
‘ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత’

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 157

బుధవారం 27-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL







### ఉత్తరాదిన కుంభవృష్టి

ఉత్తరాది రాష్ట్రాలపై మేఘ విస్ఫోటాలు విరుచుకుపడ్డాయి. ఎడతెరపి లేని వర్షాలతో హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ వణికిపోయాయి.


- వివరాలు 6లో



### ఫెడరల్ రిజర్వు గవర్నర్‌పై వేటు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫెడరల్ రిజర్వు గవర్నర్ లిసా కుక్‌ను తొలగించారు. ఈ విషయాన్ని ‘ట్రూత్’లో ప్రకటించారు.

- వివరాలు 6లో



### మహా ‘గుణ’పతిం

వినాయకుడు అంటే విశిష్టమైన నాయకత్వ లక్షణాలు కలవాడని అర్థం. ఆయన నామ, రూపాలలోని విశేషాలు..

- వివరాలు 15లో



### టారిఫ్ దుమారంలోనూ డీల్!

ఓవైపు సుంకాలపై అమెరికాతో పోరాడుతున్న భారత్ మరోవైపు అదే అమెరికాతో రక్షణరంగ ఒప్పందానికి మరో అడుగు ముందుకేసింది.

- వివరాలు 6లో

# స్థానిక ఎన్నికలపై డైలమా..



## వాయిదా వేద్దామా లేక బీసీలకు 42% కోటాపై జీవో ఇచ్చి ముందుకెళ్దామా అన్న దానిపై కాంగ్రెస్ మల్లగుల్లాలు

- వాయిదా వేయాలనుకుంటే ఆర్డినెన్స్‌ను మళ్లీ పంపాలని సలహా ఇచ్చిన న్యాయ నిపుణులు
- ఎన్నికల నిర్వహణకే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు!
- హైకోర్టు గడువు ముంచుకొస్తున్నా ఎటూ తేల్చుకోలేని పరిస్థితి
- పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి వెళితే బూమరాంగ్ అవుతుందనే ఆందోళన
- 42% రిజర్వేషన్లతో జీవో ఇవ్వడమే ప్రత్యామ్నాయమనే ప్రతిపాదన తెరపైకి
- న్యాయ నిపుణులు, ప్రభుత్వం, పార్టీ ఆలోచనలను క్రోడీకరించి నివేదిక ఇవ్వనున్న మంత్రుల బృందం
- 30న కేబినెట్ భేటీ తర్వాతే స్పష్టత

సాక్షి, హైదరాబాద్/ న్యూఢిల్లీ: రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికల విషయంలో డైలమా ఏర్పడింది. వాయిదా వేద్దామా? ప్రభుత్వ పరంగా బీసీలకు 42% కోటాపై జీవో ఇచ్చి ముందుకు వెళదామా అన్న దానిపై అధికార కాంగ్రెస్ పార్టీ మల్లగుల్లాలు పడుతోంది. ఈ అంశంపై జాతీయ స్థాయి న్యాయ నిపుణులతో పాటు పార్టీ హైకమాండ్‌తో కూడా రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం చర్చలు జరిపినప్పటికీ ఇంకా స్పష్టత రాలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పీసీసీ నియమించిన మంత్రుల బృందం ఇచ్చే నివేదిక కీలకం కానుంది. మంత్రుల బృందం చేసే సిఫారసును ఈ నెల 30వ తేదీన జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మరోసారి కూలంకషంగా చర్చించిన తర్వాతే దీనిపై ఓ స్పష్టత వస్తుందని ప్రభుత్వ, కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఎటూ తేల్చుకోలేక..!:** పంచాయతీ ఎన్నికలను సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు అంశం ఎంతకీ తేలకపోవడం ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి సమస్యగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మెజారిటీ మంత్రులు ఎన్నికలకు వెళ్దాం అనే ఆలోచనలో ఉన్నారు. కానీ పార్టీలోని బీసీ నాయకత్వం రిజర్వేషన్ల కల్పనపై మాట నిలబెట్టుకుని ఎన్నికలకు వెళ్తే బాగుంటుందని సూచిస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మొదటి నుంచి 42% రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలనే ఆలోచనతో ఉన్నారు. ఈ తర్జనభర్జనల నేపథ్యంలోనే న్యాయనిపుణుల సలహాలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ నిర్ణయించింది. అందులో భాగంగానే

మిగతా 2వ పేజీలో ▶

# అదనపు సుంకాల మోత షురూ..

- అమెరికాకు ఎగుమతులపై మరో 25% టారిఫ్‌లు నేటి నుంచే అమల్లోకి
- కార్మికులు అత్యధికంగా ఉండే రంగాలపై తీవ్ర ప్రభావం
- దుస్తులు, తోలు ఉత్పత్తులు, రొయ్యలు, రత్నాభరణాలపై ఎఫెక్ట్
- 66 శాతం ఎగుమతులకు ప్రతికూలం



రష్యా నుంచి చమురు కొంటున్నామన్న సాకుతో భారత ఎగుమతులపై అమెరికా ప్రకటించిన 25% అదనపు సుంకాలు భారతీయ కాలమానం ప్రకారం.. బుధవారం ఉదయం 9.31 గంటల నుంచి అమల్లోకి వస్తున్నాయి. ఇప్పటికే ప్రకటించిన 25 శాతానికి ఇవి అదనం కావడంతో టారిఫ్‌ల భారం మొత్తంగా 50 శాతానికి పెరిగినట్లవుతుంది. టారిఫ్‌ల ఎఫెక్ట్‌తో అమెరికా మార్కెట్‌లో చాలామటుకు భారతీయ ఉత్పత్తులకు చోటు లేకుండా పోతుందని ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఉత్పత్తుల విషయంలో సగానికి పైగా ఎగుమతులకు అమెరికా గమ్యస్థానంగా ఉంటోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కోవడం సవాలుగా మారనుంది. కాగా, జీఎస్టీ రేట్ల సవరణతో దేశీయంగా వినియోగం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి కాబట్టి, అమెరికా సుంకాల భారం పడినప్పటికీ భారత్ వృద్ధిపై పెద్దగా ప్రభావం ఉండదని ఆర్థికవేత్తలు అంటున్నారు.

- వివరాలు 17లో

### అమ్మకాల వెల్లువ..

- అదనపు టారిఫ్‌పై భారత్‌కు అమెరికా నోటీసుల జారీ ప్రభావం
- 849 పాయింట్లు కోల్పోయి 81,000 దిగువకు సెన్సెక్స్
- 256 పాయింట్లు పతనమైన నిఫ్టీ

17లో

### మన మంత్రం ‘స్వదేశీ’

- మన దేశంలో తయారైన వస్తువులే ఉపయోగించుకోవాలి
- స్వదేశీ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలి
- పెట్టుబడి ఎవరిదైనా తయారీ వెనుక మనవాళ్లే ఉండాలి
- ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

6లో

### ట్రంప్ ఫోన్‌కాల్స్‌కు మోదీ నో

- నాలుగుసార్లు ఫోన్ చేసినా పలకని మోదీ
- ట్రంప్ టారిఫ్‌లపై భారత ప్రధాని పరోక్ష ఆగ్రహం!
- జర్మనీ వార్తాపత్రిక ‘ఫ్రాంక్‌ఫర్టర్ అల్‌జెమేని’ వెల్లడి

## న్యూస్‌రీల్

### 30 నుంచి ‘అసెంబ్లీ’..



అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 30 నుంచి జరగనున్నాయి. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నిరోజులు సమావేశాలు నిర్వహించాలనే దానిపై బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.

- వివరాలు 2లో

### బాలిక కిడ్నాప్, రేప్ కేసులో దోషికి 51 ఏళ్ల జైలు



బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన కేసులో దోషికి వివిధ చట్టాల కింద మొత్తం 51 ఏళ్ల జైలు శిక్షను విధిస్తూ నల్లగొండ జిల్లా పోక్సో కోర్టు జడ్జి ఎన్.రోజారమణి మంగళవారం సంచలన తీర్పు వెలువరించారు.

- వివరాలు 5లో

### జనవరిలోనే ఇంటర్ పరీక్షలు!



ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ఈసారి ముందుగానే నిర్వహించాలని ఇంటర్ బోర్డ్ యోచిస్తోంది. సదరు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది. అయితే, పరీక్షలను ముందుకు తీసుకొస్తే విద్యార్థులు నష్టపోతారని లెక్చరర్లు అంటున్నారు.

- వివరాలు 7లో

### శబ్ద పరిమితి దాటొద్దు

- గణేశ్ మండప నిర్వాహకులకు హైకోర్టు ఆదేశం
- విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి
- ట్రాఫిక్ ఆగిపోకుండా చూసుకునే బాధ్యత నిర్వాహకులదే

7లో

### సెలవు..

వినాయకచవితి పర్వదినం సందర్భంగా నేడు సాక్షి కార్యాలయానికి సెలవు. కావున గురువారం సంచిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం.



# సాదా బైనామాకు లైన్‌క్లియర్..



## క్రమబద్ధీకరణకు అనుమతిచ్చిన హైకోర్టు

### 2020లో విధించిన స్టే తొలగించిన సీజే ధర్మాసనం

- ఏప్రిల్ నుంచి భూ భారతి అమల్లోకి వచ్చిందన్న ఏజీ
- సెక్షన్ 6 ప్రకారం సాదాబైనామా క్రమబద్ధీకరించుకోవచ్చని వెల్లడి
- 9 లక్షలకు పైగా పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది
- సవరణ పిటిషన్‌ను అనుమతించాలని కోరిన పిటిషనర్
- తోసిపుచ్చిన ప్రధాన న్యాయమూర్తి.. పిల్‌ను కొట్టివేస్తూ తీర్పు

సాక్షి, హైదరాబాద్: సాదా బైనామాలకు ఎట్టకేలకు లైన్‌క్లియర్ అయింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసి క్రమబద్ధీకరణకు అనుమతిచ్చింది. సాదా బైనామాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం 2020, అక్టోబర్ 12న జారీ చేసిన జీఓ నంబర్ 112ను సవాల్ చేస్తూ నిర్మల్ జిల్లా లింబా కె.కుంటాలకు చెందిన షిండే దేవిదాస్ హైకోర్టులో అదే ఏడాది ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం సాదా బైనామాల క్రమబద్ధీకరణ ఆపాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త రెవెన్యూ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత అందిన దరఖాస్తులు పరిశీలించవద్దని ప్రభుత్వాన్ని 2020లోనే ఆదేశించింది. కొత్త చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత పాత చట్టం ప్రకారం క్రమబద్ధీకరణ చేయడాన్ని

మిగతా 2వ పేజీలో ▶



### అటూ ఇటుగా... ఆరు నెలలు

- హైకోర్టు తీర్పుతో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు సమయం పట్టే చాన్స్
- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తేనే ఆర్డీవోల ద్వారా నోటీసులు
- క్రమబద్ధీకరణ జరగాలంటే స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కట్టాల్సిందే
- -రాష్ట్రంలో ఇప్పటివరకు 13 సార్లు సాదాబైనామాల క్రమబద్ధీకరణ

2లో

# ఒడువని కొరత.. విడువని కష్టాలు

## యూరియా కోసం గోస పడుతున్న రైతులు

### ఒక్క బస్తా కోసం రాత్రి పగలు పడిగాపులు

- సకాలంలో యూరియా అందక సరిగా ఎదగని పంటలు
- మంత్రి తుమ్మల రోజూ సమీక్షలు చేసినా తీరని కొరత
- కేంద్రం ఇస్తానన్న 50 వేల టన్నుల్లో 35 వేల టన్నులు సరఫరా
- ఇంకా 2 లక్షల టన్నులు వస్తే తప్ప సమస్యకు పరిష్కారం కష్టమే



హనుమకొండ జిల్లా వేలేరు మండలం షోడశపల్లిలో యూరియా వేయకపోవడంతో ఎదుగుదల లేని పత్తి చేను

### తర్వాత రండి..



రమావత్ నరసింహారావు
కరివారిగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కరివారిగూడెం గ్రామానికి చెందిన రమావత్ నరసింహారావు 4 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. పంట పూత, పిందె దశలో ఉంది. నెల క్రితం జూలూరుపాడు ప్యాక్స్ వద్ద నాలుగు బస్తాల యూరియా తీసుకెళ్లి పంటకు వేశాడు. పంట చేతికొచ్చేనాటికి మూడు విడతల్లో ఎకరానికి మూడు బస్తాల యూరియా వేయాల్సి ఉంటుంది. నాలుగు ఎకరాలకు 12 బస్తాలు అవసరం. దీంతో రెండోసారి యూరియా కోసం మంగళవారం సొసైటీ వద్దకు వెళ్లగా, అడిగినంత యూరియా ఇవ్వలేమని అధికారులు తెలిపారు. ఎంత భూమి ఉన్నా ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్సులు ఇచ్చి వెళితే రెండు బస్తాలు మాత్రమే ఇస్తామని చెప్పారు. అది కూడా రెండుమూడు రోజుల తర్వాత ఇస్తామని అధికారులు తెలిపినట్లు నరసింహారావు వాపోయాడు.

### బస్తా కోసం బారులు

- యూరియా కోసం తెల్లవారుజాము నుంచే క్యూ లైన్.. అయినా అందకపోవటంతో హైవేలపై మెరుపు ధర్నాలు
- ఆసిఫాబాద్ జిల్లాలో క్యూలోనే కుప్పకూలిన మహిళా రైతు

8లో

## ఇదండీ సంగతి



..చెప్పడానికేమీ లేదు!
నా ఓటు కూడా చోరీ అయింది!!

# రింగ్ రైలు @ రూ. 28 వేల కోట్లు



- భారీగా పెరిగిన ప్రాజెక్టు అంచనా వ్యయం
- ఆర్‌ఆర్‌ఆర్‌ను ఆనుకొని 60 మీటర్ల వెడల్పుతో అలైన్‌మెంట్
- 3,600 హెక్టార్ల భూమిని సేకరించే యోచన

సాక్షి, హైదరాబాద్:

రీజినల్ రింగురోడ్డును ఆనుకొని నిర్మించాలని భావిస్తున్న ఔటర్ రింగ్ రైల్ ప్రాజెక్టు అంచనా వ్యయం భారీగా పెరిగింది. తొలుత రూ. 12,408 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసిన రైల్వేశాఖ తాజాగా దాన్ని రూ. 28 వేల కోట్లకుపైగా ఖర్చవుతుందని అంచనా వేస్తూ కొత్త నివేదికను సిద్ధం చేసింది. ఇందుకోసం కొత్తగా 60 మీటర్ల వెడల్పుతో 3,600 హెక్టార్ల భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందని ప్రతిపాదించింది.

### రింగు రోడ్డు కంటే మీటరున్నర ఎత్తుతో నిర్మాణం...

రీజినల్ రింగురోడ్డును 5 మీటర్ల ఎత్తుతో నిర్మించనుండగా దానికి బయటి వైపు ఔటర్ రింగురైలును మరో మీటరున్నర ఎత్తుతో నిర్మించనున్నారు. అంటే భూమి నుంచి ఆరున్నర మీటర్ల ఎత్తుతో రైల్వే లైన్ నిర్మిస్తారన్నమాట. ఒకేసారి రెండు లైన్ల నిర్మాణం చేపడతారు. భవిష్యత్తులో అవసరమైతే లైన్ల సంఖ్య పెంచేలా కొంత భూమిని వదలాలని భావిస్తున్నారు. ఇందుకోసం 60 మీటర్ల వెడల్పుతో అలైన్‌మెంట్‌ను సిద్ధం చేయనున్నారు. ఇంత ఎత్తుతో కట్ట నిర్మించాలంటే పైనుంచి భూమి వైపు వచ్చేకొద్దీ అది వాలుగా ఉంటుంది. అంటే పైన ట్రాక్ నిర్మించే భాగం కంటే, కింద భూమి వద్ద అలైన్‌మెంట్ పరిధి 3 రెట్లు ఎక్కువగా ఉంటుంది. రెండు లైన్ల ట్రాక్ నిర్మాణానికి 15 మీటర్ల స్థలం అవసరం. దాని వాలుతో కలుపుకొంటే 45 మీటర్ల భూమిని సేకరించాల్సి ఉంటుంది. భవిష్యత్తులో అదనంగా మరో లైన్ నిర్మించేంత స్థలం

మిగతా 14వ పేజీలో ▶



ఐఎన్‌ఎస్ హిమగిరిని జాతికి అంకితం చేసి మాట్లాడుతున్న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్

# రక్షణ రంగంలో తిరుగులేని శక్తిగా భారత్

- ఆత్మనిర్భర్ భారత్‌తో నౌకా నిర్మాణాల్లో నంబర్–1గా నిలిచాం
- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- విశాఖలో ఐఎన్‌ఎస్ హిమగిరి, ఉదయగిరి నౌకలు జల ప్రవేశం
- రెండు యుద్ధ నౌకల్ని ప్రారంభించి జాతికి అంకితం చేసిన రక్షణ మంత్రి

14లో

## క్లుప్తంగా...

### గవర్నర్ వినాయక చవితి శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: వినాయక చవితి సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగించి విజయాలను ప్రసాదించాలని కోరుతూ భక్తులు విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తారని గుర్తు చేశారు. విఘ్నేశ్వరుడిని ప్రార్థించాకే ఏ కార్యాన్నైనా ప్రారంభించే సంప్రదాయం ఉందన్నారు. ఐక్యత, శాంతి, ప్రగతి, సౌభాగ్యం బాటలో విఘ్నాలన్నీ తొలగిపోవాలని గవర్నర్ ప్రార్థించారు.

### విఘ్నేశ్వరుడు ప్రజలందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం ప్రసాదించాలి

**సీఎం రేవంత్ వినాయక చవితి శుభాకాంక్షలు**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలోని విఘ్నాలను తొలగించి అందరికీ ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం ప్రసాదించాలని విఘ్నేశ్వరుడుని ప్రార్థించారు. ఈ గణపతి నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్ సహా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను సీఎం ఆదేశించారు.

### ప్రజలకు శుభాలను చేకూర్చే ఆదిదేవుడు వినాయకుడు

**రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ వినాయక చవితి శుభాకాంక్షలు**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయం కలిసి వచ్చి, రైతన్నల కుటుంబాల్లో సుఖశాంతులు వెల్లి విరిసేలా విఘ్నేశ్వరుడు దీవించాలని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రార్థించారు. వినాయక చవితి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రజల్లో మతసామరస్యం, దైవభక్తి, సమష్టితత్వం మరింత బలపడాలని కేసీఆర్ ఆకాంక్షించారు.

### వినాయకుడు అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగించాలి

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



సాక్షి, హైదరాబాద్: ప్రతి ఒక్కరి జీవితంలో ఏర్పడే సకల విఘ్నాలను వినాయకుడు తొలగించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వినాయకుడిని ప్రార్థించారు. పరమ పవిత్రమైన వినాయక చవితి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మండపంలో మట్టి వినాయకులను పెట్టి పూజించి మన సంస్కృతిని, పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

### వినాయకుడి ఆశీస్సులతో అందరి జీవితాల్లో వెలుగులు రావాలి

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు వినాయక చవితి శుభాకాంక్షలు**





సాక్షి, హైదరాబాద్: వినాయకుడి ఆశీస్సులతో అందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు రావాలని, ఆటంకాలన్నీ తొలగిపోయి అందరూ ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్టు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. వినాయకచవితి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నిరకాల విఘ్నాలను తొలగించి సరైన మార్గంలో మనల్ని నడిపించే విఘ్నేశ్వరుడు, ఓర్పునకు, విద్యకు ప్రతీక అని పేర్కొన్నారు. విఘ్నాలను తొలగించే వినాయకుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజల జీవనంలో ఆనందం, ఐశ్వర్యం, సుభిక్షం నిండాలని ఆకాంక్షిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు.



# అటూ ఇటుగా.. ఆరు నెలలు

**హైకోర్టు తీర్పు మేరకు సాదాబైనామాల క్రమబద్ధీకరణకు సమయం పట్టే అవకాశం**

- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తేనే ఆర్డీవోల ద్వారా నోటీసులు
- క్రమబద్ధీకరణ జరగాలంటే స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కట్టాల్సిందే
- రాష్ట్రంలో ఇప్పటివరకు 13 సార్లు సాదాబైనామాల క్రమబద్ధీకరణ
- ఇంకోసారి అవకాశం లేకుండా భూభారతి చట్టంలో నిబంధన

సాక్షి, హైదరాబాద్: సాదాబైనామాల క్రమబద్ధీకరణ విషయంలో హైకోర్టులో ఉన్న అడ్డంకి తొలగిపోవడంతో రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు ఊరట లభించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 9.26 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, దాదాపు 10 లక్షల ఎకరాల భూమి ఈ దరఖాస్తుల పరిధిలో ఉంటుందని, ఈ మేరకు ఆ భూములన్నింటికీ త్వరలోనే విముక్తి లభిస్తుందని రెవెన్యూ వర్గాలంటున్నాయి. అయితే, ఈ ప్రక్రియ పూర్తయ్యే సరికి అటూఇటుగా ఆరునెలల సమయం పట్టే అవకాశముంది. భూభారతి పేరుతో రాష్ట్రంలో అమల్లో ఉన్న ఆర్‌వోఆర్ చట్టం ప్రకారం ఈ దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉంటుంది. రెవెన్యూ వర్గాల సమాచారం ప్రకారం ఈ ప్రక్రియ ఎలా ఉంటుందంటే...!

- హైకోర్టు తీర్పునకు అనుగుణంగా సాదాబైనామాల ద్వారా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి తొలుత ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలి.
- ఈ నోటిఫికేషన్ మేరకు పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల దరఖాస్తుదారులకు, సాదాబైనామాల ద్వారా ఆ భూమిని అమ్మిన వారికి ఆర్డీవో నోటీసులు జారీ చేస్తారు. ఈ నోటీసుల జారీకి కనీసం నెలరోజుల సమయం పడుతుందని అంచనా.
- ఈ నోటీసుల ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారు. ఆ భూమికి సంబంధించి తెల్ల కాగితంపై రాసుకున్న సాదాబైనామా లావాదేవీ సరైందా లేదా అన్నది పరిశీలించడంతోపాటు చుట్టుపక్కల ఉన్న రైతుల అభిప్రాయాలు కూడా తీసుకుంటారు.
- అప్పుడు సదరు భూమిని అమ్మింది, కొన్నది వాస్తవమే అని తేలితే ప్రత్యేక ఆర్డర్ ఇచ్చి రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీ కట్టి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పిస్తారు.
- అలా స్టాంపు డ్యూటీ కట్టిన తర్వాత ఓ సర్టిఫికెట్ ఇస్తారు. ఈ సర్టిఫికెట్‌ను రిజిస్టర్డ్ డాక్యుమెంట్ కింద పరిగణనలోకి తీసుకుంటారు.



### కోర్టు నిర్ణయం సంతోషకరం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటైన ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ సమావేశాల్లో కూడా ఈ సాదాబైనామాలపై చాలాసార్లు చర్చించాం. అయితే, గతంలో అమల్లో ఉన్న ధరణి చట్టంలో సాదాబైనామాల పరిష్కార నిబంధనను పొందుపర్చలేదు. దీంతోనే కోర్టు కొట్టివేసింది. కొత్తగా తెచ్చిన భూభారతి చట్టంలో ఆ నిబంధన పెట్టాం. ఇప్పుడు ఇదే నిబంధన ఆధారంగా కోర్టు సానుకూల తీర్పునిచ్చింది. ఇప్పటికైనా నా దీర్ఘకాలిక సమస్య పరిష్కారమైనందుకు సంతోషంగా ఉంది.

**- భూమి సునీల్, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు**

**సాదాబైనామాల క్రమబద్ధీకరణ ఎప్పుడెప్పుడు జరిగిందంటే...**

| సంవత్సరం | ఉత్తర్వు |
|---|---|
| 1989 | జీవో 570 |
| 1996 | జీవో 52 |
| 1997 | జీవో 1020 |
| 1997 | జీవో 1059 |
| 1998 | జీవో 677 |
| 2006 | జీవో 45 |
| 2008 | జీవో 826 |
| 2008 | జీవో 1445 |
| 2010 | జీవో 1328 (వరంగల్ జిల్లాకు మాత్రమే) |
| 2013 | జీవో 314 (నిజామాబాద్ జిల్లాకు మాత్రమే) |
| 2016 | జీవో 153 |
| 2016 | జీవో 159 |
| 2017 | సెక్షన్ 5-ఏకు సవరణ ద్వారా |
| 2020 | జీవో 121 (ఈ ప్రక్రియ ఇప్పుడు పూర్తి కానుంది) |

- దీని ఆధారంగా ఆ భూమికి పాసు పుస్తకాలు వస్తాయి. ఈ సర్టిఫికెట్ ద్వారానే క్రయవిక్రయ లావాదేవీలు జరుగుతాయి.
- గతంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణ ఉచితంగా చేసేవారు. కానీ, భూభారతి చట్టంలో మార్చిన నిబంధన ప్రకారం స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కట్టాలి.
- హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు 2020లో దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను మాత్రమే క్రమబద్ధీకరిస్తారు.
- రాష్ట్రంలో ఇప్పటివరకు 13సార్లు సాదాబైనామాలను క్రమబద్ధీకరించారు. 2020లో 14వ సారి జారీ చేసిన సాదాబైనామా ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పుడు ఆ ప్రక్రియకు మోక్షం కలగనుంది.
- దీని తర్వాత సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ఆస్కారం ఉండదు. ఈ మేరకు భూభారతి చట్టంలో స్పష్టంగా పొందుపరిచారు. 2020లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించిన తర్వాత మళ్లీ సాదాబైనామాల దరఖాస్తులను తీసుకునే వీల్లేదని పేర్కొన్నారు. మళ్లీ సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేపట్టాలనుకుంటే ఆ చట్టాన్ని సవరిస్తే కానీ సాధ్యం కాదు.

# 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్**

- అదేరోజు మధ్యాహ్నం మంత్రివర్గ భేటీ



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 30 నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. శాసనసభతో పాటు మండలి సమావేశాలు సైతం జరగనుండగా, ఎన్నిరోజులు సమావేశాలు నిర్వహించాలనే దానిపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన విచారణ నివేదికపై సభలో చర్చించే అవకాశం ఉంది. కాగా అదేరోజు రాష్ట్ర మంత్రివర్గం కూడా సమావేశం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం ఒంటి గంటకు కేబినెట్ భేటీ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంలో ఎదురవుతున్న ఆటంకాలు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు.

**బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనపై ప్రత్యేక దృష్టి**

ఒకవైపు సెప్టెంబర్ 30 లోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు విధించిన గడువు సమీపిస్తోంది. మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా రాష్ట్రపతి పరిశీలన కోసం పంపించారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి మరో ప్రయత్నంగా ఆర్డినెన్స్‌లను రూపొందించి పంపగా వాటిని సైతం గవర్నర్ రాష్ట్రపతికి సిఫారసు చేయడంతో ప్రభుత్వం తీవ్ర ఇరకాటంలో పడింది. ఈ నేపథ్యంలోనే పంచాయతీ ఎన్నికల నిర్వహణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తదితర అంశాలపై కేబినెట్ చర్చించి నిర్ణయం తీసుకోనుంది.

**కాళేశ్వరం కమిషన్ నివేదిక, యూరియా కొరత తదితరాలపై..**

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన విచారణ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి చర్చించాలని భావిస్తున్న నేపథ్యంలో.. దీనిపై సైతం మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనుంది. అలాగే రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరత, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ గృహాల నిర్మాణం, ఉద్యోగుల సమస్యలు, ఉద్యోగ నియామకాలు తదితర అంశాలను కూడా మంత్రివర్గం పరిశీలించే అవకాశం ఉంది.

# ‘క్లినిక్’లతో లక్షలాది ఆర్మీ కుటుంబాలకు లబ్ధి

**టీఎస్ఎల్ఎస్ఏ పాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ఏకే సింగ్**

- సైనికులపై న్యాయవ్యవస్థ నిబద్ధతకు నిదర్శనమని వెల్లడి
- సమగ్ర న్యాయ సాయమే లక్ష్యమన్న జస్టిస్ శామ్‌కోషి
- 8 జిల్లాల్లో ఉచిత న్యాయ సేవల క్లినిక్‌లు ప్రారంభం




‘ఏక్ ముట్ఠీ ఆస్మాన్’ సీడీని ఆవిష్కరిస్తున్న సీజే అపరేశ్‌కుమార్ సింగ్. చిత్రంలో జస్టిస్ శామ్‌కోషి, సీహెచ్ పంచాక్షరి

సాక్షి, హైదరాబాద్: ఉచిత న్యాయ సేవల క్లినిక్‌తో దేశవ్యాప్తంగా లక్షలాది ఆర్మీ కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని టీఎస్ఎల్ఎస్ఏ పాట్రన్ ఇన్ చీఫ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ అన్నారు. సైనికులపట్ల న్యాయవ్యవస్థకు ఉన్న నిబద్ధతకు ఈ క్లినిక్‌లు నిదర్శనమని చెప్పారు. వీర పరివార్ సహాయత యోజన–2025 కింద దేశ వ్యాప్తంగా ఉచిత న్యాయ సేవల క్లినిక్‌ల ద్వారా సేవలు అందించాలని నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా హైకోర్టు ఆవరణలోని లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆన్‌లైన్ ద్వారా 8 జిల్లాల్లో క్లినిక్‌లను టీఎస్ఎల్ఎస్ఏ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.శామ్ కోషితో కలసి సీజే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని సాయుధ దళాల సభ్యులు, వారి కుటుంబాలకు న్యాయ సాయం అందించడంలో ఇదో కీలక ముందడుగు అన్నారు. గతంలో ఏర్పాటు చేసిన రెండు క్లినిక్‌లతో కలిపి ఉమ్మడి జిల్లాలవారీగా కేంద్రాలు ఏర్పాటయ్యాయని.. మిగిలిన జిల్లాలకు కూడా క్లినిక్‌లను విస్తరిస్తామని చెప్పారు. న్యాయ సాయంతోపాటు న్యాయ సూచనలు కూడా ఈ క్లినిక్‌లలో అందిస్తామని వివరించారు. గత నెల 26న రెండు క్లినిక్‌లు ప్రారంభమవగా తాజాగా మరో 8 క్లినిక్‌లు ఏర్పాటు కావడం అథారిటీ చొరవకు నిదర్శనమని కొనియాడారు. అనంతరం జస్టిస్ శామ్ కోషి మాట్లాడుతూ రక్షణ సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబాలకు సమగ్ర న్యాయ సాయం అందించడమే క్లినిక్‌ల లక్ష్యమన్నారు. ఆస్తి, కుటుంబ వివాదాలు, పింఛన్, సంక్షేమ పథకాలు పొందడంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంలో క్లినిక్‌లు కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. ప్రతి మొదటి, నాలుగో శనివారం ఈ క్లినిక్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సందర్భంగా తెలుగులోకి అనువదించిన నల్సా థీమ్ సాంగ్ ‘ఏక్ ముట్ఠీ ఆస్మాన్’ను న్యాయమూర్తులు విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గోవర్ధన్‌రెడ్డి, అథారిటీ సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి నేరుగా హాజరుకాగా జిల్లా ప్రిన్సిపల్ జడ్జీలు, ప్రాంతీయ సైనిక్ వెల్ఫేర్ బోర్డుల అధికారులు, మాజీ సైనికులు, సైనిక్ వెల్ఫేర్ కార్యాలయ సిబ్బంది ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు.

## ‘స్పోర్ట్స్ పాలసీ’ అమలుపై చర్చ

**రేపు సీఎంతో బోర్డు సభ్యుల సమావేశం**

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ప్రతిపాదించిన స్పోర్ట్స్ పాలసీని అమలు చేయడానికి సంబంధించి గురువారం ప్రభుత్వ ఆధ్వర్యంలో కీలక సమావేశం జరగనుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో పాటు తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఇందులో పాల్గొంటారు. ఈ నెల 2న జరిగిన ‘స్పోర్ట్స్ కాంక్లేవ్’కు కొనసాగింపుగా ఈ సమావేశం ఉంటుంది. 2036 ఒలింపిక్ క్రీడల కోసం బిడ్ వేసేందుకు అవసరమైన వేదికలు, మౌలిక సౌకర్యాలు, ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం తదితర అంశాలు గురువారం ఎజెండాలో భాగంగా ఉన్నాయి. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీ, తెలంగాణ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ ఏర్పాటుపై కూడా ఇందులో చర్చిస్తారు. సంజీవ్ గోయెంకా, ఉపాసన కామినేని, కావ్యమారన్ వంటి వ్యాపారవేత్తలతో పాటు అభినవ్ బింద్రా, పుల్లెల గోపీచంద్ తదితరులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు.

## భూభారతి దారి చూపింది

**హైకోర్టు తీర్పుపై మంత్రి పొంగులేటి హర్షం**

సాక్షి, హైదరాబాద్: సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. సాదాబైనామాల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలను నమ్మించి మోసం చేసిందని, పేదల పక్షపాతి అయిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి పరిష్కారానికి మార్గం చూపిందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ‘హైకోర్టు తీర్పుతో పేదల కల సాకారం కాబోతోంది. మా ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన భూభారతి చట్టమే దీనికి దారి చూపింది. ఈ చట్టంలో స్పష్టమైన నిబంధనలను పొందుపరిచిన కారణంగానే హైకోర్టు కేసు ముగిసింది. కోర్టు తీర్పు మేరకు పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తాం. ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపించేందుకు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుంది’ అని పొంగులేటి వెల్లడించారు.

# సాదా బైనామాకు లైన్‌క్లియర్..

▶ మొదటి పేజీ తరువాయి

తప్పుబట్టింది. కొత్త చట్టం రాక ముందు (2020, అక్టోబర్ 29) వరకు 2,26,693 దరఖాస్తులు వచ్చాయని, ఆ తర్వాత 6,74,201 దరఖాస్తులు వచ్చాయని ప్రభుత్వం కోర్టుకు తెలపగా, గడువుకు ముందు వచ్చిన దరఖాస్తులపై నిర్ణయం కూడా తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది.

**సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనం..**

ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం విధించిన గడువులోగా 9.24 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో తెలంగాణ భూ భారతి (భూమిపై హక్కుల రికార్డు) చట్టం 2025 అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పిల్ చెల్లదని వాదించారు. ఈ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం 2014, జూన్ 2 ముందు 12 ఏళ్లపాటు భూమి తమ అధీనంలో ఉన్నట్లు చూపిన సన్నకారు రైతులకు క్రమబద్ధీకరణకు అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. 2020, అక్టోబర్ 12 నుంచి 2020 నవంబర్ 10 వరకు తెలంగాణ భూమి హక్కులు, పట్టాదార్ పాస్‌బుక్స్ చట్టం–1971 ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికి క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు కొత్త చట్టం వచ్చినందున 2020లో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు రద్దు చేయాలని కోరారు. స్టే ఎత్తివేస్తే 6,74,201 దరఖాస్తుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభిస్తుందని విన్నవించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది జె.ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. పాత చట్టానికి బదులుగా కొత్త చట్టంలోని నిబంధనను సవాల్ చేస్తూ సవరణ పిటిషన్ దాఖలు చేశామని, వాదనలకు అనుమతించాలని కోరారు. ఈ విజ్ఞప్తిని సీజే తోసిపుచ్చారు. కొత్త చట్టాన్ని సవాల్ చేస్తూ మరో పిటిషన్ వేసుకోవాలని, అలాగే పలుమార్లు వాయిదా కోరడం సరికాదని సూచించారు. కొత్త చట్టం వచ్చిన తర్వాత కూడా పాత దరఖాస్తులనే అనుమతిస్తున్నారని, కొత్త వాటిని స్వీకరించడం లేదని.. ఇది వివక్షేనని ప్రభాకర్ పేర్కొన్నారు. దీనికి అంగీకరించని సీజే.. కొత్త చట్టంతో సన్న, చిన్నకారు రైతులు సాదా బైనామాలను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో 2020లో ఇచ్చిన స్టేను ఎత్తివేస్తున్నామని ప్రకటించారు.

# స్థానిక ఎన్నికలపై డైలమా!

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు పీసీసీ నియమించిన ఐదుగురు మంత్రుల బృందం ఢిల్లీలో పర్యటించి న్యాయ నిపుణులతో పాటు పార్టీ హైకమాండ్‌తో కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించినట్లు తెలుస్తోంది.

**పార్టీ పరంగా ఇస్తే బూమరాంగ్ ఖాయం**

విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం..కులగణన చేస్తామని, ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రజలకు వాగ్దానం చేసి, ఇప్పుడు పార్టీ పరంగా ఇస్తామని చెబితే బూమరాంగ్ కావడం ఖాయమని కాంగ్రెస్ హైకమాండ్ తేల్చిచెప్పింది. అవసరమైతే ఎన్నికల నిర్వహణకు కోర్టును మరింత సమయం కోరాలని సూచించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి పంపిన రెండు బిల్లులతో పాటు, 50% రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ తెచ్చిన ఆర్డినెన్స్‌పై కేంద్ర ప్రభుత్వం ఎటూ తేల్చకపోవడాన్ని తప్పుపడుతూ.. క్షేత్రస్థాయిలో బీజేపీని ఎండగట్టే కార్యక్రమాలు చేపట్టాలని చెప్పినట్లు తెలిసింది. సోమవారం ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీలతో చర్చలు జరిపిన సీఎం, మంత్రుల బృందం.. మంగళవారం బిహార్‌లో ఓటర్ అధికార యాత్ర నిర్వహిస్తున్న రాహుల్‌గాంధీతోనూ సమాలోచనలు జరిపినట్లు తెలిసింది.

**బీజేపీని ఎండగట్టాల్సిందే..**

‘పార్టీపరంగా సాధ్యం కాదు. ఒకవేళ ఇచ్చినా మళ్లీ గత అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితే రావొచ్చు. ఓడిపోయే సీట్లను బీసీలకు కేటాయించొచ్చు. ఇది బీసీలను మోసం చేయడమే..’ అని కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. ‘బీసీలకు రిజర్వేషన్ల అమలు ఇప్పుడు ఒక్క తెలంగాణ అంశమే కాదు.. యావత్ దేశానిది. రిజర్వేషన్లు అమలు చేయకుండా ఒకట్రెండు ధర్నాలు చేసి చేతులు ముడుచుకుంటే మొదటికే మోసం వస్తుంది. కాబట్టి బీజేపీని మరింతగా ఎండగట్టాలి. బీసీ రిజర్వేషన్లపై కేంద్రం తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలి..’ అని హైకమాండ్ పెద్దలు గట్టిగా చెప్పినట్లు తెలిసింది.ఈ



బిహార్‌లో రాహుల్‌గాంధీతో కలిసి ‘ఓటర్ అధికార్ యాత్ర’లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ ప్రియాంకాగాంధీ

పరిస్థితుల్లోనే ప్రభుత్వ పరంగా బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లే అంశం తెరపైకి వచ్చింది. అయితే ఇది కోర్టులో నిలబడుతుందా లేదా? అనే సందేహం కూడా కాంగ్రెస్ నేతలను వెంటాడుతోంది.

**కోర్టును గడువు అడగండి..మళ్లీ ఆర్డినెన్స్ పంపండి**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో న్యాయ కోవిదుల అభిప్రాయాలను తీసుకుని నివేదిక సమర్పించేందుకుగాను టీపీసీసీ నియమించిన మంత్రుల బృందం ఆదివారం ప్రజాభవన్‌లో రాష్ట్ర అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డితో సమావేశమై ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలు, న్యాయ పరంగా ఉన్న ఇబ్బందులపై చర్చించింది. తాజాగా సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీ, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో సమావేశమైంది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఆలోచనలను కూడా వివరించింది. ఈ నేపథ్యంలో 42 శాతం రిజర్వేషన్లను అధికారికంగా అమలు చేయాలనే కోణంలోనే ముందుకు వెళ్లాలనుకుంటే ఎన్నికలను మూడు నెలల పాటు వాయిదా వేయాలని సూచించినట్లు తెలిసింది. అదే విధంగా 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ తెచ్చిన ఆర్డినెన్స్ కాలపరిమితి 3 నెలలు ముగిసిన తర్వాత మళ్లీ ఆర్డినెన్స్ చేసి, మరోమారు ఆమోదం కోసం గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపాలని చెప్పినట్లు సమాచారం. ఈలోపు హైకోర్టులో ఉన్న కేసులో ఆరు వారాల గడువు కోరుతూ కౌంటర్ దాఖలు చేయాలని, తద్వారా సుప్రీంకోర్టులో ఉన్న కేసుకు బలం చేకూరుతుందని, రెండోసారి మంత్రివర్గం పంపిన ఆర్డినెన్స్‌ను రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు ఆమోదించాల్సి ఉంటుందని ఆయన వివరించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

**అసెంబ్లీ సమావేశాల నిర్ణయంపై చర్చ**

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అవుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండటం సాధ్యం కాదనే కోణంలోనే వీలున్నంత త్వరగా అసెంబ్లీ సమావేశాలను పూర్తి చేయాలన్న యోచనతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అంటున్నారు. ఇదే నిజమైతే 30వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ జీవో విడుదల చేయాలని మంత్రివర్గం నిర్ణయిస్తుందని తెలుస్తోంది. ఒకవేళ ఎన్నికల వాయిదాకు కనుక మొగ్గు చూపితే హైకోర్టును గడువు అడిగే విధంగా కేబినెట్ నిర్ణయం ఉంటుందని సమాచారం. ఏదిఏమైనా ఈ నెల 30వ తేదీన జరిగే రాష్ట్ర మంత్రివర్గ భేటీలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

### రాహుల్ యాత్రలో సీఎం, రాష్ట్ర నేతలు

కేంద్ర ఎన్నికల సంఘం ఓట్ల చోరీకి పాల్పడుతోందంటూ బిహార్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన ‘ఓటర్ అధికార్ యాత్ర’లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. రాహుల్‌తో కలిసి రేవంత్‌రెడ్డి రోడ్‌షోలో పాల్గొన్నారు. రోడ్‌షోకు హాజరైన పార్టీ నేత ప్రియాంకాగాంధీని కూడా రాష్ట్ర నేతలు కలిశారు.

# సెప్టెంబర్ 2న ఓటర్ల తుది జాబితాల ప్రచురణ

- డీపీవోలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు
- ఎస్ఈసీ నోటిఫికేషన్ జారీ

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి...రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సన్నాహాలు వేగవంతం చేసింది. ఎన్నికలకు సన్నద్ధం కావడంలో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందుకు అనుగుణంగా జాబితాలను సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారులను (డీపీవో) ఆదేశిస్తూ మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణీకుముదిని నోటిఫికేషన్ జారీ చేశారు. 2025 జులై 1న అందుబాటులోకి వచ్చిన అసెంబ్లీ నియోజకవర్గాల ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాలను తు.చ. తప్పకుండా అనుసరిస్తూ వార్డుల విభజన చేస్తూ తామిచ్చిన షెడ్యూల్‌ను అనుసరించాలని స్పష్టం చేశారు. డీపీవోలతో పాటు అదనపు జిల్లా ఎన్నికల అధికారులు, ఎంపీడీవోలు, సహాయ జిల్లా ఎన్నికల అధికారులు, సీఈవోలు, అదనపు జిల్లా అధికారులు, జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లకు (హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు మినహా), పీఆర్ ఆర్‌డీ డైరెక్టర్, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శికి దీని ప్రతులను పంపించారు.

### ఎస్ఈసీ జారీచేసిన షెడ్యూల్...

- గురువారం (ఆగస్టు 28న) గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ముసాయిదా ఫొటో ఓటర్ల జాబితాను రూపొందించి గ్రామపంచాయతీలు, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించాలి.
- శుక్రవారం (29న) జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారుల (జిల్లా కలెక్టర్లు) సమావేశం
- శనివారం (30న) మండల స్థాయిలో సంబంధిత ఎంపీడీవోల ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం
- గురువారం నుంచి శనివారం దాకా (28 నుంచి 30వ తేదీ వరకు) గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల రీఅరేంజ్‌మెంట్‌కు (వార్డుల వారీగా గ్రామపంచాయతీ ఓటర్ల జాబితా) సంబంధించి అభ్యంతరాల స్వీకరణ
- ఆదివారం (31న) ఈ అభ్యంతరాలపై డీపీవోల ద్వారా పరిష్కారం
- సెప్టెంబర్ 2న గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాలను డీపీవోల ద్వారా ప్రచురణ.


దీనిముందు అన్నీ బలాదూర్
PACK TWO
దీనిని తీసుకురండి. ఇది ఈ మధ్యనే లాంచ్ చేయబడిన 'XEV 9e Pack Two', ఇది ప్రతివిషయంలోనూ శ్రేష్ఠతకి చిహ్నం. మా టాప్ ఎండ్ Pack Three లాగానే. ఇంకా, దీని ఆకర్షణీయమైన ధర కేవలం ₹24.90 లక్షలు* మరియు EMI కూడా సులువుగా, కేవలం ₹45 716.00#. వచ్చేసిందిగా మీ ముఖంలో చిరునవ్వు! ఇప్పుడు కాస్త శ్రద్ధగా చూడండి మా టాప్ ఎండ్ ఫీచర్లని. ఇవి మీకు లభిస్తాయి Pack Two లో:
కాస్ట్-టు-కాస్ట్ 3 స్క్రీన్స్ డిస్ ప్లే • ప్రీమియం లెదరెట్ ఇంటీరియర్స్ • సోనిక్ స్టూడియో
16- స్పీకర్ హర్మన్ కార్డన్ సిస్టంతోపాటు డాల్బీ అట్మాస్ • లెవల్ 2 ADAS • LED ల్యాంప్స్ • R19 అల్లాయ్ వీల్స్
ఫిక్స్‌డ్-గ్లాస్ ఇన్ఫినిటీ రూఫ్ • 5- స్టార్ భారత్ NCAP సేఫ్టీ రేటింగ్
సింగిల్ ఛార్జితో 79 kWh బ్యాటరీ మీకిప్పిస్తుంది 500 km^ల రియల్ వర్ల్డ్ రేంజ్ అదే 59 kWh బ్యాటరీ తో 400 km^, అంటే వారంలో ఒక్కసారి ఛార్జి చేస్తే సరిపోతుంది. దాంతోపాటు, మీకు లభిస్తుంది బ్యాటరీ మీద లైఫ్ టైం వారంటీ###. ఇప్పుడు ప్రయాణం టెన్షన్ - ఫ్రీ.
ప్రారంభధర
₹24.90 లక్షలు*
₹45 716.00#ల సులువైన EMI
బిజినెస్సులకై 40% డిప్రిసిపషన్ ప్రయోజనం##
మీకు దగ్గరలోనున్న డీలర్ షిప్ ని తెలుసుకునేందుకై స్కాన్ చెయ్యండి
XEV 9e PACK TWO | డెలివరీ ఇప్పుడు ప్రారంభం
ELECTRIC ORIGIN SUVs
mahindra
*ఛార్జర్ మరియు ఇన్ స్టలేషన్ ఖర్చు లేకుండా XEV 9e Pack Two 59 kWh యొక్క ఎక్స్-షోరూమ్ ప్రారంభ ధర #MMFSL తరఫున బెలూన్ పేమెంట్ తోపాటు స్పెషల్ EMI స్కీమ్. ##అర్హత కోసం మీ ఫైనాన్షియల్ అడ్వైజర్ ని సంప్రదించండి. ###మొదటి రిజిస్టర్డ్ ఓనర్ కోసం. కేవలం ప్రైవేట్ రిజిస్ట్రేషన్ కై వర్తిస్తుంది. ఓనర్ షిప్ (యాజమాన్యం) మారితే, HV బ్యాటరీకి వారంటీ 10 సంవత్సరాలు లేదా 2 00 000 km, ఏది బండి డెలివరీకి ముందైతే అది. ^AC ఆన్ చేసి, నగరపు ప్రాంతాలలో నిజమైన పరీక్షల అనుసారం. వాస్తవిక పరిణామాలలో భిన్నంగా ఉండచ్చు. ARAI MIDC P1+P2 ప్రమాణిత రేంజ్ 59 kWh: 542 km, 79 kWh: 656 km. ^^షరతులు, నిబంధనలు వర్తిస్తాయి.
విస్తృతమైన షరతులు, నిబంధనలకై, ఇక్కడ విజిట్ చెయ్యండి: visit www.mahindraelectricsuv.com/tnc.html

సాక్షి

బుధవారం, 27 ఆగస్టు 2025

# క్షతగాత్ర గాజా

అంతర్జాతీయంగా ఏకాకి అవుతున్నకొద్దీ ఇజ్రాయెల్‌లో ఉన్మాదం ప్రకోపిస్తోంది. గాజాలో దాని దుర్మార్గాన్ని ఎప్పటికప్పుడు ప్రపంచానికి చాటుతున్న పాత్రికేయులను గురిచూసి కాటేస్తూ, మరోపక్క గాజా వాసులను ఆకలితో మాడ్చి చంపుతున్న వైనం అమెరికాకు తప్ప అందరికీ ఆందోళన కలిగిస్తోంది. మనుషులు సృష్టించిన దుర్భిక్షంతో గాజా అల్లాడుతున్నదని ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రతను అంచనా వేసే ఐరాస అనుబంధ సంస్థ ఐపీసీ ప్రకటించిందంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థమవుతోంది. మర్యాదలు అడ్డువచ్చాయో, నిబంధనలు అనుమతించలేదో గానీ... గాజా దుర్భిక్షాన్ని మానవ మృగాల సృష్టిగా ప్రకటిస్తే వర్తమాన స్థితికి సరిగ్గా సరిపోయేది. ఇజ్రాయెల్‌ఇంతగా ఎందుకు దిగజారుతున్నదో తెలిసిందే. ఇన్ని దశాబ్దాలుగా ఆ దేశానికి గట్టి మద్దతుదార్లుగా నిలిచి, దాని దురాగతాలను సమర్థిస్తూ వచ్చిన బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియాలు వచ్చే నెలలో జరిగే ఐరాస సర్వసభ్య సమావేశంలో పాలస్తీనాను అధికారికంగా గుర్తించనున్నట్టు ప్రకటించాయి. దాంతో భారత్‌తో సహా 1988లోనే పాలస్తీనా ఆవిర్భావాన్ని గుర్తించిన 147 దేశాల సరసన అవి చేరనున్నాయి. భద్రతా మండలిలోని 5 శాశ్వత సభ్యదేశాల్లో రష్యా, చైనాలు ఇప్పటికే పాలస్తీ నాను గుర్తించగా బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఆ జాబితాలో చేరనున్నాయి. అంటే ఇజ్రాయెల్ నరమేధానికి మౌనంగా అంగీకారం తెలుపుతున్న అమెరికా ఇకపై మండలిలో ఏకాకి కానుంది. అందుకే ఇజ్రాయెల్ ఉన్మాదం ముమ్మరించింది. సమితిలోనూ, మండలిలోనూ పాలస్తీనాపై చర్చ వచ్చేనాటికల్లా పాలస్తీనా ఉనికినే తుడిచేయాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తాపత్రయపడుతున్నారు. అది సాధ్యంకాదని గాజాను వదలబోమంటున్న ప్రజానీకం చాటుతోంది.

రెండేళ్ల క్రితం పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్ ఇజ్రాయెల్ గడ్డపై ఉగ్రవాద చర్యకు పాల్పడి 1,200 మంది పౌరులను హతమార్చటంతోపాటు 250 మందిని అపహరించాక నెతన్యాహూ హమాస్‌పై చర్య నెపంతో ఈ నెత్తుటి హోమాన్ని మొదలుపెట్టారు. రెండు ప్రపంచ యుద్ధాల్లోనూ, వియత్నాం, అఫ్గాన్‌లలో అమెరికా సాగించిన దురాక్రమణ యుద్ధాల్లోనూ మరణించిన మీడియా సిబ్బంది కన్నా అధికంగా గాజాలో 245 మంది పాత్రికేయులు ఇజ్రాయెల్ క్రౌర్యానికి బలయ్యారు. ఈ దురాగతాలు అమెరికా అధ్యక్షుడికి తెలియనే తెలియవట. ఈ పరిణామాలకు ఆయనేమీ సంతోషంగా లేరట! నటనలో ట్రంప్‌ను నెతన్యాహూ మించిపోతున్నారు. పాత్రికేయుల మరణం విషాదకరమనీ, వైద్యసిబ్బందికీ, పౌరులకూ తామెంతో విలువిస్తామనీ చెబుతున్నారు. సోమవారం ప్రాణాలు తీసిన పాత్రికేయులపై ఆయనగారు ఎందుకనో ఉగ్రవాద ముద్ర వేయలేదు.

ఐపీసీ ఇరవయ్యేళ్ల చరిత్రలో కరవు కాటకాలను ప్రకటించింది నాలుగే సందర్భాల్లో. సోమాలియాలో 2011లో, దక్షిణ సూడాన్‌లో 2017, 2020లలో, సూడాన్‌లో నిరుడు ఆ సంస్థ దుర్భిక్షం నెలకొన్నట్టు ప్రకటించింది. ఇప్పుడు ఆ జాబితాలో గాజా చేరింది. గాజా దుర్భిక్షం ఫేజ్–5లో ఉన్నదని ఐపీసీ చెబుతోంది. పిల్లల్లో 30 శాతంమంది తీవ్రమైన పౌష్టికాహార లోపంతో ఉన్నారని, ప్రతి పదివేల మందిలో ముగ్గురు మరణిస్తున్నారని దానర్థం. ఇదే కొనసాగితే గాజా జనాభాలో మూడోవంతు మంది... అంటే 6,41,000 మంది ప్రమాదకర స్థితిలో పడతారని, అయిదేళ్లలోపు చిన్నారులు 1,32,000 మంది మృత్యువాత పడతారని అంచనా వేస్తోంది. ఇప్పటికే ఆకలితో 112 మంది పసివాళ్లతో సహా 271 మంది చనిపోయారు. ఇవిగాక పంపిణీ ట్రక్కుల వద్ద గుమిగూడుతున్నవారిని కాల్చి చంపటం నిత్యకృత్యమైంది. దిగ్బంధాలతో ఆహారం, సరుకులు, ఔషధాలు ప్రజానీకానికి చేరట్లేదు. గాజా వెలుపల 6,000 ట్రక్కులు అనుమతులకై ఎదురుచూస్తున్నాయి.

నిత్యం క్షిపణులు, బాంబులతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతున్నా, ఈ మారణ హోమాన్ని మౌనంగా తిలకిస్తున్న ప్రపంచంలో అనాథలమయ్యామని తెలుస్తూనే ఉన్నా అత్యధిక జనాభా పాలస్తీనాను విడిచిపెట్టడానికి ససేమిరా అంటున్నది. ఆకలితో, హంతక దాడులతో మృత్యువాత పడతామని తెలిసినా వెరవట్లేదు. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఎక్కడా దిక్కులేక అగ్రరాజ్యాల అండతో ఒక దేశాన్ని ఆక్రమించుకున్న దురాక్రమణదారుకేం తెలుసు... మాతృభూమిపై మమకారమంటే ఏమిటో?! ఇవాళ హంతకులది పైచేయి కావొచ్చు, ప్రపంచ ప్రజానీకం మౌనంగా మిగిలిపోవచ్చు. కానీ ఈ నేరాలు సమసిపోవు... వాటికి శిక్షపడకా తప్పదు. అప్పుడు నటనలు చెల్లవు, ముసుగులు కుదరవు. ఆ రోజు ఆగమించేవరకూ పాలస్తీనా పంటి బిగువన ఈ కష్టాలు భరించక తప్పదు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.చవితి ప.1.58 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** చిత్త పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ప.2.31 నుండి 4.16 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.39 నుండి 12.29 వరకు, **అమృత ఘడియలు:** రా.1.02 నుండి 2.45 వరకు, **వినాయక చవితి.**

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.17
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

## సోషల్ టాక్

### కొత్త నియమాలు



చైనా 30 శాతం సుంకాలను ఎదుర్కొంటోంది. ఇండియా 50 శాతం సుంకాలను ఎదుర్కొంటోంది. చైనా వాళ్ల పెద్ద విరోధి కాగా ఇండియా సోకాల్డ్ వ్యూహాత్మక భాగస్వామి. ట్రంప్ ప్రపంచంలో ఏదైనా సాధ్యమే!

– మోనికా వర్మ, పరిశోధకురాలు

### కొనేస్తే పోలా!



మన ధనిక కుటుంబాల్లో ఎవరైనా నోబెల్ శాంతి బహుమతిని కొని 50 శాతం డిస్కౌంటుకు ట్రంప్‌కు అమ్మగలిగితే బాగుండు! ఈ సుంకాల వివాదం ఒక వారంలో సద్దుమణుగుతుంది.

– వీర్ దాస్, స్టాండప్ కమెడియన్

### వయసు



నా దగ్గర కీప్యాడ్ (బేసిక్) ఫోన్లు ఉండేవి. పంచాయతీ ఆఫీస్ వాళ్లు ఇంటర్నెట్‌లో ఏది ఎలా వాడాలో చెప్పాక ఇప్పుడు నేను స్మార్ట్‌ఫోన్ వాడుతూ, వార్తలు చూస్తున్నా. నేర్చుకోవటానికి వయసు అడ్డు కాదు.

– ఎం.ఎ. అబ్దుల్లా మౌలవి (105), సరికొత్త డిజిటల్ అక్షరాస్యుడు

### మూడు



అసాధారణమైన వాటిని సాధించడానికి మొదట ప్రశాంతమైన మనసు అవసరం. రెండోది: విజయాన్ని అదృష్టానికి ఆపాదించక పోవటం. మూడు: డబ్బు సంపాదించటం కంటే లక్ష్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వటం.

– జాంగ్ యిమింగ్, టిక్ టాక్ ఫౌండర్

### కంటెంట్



యూట్యూబ్ అద్భుతమైన వేదిక ఏమీ కాదు. గొప్ప కంటెంట్ క్రియేటర్‌లు, కళాకారులు, సంగీతకారులు, విభిన్నమైన ఆలోచనాపరులు వేదిక పైకి రావటం వల్ల యూట్యూబ్ నిజంగా అద్భుతం అయింది.

– నీల్ మోహన్, యూట్యూబ్ సీఈవో

### ప్రణాళిక



సమాజంలో ఎగుడు దిగుడుగా ఏముందో చూడండి. దానిని ఎలా మెరుగు పరచాలో కనిపెట్టండి. ఆపై, దాని చుట్టూ ఒక వ్యాపారాన్ని ప్లాన్ చెయ్యండి. లాభాలు ఎందుకు రావో చూద్దాం.

– విట్నీ వోల్ఫ్ హెర్డ్, అమెరికన్ పారిశ్రామికవేత్త

# స్వావలంబన సాధించగలమా?

విశ్లేషణ



డా॥ తమ్మా కోటిరెడ్డి



◆ భారత్‌లో అవసరమైన ఆరోగ్య సంరక్షణ సాధనాలు 90 శాతం చైనా నుండి దిగుమతి చేసుకుంటున్నవే!

◆ 2024–25లో ఎరువులకు డిమాండ్ 650 లక్షల టన్నులు కాగా, 170 లక్షల టన్నులకు పైగా దిగుమతి చేసుకున్నట్లు అంచనా.

◆ టెక్స్‌టైల్స్‌కు సంబంధించి భారత్ అతి పెద్ద ఎగుమతిదారునిగా నిలిచినప్పటికీ వీటి తయారీలో ఉపయోగించే సింథటిక్ ఫైబర్, ముఖ్య యంత్రాల కొరకు దిగుమతులపై ఆధారపడుతోంది.

స్వాతంత్ర్యానంతరం 1950వ దశకం మొదటి అర్ధ భాగంలో ఆహార ధాన్యాలు, హెవీ ఇంజినీరింగ్ వస్తువులు, రవాణా పరికరాలు, యంత్రాలు, మెషిన్ టూల్స్, ఇతర మూలధన వస్తువుల దిగుమతులపై భారత్ అధికంగా ఆధారపడింది. స్వావలంబన, స్వీయ ఉత్పత్తి ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా ప్రారంభమైన మూడవ పంచవర్ష ప్రణాళిక, ఆ తర్వాతి హరిత విప్లవం, మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర భారత్‌లు సరైన ఫలితాలను అందించలేక పోయాయి. 2024–25లో వస్తు వాణిజ్య లోటు 282.3 బిలియన్ డాలర్లు కాగా, కరెంటు ఖాతా లోటు 23.3 బిలియన్ డాలర్లుగా నమోదవడాన్ని బట్టి, భారత్ వస్తు దిగుమతులపై అధికంగా ఆధారపడటం తేటతెల్లమవుతున్నది.

**తయారీకి దిగుమతులే ఆధారం**

తయారీ రంగాన్ని పటిష్ఠపరచడంతోపాటు భారత్‌ను ప్రపంచంలో 'తయారీ, డిజైన్ హబ్'గా రూపొందించడానికి 2014 సెప్టెంబర్‌లో 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ప్రారంభమైంది. నియంత్రణ–విధానపరమైన అడ్డంకులు, లాజిస్టిక్స్–సప్లయ్ చెయిన్ వ్యవస్థ సమర్థంగా లేకపోవడం, ప్రైవేటు–విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులలో తక్కువ వృద్ధి, నైపుణ్యం గల శ్రామిక శక్తి లభ్యత తక్కువగా ఉండటం, అంతర్జాతీయ మార్కెట్‌లో అధిక పోటీ కారణంగా మేక్ ఇన్ ఇండియా తన లక్ష్య సాధనలో వెనుకబడింది.

సెమీ కండక్టర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల విషయంలో మొబైల్ ఫోన్ తయారీదారులు అధికంగా దిగుమతులపై ఆధారపడుతున్నారు. భారత్‌లో ఫోన్ల అసెంబ్లింగ్‌లో నిమగ్నమైన ఆపిల్, శామ్‌సంగ్, షావోమీ కంపెనీలు చైనా, తైవాన్, దక్షిణ కొరియా నుండి చిప్‌సెట్స్, డిస్‌ప్లే ప్యానల్స్, కెమెరా మాడ్యూల్స్‌ను దిగుమతి చేసు కుంటున్నాయి. కార్ల తయారీలో నిమగ్నమయిన టాటా, హ్యుండాయ్, మారుతి సుజుకీలు ఎలక్ట్రానిక్స్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ, ఇంజిన్ కంట్రోల్ యూనిట్లను దిగుమతి చేసుకుంటున్నాయి. చైనా నుండి సోలార్ సెల్స్, మాడ్యూల్స్‌ను పెద్ద సోలార్ పార్క్‌లు దిగుమతి చేసుకుంటున్నాయి. భారత్‌లో అవసరమైన ఆరోగ్య సంరక్షణ సాధనాలు 90 శాతం చైనా నుండి దిగుమతి చేసుకుంటున్నవే. ప్రపంచ మార్కెట్‌లో టెక్స్‌టైల్స్‌కు సంబంధించి భారత్ అతి పెద్ద ఎగుమతిదారునిగా నిలిచినప్పటికీ వీటి తయారీలో ఉపయోగించే సింథటిక్ ఫైబర్, ముఖ్య యంత్రాల కొరకు భారత్ దిగుమతులపై ఆధారపడుతోంది. టీవీ, లాప్‌టాప్స్, వాషింగ్ మెషిన్ ఉత్పత్తుల అసెంబ్లింగ్‌కు అవసరమైన చిప్స్, సెన్సార్స్, డిస్‌ప్లేలు కూడా దిగుమతి చేసుకుంటున్నవే.

**ఎరువుల ఉత్పత్తిని పెంచడమెలా?**

79వ స్వాతంత్ర్య దినోత్సవాలలో భాగంగా ప్రధాని 'స్వయం సమృద్ధ భారత్'ను ప్రస్తావించారు. 2047 నాటికి అన్ని రంగాలలో ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ విజన్‌ను పేర్కొన్నారు.

అయితే, దేశీయంగా వ్యవసాయ డిమాండ్ నేపథ్యంలో ఎరువులు ప్రధాన దిగుమతులుగా నిలిచాయి. 2024–25లో ఎరువులకు డిమాండ్ 650 లక్షల టన్నులు కాగా, దేశీయంగా ఉత్పత్తి తక్కువగా ఉండటంతో 170 లక్షల టన్నులకు పైగా దిగుమతి చేసుకున్నట్లు అంచనా. అధిక దిగుమతులపై ఆధారపడటాన్ని భారత్ తగ్గించుకున్నప్పుడు వాణిజ్య లోటు తగ్గుతుంది. యూరియా, ఫాస్ఫటిక్, పొటాసిక్ ఎరువుల దిగుమతులను తగ్గించుకోవడానికి గ్యాస్ ఫీల్డ్స్ అధికంగా ఉన్న ప్రాంతాలలో నూతన ప్లాంట్లను ఏర్పాటు చేయాలి. ఇప్పటికే మూసివేసిన ఎరువుల కర్మాగారాలను తిరిగి ప్రారంభించడంతో పాటు నానో– ఫెర్టిలైజర్ టెక్నాలజీని ప్రోత్సహించాలి. బయో ఆధారిత, ఆర్గానిక్ ఎరువుల వినియోగం పట్ల రైతులలో అవగాహన పెంపొందించినట్లయితే రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. ఎరువుల ఉత్పత్తిని పెంచడానికి విదేశాలలో జాయింట్ వెంచర్స్ ఏర్పాటుతో పాటు ప్రపంచ ఎరువుల మార్కెట్‌లో ప్రధాన దేశాలుగా ఉన్న రష్యా, జోర్డాన్, కెనడాలతో దీర్ఘకాలిక ఒప్పందాలు అవసరం.

**'పునరుత్పాదక' సమస్యలు**

జనాభా పెరుగుదల, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ నేపథ్యంలో 2040 నాటికి భారత్ శక్తి వినియోగం రెట్టింపు కాగలదని 'ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ' అంచనా. భారత్ అవస్థాపిత విద్యుత్ సామర్థ్యం 2025 జూన్ నాటికి 476 గిగావాట్లకు చేరుకుంది. 2013–14తో పోల్చినప్పుడు 2024–25లో విద్యుత్ కొరత తగ్గినప్పటికీ తలసరి వినియోగంలో 45.8 శాతం పెరుగుదల ఏర్పడింది. భారత్ మొత్తం విద్యుత్ సామర్థ్యంలో థర్మల్ విద్యుత్ వాటా 50.52 శాతం కాగా, శిలాజేతర ఇంధనాల వాటా 49 శాతం. 2014–15లో భారత్ మొత్తం ఎనర్జీ వినియోగంలో దిగుమతి వాటా 26 శాతం కాగా, 2025 జనవరి నాటికి 19.60 శాతానికి తగ్గింది.

'వాణిజ్య బొగ్గు మైనింగ్', 'మిషన్ కోకింగ్ కోల్' వంటి ప్రభుత్వ చర్యల వల్ల స్వదేశీ బొగ్గు ఉత్పత్తి పెరిగి, దిగుమతులపై ఆధారపడటం తగ్గింది. కానీ 2030–2035 మధ్య బొగ్గుకు డిమాండ్ అధికంగా ఉంటుందని నీతి ఆయోగ్ అంచనా. రాబోయే కాలంలో శక్తికి బొగ్గు ప్రధాన ఆధారంగా నిలిచే అవకాశం ఉన్నందువలన సౌర, పవన, జల విద్యుత్తు లాంటి పునరుత్పాదక శక్తి వనరులపై దృష్టి సారించాలి. శిలాజేతర ఇంధన ఆధారిత శక్తి సామర్థ్యం 2030 నాటికి 500 గిగావాట్లకు చేరుకోవాలని లక్ష్యం. అవస్థాపనా సౌకర్యాల కల్పన, గ్రీన్ ఫైనాన్సింగ్, ప్రభుత్వ – ప్రైవేటు భాగస్వామ్యాలను ప్రోత్సహించినప్పుడు ఆ యా ఉత్పత్తులు పెరిగి శక్తి సప్లయ్ పెరుగుతుంది. పునరుత్పాదక శక్తి ఆధారాలు ఎదుర్కొంటున్న సమస్యలైన ట్రాన్స్‌మిషన్ మౌలిక వసతులు సరిపోయినంతగా లేకపోవడం, నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటం, వాతావరణ మార్పులు, సౌర, పవన క్షేత్రాలు నిర్మించడానికి అవసరమైన భూసేకరణ లాంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

**అవసరమైన సంస్కరణలు**

రక్షణ ఉత్పత్తి సామర్థ్యం పెంచడానికి ఇటీవల ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రక్షణ రంగ ఉత్పత్తులకు సంబంధించి ఎఫ్‌డీఐ పరిమితిని సరళీకరించడంతోపాటు దేశీయ ఉత్పత్తికి ప్రాధాన్యమిస్తోంది. 2020–24 మధ్య ప్రపంచవ్యాప్తంగా మొత్తం ఆయుధాల దిగుమతిలో భారత్ వాటా 8.3 శాతం. మందుగుండు సామగ్రిలో భారత్ 88 శాతం స్వయంసమృద్ధి సాధించింది. రక్షణ రంగంలో భవిష్యత్ ఒప్పందాలు, ప్రాజెక్టులకు సంబంధించిన 'డిఫెన్స్ ఆర్డర్ పైప్‌లైన్' స్వదేశీ రక్షణ ఉత్పత్తుల పెరుగుదలకు దోహదపడగలదు. రక్షణ రంగంలో స్వావలంబన సాధన దిశగా 'మిలిటరీ–ఇండస్ట్రియల్ కాంప్లెక్స్'ను అభివృద్ధి పరచాలి.

ముఖ్య రంగాలలో నైపుణ్యం, పోటీతత్వం, స్వదేశీ ఉత్పత్తి సామర్థ్యం, కార్మిక సంస్కరణలు, కీలక పరిశ్రమలలో ప్రైవేటు కంపెనీలను అనుమతించడం లాంటి చర్యలు తీసుకున్నప్పుడే స్వావలంబన లక్ష్యం నెరవేరగలదు.

వ్యాసకర్త వైస్ ఛాన్స్‌లర్ (ఇన్‌ఛార్జ్), ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, హైదరాబాద్

# ప్రైవేటు పరం చేయడానికి అంతా సిద్ధం!



'విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు' అనే నినాదం స్ఫూర్తితో ఎందరో ప్రాణ త్యాగాలకు ప్రతీకగా నిలిచిన విశాఖ ఉక్కు కర్మాగారం ఇప్పుడు ప్రైవేటుపరం కాబోతోంది. 1982లో తొలి బ్లాస్ట్ ఫర్నేస్ యూనిట్ ప్రారంభం అయినా... అతి కష్టం మీద నిర్మాణం పూర్తి చేసుకుని 1992లో నాటి ప్రధాని పీవీ నరసింహారావు చేతుల మీదుగా జాతికి అంకితం అయింది.

రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)గా పేరుపొందిన విశాఖ ఉక్కు కర్మాగారంలో వివిధ శాఖల్లో దాదాపు పద్నాలుగు వేలమంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరుకాక కొన్ని వేలమంది ఔట్ సోర్సింగ్ కార్మికులు కూడా కొనసాగుతున్నారు. 73 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి లక్ష్యంతో లాభాల బాటలో దూసుకుపోయిన విశాఖ ఉక్కు ఒక దశలో అంచనాలకు మించిన ఉత్పత్తిని సాధించింది. అయితే ప్రపంచ వ్యాప్తంగా ఉక్కు రంగంలో నెలకొన్న ప్రతికూల ప్రభావాల కారణంగా విశాఖ ఉక్కు మెల్లమెల్లగా నష్టాలను చవిచూడటం మొదలు పెట్టింది. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లేకపోవడంతో నష్టాలు మరింత పెరిగాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేయడానికి నిర్ణయించింది. 2021 ఫిబ్రవరిలో పార్లమెంటులో దీనికి సంబంధించిన ప్రకటన చేసింది. పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కార్మికులు సమ్మెకు దిగారు. వివిధ రూపాల్లో దశలవారీగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేశారు. 2024 దాకా అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డి ప్రైవేటీకరణను అడ్డుకునే ప్రయత్నం చేసింది.

ప్రతిపక్షంలో ఉండగా అనేక వాగ్దానాలు చేసిన తెలుగుదేశం పార్టీ... బీజేపీ, జనసేనలతో కూటమిగా ఏర్పడి అధికారంలోకి వచ్చినా అది వెలగబెట్టింది ఏమీ కనబడటం లేదు. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న స్టీల్ ప్లాంట్ కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదనీ, తెలుగువారి భావోద్వేగాలతో ముడిపడిన జనసేనాని పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. తాము అధికారంలోకి వస్తే సొంత నిధులతోనైనా ఉక్కు ఫ్యాక్టరీని కొనసాగిస్తాము కానీ, ప్రైవేటుపరం కానీయబోమని నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు అన్నారు. లోకేశ్ ఏకంగా ఒక రోజు కార్మికుల శిబిరంలో కూర్చున్నారు. కానీ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత కూటమి నేతలు స్టీల్ ప్లాంట్ అంశాన్ని పక్కన పెట్టేశారు. వేలాదిమంది ఒప్పంద కార్మికులను యాజమాన్యం ఉద్యోగాల నుంచి తొలగించింది. తాజాగా 32 విభాగాలను ప్రైవేటు పరం చేసేందుకు టెండర్లు పిలిచింది. ఉక్కుమంత్రి విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూరు శాతం పెట్టుబడుల ఉపసంహరణ జాబితాలోనే ఉంచామని పార్లమెంటులో ప్రకటించారు. ఇదంతా చూస్తుంటే... విశాఖ ఉక్కు కర్మాగారం త్వరలోనే ప్రైవేటు పరం కావడం తథ్యం అనిపిస్తోంది.

– ప్రొ॥ పీటా బాబీ వర్ధన్, ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం శాఖ పూర్వాధిపతి | 93931 00566

# ప్రభుత్వ నియంత్రణ అవసరం!

ఇన్ బాక్స్

భారతదేశంలో స్మార్ట్‌ఫోన్‌లు పిల్లల మానసిక, శారీరక భద్రతకు పెను ముప్పుగా మారుతున్నాయి. హైదరాబాద్ కూకట్‌పల్లిలో 10 ఏళ్ల బాలికను 14 ఏళ్ల బాలుడు హత్య చేయడం, జడ్చర్లలో తొమ్మిదేళ్ల బాలికపై 12 ఏళ్ల బాలుర అత్యాచారం, నంద్యాలలో 8 ఏళ్ల బాలికను 14 ఏళ్ల ముగ్గురు బాలురు అత్యాచారం చేసి హత్య చేయడం – ఈ దారుణ సంఘటనలు సమాజాన్ని కలచివేస్తున్నాయి. ఈ బాలురు స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా పోర్నోగ్రఫీ, హింసాత్మక కంటెంట్‌కు వ్యసనపరులైనట్లు వార్తలు వెల్లడించాయి. ఈ నేరాలు శ్రుతి మించక ముందే, ప్రభుత్వం వీటి నేపథ్యాన్ని అధ్యయనం చేసి చిన్న పిల్లలకు స్మార్ట్‌ఫోన్‌లు అందుబాటులోకి రాకుండా చర్యలు తీసుకోవాలి.

ఈ నేరాల మూలాల్లోకి వెళితే... జడ్చర్ల, నంద్యాల బాలురు పోర్నోగ్రఫీకి బానిసలై ఈ ఘాతుకాలకు పాల్పడ్డారు. కూకట్‌పల్లిలో బాలుడు ఓటీటీలోని క్రైమ్ వెబ్‌సిరీస్‌లు, యూట్యూబ్‌లోని హింసాత్మక వీడియోల ప్రభావంతో హత్య చేశాడని పోలీసుల విచారణలో తేలింది.



మైనర్ల ప్రవర్తనపై డిజిటల్ మీడియా ప్రభావాన్ని ఆల్బర్ట్ బండూరా 'సామాజిక అభ్యసన సిద్ధాంతం' ద్వారా అర్థం చేసుకోవచ్చు. ఈ సిద్ధాంతం ప్రకారం... ఇతరులను వ్యక్తులు, ముఖ్యంగా పిల్లలు గమనించడం ద్వారా, అనుకరించడం ద్వారా ప్రవర్తనలను నేర్చుకుంటారు. స్మార్ట్‌ఫోన్‌లలోని హింసాత్మక, అశ్లీల కంటెంట్ నిరంతర వీక్షణం వారిలో ఆ ప్రవర్తనలను సాధారణీకరించడానికీ, సున్నితత్వాన్ని కోల్పోవడానికీ దారితీస్తుంది.

ఇప్పటికే బ్రిటన్‌లో 16 ఏళ్లలోపు పిల్లలకు స్మార్ట్‌ఫోన్‌ల విక్రయాన్ని నిషేధించే ప్రతిపాదనపై తీవ్రంగా చర్చిస్తున్నారు. భారతదేశంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఇక్కడ 11 ఏళ్లకే పిల్లలు స్మార్ట్‌ఫోన్లు వాడుతూ, రోజుకు 3–4 గంటలు దానితోనే గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో, నిజానికి బ్రిటన్ కంటే మనమే ముందుగా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రుల ఆందోళనలను, సూచనలను పరిగణనలోకి తీసుకుని చట్టాన్ని రూపొందించాలి.


స్మార్ట్‌ఫోన్‌లను అందుబాటులో లేకుండా చేస్తే పిల్లల భద్రత, చదువు మాటేమిటని కొందరు వాదించవచ్చు. అత్యవసర సమాచార బదిలీ కోసం స్మార్ట్‌ఫోన్‌లు అవసరం లేదు. ఇంటర్నెట్, యాప్‌లు లేని ఫీచర్ ఫోన్‌లు సురక్షితమైన ప్రత్యామ్నాయం. ఇవి పిల్లలను బయటి ప్రపంచంతో అనుసంధానిస్తాయి. స్మార్ట్‌ఫోన్ల వ్యసనం మన పిల్లల బాల్యాన్ని, మన సమాజ భద్రతను నాశనం చేయకముందే భారత ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.

– శ్రీనివాస్ మాధవ్ | సమాచార హక్కు పరిశోధకుడు

డేటా పాయింట్

## ఒకటి పనిచేస్తున్నా... మరోటి కొనేస్తున్నారు!

ఫోన్, ల్యాప్‌టాప్ వంటివి పాడైతే మరొకటి కొనడం సాధా రణం. కానీ మనదేశంలో 41 శాతం మంది పాతది పనిచేస్తుండగానే మరోటి కొంటున్నారు. 'స్టాటిస్టా కన్జ్యూమర్ ఇన్‌సైట్స్' 2024 జూలై – 2025 జూన్ మధ్య అనేక దేశాల్లో నిర్వహించిన సర్వేలో మన తర్వాత స్థానంలో బ్రెజిల్, చైనా నిలిచాయి.




# వాతాపి గణపతి



'వాతాపి గణపతిం భజే...' అన్న కర్ణాటక సంగీత కీర్తనను విని ఉండనివారూ, ఎరగనివారూ ఆస్తిక సమాజంలో అరుదు. వాతాపి ఒక ఊరు. దీన్నే 'బాదామి' అని కూడా అంటారు. ప్రస్తుతం ఇది కర్ణాటక రాష్ట్రంలో ఒక చిన్న తాలూకా కేంద్రం. కానీ ఒకప్పుడు ఈ బాదామి, పశ్చిమ చాళుక్య రాజుల రాజధానిగా, కళలకు కాణాచిగా ఉండేది. క్రీ.శ. 642లో జరిగిన 'బాదామి యుద్ధం'లో పల్లవ రాజులు, బాదామి చాళుక్యుల మీద విజయం సాధించారు. పరంజ్యోతి అనే పల్లవ సేనాధిపతి, తమ ఘన విజయానికి జ్ఞాపికగా కాబోలు, వాతాపి నుండి ఒక గణపతి విగ్రహాన్ని తమిళనాటకు తీసుకెళ్ళి, తన స్వస్థలమైన తిరుచెంగట్టన్ గూడిలో ఉన్న శివాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠ చేయించాడు. అది ఈనాటికీ 'వాతాపి గణపతి'గా పూజలందుకొంటున్నది. వాతాపి రాక్షసుడిని వధించిన తరవాత అగస్త్య మహర్షి పూజించిన గణపతి, వాతాపి గణపతిగా ప్రసిద్ధుడయ్యాడని ఒక ఐతిహ్యం.

కర్ణాటక సంగీత త్రిమూర్తులలో ఒకరైన ముత్తుస్వామి దీక్షితుల (1775–1835) స్వగ్రామం తిరువారూరు. అది తిరుచెంగట్టన్ గూడి గ్రామానికి చాలా దగ్గర. వినాయకుడి మీద మొత్తం పదహారు కీర్తనలను రచించిన దీక్షితుల వారు, వాతాపి గణపతిని స్తుతిస్తూ చెప్పిన హంసధ్వని రాగకృతి, గణపతి తత్త్వాన్ని సమగ్రంగా ఆవిష్కరించే మణిపూస. ఇది వాతాపి గణపతికీ, దీక్షితుల వారికీ, హంసధ్వని రాగానికీ అఖండమైన ప్రఖ్యాతిని ఆర్జించిపెట్టింది. ఇన్నేళ్ళలో, ఇంతమంది ఇన్నిసార్లు పాడి, వినిపించిన కృతి, కర్ణాటక సంగీత 'కచేరీ'ల చరిత్రలో మరొకటి లేదు.

వారణాస్యుడైన గణపతిని వరప్రదాతగా, భూతాది సంసేవితుడిగా, భూత భౌతిక ప్రపంచ భర్తగా, వీతరాగుడిగా, విశ్వకారణుడిగా, విఘ్నవారణుడిగా ఈ కృతి నుతి చేస్తుంది. శ్రీ చక్ర త్రికోణ గతుడిగా, మూలాధార క్షేత్ర స్థితుడిగా, ఓంకార రూపమైన వక్రతుండ ధారిగా అభివర్ణిస్తుంది. వీనుల విందుగా వినాయకుడిని కొనియాడే ఈ కీర్తనను వినటానికీ, పాడుకోవటానికీ, మననం చేసుకోవటానికీ వినాయక చతుర్థి అనువైన సుదినం!

– ఎం. మారుతి శాస్త్రి

# కొరియర్‌లో గంజాయి

## ఢిల్లీ నుంచి గుట్టుచప్పుడు కాకుండా రవాణా

- మహీంద్రా యూనివర్సిటీ విద్యార్థులకు విక్రయం
- గంజాయి కొంటున్న 50 మంది విద్యార్థులు
- గంజాయి సిగరెట్ కోసం రోజుకు రూ.2,500 ఖర్చు
- నలుగురిని అరెస్టు చేసిన ఈగల్.. 1.15 కిలోల గంజాయి స్వాధీనం



డ్రగ్స్‌తో పట్టుబడిన విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: కొరియర్ ద్వారా గుట్టుచప్పుడు కాకుండా ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తున్న ఓ ముఠా గుట్టును ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) టీం రట్టు చేసింది. హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీ విద్యార్థులకు ఈ గంజాయి చేరవేస్తున్నట్టు ఆధారాలు లభించాయి. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం జీడిమెట్లలోని సూరారంలో శివాలయం కాలనీలో నిర్వహించిన ఆపరేషన్‌లో ఈ డ్రగ్ రాకెట్‌లో కీలకంగా పనిచేస్తున్న నలుగురిని అరెస్టు చేసి.. 1.15 కిలోల గంజాయి, 47 గ్రాముల ఓజీ వీడ్ స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్న 50 మంది మహీంద్రా యూనివర్సిటీ విద్యార్థులను ఈగల్ టీం గుర్తించింది. ఓ నైజీరియన్ తన నెట్‌వర్క్ ద్వారా ఢిల్లీ, బీదర్ నుంచి పలు కంపెనీల పేరిట కొరియర్ ద్వారా డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు చేరవేడయంతోపాటు స్థానికంగా ఉన్న పెడ్లర్ల ద్వారా మహీంద్రా యూనివర్సిటీ విద్యార్థులకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఈ ఆపరేషన్‌లో మణిపూర్‌కు చెందిన నెవెల్ టాంగ్ బ్రామ్‌తోపాటు అంబటి గణేశ్, బూసా శివ కుమార్, మహ్మద్ అషర్ జావేద్ ఖాన్‌ను అరెస్టు చేసినట్టు ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య మంగళవారం తెలిపారు. యూనివర్సిటీకి చెందిన 14 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా ఐదుగురికి పాజిటివ్ వచ్చింది.

**మల్నాడు రెస్టారెంట్ కేసులో లింకులతో..**

మల్నాడు రెస్టారెంట్ కేసు విచారణ సందర్భంగా తెరపైకి వచ్చిన శ్రీ మారుతి కొరియర్స్ ఫ్రాంచైజీ రాజేష్ ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థ పేరిట రెండు పార్సిళ్లు డీటీడీసీ కొరియర్ సంస్థ ద్వారా ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు పంపినట్టు ఈగల్ అధికారులు గుర్తించారు. ఆ పార్సిళ్లపై ఉన్న మొబైల్ నంబర్లు భారతీయ మొబైల్ నంబర్లుగానే ఉన్నా.. నైజీరియా నుంచి నిక్ అనే వ్యక్తి వాడుతున్నట్లు తేలింది. నిక్ ఢిల్లీ నుంచి పంపిన ఈ పార్సిళ్లు మహీంద్రా యూనివర్సిటీ విద్యార్థులు దినేశ్, భాస్కర్‌లకు చేరినట్టు డెలివరీ బాయ్స్ ద్వారా తెలుసుకున్నారు. ఈ ఇద్దరిలో ఒకరు ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లిస్తుండగా, మరొకరు ఈ పార్సిళ్లను తీసుకుంటున్నట్టు తెలిసింది. వీరిద్దరూ గంజాయితోపాటు ఎండీఎంఏ పిల్స్‌ను సైతం విద్యార్థులకు సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. మణిపూర్‌కు చెందిన నెవెల్ టాంగ్ బ్రామ్ సైతం ఢిల్లీలోని అరవింద్‌శర్మ, అనిల్ సోయిబామ్ నుంచి గంజాయిని డీటీడీసీ కొరియర్ ద్వారా తెప్పిస్తున్నట్టు ఆధారాలు లభించాయి. బూసా శివకుమార్, అంబటి గణేశ్, అషర్ జావేద్ ఖాన్‌లు విద్యార్థులకు ఈ గంజాయిని సరఫరా చేస్తున్నట్టు తేలింది.

### గంజాయి సిగరెట్ కోసం రోజుకు రూ.2,500

బల్క్‌గా తెచ్చిన గంజాయిని నాలుగు గ్రాములకు ఒక ప్యాకెట్ చొప్పున విభజించి, ఒక్కో ప్యాకెట్‌ను రూ.500లకు విక్రయిస్తున్నారు. ఇది పెట్టుబడి కంటే రెట్టింపు లాభం. అదేవిధంగా ఢిల్లీ నుంచి తెచ్చిన నాణ్యమైన గంజాయి 28 గ్రాములు (ఒక ఔన్స్) రూ.30,000లకు కొనుగోలు చేసి, 1 గ్రామును రూ.2,500లకు విద్యార్థులకు విక్రయిస్తున్నారు. ఒక గ్రాము ఈ గంజాయితో రెండు సిగరెట్లు తయారవుతాయి. వీటి కోసం ఒక్కో విద్యార్థి రోజుకు రూ.2,500 ఖర్చు చేస్తున్నట్లు గుర్తించారు. హాస్టళ్లలో, ప్రైవేట్ సమావేశాలలో ఈ ముఠా విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా చేస్తోంది.

## బాలిక కిడ్నాప్, రేప్ కేసులో దోషికి 51 ఏళ్ల జైలు

- నల్లగొండ జిల్లా పోక్సో కోర్టు సంచలన తీర్పు
- పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చెరో 20 ఏళ్ల శిక్ష
- కిడ్నాప్‌నకు పాల్పడినందుకు 10 ఏళ్లు, బెదిరించినందుకు మరో ఏడాది శిక్ష
- శిక్షలన్నీ ఏకకాలంలో అమలవుతాయని వెల్లడి
- బాధితురాలి కుటుంబానికి రూ.7 లక్షల పరిహారానికి ఆదేశం

రామగిరి (నల్లగొండ): బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన కేసులో దోషికి వివిధ చట్టాల కింద మొత్తం 51 ఏళ్ల జైలు శిక్షవిధిస్తూ నల్లగొండ జిల్లా పోక్సో కోర్టు జడ్జి ఎన్.రోజారమణి మంగళవారం సంచలన తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా తిప్పర్తికి చెందిన మహ్మద్ ఖయ్యూమ్ కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. 2021 నవంబర్ 3న తిప్పర్తి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయాన్ని బాలిక తల్లితండ్రులకు చెప్పడంతో వారు తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన జడ్జి రోజారమణి నిందితుడికి పోక్సో చట్టం ప్రకారం 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 25 వేల జరిమానాతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద 20 ఏళ్ల జైలుశిక్ష, రూ. 25 వేల జరిమానా విధించారు. అలాగే కిడ్నాప్ కేసులో 10 ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ. 25 వేల జరిమానా, బెదిరించిన నేరం కింద ఏడాది జైలుశిక్ష, రూ. 5 వేల జరిమానాతో కలిపి మొత్తం 51 ఏళ్ల జైలు శిక్ష, రూ. 80 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. శిక్షలన్నీ ఏకకాలంలో అమలు కానున్నట్లు తీర్పులో పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి రూ.7 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు.

## అవమానభారంతో మైనర్ బాలిక మృతి

- ముగ్గురు యువకులు లైంగిక దాడి చేసినట్లు బాలిక తల్లి ఫిర్యాదుతో కేసు

ఇల్లంతకుంట (మానకొండూర్): ముగ్గురు యువకులు బెదిరించి తన కూతురిపై లైంగిక దాడికి పాల్పడటంతో అవమానభారం, మనోవేదనకు గురై మరణించిందని మృతురాలి తల్లి ఇల్లంతకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై సిరిసిల్ల అశోక్ వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలానికి చెందిన 17 ఏళ్ల బాలిక తీవ్ర జ్వరంతో బాధపడుతూ ఫిట్స్‌తో సోమవారం మండల కేంద్రంలోని ఆస్పత్రికి వచ్చింది. పరిస్థితి విషమంగా ఉండటంతో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరిశీలించగా అప్పటికే బాలిక మృతిచెందింది. అయితే మైనర్ బాలిక వద్ద ఆమె రాసుకున్న మూడు పేజీల నోట్స్ లభించాయి. తన కూతురు మృతికి పిల్లి వినోద్, జాషు, సతీశ్ కారణమంటూ మృతురాలి తల్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మైనర్ బాలిక తన తల్లి వద్ద బెజ్జంకి మండలం చిల్లాపూర్‌లో ఉంటూ ఇంటర్ ఫస్టియర్ చదివింది. ఏడాది కిందట ఇల్లంతకుంట మండలంలో ఉంటున్న తండ్రి వద్దకు వచ్చింది. తన తండ్రితోపాటు గాలిపెల్లి, ఇల్లంతకుంట, కందికట్కూర్‌లోని వారసంతల్లో కూరగాయలు విక్రయించేది. పోస్టుమార్టం అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని ఎస్సై తెలిపారు. కాగా, సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రిలో మృతురాలి బంధువులు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించి, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



కనకరాజు

దుబ్బాక: అప్పుల బాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ పరిధిలో జరిగింది. ధర్మాజీపేటకు చెందిన దివిటి కనకరాజు (37) వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. నమ్ముకున్న వ్యవసాయంలో అంతగా కలిసిరాక అప్పుల పాలయ్యాడు. దీంతో కొన్ని రోజులుగా అప్పుల బాధతో తీవ్ర మనోవేదనకు గురవుతూ వస్తున్నాడు. ఈ క్రమంలోనే ఈనెల 21న కనకరాజు పురుగుల మందు తాగాడు. పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబ సభ్యులు సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కీర్తి రాజు తెలిపారు.



సిరిసిల్లలో ఇందిరా మహిళా శక్తి చీరలను చూపిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు. చిత్రంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఆది శ్రీనివాస్, శైలజా రామయ్యర్

## నేతన్నలకు చేతినిండా పని కల్పిస్తున్నాం

- గత ప్రభుత్వం బకాయిపెట్టిన రూ. 352.35 కోట్లు చెల్లించాం
- సిరిసిల్లలో త్రిఫ్ట్ ఫండ్ పొదుపు సొమ్ము రూ.12.41 కోట్లు విడుదల కార్యక్రమంలో మంత్రి తుమ్మల
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి చెక్కులు పంపిణీ

సిరిసిల్ల: నేతన్నల ఆదాయానికి కొదువ లేకుండా చేతినిండా పని కల్పిస్తున్నామని వ్యవసాయ, చేనేత, మార్కెటింగ్, జౌళిశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మరమగ్గాల కార్మికులకు రూ. 12.41 కోట్ల త్రిఫ్ట్ ఫండ్ పొదుపు సొమ్ము పంపిణీ, బీమా పథకం చెక్కులను లబ్ధిదారులకు మంత్రి తుమ్మలతోపాటు ఎస్సీ కులాల అభివృద్ధి, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గత ప్రభుత్వం చిన్నాభిన్నం చేసినా ప్రజలపై పన్నుల భారం మోపకుండా ఒక్కోదాన్ని చక్కబెడుతున్నామన్నారు. పసుపు అంటే నిజామాబాద్, ధాన్యం అంటే కరీంనగర్ అనే స్థాయిలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేనేత, జౌళిశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి రూ.వెయ్యి కోట్ల బకాయిలు ఎందుకు పెట్టారని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. సిరిసిల్లలో నేతన్నలతో బతుకమ్మ చీరలు నేయించి రూ.352.35 కోట్ల మేర బకాయిలు పెడితే తమ ప్రభుత్వం చెల్లించిందన్నారు. నాణ్యత లేని బతుకమ్మ చీరల స్థానంలో 65 లక్షల మంది స్వశక్తి మహిళలకు నాణ్యమైన ఇందిరా మహిళా శక్తి చీరలు అందిస్తున్నామని వివరించారు. ఐఐహెచ్‌టీ యూనివర్సిటీని స్థాపించి ఏటా 120 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. తెలంగాణ రైతుల ప్రయోజనం కోసం ఎప్పుడు మోటార్లు వేయాలో.. ఎప్పుడు ప్రాజెక్టులు నింపాలో తమకు తెలుసని వ్యాఖ్యానించారు. మంత్రి అడ్లూరి మాట్లాడుతూ అధికారంలో ఉండగా నేతన్నలకు రూ. కోట్లలో బకాయిలు పెట్టిన పెద్దమనిషి.. అధికారం పోగానే నేతన్నలను ఆదుకోవాలని లేఖలు రాయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. సిరిసిల్ల నేతన్నలు నేసిన ఇందిరా మహిళా శక్తి చీరలను ప్రదర్శించారు.

## బీజేపీ తీరుపై చేవెళ్ల ఎంపీ కొండా వినూత్న నిరసన

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీకి ఫుట్‌బాల్ ఇచ్చి నిరసన



సాక్షి, హైదరాబాద్: బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వినూత్న తరహాలో నిరసన వ్యక్తం చేశారు. తాను ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిధిలోనే తనను నిర్లక్ష్యం చేస్తున్నారంటూ మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ తివారీకి ఫుట్‌బాల్‌ను కానుకగా అందచేసినట్టు తెలుస్తోంది. అయితే ఫోన్లో 'సాక్షి'ఆయన్ను సంప్రదించినపుడు ఫుట్‌బాల్‌ను తాను పార్టీ కార్యాలయంలో వదిలి వచ్చానని, తమ అంతర్గత చర్చల్లో కొన్ని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకొస్తుంటామని బదులిచ్చారు. ఎంపీగా తాను లేకుండానే పార్టీ శిక్షణా కార్యక్రమాల పూర్తి, వికారాబాద్ జిల్లా చేవెళ్ల పరిధిలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పల్లె నిద్ర, వికారాబాద్ జిల్లాలో పర్యటించారని ఆయన చెబుతున్నట్టు తెలిసింది. తాను అందుబాటులో లేని సమయంలో ఈ జిల్లాల అధ్యక్షులు కార్యక్రమాల నిర్వహణ, వాటికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కూడా హాజరు కావడంపై విశ్వేశ్వర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తంచేస్తున్నట్టు తెలిసింది. ఈమేరకు తివారీకి చెప్పేందుకు చూస్తే రాంచందర్‌రావుకు చెప్పాలన్నారని, రాష్ట్ర అధ్యక్షుడికి తెలియజేయాలని ప్రయత్నిస్తే, ఆయన పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్‌పాటిల్‌ను కలవమంటున్నారని వాపోతున్నట్టు తెలుస్తోంది. దీంతో విసుగు చెందిన విశ్వేశ్వర్‌రెడ్డి ఫుట్‌బాల్ అందజేసినట్టు సమాచారం. రాష్ట్ర పార్టీ నుంచి ఏదో అదృశ్యశక్తి తనకు వ్యతిరేకంగా పనిచేస్తోందని, ఆ శక్తి ఆదేశాలకు అనుగుణంగా జిల్లా అధ్యక్షుడు పనిచేస్తున్నారని ఆరోపించారు.

## 'సాహితీ' మాజీ డైరెక్టర్ పూర్ణచంద్రరావు అరెస్టు

- ప్రీలాంచ్ మోసం కేసులో అరెస్టు చేసిన ఈడీ
- 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించిన కోర్టు

సాక్షి, హైదరాబాద్: ప్రీలాంచ్ ఆఫర్ల పేరిట కొనుగోలుదారులను మోసగించిన కేసులో సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌ఐవీఐపీఎల్) మాజీ డైరెక్టర్, సేల్స్ అండ్ మార్కెటింగ్ హెడ్ సందు పూర్ణచంద్రరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. అతడిని నాంపల్లిలోని పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చగా.. కోర్టు అతడికి 15 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించినట్టు ఈడీ హైదరాబాద్ జోనల్ యూనిట్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. తెలంగాణ పోలీసులు ఎస్‌ఐవీఐపీఎల్ ఎండీ బి.లక్ష్మీనారాయణ, ఇతరులపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ విచారణ ప్రారంభించింది. ఈ సంస్థ రెసిడెన్షియల్ గేటెడ్ కమ్యూనిటీ నిర్మాణం కోసం 'ప్రీలాంచ్ ఆఫర్' ప్రకటించి సుమారు 700 మంది నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసింది. చివరకు కొనుగోలుదారులకు ఫ్లాట్లను అందించడంలో, వారి డబ్బును తిరిగి చెల్లించడంలో విఫలమైంది. ఇలా సుమారు రూ.360 కోట్ల మేర మోసగించినట్లు కేసులు నమోదయ్యాయి. సందు పూర్ణచంద్రరావు సుమారు రూ.126 కోట్లను ఎస్‌ఐవీఐపీఎల్ నుంచి దుర్వినియోగం చేశాడని అభియోగాలున్నాయి. ఈ విషయం బి.లక్ష్మీనారాయణకు తెలియడంతో, అతడు పూర్ణచంద్రరావుపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించాడు. ఈ ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించడం కోసం పూర్ణచంద్రరావు.. సాహితీ గ్రూప్ ఉద్యోగులు, ఇతరుల పేరిట 21 స్థిరాస్తులను లక్ష్మీనారాయణ లబ్ధి కోసం బదిలీ చేశాడు. ఈ కేసులో లక్ష్మీనారాయణను ఈడీ గత ఏడాది సెప్టెంబర్ 29న అరెస్ట్ చేసింది. ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు.

## నకిలీ మద్యం తయారీ లేబుల్స్ యూనిట్ సీజ్

**కుషాయిగూడలో ఎక్సైజ్ ఎస్టీఎఫ్ సోదాల్లో గుర్తింపు.. ఇద్దరి అరెస్టు**

సాక్షి, హైదరాబాద్: నకిలీ మద్యం తయారీ బాటిల్స్‌పై వేస్తున్న లేబుల్స్ తయారు చేసే యూనిట్‌ను ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ యూనిట్ అధికారులు గుర్తించారు. సోమవారం తెల్లవారు జామున కుషాయిగూడలోని శివసాయి నగర్ కాలనీ, నాగార్జున కాలనీ మధ్య గుట్టుచప్పుడు కాకుండా నడుపుతున్న ప్రింటింగ్ మెషీన్లతోపాటు ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.30 లక్షల విలువ చేసే కలర్ లేబుల్స్ తయారీ ప్రింటర్‌తోపాటు రూ.20 లక్షల విలువ చేసే సామగ్రి ఉన్నట్టు ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యూనిట్ గడ్డమీది నవీన్ గౌడ్‌కు సంబంధించిన నివాస స్థలంలో నిర్వహిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో కుషాయిగూడకు చెందిన గడ్డమీది ప్రకాశ్, నివావత్ రాజేశ్‌లను అరెస్టు చేసినట్టు తెలిపారు. ఎస్టీఎఫ్ ఇన్‌చార్జి అంజి రెడ్డి బృందం రెండు నెలల కిందట సూర్యాపేటలో నకిలీ మద్యం తయారీ ముఠాను పట్టుకున్నారు. ఆ కేసు దర్యాప్తు సందర్భంగా లభించిన ఆధారాల మేరకు నకిలీ లేబుల్స్ తయారీ యూనిట్‌కు సంబంధించి వివరాలు వెలుగు చూశాయి. ఇక్కడ తయారయ్యే లేబుల్స్‌ను తెలంగాణ, ఏపీ, కర్ణాటకలో తయారు చేసే నకిలీ మద్యం బాటిళ్లపై వాడేందుకు సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది.

## ఇందిరమ్మ ఇళ్ల ఆర్థిక సాయం రూ. వేయి కోట్లు

- గృహనిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇప్పటివరకు అందజేసిన ఆర్థిక సాయం రూ.వేయి కోట్లకు చేరుకుందని గృహనిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతం వెల్లడించారు. ఇప్పటివరకు 2.04 లక్షల ఇళ్ల పనులు మొదలుకాగా, వాటిల్లో లక్ష ఇళ్లు బేస్‌మెంట్ స్థాయికి చేరుకున్నాయన్నారు. మంగళవారం గృహనిర్మాణ సంస్థ కార్యాలయంలో జిల్లా పీడీలు, డిప్యూటీ ఇంజనీర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందేలా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పథకం నిర్వహణలో అవినీతి, అక్రమాలను సహించబోమని, బాధ్యులపై కఠినచర్యలుంటాయని హెచ్చరించారు. శాఖాపరమైన చర్యలే కాకుండా ఏసీబీకి అప్పగించి విచారణ జరిపిస్తామన్నారు. బిల్లుల కోసం లబ్ధిదారులు ఎవరికీ లంచాలు ఇవ్వొద్దన్న విషయంలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని గౌతం ఆదేశించారు. బిల్లులు అందుకునే సందర్భంలో, ఇళ్ల నిర్మాణ పురోగతికి సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేసే విషయంలో గ్రామ కార్యదర్శులే కాకుండా లబ్ధిదారులు కూడా అప్‌లోడ్ చేసే వెసులుబాటు సంబంధిత యాప్‌లో ఉందని వెల్లడించారు. సమావేశంలో సంస్థ సలహాదారు ఈశ్వరయ్య, చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్, ఎస్ఈలు వెంకటదాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లాభాల ఆశచూపి.. నిండా ముంచారు

**రియల్ ఎస్టేట్ వ్యాపారి నుంచి రూ.4.87 కోట్లు కొల్లగొట్టిన సైబర్ కేటుగాళ్లు**

సాక్షి, హైదరాబాద్: ట్రేడింగ్, స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే తక్కువ సమయంలో రూ.కోట్లు లాభాలు వస్తాయంటూ సైబర్ నేరగాళ్లు ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని రూ.4.87 కోట్లు మోసం చేశారు. తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌తో పాటు సోమవారం రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం హస్తినపురానికి చెందిన కుంభం శ్రీనివాస్‌రెడ్డి (55) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. జూలై 13న ఆయన వాట్సాప్ నంబర్‌కు 8968651687 నంబర్‌తో మెసేజ్ వచ్చింది. ట్రేడింగ్ అకౌంట్‌లో ఇన్వెస్ట్‌మెంట్, లాభాలు పొందేందుకు అంటూ లింక్ పంపించారు. తాము ఇచ్చే టిప్స్‌తో షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే పెద్దమొత్తంలో లాభాలు వస్తాయని ఆశ చూపారు. దీంతో శ్రీనివాస్‌రెడ్డి ముందుగా రూ.50 వేలు ఇన్వెస్ట్ చేశాడు. ఆయన పెట్టుబడికి 24 శాతం లాభం వచ్చినట్లు ఆన్‌లైన్‌లో చూపారు. ఇలా క్రమంగా నమ్మకం పెంచారు. ఇలా వారంలో రూ.1.5 కోట్లు పెట్టుబడిగా పెట్టించి.. రూ.3.5 కోట్లు ఆర్జించినట్లు డాలర్లలో చూపారు. ఈ క్రమంలో శ్రీనివాస్‌రెడ్డి పెట్టుబడిగా పెట్టిన రూ.1.5 కోట్లు సహా రూ.3.5 కోట్లు విత్‌డ్రా చేసుకునే ప్రయత్నం చేశాడు. ప్రాఫిట్ అమౌంట్‌ను తీసుకోవాలంటే 30 శాతం ట్యాక్స్ చెల్లించాలని చెప్పి రూ.1.34 కోట్లు వసూలు చేశారు. ఆ తరువాత కూడా పెద్దమొత్తాన్ని డ్రా చేసుకోవాలంటే రూ.1.8 కోట్లు చెల్లించి వీఐపీగా అప్‌గ్రేడ్ చేసుకోవాలని చెప్పారు. కన్వర్షేషన్ ఫీజు పేరుతో మరో రూ.1.33 కోట్లు వసూలు చేశారు. అయినప్పటికీ విత్‌డ్రా చేసుకునేందుకు ఒప్పుకోలేదు. శ్రీనివాస్‌రెడ్డి ఒత్తిడి మేరకు రూ.1,88,888 చొప్పున రెండు విడతలుగా తీసుకునేందుకు అవకాశం ఇస్తున్నామన్నారు. దీంతో శ్రీనివాస్‌రెడ్డి రూ.1,88,888కు మొదటి రిక్వెస్ట్ పెట్టాడు. దీనికి సంబంధించి ఆరు గంటలలోగా అమౌంట్ క్రెడిట్ అవుతుందని నమ్మించారు. ఈ క్రమంలోనే తప్పుడు ఎంట్రీతో అకౌంట్ ఫ్రీజ్ అయ్యిందని భయాందోళనకు గురిచేశారు. ఈ మొత్తం డబ్బు అన్ ఫ్రీజ్ చేయాలంటే రూ.2.5 కోట్లు చెల్లించాలని సూచించారు. ఇలా ఆగస్టు 23వ తేదీ వరకు రూ.4.87 కోట్లు వసూలు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ సెక్యూరిటీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గర్భిణి హత్య కేసుపై నివేదిక పంపండి

- డీజీపీకి జాతీయ మహిళా కమిషన్ నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: ఐదు నెలల గర్భిణి అయిన భార్య (స్వాతి)ను కట్టుకున్న భర్తే (మహేందర్‌రెడ్డి) కాలయముడై హతమార్చి మృతదేహాన్ని ముక్కలు చేసి మూసీలో పడేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) పేర్కొంది. ఈ హత్యోదంతంపై మీడియా కథనాల ఆధారంగా సుమోటోగా కేసును స్వీకరించినట్లు ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన సమగ్ర నివేదికను మూడు రోజుల్లోగా తమకు సమర్పించాలని తెలంగాణ డీజీపీకి నోటీసులు జారీ చేసింది. కేసులో పురోగతి, నిందితుడిపై తీసుకున్న చర్యల వివరాలను తెలియజేయాలని ఆదేశించింది.

## టవల్ బిగించి చంపి.. మూర్ఛగా నమ్మించి..

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య
- అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన కుమారుడు.. విచారణలో హత్యగా నిర్ధారణ
- నిందితుల అరెస్ట్.. వివరాలు వెల్లడించిన ఏఎస్పీ రాజేశ్ మీనా




వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్‌మీనా

సోన్: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను ప్రియుడితో కలిసి భార్య హతమార్చింది. ఆపై ఏమీ తెలియనట్లు మూర్ఛతో తన భర్త మృతి చెందాడంటూ బంధువులందరినీ నమ్మించింది. తండ్రి అంత్యక్రియలకు దుబాయ్ నుంచి ఇంటికి వచ్చిన కొడుకుకు అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారి విచారణలో ఇది హత్యగా తేలింది. దీంతో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిర్మల్ జిల్లా సోన్ మండలం న్యూ వెల్మల్ గ్రామంలో జరిగిన ఈ హత్యోదంతం వివరాలను నిర్మల్ సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ రాజేశ్‌మీనా మంగళవారం వెల్లడించారు.

**30 ఏళ్ల క్రితం వివాహం..**

న్యూ వెల్మల్ గ్రామానికి చెందిన తిరునగరి నాగలక్ష్మికి 30 ఏళ్ల క్రితం హరిచరణ్ (55)తో పెళ్లయింది. హరిచరణ్ బీడీ ప్యాకింగ్ పని చేస్తుండగా నాగలక్ష్మి బీడీలు చుట్టేది. వారికి పెళ్లిళ్లు జరిగిన కుమారుడు కృష్ణ, ఓ కుమార్తె ఉన్నారు. కృష్ణ ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. నాగలక్ష్మికి అదే గ్రామానికి చెందిన అంకం మహేశ్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. మహేశ్ గతంలో కారోబార్‌గా పనిచేసేవాడు. ఈ వ్యవహారం హరిచరణ్‌కు తెలియడంతో భార్యాభర్తల మధ్య తరచూ వివాదాలు, పంచాయితీలు జరిగేవి. ఈ నేపథ్యంలో హరిచరణ్ అడ్డు తొలగించాలని నాగలక్ష్మి, మహేశ్ నిర్ణయించుకున్నారు.


**హత్య చేసి తప్పుదోవ పట్టించే ప్రయత్నం..**

ఈ నెల 22న అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నాగలక్ష్మి, మహేశ్ కలిసి హరిచరణ్ గొంతుకు టవల్‌తో చుట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. హత్యను దాచిపెట్టేందుకు హరిచరణ్‌కు ఫిట్స్ వచ్చి బాత్రూంలో కాలుజారి పడి మరణించాడని బంధువులను నమ్మించారు. దీంతో సాధారణ మరణంగానే అందరూ భావించి హరిచరణ్ అంత్యక్రియలు పూర్తి చేశారు.

**పోలీసుల దర్యాప్తు..**

అయితే దుబాయ్ నుంచి వచ్చిన కుమారుడు కృష్ణకు తమ ఇంట్లోని గోడకు రక్తపు మరకలు కనిపించడంతో తండ్రి మృతిపై అనుమానం వచ్చింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్య వెనుక నాగలక్ష్మి, మహేశ్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హరిచరణ్ మరణాన్ని తప్పుదోవ పట్టించడంలో సహకరించిన ఆర్ఎంపీ రమేశ్ పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసు ఛేదనలో కీలకపాత్ర పోషించిన సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సై గోపి, పోలీసు సిబ్బందిని అదనపు ఎస్పీ రాజేశ్ మీనా అభినందించారు.





# ట్రంప్ ఫోన్ కాల్స్‌కు మోదీ నో

- ట్రంప్ నాలుగుసార్లు ఫోన్ చేసినా పలకని ప్రధాని మోదీ
- జర్మనీ వార్తాపత్రిక 'ఫ్రాంక్‌ఫర్టర్ అల్‌జెమేని' కథనం



**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో మాట్లాడేందుకు పదేపదే ప్రయత్నించారా? అందుకు మోదీ తిరస్కరించారా? ట్రంప్‌తో సంభాషణకు మోదీ ఇష్టపడలేదా? అంటే.. అవుననే చెబుతోంది జర్మనీ వార్తాపత్రిక ఫ్రాంక్‌ఫర్టర్ అల్‌జెమేని(ఎఫ్ఏజెడ్). భారత ఉత్పత్తులపై అమెరికా ప్రభుత్వం ఏకంగా 50 శాతం టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. దీనిపట్ల భారత నాయకత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో మోదీతో ఫోన్‌లో మాట్లాడడానికి ట్రంప్ కనీసం నాలుగుసార్లు ప్రయత్నించారని జర్మనీ పత్రిక పేర్కొంది. అమెరికా నుంచి నాలుగుసార్లు ఫోన్ చేసినా మోదీ స్పందించలేదని వెల్లడించింది. అమెరికా విజ్ఞప్తులను ఆయన గట్టిగా తిరస్కరించారని, ట్రంప్ విధించిన టారిఫ్‌ల పట్ల తన ఆగ్రహాన్ని పరోక్షంగా వ్యక్తీకరించారని స్పష్టంచేసింది. ఈ మేరకు జర్మనీ పత్రికలో ప్రచురితమైన కథనాన్ని బెర్లిన్‌కు చెందిన గ్లోబల్ పబ్లిక్ పాలసీ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ థార్‌స్టెన్ బెన్నర్ తాజాగా 'ఎక్స్'లో పోస్టుచేశారు.

### ట్రంప్ శాపనార్థాలు

భారత్–అమెరికా మధ్య గత 25 ఏళ్లుగా సంబంధాలు క్రమంగా మెరుగుపడుతున్నాయి. కానీ, ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరుదేశాల మధ్య సంబంధాలు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేస్తుండడాన్ని ట్రంప్ వ్యతిరేకిస్తున్నారు. భారత్ ఇస్తున్న సొమ్మును ఉక్రెయిన్‌లో యుద్ధానికి రష్యా ఖర్చు చేస్తోందని ఆయన ఆరోపిస్తున్నారు. అందుకే రష్యా నుంచి చమురు కొనుగోళ్లు వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తున్నారు. ట్రంప్ హెచ్చరికలను భారత ప్రభుత్వం లెక్కచేయకపోవడంతో ప్రతీకార చర్యల కింద 50 శాతం టారిఫ్‌లు విధించారు. భారత్–రష్యా సంబంధాల గురించి తాను పట్టించుకోనని, ఆ రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలు మృతప్రాయంగా మారుతాయంటూ ట్రంప్ శాపనార్థాలు సైతం పెట్టారు. అయితే, ట్రంప్‌కు ప్రధాని మోదీ గట్టిగా బదులిచ్చారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ త్వరలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం తథ్యమని తేల్చిచెప్పారు. టారిఫ్‌లకు బెదిరిపోయే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు.

### రెచ్చగొట్టేలా ట్రంప్ చర్యలు!

మరోవైపు భారత్–పాకిస్తాన్ ఘర్షణను తానే ఆపేశానని ట్రంప్ తరచుగా చెప్పుకుంటున్నారు. తాను చొరవ తీసుకోకపోతే రెండు దేశాల మధ్య అణుయుద్ధం జరిగేదని ఆయన బహిరంగంగా పేర్కొన్నారు. భారత్‌పై ఒత్తిడి తెచ్చి పాకిస్తాన్‌పై దాడులకు తెరదించేలా చేశానని ట్రంప్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ హఠాత్తుగా ఆగిపోవడం తన ఘనతేనని స్పష్టంచేశారు. అయితే, ట్రంప్ వ్యాఖ్యలను భారత్ పలుమార్లు ఖండించింది. అయినప్పటికీ ఆయన వెనక్కి తగ్గడం లేదు. భారత్–పాక్ యుద్ధాన్ని ఆపేసినందుకు నోబెల్ శాంతి బహుమతికి అర్హుడినని అంటున్నారు. ఇదిలా ఉండగా, పాకిస్తాన్ సైన్యాధిపతి అసిమ్ మునీర్‌ను ట్రంప్ ముద్దు చేస్తున్నారు. వైట్‌హౌస్‌కు అధికారికంగా ఆహ్వానించి, ఘనంగా విందు ఇచ్చారు. పాకిస్తాన్‌కు ఆర్థికంగా మద్దతు ప్రకటిస్తున్నారు. ఈ పరిణామాలన్నీ భారత ప్రభుత్వానికి రుచించడం లేదు. ట్రంప్ చర్యలు తమను రెచ్చగొట్టేలా ఉన్నాయని భావిస్తోంది. అందుకు ట్రంప్‌తో మాటాడ్డానికి ప్రధాని మోదీ ఇష్టపడలేదని తెలుస్తోంది. మరోవైపు ఇటీవలి కాలంలో చైనాతో సంబంధాలకు మోదీ ప్రాధాన్యం ఇస్తుండడం గమనార్హం. ఆయన ఈ నెలాఖరులో చైనాలో పర్యటించబోతున్నారు.

# మన మంత్రం 'స్వదేశీ'

- మన దేశంలో తయారైన వస్తువులే ఉపయోగించుకోవాలి
- స్వదేశీ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలి
- పెట్టుబడి ఎవరిదైనా తయారీ వెనుక మనవాళ్లే ఉండాలి
- ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు



**అహ్మదాబాద్:** స్వదేశీ ఉత్పత్తుల వినియోగం ప్రతి ఒక్కరి జీవన మంత్రం కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. మన దేశంలో మన కార్మికుల శ్రమతో తయారైన వస్తువులు, సరుకులు కొనుగోలు చేయాలని సూచించారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంతో దేశ విదేశీ తయారీదార్లకు పూర్తి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నారు. పెట్టుబడి ఎవరిదైనా సరే.. అది డాలర్ అయినా, పౌండ్ అయినా.. తెల్లధనమైనా, నల్లధనమైనా.. ఆ సొమ్ముతో తయారైన వస్తువుల వెనుక మన కార్మికుల స్వేదం ఉండాలన్నారు. మన గడ్డపై మన వాళ్ల చేతుల మీదుగా ఉత్పత్తి అయిన వస్తువులు మన దేశ పరిమళాన్ని పొందుతాయని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ మంగళవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మారుతీ సుజుకీ కంపెనీ తయారు చేసిన తొలి ఎలక్ట్రిక్ వాహనం(ఈవీ) 'ఈ–విటారా'ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మన దేశంలో తయారైన ఎలక్ట్రిక్ వాహనాలను ప్రపంచమంతటా నడిపించే రోజు వస్తుందన్నారు.

### భవిష్యత్తు తరాల కోసం..

మనదేశంలో ఉత్పత్తి అయిన ప్రతి వస్తువు స్వదేశీ అవుతుందని ప్రధాని మోదీ నిర్వచనం ఇచ్చారు. ఒకవేళ జపాన్ కంపెనీ ఇండియాలో వస్తువులు తయారు చేస్తే అవి స్వదేశీ వస్తువులే అవుతాయని స్పష్టంచేశారు. మన దేశ ఉత్పత్తులను సగర్వంగా వాడుకుందామని చెప్పారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలని, ఆత్మనిర్భర్ భారత్ కోసం ప్రజలంతా కృషి చేయాలని పేర్కొన్నారు. భవిష్యత్తు తరాల కోసం స్వదేశీ ఉద్యమంలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. మన త్యాగాలు, సేవలు చూసి రాబోయే తరాలు గర్వపడతాయని వెల్లడించారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచే 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' ఆకాంక్షలు తన మదిలో ఉన్నాయని వివరించారు. చక్కటి ప్రజాస్వామ్య వ్యవస్థ, భారీ జనాభా, నైపుణ్యం కలిగిన కార్మిక శక్తి మన బలం అని పేర్కొన్నారు. ఇది 'విన్–విన్' పరిస్థితిని సృష్టిస్తుందన్నారు. మనతోపాటు మన భాగస్వాములకు సైతం మేలు జరుగుతుందన్నారు.

**రాష్ట్రాలు పరస్పరం పోటీ పడాలి**

నేడు ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలో ఏ ఒక్క రాష్ట్రం కూడా వెనుకంజలో ఉండడానికి వీల్లేదన్నారు. మనకున్న అవకాశాలను అన్ని రాష్ట్రాలూ ఉపయోగించుకోవాలని చెప్పారు. విదేశీ పెట్టుబడిదారులు మన దేశానికి వెల్లువలా వస్తున్నారని, కానీ.. ఏ రాష్ట్రానికి వెళ్లాలి అనేదానిపై వారు గందరగోళంలో చిక్కుకుంటున్నారని తెలిపారు. అందుకే పెట్టుబడిదారులను ఆకర్షించడంలో రాష్ట్రాలు పరస్పరం పోటీ పడాలని సూచించారు. సంస్కరణలు, అభివృద్ధి అనుకూల విధానాలు, సుపరిపాలనతో ముందుకు రావాలన్నారు. ఇండియా పరుగు ఇక్కడితో ఆగదని, కీలక రంగాల్లో మన పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని చెప్పారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా తయారీ రంగంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. సెమీ కండక్టర్ల రంగంలో దూసుకెళ్తున్నామని తెలియజేశారు. భారత్–జపాన్ సంబంధాలు బలోపేతం అవుతుండడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. రెండు దేశాలు 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అంటూ ప్రశంసించారు.

# జస్టిస్ పంచోలీని నియమిస్తే ప్రాంతీయ అసమతౌల్యం

**కొలీజియం సిఫార్సు పట్ల జస్టిస్ నాగరత్న అభ్యంతరం**

**న్యూఢిల్లీ:** పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మనుభాయి పంచోలీని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలంటూ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం చేసిన సిఫార్సు పట్ల సుప్రీంకోర్టు న్యాయవాది జస్టిస్ బి.వి.నాగరత్న అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆయన నియామకం న్యాయ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా కొలీజియం వ్యవస్థ విశ్వసనీయత కూడా దెబ్బతినే అవకాశం ఉందన్నారు. జస్టిస్ పంచోలీకి పదోన్నతి ఇవ్వాలని సూచించిన కొలీజియంలో జస్టిస్ నాగరత్న కూడా సభ్యురాలే. కొలీజియంలోని మొత్తం ఐదుగురిలో నలుగురు జస్టిస్ పంచోలీకి అనుకూలంగా ఉండగా, ఆమె ఒక్కరే అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జస్టిస్ పంచోలీ గుజరాత్ హైకోర్టు నుంచి 2023 జూలైలో పాట్నా హైకోర్టుకు బదిలీపై వెళ్లారు. సుప్రీంకోర్టులో గుజరాత్ హైకోర్టు నుంచి వచ్చిన ఇద్దరు న్యాయమూర్తులు ఇప్పటికే ఉన్నారు. ఇప్పుడు జస్టిస్ పంచోలీని కూడా నియమిస్తే ప్రాంతీయ అసమతౌల్యం ఏర్పడుందని జస్టిస్ నాగరత్న చెబుతున్నారు. అత్యున్నత న్యాయస్థానంలో ఒకేకోర్టు నుంచి వచ్చిన ముగ్గురు న్యాయమూర్తులు ఉండడం సరైంది కాదని, ఇతరులకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. జస్టిస్ పంచోలీ ఇప్పుడు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైతే 2031 అక్టోబర్‌లో ప్రధాన న్యాయమూర్తి అయ్యే అవకాశం ఉంది.

# టారిఫ్ వేడిలోనూ డీల్!

**తేజస్ ఇంజిన్ల కోసం అమెరికాతో భారత్ 1 బిలియన్ డాలర్ల ఒప్పందానికి రెడీ**



**వాషింగ్టన్:** ఓవైపు సుంకాల సమరంలో అమెరికాతో పోరాడుతున్న భారత్ మరోవైపు అదే అమెరికాతో రక్షణరంగ ఒప్పందానికి మరో అడుగు ముందుకేసింది. అమెరికాకు చెందిన దిగ్గజ విమాన ఇంజిన్ల తయారీ సంస్థ జనరల్ ఎలక్ట్రిక్(జీఈ)తో ఏకంగా 1 బిలియన్ డాలర్ల భారీ రక్షణరంగ ఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధమైంది. వచ్చే నెలలో ఈ ఒప్పందం ఖరారుకానుంది. తేలికపాటి యుద్ధవిమానం తేజస్ మార్క్ 1లో బిగించాల్సిన జీఈ–404 రకం ఇంజిన్లను కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకుంటున్నారు. 1 బిలియన్ డాలర్ల ఒప్పందంలో భాగంగా జీఈ సంస్థ నుంచి భారత్ 113 ఇంజిన్లను కొనుగోలుచేయనుంది. వీటిని మొత్తంగా 97 తేజస్ విమానాల కోసం ఉపయోగించనున్నారు. గతంలో ఇదే తరహాలో 83 తేజస్ విమానాల కోసం 99 జీఈ ఇంజిన్లను కొనుగోలుచేశారు. ట్రంప్ ప్రకటించిన 50 శాతం సుంకాలు నేటినుంచి అమల్లోకి వస్తున్న ఇదే సమయంలో ఈ భారీ రక్షణరంగ డీల్ తుదిదశకు చేరుకోవడం గమనార్హం. భారత త్రివిధ దళాల రక్షణ అవసరాలు తీర్చేందుకు తేజస్ విమానాలను తయారుచేస్తున్న హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్)కు ఎలాంటి ఇంజిన్ల సరఫరాలో జాప్యంలేకుండా ఉండేందుకు వేగంగా ఈ డీల్‌ను తుదిదశకు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. పాతతరం మిగ్–21 వంటి యుద్ధవిమానాలను మూలకు పడేస్తున్న వేళ వాటి స్థానంలో అధునాతన తేజస్‌లను సైన్యంలోకి తీసుకోవాల్సిన తక్షణావసరం ఏర్పడింది. అందుకే టారిఫ్‌ల వంటి అంశాల్లో అమెరికాతో విభేదాలు ఉన్నప్పటికీ భారత్ ఈ డీల్ కోసం అమెరికన్ కంపెనీతో వాణిజ్యబంధాన్ని కొనసాగించాల్సి వస్తోంది. 2029–30కల్లా తొలి దఫాలో 83 తేజస్ విమానాలను అందిస్తానని హాల్ గతంలో హామీ ఇచ్చింది. 2033–34 కల్లా మరో 97 తేజస్ యుద్ధవిమానాలను సరఫరాచేయనుంది. ప్రతి 15 రోజులకు ఒకటి చొప్పున ఇంజిన్‌ను తయారుచేసి జీఈ సంస్థ భారత్‌కు సరఫరా చేయనుంది. అయితే జీఈ–414 రకం ఇంజిన్ తయారీలోని 80 శాతం సాంకేతికతను భారత్‌కు బదిలీచేసే అంశంపై జీఈతో హాల్ చర్చలు జరుపుతోంది. తేజస్ మార్క్2 రకం, అధునాతన మధ్యశ్రేణి యుద్ధ(ఏఎంసీఏ) విమానాల్లో బిగించేందుకు కావాల్సిన జీఈ–414 ఇంజిన్లను కొనుగోలుచేసేందుకు ఏకంగా 1.5 బిలియన్ డాలర్ల మరో ఒప్పందం కుదుర్చుకోవాలని భారత్ ఆశిస్తోంది. జీఈ–414 ఇంజిన్లను 162 తేలికపాటి మార్క్2 విమానాలు, 10 నమూనా ఏఎంసీఏ విమానాలకు అమర్చనున్నారు. మరోవైపు ఫ్రాన్స్‌కు చెందిన సాఫ్రాన్ కంపెనీతో కలిసి దేశీయంగా యుద్ధవిమాన ఇంజిన్‌ను తయారుచేసేందుకు భారత్ కృషిచేస్తోంది.

# సీజేఐ బంధువు సహా 14 మంది లాయర్లకు జడ్జిలుగా పదోన్నతి

**సుప్రీం కొలీజియం సిఫారసు**

**న్యూఢిల్లీ /ముంబై:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ బంధువు రాజ్ దామోదర్ వకోడె సహా 14 మంది లాయర్లను బాంబే హైకోర్టు జడ్జిలుగా నియమించాలని కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. వకోడె తమకు దూరపు చుట్టమని సీజేఐ సోదరుడు డాక్టర్ రాజేంద్ర గవాయ్ చెప్పారు. 1996లో 12వ తరగతి పూర్తి చేసిన వకోడె, 2001లో ఎమ్మెస్సీలో బంగారు పతకం సాధించారు. అమరావతి వర్సిటీ నుంచి 2004లో 60.34 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ పాసయ్యారు. అనంతరం బాంబే హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. వివిధ ట్రిబ్యునల్స్‌లో సభ్యుడిగా ఉన్నారు. సివిల్, క్రిమినల్ కేసులను వాదించారు. మహారాష్ట్ర నేషనల్ లా వర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్ గాను పనిచేశారు. సమర్థుడైన లాయర్‌గా పేరు తెచ్చుకున్నారు. తాజాగా, జడ్జిగా పదోన్నతి రావడంపై స్పందించేందుకు వకోడె నిరాకరించారు. వకోడెతో పాటు గతంలో సీజేతో అనుబంధమున్న మరో ఇద్దరు లాయర్ల పేర్లను సైతం కొలీజియం తుది జాబితాలో ఉన్నాయని సుప్రీంకోర్టు వర్గాలు తెలిపాయి.

**బాంబే హైకోర్టు సీజేగా శ్రీ చంద్రశేఖర్:** బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవికి జస్టిస్ శ్రీ చంద్రశేఖర్ పేరును సుప్రీంకోర్టు కొలీజియం మంగళవారం సిఫారసు చేసింది. జార్ఖండ్ హైకోర్టు నుంచి వచ్చిన ఈయన ప్రస్తుతం బాంబే హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్నారు.

# ఉత్తరాదిన కుంభవృష్టి

**హిమాచల్, జమ్మూను ముంచెత్తిన మెరుపు వరదలు**

- కొట్టుకుపోయిన రోడ్లు, దుకాణాలు
- కూలిన ఇళ్లు, చెట్లు
- వైష్ణోదేవి ఆలయానికి వెళ్లేమార్గంలో కొండచరియలు పడి 9 మంది మృతి


ముఘల్ మైదాన్ వంతెన ధ్వంసమైన దృశ్యం

**సిమ్లా/జమ్మూ:** మేఘ విస్ఫోటం(క్లౌడ్ బరస్ట్) ఘటనల నుంచి తేరుకోకముందే మళ్లీ మేఘ విస్ఫోటాలు ఉత్తరాది రాష్ట్రాలపై విరుచుకుపడ్డాయి. హిమాలయాలకు నిలయాలైన హిమాచల్, జమ్మూలు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు, కొండచరియలు పడిన ఘటనలతో వణికిపోయాయి. హిమాచల్‌లో మెరుపు వరదల ధాటికి ఇళ్లు, దుకాణాలు నేలమట్టమయ్యాయి. జమ్మూకశ్మీర్‌లోని రియాస్ జిల్లాలోని ప్రఖ్యాత మాతా వైష్ణోదేవి ఆలయ ట్రెక్కింగ్ మార్గంలో మంగళవారం మధ్యాహ్నం కొండచరియలు విరిగిపడడంతో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. 14 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఖత్రాలోని బేస్‌క్యాంప్‌లో చేర్పించి చికిత్సనందిస్తున్నారు. త్రికూట పర్వతంపై కొలువైన ఆలయానికి ఖత్రా నుంచి 12 కిలోమీటర్ల మార్గముంది. ఇందులో అర్ధ్‌కువారీ సమీప ఇంద్రప్రస్థ భోజనాలయం సమీపంలో కొండచరియలు విరిగిపడటంతో ఈ ఘోరం జరిగింది. ఆలయానికి రెండు మార్గాల్లో ట్రెక్కింగ్ చేస్తూ చేరుకోవచ్చు. మంగళవారం ఉదయం నుంచి హిమ్‌కోటీ ట్రెక్కింగ్ మార్గం గుండా యాత్రను నిలిపేశారు. పాత రూట్‌లో మధ్యాహ్నం 1.30దాకా ట్రెక్కింగ్ జరగ్గా కొండచరియలు పడటంతో అది కూడా నిలిపేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టేదాకా వైష్ణోదేవి ఆలయానికి భక్తుల యాత్రను అర్ధాంతరంగా ఆపేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

### ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు

గత మూడ్రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జమ్మూ ప్రాంతంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వైష్ణోదేవి ఆలయ ఘటనతో కలిసి జమ్మూవ్యాప్తంగా వర్షసంబంధ ఘటనల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. కశ్మీర్‌లో లోయలోనూ భారీ వర్షాల కారణంగా కొన్ని చోట్ల చిన్నపాటి వంతెనలు, మొబైల్ టవర్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు సైతం తెగిపోవడంతో టెలికం, ఇంటర్నెట్ సేవలు దాదాపు ఆగిపోవడంతో లక్షలాది మంది ప్రజలు అవస్థలు పడుతున్నారు. రైలుపట్టాలపై రాళ్లు పడటంతో ఖత్రా, ఉధంపూర్, జమ్మూ రైల్వేస్టేషన్ల నుంచి ఇతర ప్రాంతాలకు 18 రైళ్లను రద్దుచేశారు. కొండచరియలు పడటంతో జమ్మూ–శ్రీనగర్, కిష్త్వార్–దోడా జాతీయరహదారులపై రాకపోకలను అధికారులు నిలిపేశారు. ఇలా డజన్లకొద్దీ పర్వతసానువుల వెంట రహదారులు మూసేశారు. కిష్త్వార్, రేసీ, రాజౌరీ, రాంబాన్, పూంఛ్ జిల్లాల్లోనూ వర్షబీభత్సం జరిగింది. ఇళ్లు నేలకూలాయి. కిష్త్వార్‌లోని ముఘల్ మైదాన్ వంతెన ధ్వంసమైంది. జమ్మూలో తక్షణం చేపట్టాల్సిన సహాయక చర్యలపై శ్రీనగర్‌లో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు తగు ఆదేశాలిచ్చారు.


కులూ ప్రాంతంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బియాస్ నది

### మనాలీలో బియాస్ ఉగ్రరూపం

హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలీలో బియాస్ నది ఉగ్రరూపం దాల్చి పరీవాహక ప్రాంతాలపై విరుచుకుపడింది. చాలా చోట్ల మనాలీ–లేహ్ రహదారి నదీప్రవాహం కారణంగా కొట్టుకుపోయింది. మనాలీలోని బహంగ్ ప్రాంతంలో బహుళ అంతస్తుల భవనం నీటి ఉధృతికి కూలి నదీప్రవాహంలో పడింది. రెండు రెస్టారెంట్లు, కొన్ని దుకాణాలు సైతం కొట్టుకుపోయాయి. 40 షాప్‌లు ధ్వంసమయ్యాయి. రహదారిపై నిలిచి ఉన్న వాహనాలు సైతం నదీప్రవాహంలో కొట్టుకుపోయాయి. సమీప ప్రాంతాల ప్రజలకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. రాష్ట్రంలో పర్యటిస్తున్న యాత్రికులు పలు చోట్ల చిక్కుకుపోయారు. పట్లీకుహాల్ ప్రాంతంలో ఇళ్లు నీటమునిగాయి. కులూ ప్రాంతంలోనూ బియాస్ నది ఉధృతంగా ప్రవహించింది. కినౌర్ జిల్లాలోని కన్వీ గ్రామంలోనూ మేఘ విస్ఫోటం సంభవించింది. రాష్ట్రవ్యాప్తంగా భారీవర్షాల కారణంగా కొండచరియలు రహదారులపై పడటంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో మంగళవారం ఒక్కరోజే మండీ జిల్లాలో 320, కులూ జిల్లాలో 132 రహదారులను మూసేశారు. కంగ్రా, చంబా, లహౌల్ స్పితి జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు.

# గవర్నర్ జాప్యం చేస్తే చూస్తూ కూర్చోవాలా?: సుప్రీం

**న్యూఢిల్లీ:** అసెంబ్లీలో ఆమోదం పొంది, సమ్మతి కోసం వచ్చిన బిల్లులను గవర్నర్ నిరవధికంగా పెండింగ్‌లో పెడితే కోర్టు చూస్తూ కూర్చోవాలా? ఎలాంటి అధికారాలు లేకుండా నిష్క్రియాత్మకంగా ఉండిపోవాలా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్ తన అధికారాలను ఉపయోగించుకుంటూ బిల్లులపై నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేయొచ్చా? కీలకమైన ద్రవ్య బిల్లులను సైతం పెండింగ్‌లో పెట్టొచ్చా? అని అడిగింది. బిల్లుల విషయంలో రాష్ట్రపతి/గవర్నర్లు మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఇటీవల ఆదేశించిన సంగతి, దీనిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. బిల్లుల విషయంలో రాష్ట్రపతి రిఫరెన్స్‌పై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారణ కొనసాగింది. బిల్లులకు సమ్మతి తెలియజేయకుండా రాష్ట్రపతి/గవర్నర్లు ఏళ్ల తరబడి జాప్యం చేసినా కోర్టులు మిన్నకుండిపోవాలని చెప్పడం సరైంది కాదని పేర్కొంది. రాష్ట్రపతి/గవర్నర్లకు గడువు నిర్దేశించే అధికారం కోర్టులకు లేకపోతే.. మరి ఆ పని ఎవరూ చేస్తారని ప్రశ్నించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

# ఫెడరల్ రిజర్వు గవర్నర్‌కు ట్రంప్ ఉద్వాసన


లిసా కుక్

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫెడరల్ రిజర్వు గవర్నర్ లిసా కుక్‌ను తొలగించారు. ఈ విషయాన్ని సోమవారం రాత్రి సొంత ట్రూత్ మీడియాలో ట్రంప్ ప్రకటించారు. ఆమె మోసానికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలకు తగు ఆధారాలున్నాయని తెలిపారు. మిషిగన్, జార్జియాలోని భవనా లను ప్రాథమిక నివాసాలుగా ప్రకటిస్తూ ఆమె సంతకాలు చేసిన పత్రాలను ట్రంప్ అటాచ్ చేశారు. రెండు వారాల వ్యవధిల్లోనే రెండిళ్లను ఆమె కోరారని, బహుశా మొదటి నివాసం విషయం మ ర్చిపోయి ఉంటారంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. మార్టిగేజ్(తనఖా) విభాగానికి ట్రంప్ నియమించిన బిల్ పాల్ట్ గత వారం స్వయంగా లిసాపై ఆరోపణలు చేయడం గమనార్హం. స్వల్పకాలిక వడ్డీ రేట్లలో కోత విధించాలంటూ ఫెడరల్ రిజర్వు చైర్మన్ జెరోమ్ పావెల్‌పై తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. చెప్పింది చేయకుంటే పదవి నుంచి తొలగిస్తానని హెచ్చరిక సైతం చేయడం గమనార్హం. అదేవిధంగా, సెంట్రల్ బ్యాంకు బోర్డులోని ఏడుగురు సభ్యుల్లో లిసా ఒకరు. మొత్తం 12 మంది సభ్యుల్లో లిసా సహా ఏడుగురికి మాత్రం వడ్డీ రేట్లు తగ్గించే అధికారముంది. వడ్డీ రేటు తగ్గించేందుకు లిసా అంగీకరించడం లేదు. జూలైలో జరిగిన బోర్డు సమావేశంలో వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచేందుకు పావెల్‌తోపాటు ఓటేసిన వారిలో లిసా కుక్ ఉన్నారు. దీంతో, ఇటీవల రాజీనామా చేయాలంటూ ట్రంప్ కోరినా ఆమె కొనసాగుతూనే ఉన్నారు. ఇది నచ్చని ట్రంప్ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అధికారంతోనే లిసా కుక్‌ను తొలగించినట్లు తాజాగా సమర్థించుకున్నారు.

### ఆ అధికారం అధ్యక్షుడికి లేదు

ఫెడరల్ రిజర్వు గవర్నర్ లిసా కుక్ వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. వేధింపులకు భయపడి రాజీనామా చేయబోనని తెగేసి చెప్పారు. తనను తొలగించే అధికారం అధ్యక్షుడికి లేదని స్పష్టం చేశారు. అమెరికా ప్రజలకు సేవలందించేందుకు 2022 నుంచి కొనసాగుతున్నానన్నారు. ట్రంప్ చర్యకు తగు కారణం లేదన్నారు. ట్రంప్ చూపుతున్న పత్రాలు నాలుగేళ్ల క్రితం తాను సెంట్రల్ బ్యాంకులో చేరకముందునాటివని తెలిపారు.

# రాజ్యాంగం కోసం ఓటును కాపాడుకోండి

**ప్రజలకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పిలుపు**


యాత్రలో వాహనంపై అభివాదం చేస్తున్న రాహుల్. చిత్రంలో ప్రియాంక, రేవంత్ రెడ్డి, తేజస్వీ యాదవ్

**మధుబని:** దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు ప్రజలు తమకున్న ఓటు హక్కును కాపాడుకోవాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)తో బీజేపీ, ఈసీ నిజ స్వరూపం బట్టబయలైందని ఆయన వ్యాఖ్యానించారు. తొలగింపునకు గురైన 65 లక్షల ఓట్ల స్థానంలో బీజేపీ ఓట్లను చేరుస్తారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ద్వారా బీజేపీ నేతలు ఓట్ల చోరీకి పాల్పడుతున్నారన్నారు. అందుకే ప్రజలు ఇప్పుడు బీజేపీ నేతలను ఓట్ల దొంగలని అంటున్నారని వ్యాఖ్యానించారు. ఓటర్ అధికార్ యాత్రలో మంగళవారం రాహుల్ గాంధీ బిహార్‌లోని మధుబని జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఓటు హక్కును కోల్పోతే రాజ్యాంగాన్ని రక్షించుకోలేమన్న విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. పేదలకు ఓటు చాలా ముఖ్యమైంది. ఇదే లేకుంటే వారికి హక్కులే ఉండవన్నారు. 'మోదీ జీ, ఆర్ఎస్ఎస్‌లు జాతీయ జెండాకు ఎన్నడూ సెల్యూట్ చేయలేదని రాహుల్ ఆరోపించారు. ఇప్పటికీ కూడా వీరు జాతీయ జెండాను గౌరవించరని, అలా చేస్తున్నట్లు నటించినా వారి ఆలోచనలన్నీ వేరే చోట ఉంటాయన్నారు. రాజ్యాంగం ద్వారా దళితులు, ఓబీసీలు, ఈబీసీలు, మహిళలకు హక్కులు దక్కడం బీజేపీకి ఇష్టం ఉండదని వ్యాఖ్యానించారు. ఓట్లను చోరీ చేస్తుండబట్టే బీజేపీ ప్రభుత్వం మరో 50 ఏళ్లు కొనసాగుతుందని హోం మంత్రి అమిత్ షా అంటున్నారని రాహుల్ పేర్కొన్నారు. ఈ విషయం ప్రజలందరికీ తెలుసునని చెప్పారు. ఆధారాలన్నీ తన వద్ద ఉన్నందునే ఓట్ చోరీ ఆరోపణలు చేశానని చెప్పారు. కార్యక్రమాల్లో రాహుల్ సోదరి, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ, తేజస్వీ యాదవ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

### రేవంత్ రెడ్డి పాల్గొనడంపై బీజేపీ అభ్యంతరం

ఓటర్ అధికార్ యాత్రలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనడంపై బీజేపీ తీవ్ర అభ్యంతరం తెలిపింది. దీనిపై కాంగ్రెస్ నేతలు రాహుల్, ప్రియాంక వెంటనే బిహార్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. బీజేపీ ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర ప్రధాన్ బిహార్ రాజధాని పట్నాలో జరిగిన బీజేవైఎం కార్యక్రమంలో మాట్లాడారు. 'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌లో బిహారీ డీఎన్ఏ ఉందని, ఆయనది తెలంగాణ డీఎన్ఏ అంత నాణ్యమైంది కాదని గతంలో రేవంత్ రెడ్డి విమర్శించారు' అని ప్రధాన్ గుర్తుచేశారు. బిహారీ డీఎన్ఏను తక్కువగా చేసి మాట్లాడిన రేవంత్‌తో యాత్రలో పాల్గొంటున్న రాహుల్ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని స్పష్టం చేశారు.

## క్లుప్తంగా...

### 31న సైక్లింగ్ ర్యాలీకి గవర్నర్‌కు ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల 31న నిర్వహించనున్న సైక్లింగ్ ర్యాలీ కార్యక్రమానికి రావాల్సిందిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆహ్వానం అందింది. ఈ మేరకు తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి.. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆహ్వానించారు. 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్'కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు గవర్నర్‌కు వివరించారు. గవర్నర్ ఈ ఆహ్వానాన్ని సానుకూలంగా స్వీకరించి, తప్పకుండా హాజరవుతానన్నారు. 31వ తేదీ ఉదయం 7 గంటలకు గచ్చిబౌలి స్టేడియం మెయిన్ గేట్ వద్ద సైక్లింగ్ ర్యాలీ ప్రారంభం కానుంది.


### పవిత్రకు సీఎం రేవంత్ అభినందనలు

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డుకు ఎంపికైన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు మారం పవిత్రకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. సాంకేతికత, వినూత్న పద్ధతులతో ంబోధనలో తనదైన శైలిని రూపొందించుకునిం ఆమె ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు.

**చికితకి సీఎం అభినందనలు**

కెనడాలో జరుగుతున్న ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించి వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌కి చెందిన చికిత తానిపర్తికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఆర్చరీ అండర్–21 కేటగిరీ ఫైనల్‌లో కొరియాకు చెందిన పార్క్ యెరిన్‌పై విజయం సాధించి స్వర్ణం చేజిక్కించుకుని చికిత వరల్డ్ చాంపియన్‌గా నిలవడం దేశానికే గర్వకారణమని కొనియాడారు. ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, లక్ష్యాన్ని సాధించాలన్న చికిత సంకల్పం యువతీ యువకులకు స్ఫూర్తిదాయకమన్నారు. చిన్ననాటి నుంచి చికితలోని ప్రతిభను గుర్తించి అందుకు అనుగుణంగా ప్రోత్సహించిన తల్లిదండ్రులకు సీఎం అభినందనలు తెలిపారు.

### 4,454 మంది టీచర్లకు పదోన్నతులు



సాక్షి, హైదరాబాద్: పదోన్నతులకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో 4,454 మంది వివిధ కేడర్ టీచర్లకు పదోన్నతులు లభించాయి. పాఠశాల విద్య డైరెక్టరేట్ కార్యాలయం ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియారిటీపై కొంతమంది టీచర్లు కోర్టు ను ఆశ్రయించడంతో వెబ్ ఆప్షన్లు ఇచ్చినా, పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా మల్టీజోన్–1 పరిధిలో 490 మందికి, మల్టీజోన్–2 పరిధిలో 390 మంది స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెడ్ మాస్టర్లు (గ్రేడ్–2) పదోన్నతులు ఇచ్చారు. 811 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లను ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలుగా, 2,763 మంది ఎస్జీటీలకు స్కూల్ అసి స్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు 15 రోజుల్లో గా కేటాయించిన విధుల్లో చేరాలని పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశించారు.

### 30న ఏజీ వర్సిటీలో డిగ్రీ కోర్సులకు వాక్‌ఇన్ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈనెల 30న ఎన్నారై, ఎన్నారై ప్రాయోజిత కోటా కౌన్సెలింగ్‌తో పాటు యూనివర్సిటీ–వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీల డ్యూయల్ డిగ్రీ కోర్సులకి వాక్‌ఇన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ జీఈసీహెచ్ విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ ఉదయం 10 గంటలకు ఎన్నారై కోటా బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్, బీఎస్సీ (ఆనర్స్) కమ్యూనిటీ సైన్స్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ), బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) కోర్సుల్లో సీట్ల భర్తీకి వాక్‌ఇన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదేరోజు మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీలు సంయుక్తంగా అందిస్తున్న డ్యూయల్ డిగ్రీ కోర్సు బీఎస్సీ (ఆనర్స్), అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాల కోసం వాక్‌ఇన్ కౌన్సెలింగ్ జరగనుందని తెలిపారు. రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగంలో ఈ రెండు కౌన్సెలింగ్‌లు నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.pjtau.edu.inను సందర్శించవచ్చని తెలిపారు.

### 29 నుంచి ఎడ్‌సెట్ రెండో దశ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ఎడ్‌సెట్ రెండో దశ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 29 నుంచి మొదలవుతుంది. సెప్టెంబర్ 2 వరకూ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. సీట్ల కేటాయింపు వచ్చే నెల 11వ తేదీన ఉంటుందని సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎ.పాండురంగారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

# జెన్ Z



## నెట్టింట్లో పెట్టుబడి పాఠాలు!

- నమ్మకంగా సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్
- జెన్–జడ్ పెట్టుబడి పాఠాలకు ఇవే ఆధారం
- తరువాతే కుటుంబం, స్నేహితుల సలహాలు
- యువ ఇన్వెస్టర్లను ప్రభావితం చేస్తున్న యాప్స్

జెనరేషన్–జడ్.. జూమర్స్.. పేరు ఏదైనా 1997–2012 మధ్య జన్మించి, డిజిటల్ ప్రపంచంలో మునిగితేలుతున్న యువతరం. వీళ్లు పెట్టుబడి పాఠాలను కూడా సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్ ద్వారానే నేర్చుకుంటున్నారు. తల్లిదండ్రులు, కుటుంబం, స్నేహితులు ఇచ్చే సలహాలు వీరికి ఈ ప్లాట్‌ఫామ్స్ తర్వాతేనట. మూడింట రెండొంతుల మంది యువ వినియోగదారులు తమ పెట్టుబడులను యాప్స్ ప్రభావితం చేస్తున్నాయని చెబుతున్నారు.

డూ ఇట్ యువర్‌సెల్ఫ్.. నిపుణుల సూచనలూ, సలహాలతో పని లేకుండా ఎలాంటి పనినైనా చేయడం లేదా ఉత్పత్తిని తయారుచేయడంతోపాటు మరమ్మతులూ చేసేయడం. జెన్–జడ్ అన్ని విషయాల్లోనూ ఇదే ఫాలో అవుతారు. నిపుణుల సూచనలూ సలహాల కంటే.. తమ ప్రయత్నంతో, ఆలోచనలతో చేసి సాధించాలనే మనస్తత్వం వీరిలో ఎక్కువ. ఆసక్తికరంగా ఆర్థిక విషయాల్లోనూ వీరు ఇదే ధోరణితో ముందుకుపోతున్నారట. 2024 'గ్రో ఇన్‌సైట్స్' నివేదిక ప్రకారం జెన్–జడ్‌లో సగానికి పైగా యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ , ఫైనాన్స్ క్రియేటర్స్ నుండి పెట్టుబడి గురించి నేర్చుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇతర ప్రాంతాల మాదిరిగానే మన దేశంలోని ఈ తరం పెట్టుబడిదారులు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, ఫిన్‌ఫ్లుయెన్సర్స్ (ఆర్థిక రంగంలో ఉండే ఇన్‌ఫ్లుయెన్సర్లు ) వంటి వనరుల నుండి విస్తృత ఆర్థిక సమాచారాన్ని పొందుతున్నారు.

**సంపాదిస్తూ.. పెట్టుబడులు పెడుతూ..**

బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్, స్నాప్‌చాట్ సంయుక్త అధ్యయనం ప్రకారం జెన్–జడ్ తరంలో నలుగురిలో ఒకరు ఇప్పటికే శ్రామిక శక్తిలో భాగమయ్యారు. జాబ్ మార్కెట్లోకి ఇటీవలే ప్రవేశించిన వీరు నగదును ఖర్చు చేయడానికి భయపడడం లేదు. అదే సమయంలో వారు తమ డబ్బును వివిధ మార్గాల్లో పెట్టుబడులు పెడుతున్నారు.


జెన్–జడ్ తరం యూపీఐ ద్వారా ఆర్థిక ఓనమాలు దిద్దుతున్నారు. సిస్టెమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ (సిప్)తో పెట్టుబడులు పెడుతూ చాలామందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

మొబైల్ యాప్స్, యూట్యూబ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్ ఇచ్చే సలహాల ఆధారంగా ట్రయల్–ఎర్రర్ ప్రయోగాలతో పెట్టుబడులకు సన్నద్ధమై సొంతంగా ప్రణాళికలను రచించుకుంటున్నారు.

నష్టాలను తగినంతగా విశ్లేషించకుండా, అధిక రాబడిపై జెన్–జడ్ దృష్టి పెడుతున్నారు.

**ఇంటర్నెట్.. ఆర్థిక గురు**

డబ్బులు, పెట్టుబడి సలహాల గురించి ఎవరిపై ఆధారపడ్డారంటే..




(ఆధారం: సీఎఫ్‌ఏ ఇన్‌స్టిట్యూట్, పెట్టుబడి నిపుణులకు సూచనలు, సలహాలు ఇచ్చే ప్రముఖ సంస్థ )

**పెట్టుబడులకు ఊతం ఇలా..**

| వినియోగిస్తున్న వేదికలు | జెన్–జడ్ | మిల్లేనియల్స్ |
|---|---|---|
| పెట్టుబడి యాప్స్ | 65% | 55% |
| ఫైనాన్షియల్ వెబ్‌సైట్లు | 49% | 55% |

(ఆధారం: సీఎఫ్‌ఏ ఇన్‌స్టిట్యూట్ )

**యువతకు ముందున్న సవాళ్లు**

| | |
|---|---|
| నిరుద్యోగిత | 29% |
| విద్య, నైపుణ్యం, శిక్షణ | 25% |
| మానసిక ఆరోగ్యం | 23% |
| జీవన వ్యయం | 21% |
| ఆరోగ్య సేవలు/వ్యాధుల నివారణ | 19% |

(ఆధారం: డెలాయిట్ గ్లోబల్ 2025 జెన్–జడ్, మిల్లేనియల్ సర్వే)

స్టాక్ మార్కెట్లో 30 ఏళ్ల లోపు వయసున్న ఇన్వెస్టర్లదే హవా. ఇతర వయసుల వారితో పోలిస్తే మొత్తం ఇన్వెస్టర్లలో ఈ జెనరేషన్–జడ్ వాటా 2025 మే నాటికి 39 శాతం ఉంది. ఇక కొత్త రిజిస్ట్రేషన్స్‌లో 56.1 శాతం వాటా వీరిదే. 2019–20 నుంచి యూత్ వాటా నూతన పెట్టుబడిదారుల్లో 52 శాతంపైగా ఉండడం విశేషం.


సాక్షి, స్పెషల్ డెస్క్

# శబ్ద పరిమితి దాటొద్దు

**గణేశ్ మండప నిర్వాహకులకు హైకోర్టు ఆదేశం**

- విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి
- ట్రాఫిక్ ఆగిపోకుండా చూసుకునే బాధ్యత నిర్వాహకులదే
- ఫిర్యాదుల స్వీకరణకు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలి

సాక్షి, హైదరాబాద్: నివాస ప్రాంతాల్లో ఏర్పాటు చేసే గణేశ్ మండపాల వద్ద శబ్ద పరిమితి దాటి లౌడ్ స్పీకర్లను ఏర్పాటు చేయొద్దని నిర్వాహకులకు హైకోర్టు స్పష్టం చేసింది. అంబులెన్స్, అగ్నిమాపక యంత్రాలు వెళ్లేందుకు వీల్లేకుండా, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించేలా పందిళ్లు ఏర్పాటు చేయొద్దని సూచించింది. తీవ్ర శబ్దం కారణంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు గతంలో ప్రాణాలు కోల్పోయిన ఘటనలను గుర్తుంచుకోవాలని చెప్పింది. విద్యుత్ కనెక్షన్ పక్కాగా ఏర్పాటు చేయకుంటే విద్యుదాఘాతం, అగ్నిప్రమాదం సంభవించే అవకాశం ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు తాజాగా మార్గదర్శకాలను జారీ చేసింది. తన ఇంటిని ఆనుకునే అనుమతి లేకుండా గణేశ్ మండపాన్ని ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సికింద్రాబాద్ ఎంఈఎస్ కాలనీకి చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు ప్రభావతి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ అభ్యంతరాలను పరిగణనలోకి తీసు




కున్న తర్వాతే అనుమతి ఇవ్వాలని హైకోర్టు అధికారులను ఆదేశించింది. ధిక్కరణ పిటిషన్‌తోపాటు అనధికారిక మండపాల ఏర్పాటుపై పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై జస్టిస్ ఎన్వీ శ్రావణ్‌కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పండుగను సుహృద్భావ వాతావరణంలో ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా నిర్వహించుకోవాలన్నారు. మున్సిపల్ అధికారులు, పోలీసులతో పాటు నిర్వాహకులకు మార్గదర్శకాలను జారీ చేశారు.

**అనుమతులు ఇలా..**

- ➤ బహిరంగ ప్రదేశాల్లో గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించే ముందు పోలీసులు, మున్సిపల్ అధికారుల నుంచి అనుమతి తప్పనిసరి.
- ➤ ట్రాఫిక్ సజావుగా సాగేలా, ఇళ్లు, ఆసుపత్రుల ప్రవేశాలకు ఆటంకం లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలి. అంబులెన్స్, అగ్నిమాపక యంత్రాలు.. ఇలా అత్యవసర పరిస్థితులు ఉంటే వాటిని అడ్డుకోకూడదు.
- ➤ వీలైనంత వరకు విగ్రహాలను కమ్యూనిటీ మైదానాలు, బహిరంగ ప్రదేశాల్లో నెలకొల్పాలి.

**వేడుకల నిర్వహణ..**

- ➤ అగ్ని ప్రమాదాలు జరగకుండా పందిళ్లకు విద్యుత్ కనెక్షన్ పక్కాగా తీసుకోవాలి.
- ➤ పూజలను గంటలోపు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.
- ➤ శబ్ద కాలుష్య చట్ట నియమాల ప్రకారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే సౌండ్ సిస్టమ్‌లను అనుమతించాలి.
- ➤ నివాస ప్రాంతాల్లో పగలు, రాత్రి కూడా లౌడ్ స్పీకర్లను నిర్దేశించిన డెసిబెల్ స్థాయి దాటకుండా పరిమితి పాటించాలి.
- ➤ నివాస ప్రాంతాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, వృద్ధాశ్రమాలవైపు లౌడ్ స్పీకర్లను తిప్పి ఉంచవద్దు.
- ➤ ట్రాఫిక్ ఆగిపోకుండా చూసుకునే బాధ్యత నిర్వాహకులదే.. ట్రాఫిక్ పోలీసులతో ప్రత్యామ్నాయ మార్గాలను రూపొందించుకోవాలి.
- ➤ స్థానికుల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు పోలీస్ స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలి.
- ➤ నిమజ్జనాల తర్వాత ప్రాంగణాన్ని శుభ్రం చేసే బాధ్యత నిర్వాహకులదే.
- ➤ కాలుష్యాన్ని తగ్గించేందుకు పర్యావరణ అనుకూల విగ్రహాలు, పూజా వస్తువులను ఎంచుకోవాలి.





అజయ్ కుమార్

### కనురెప్ప వెంట్రుక అంచున సూక్ష్మ గణపతి

**మైక్రో ఆర్టిస్ట్ అజయ్‌కుమార్ అద్భుత సృష్టి**

హనుమకొండ కల్చరల్: వరంగల్ నగరంలోని గిర్మాజీపేటకు చెందిన స్వర్ణకారుడు, మైక్రో ఆర్టిస్ట్ మట్టెవాడ అజయ్‌కుమార్ అద్భుతాన్ని సృష్టించారు. కనురెప్ప వెంట్రుక చివరన నాట్యం చేస్తున్న వినాయకుడి సూక్ష్మశిల్పాన్ని ఆయన తయారుచేశారు. దీనిని మైక్రోస్కోప్ ద్వారా మాత్రమే వీక్షించగలం. మెత్తని మైనం, ఇసుక రేణువులు, ప్లాస్టిక్ పౌడర్, సూక్ష్మ పనిముట్లు, రంగులు అద్దడానికి గొంగళి పురుగు వెంట్రుకతో 0.37 మిల్లీమీటర్ల ఎత్తు ఉన్న ఈ శిల్పాన్ని తయారుచేశారు. దీనిని తయారుచేయడానికి రెండు నెలల వ్యవధిలో 120 గంటల సమయం పట్టిందని అజయ్‌కుమార్ తెలిపారు. ఆయన గతంలో బియ్యపు గింజపై జాతీయ నాయకులు, ఇతర ప్రముఖుల చిత్రాలను గీశారు. ఏనుగు దంతాలపై శిల్పాలు, అగ్గిపుల్లలపై శిల్పాలు చెక్కి అంతర్జాతీయ, జాతీయ అవార్డులు కూడా అందుకున్నారు.

## 'మరణం అంచున' ఉన్నా కణాల్లో పునరుజ్జీవ వ్యవస్థ

**సీసీఎంబీ శాస్త్రవేత్తల తాజా ప్రయోగంలో గుర్తింపు**

సాక్షి, హైదరాబాద్: జీవ కణాలు 'మరణం అంచున' ఉన్నప్పటికీ పునరుజ్జీవం పొందే అంతర్గత వ్యవస్థ వాటిలో ఉంటుందని హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–సీసీఎంబీ శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. కణాల్లోని ఈ పునరుజ్జీవ ప్రక్రియ ఎంతో కచ్చితత్వంతో ఉంటుందని.. ఎదుగుదల పురోగతిని పోలి ఉంటుందని తాము గుర్తించామని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ సంతోశ్ చౌహాన్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం ఈ ప్రక్రియకు ప్రోగ్రామ్డ్ సెల్ రివైవల్ అని పేరుపెట్టింది. దీని ద్వారా కణాలు మరణం అంచుదాకా వెళ్లినా మళ్లీ పునరుజ్జీవం పొంది వేగంగా గాయాలను నయం చేయగలవని.. కణజాలాన్ని పునరుద్ధరించగలవని పలు జీవులపై ప్రయోగాల ద్వారా నిరూపించింది. తద్వారా కణాల్లో మరణించే ప్రక్రియ ఒకసారి మొదలైతే తిరిగి అది పూర్వస్థితికి చేరడం వీలుకాదన్న సిద్ధాంతాన్ని ఈ ప్రయోగం తల్లకిందులు చేసిందని సీసీఎంబీ పేర్కొంది. డాక్టర్ సంతోశ్ చౌహాన్ మాట్లాడుతూ 'ఇది యాదృచ్ఛికంగా జరిగే ప్రక్రియ కాదు. అన్ని జీవుల్లోనూ కణాలు సహజంగా ఒక సామాన్యమైన పునరుద్ధరణ యంత్రాంగాన్ని కలిగి ఉన్నాయి. ఇది జీవితం, మరణం, గాయాలను నయం చేసే లక్షణం గురించి మన ఆలోచనలనే మార్చేస్తుంది' అని పేర్కొన్నారు. అయితే కేన్సర్ చికిత్సల్లో కణాల పునరుజ్జీవం ప్రమాదకరం కావొచ్చని అభిప్రాయపడ్డారు. 'చాలా కేన్సర్ మందుల పరిశీలనలు కణ మరణ సూచనల ఆధారంగా జరుగుతాయి. కానీ నిజానికి అవి పూర్తిగా చనిపోలేదు. తిరిగి ప్రాణం పొంది మరింతగా మూలకణాల లక్షణాలను సంతరించుకోవడం వల్ల ట్యూమర్లు ఇంకా దూకుడుగా మారే ప్రమాదం ఉంది'అని చౌహాన్ వివరించారు. ఈ ఆవిష్కరణకు సంబంధించి భారతీయ, అంతర్జాతీయ పేటెంట్లకు దరఖాస్తు చేశారు. పునరుజ్జీవ వైద్యం, కేన్సర్ బయాలజీ రంగాల్లో ఇది ఒక కొత్త దిశను చూపనుందని నిపుణులు పేర్కొన్నారు. ఈ అధ్యయనం ప్రతిష్ఠాత్మక ఈఎంబీఓ జర్నల్‌లో ప్రచురితమైంది.

# జనవరిలోనే ఇంటర్ పరీక్షలు!

**ప్రభుత్వానికి ఇంటర్ బోర్డ్ ప్రతిపాదన**

- పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడమే లక్ష్యం
- సర్కార్ పరిశీలనలో సంబంధిత ఫైల్
- సిలబస్ పూర్తిచేయటం కష్టమంటున్న అధ్యాపకులు



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈసారి ముందుగానే నిర్వహించాలని ఇంటర్ బోర్డ్ యోచిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్టు తెలిసింది. ఏటా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలను ఫిబ్రవరి, మార్చిలో నిర్వహిస్తున్నారు. ఈసారి 2026 జనవరి మధ్య లేదా ఫిబ్రవరి మొదటి వారం నుంచి నిర్వహించాలని అధికారులు ప్రతిపాదించారు. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ప్రైవేటు ఇంటర్ కాలేజీల్లో అక్టోబర్, నవంబర్ నాటికే సిలబస్ పూర్తి చేస్తున్నారు. అప్పటి నుంచి నెలపాటు విద్యార్థులతో సిలబస్ రివిజన్ చేయిస్తున్నారు. తర్వాత నీట్, జేఈఈ, ఈఏపీసెట్‌పై ప్రైవేటు కాలేజీలు దృష్టి పెడుతున్నాయి. దీంతో ఎక్కువ ర్యాంకులు ప్రైవేటు కాలేజీలకే వస్తున్నాయి. పోటీ పరీక్షల్లో ప్రభుత్వ కాలేజీల విద్యార్థులకు ర్యాంకులు తగ్గుతున్న విషయాన్ని ఇటీవల విద్యాశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. ర్యాంకులు పెంచే మార్గాలను అన్వేషించాలని సూచించారు. ఈ నేపథ్యంలో పోటీ పరీక్షలకు తగిన సమయం ఉండాలని ఇంటర్ బోర్డ్ అధికారులు భావిస్తున్నారు. గతంలో ఉన్నత చదువుల్లో ఇంటర్ మార్కులకు వెయిటేజ్ ఉండేది. దాన్ని ఎత్తివేసిన తర్వాత పోటీ పరీక్షల ర్యాంకులే ప్రామాణికంగా మారాయి. ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థులకు ఆలస్యంగా సిలబస్ పూర్తిచేయటం వల్ల జేఈఈ, నీట్, ఇతర సెట్‌లపై దృష్టి పెట్టడానికి అవకాశాలు లేకపోవడం సమస్యగా మారిందని అధికారులు భావిస్తున్నారు.

**బోర్డ్ ప్రతిపాదనలు ఇవీ..**

➤ నవంబర్ మొదటి వారంలోపు ఇంటర్ ద్వితీయ సంవత్సరం సిలబస్ పూర్తి చేయాలి. మొదటి సంవత్సరం సిలబస్‌ను డిసెంబర్, లేదా జనవరి నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రధాన చాప్టర్లపై రెండు వారాలు రివిజన్ నిర్వహించాలి. వీలైతే మాదిరి పరీక్షలను కూడా నిర్వహిస్తారు.

➤డిసెంబర్ నుంచి జేఈఈ, నీట్, ఈఏపీసెట్‌పై రోజుకు రెండు గంటల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. ఈ సమయంలో వారానికి రెండు సార్లు పరీక్షలు నిర్వహించాలి. మార్కులను సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ పరిశీలిస్తారు. ఈ మార్కులను జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆన్‌లైన్‌లో ఫీడ్ చేస్తారు. ప్రైవేటు కాలేజీల మాదిరి ర్యాంకులు కూడా ఇస్తారు. దీని ఆధారంగా విద్యార్థి పోటీ పరీక్షలో ఏ స్థాయిలో ఉన్నాడనేది నిర్ధారిస్తారు. వెనుకబడ్డ విద్యార్థులను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

➤ఇప్పటికే ఇంటర్ బోర్డ్ ఫిజిక్స్ వాలా అనే సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థ ప్రభుత్వ కాలేజీ విద్యార్థులకు పోటీ పరీక్షలపై శిక్షణ ఇస్తోంది. ఇంటర్ సిలబస్ పూర్తయిన తర్వాత ఈ శిక్షణను మరింత మెరుగ్గా అందించే ప్రయత్నం చేయాలని బోర్డ్ భావిస్తోంది. ఆన్‌లైన్ పరీక్షలు కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**సిలబస్ పూర్తిచేయటం కష్టమే..**

పరీక్షలను ముందుకు తీసుకొస్తే విద్యార్థులు నష్టపోతారని ఇంటర్ కాలేజీ లెక్చరర్లు అంటున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ ఈసారి ఆలస్యంగా మొదలైందని చెబుతున్నారు. మారుమూల కాలేజీల్లో ఇప్పటికీ సిలబస్ అనుకున్న మేర పూర్తికాలేదని అంటున్నారు. జనవరికి సిలబస్ పూర్తవ్వడమే కష్టంగా ఉందని చెబుతున్నారు. ఇలాంటి సమయంలో జనవరిలోనే పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులు సన్నద్ధం కాలేరని స్పష్టం చేస్తున్నారు. సిలబస్‌తో సంబంధం లేకుండా విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలని సూచిస్తున్నారు.

**పోటీ పరీక్షల్లో ఈసారి మంచి ర్యాంకులు**

ఈసారి ఇంటర్ ఫలితాలు గతం కన్నా ముందే ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నాం. పోటీ పరీక్షలకు ఫిజిక్స్ వాలాతో ఆన్‌లైన్ శిక్షణ కూడా ఇప్పిస్తున్నాం. ఫేషియల్ రికగ్నిషన్ విధానం వల్ల విద్యార్థులంతా క్లాసులకు హాజరయ్యేలా చూస్తున్నాం. ఈసారి అన్ని పోటీ పరీక్షల్లో ప్రభుత్వ కాలేజీ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధిస్తారని ఆశిస్తున్నాం.

– కృష్ణ ఆదిత్య, ఇంటర్ బోర్డ్ కార్యదర్శి

### బాల్యం ఆటలోనే బందీ



వారిది పలకాబలపం పట్టుకొని బడి బాట పట్టాల్సిన బాల్యం. కానీ.. తల్లిదండ్రుల పేదరికమో.. విద్యా అధికారుల నిర్లక్ష్యమో తెలియదు కానీ ఆటపాటలతోనే భవిష్యత్‌ను బందీ చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు పని చేసే ఫ్యాక్టరీ ఎదుట కొందరు బోరింగ్ పంపునకు ఊయల కట్టుకొని, మరి కొందరు మట్టిలోనే గడుపుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన బడిబాట, చదువుకు దూరంగా ఉన్న పిల్లలకోసం ముస్కాన్ లాంటి కార్యక్రమాలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నా.. అవి ప్రకటనలకే పరిమితమయ్యాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

### మేడమ్.. మీరు వెళ్లొద్దు



ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనజ ఆ పాఠశాలలో ఏడేళ్లుగా పనిచేస్తూ విద్యార్థుల అభిమానాన్ని చూరగొన్నారు. ఆమె ఇప్పుడు బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ మీద మోతె మండలం నామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. వనజ మంగళవారం పాఠశాల నుంచి రిలీవ్ అవుతుండగా.. విద్యార్థులు ఆమెను చుట్టుముట్టి 'మా మేడమ్ మాకే కావాలి. మేడమ్ మీరు వెళ్లొద్దు'అంటూ రోదించారు. విద్యార్థులు రోదించడంతో టీచర్ వనజ వారిని చూసి కన్నీరు పెట్టుకున్నారు.

### 'వలస కూలీ'పై ప్రత్యేక బోధన



మద్దిరాల: సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల పరిధిలోని గోరెంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కొత్తపల్లి ప్రభాకర్ వినూత్నంగా పాఠాలు బోధిస్తుంటారు. పాఠ్యాంశంలోని పాత్రలను స్వయంగా జరిగే ప్రాంతానికి గానీ, లేదా స్వయంగా విద్యార్థులకు వేషధారణ చేసి వారు స్వీయ అవగాహన చేసుకునేలా బోధిస్తారు. అందులో భాగంగా మంగళవారం పాఠశాలలో 9వ తరగతి తెలుగు సబ్జెక్టులోని 'వలస కూలీ'పాఠాన్ని.. విద్యార్థికి వలస కూలీ వేషం వేసి పాత్ర సన్నివేశాల ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇలా నేర్చుకోవడం వల్ల ఆ పాఠాన్ని ఎప్పటికీ మరిచిపోరని ఉపాధ్యాయుడు ప్రభాకర్ చెప్పారు.

### ఏఈకి ప్రైవేటులో రూ.50 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం



ఆదర్శ్

కాసిపేట: సర్కారు కొలువు సాధించడమే కష్టతరంగా మారిన ఈ రోజుల్లో ఏకంగా నాలుగు ప్రభుత్వ కొలువులు సాధించాడు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఏఈ (ఆపరేషన్స్)గా ఉద్యోగం చేస్తూ ప్రైవేటులో రూ.50 లక్షల ప్యాకేజీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం సోమగూడెం పాతబస్తీ గ్రామానికి చెందిన సింగరేణి కార్మికుడు చల్ల రమేశ్, రమాదేవి దంపతులు మంచిర్యాల వినూత్న కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరి చిన్న కుమారుడు చల్ల ఆదర్శ్ 2018లో సింగరేణి సంస్థ నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఓవర్‌మెన్‌గా ఎంపికయ్యాడు. ఉన్నతోద్యోగం సాధించాలనే లక్ష్యంతో అందులో చేరలేదు. ఆ తర్వాత రైల్వేశాఖలో జూనియర్ ఇంజనీర్‌గా ఎంపికయ్యాడు. 2021లో కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సీపీడబ్ల్యూడీ జూనియర్ ఇంజనీర్ ఉద్యోగం సాధించాడు. 2022లో రాష్ట్ర విద్యుత్ శాఖలో ఏఈగా ఉద్యోగం సాధించి సిర్పూర్ ఏఈగా విధుల్లో చేరాడు. గ్రూప్స్ సాధించడమే లక్ష్యంగా సాగుతున్న క్రమంలో ఏఎండీ ప్రాసెసర్ ప్రైవేటు కంపెనీలో రూ.50 లక్షల ప్యాకేజీతో నియామకం అయ్యాడు. ఈ ఉద్యోగంలో చేరుతున్నానని, ఎప్పటికైనా గ్రూప్స్ సాధించడమే తన లక్ష్యమని ఆదర్శ్ తెలిపారు.

# వైద్యమూ మాతృ దేశంలోనే..!

పాశ్చాత్య దేశాలతో పోలిస్తే తక్కువ ధరకే నాణ్యమైన వైద్యం, అందుబాటు ధరలో లభించే మందులు, అతి తక్కువ ప్రీమియంతో బీమా రక్షణ, స్థానిక సంస్కృతిపై అవగాహన.. ఈ అంశాలే ప్రవాస భారతీయులను (ఎన్నారైలు) వైద్య సేవల కోసం భారత్‌కు ఆకర్షిస్తున్నాయి. అధునాతన సాంకేతికత వినియోగంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతున్న ఆసుపత్రులు, అత్యంత నైపుణ్యం కలిగిన సుశిక్షితులైన వైద్యులు, సిబ్బంది, రోగులు నిరీక్షించే సమయమూ తక్కువ కావడం వైద్యం కోసం మన దేశానికి వచ్చే ఎన్నారైలకు కలిసి వచ్చే అంశాలు. వివిధ చికిత్సల కోసం ఎన్నారైలు అడుగు పెడుతున్న ప్రథమ శ్రేణి నగరాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలవడం విశేషం. మెడికల్ టూరిజం పరిశ్రమ 2026 నాటికి దేశంలో రూ.1.13 లక్షల కోట్లకు చేరుతుందని పాలసీబజార్ నివేదిక చెబుతోంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



**అందుబాటు ధరలో శస్త్రచికిత్సలు..**

సాధారణ ఎంపిక చేసిన శస్త్రచికిత్సలకు భారత్‌లో ఎన్నారైలు సగటున రూ.1.75 లక్షల నుంచి రూ.13 లక్షల వరకు.. మరింత సంక్లిష్టమైన విధానాలకు రూ.17–34 లక్షల వరకు క్లెయిమ్ చేస్తున్నారు. అంతర్జాతీయంగా అయ్యే ఖర్చులతో పోలిస్తే ఇవి చాలా తక్కువ.

| శస్త్రచికిత్స | భారత్‌లో | యూఎస్‌లో |
|---|---|---|
| గుండె బైపాస్ సర్జరీ | 4.3-7 | 60-130 |
| మోకాలి మార్పిడి | 3.5-5.2 | 26-43 |
| కాలేయ మార్పిడి | 21.7-30 | 261-435 |
| మూత్రపిండాల మార్పిడి | 6-10.4 | 174-261 |

(అంకెలు రూ.లక్షల్లో)

2024 గూగుల్ ట్రెండ్స్ సర్చ్ డేటా ప్రకారం కొన్ని నెలలుగా ఎన్నారైలు ఈ పదాలను ఎక్కువగా శోధిస్తున్నారు

ఎన్నారైలకు భారత్‌లో ఆరోగ్య బీమా ▸ 60% వృద్ధి

భారత్‌లో విదేశీ పౌరులకు వైద్య చికిత్స ▸ 45% పెరిగాయి

**చికిత్సల కోసం భారత్‌కు వస్తున్న ఎన్నారైలు**

అతి తక్కువ ఖర్చుతో వైద్యం, మందులు, బీమా

ప్రథమ శ్రేణి నగరాల్లో హైదరాబాద్ టాప్‌లో




వివిధ రకాల ప్రత్యేక జనరిక్ ఔషధాలు మన దేశంలో చవక ధరల్లో విస్తృతంగా అందుబాటులో ఉన్నాయి. అలాగే ఇవన్నీ బీమా పరిధిలోకి వస్తాయి. తద్వారా దీర్ఘకాలిక, తీవ్ర ఆరోగ్య సమస్యలకు చికిత్సను సులభతరం చేస్తోంది. (అంకెలు రూపాయల్లో)

| ఔషధం | భారత్ | యూఎస్ | యూకే (ఎన్‌హెచ్‌ఎస్/ప్రైవేట్) | జీసీసీ (యూఏఈ, సౌదీ, ఖతర్) |
|---|---|---|---|---|
| ఇన్సులిన్ (వయల్) | 87-435 | 8,700-26,100 | 1,740-4,350 | 4,350-13,050 |
| పారాసిటమాల్ (10 ట్యాబ్లెట్స్) | 43.5 | 435-870 | 87-261 | 261-609 |
| అటోర్వాస్టాటిన్ (నెలకు) | 174-435 | 2,610-4,350 | 870-1,740 | 1,305-3,480 |
| బీపీ మందులు (నెలకు) | 174-870 | 4,350-17,400 | 870-2,610 | 1,740-6,960 |
| ఇమాటినిబ్ (నెలకు) | 8,700-43,500 | 8,70,000పైన | 87,000పైన | 261,000-6,96,000 |

**తక్కువ ప్రీమియం..**



ఒక వ్యక్తికి ఆరోగ్య బీమా సగటు వార్షిక ప్రీమియం రూ.10,440–26,100 ఉంది. భారతదేశంలో ఆరోగ్య బీమా చాలా దేశాల కంటే చవకైనది.

| దేశం | ఒక్కో వ్యక్తికి సగటు వార్షిక ప్రీమియం | ఆరోగ్య సేవల వ్యవస్థ |
|---|---|---|
| యూఎస్ | 6,96,000 | ప్రధానంగా ప్రైవేట్ |
| యూకే | నేషనల్ హెల్త్ సర్వీస్: ఉచితం. ప్రైవేట్: 1,30,500–2,61,000 | ఎన్‌హెచ్‌ఎస్, ప్రైవేట్ |
| జీసీసీ దేశాలు | 3,48,000–4,35,000 | ప్రైవేట్, కంపెనీలు |

(అంకెలు రూపాయల్లో)

ఆరోగ్య బీమా క్లెయిమ్‌లలో వివిధ స్థాయిల ఆసుపత్రులలో ఎన్నారైల వాటా:

నగరం స్థాయి

| ప్రథమ | ద్వితీయ | తృతీయ |
|---|---|---|
| 21% | 33% | 46% |

స్థాయిలవారీగా ఎన్నారైలు ఎంచుకుంటున్న ప్రధాన నగరాలు

| ప్రథమ | ద్వితీయ | తృతీయ |
|---|---|---|
| హైదరాబాద్ | ఎర్నాకులం | త్రిస్సూర్ |
| చెన్నై | తిరువనంతపురం | కొల్లమ్ |
| ముంబై | పుణే | కోజికోడ్ |
| బెంగళూరు | థానే | కొట్టాయం |
| కోల్‌కతా | కోయంబత్తూర్ | పత్తనంతిట్ట |

(ఆధారం: భారత్‌లో మూడేళ్లలో పాలసీబజార్ వేదికపై ఎన్నారై కస్టమర్ల క్లెయిమ్స్ డేటా)

**మాతృ దేశంలో..**

భారత్‌లో చికిత్స పొందే ఎన్నారైలకు కుటుంబం, స్నేహితుల మద్దతు ఉంటుంది. వైద్య సిబ్బంది ఇంగ్లిష్ మాట్లాడడం సౌకర్యాన్ని అందిస్తుంది.

అనేక ఆసుపత్రులు వీసాలు, ప్రయాణ ఏర్పాట్లు, శస్త్రచికిత్స అనంతర సంరక్షణతో సహా చికిత్స ప్యాకేజీలను అందిస్తున్నాయి.

బీమా పాలసీలు వృద్ధ తల్లిదండ్రుల చికిత్స కోసం ఎన్నారైలకు క్షేత్ర స్థాయిలో తోడ్పాటునిస్తున్నాయి.

## క్లుప్తంగా...

### తప్పుదారి పట్టించేందుకే 'ఓట్ చోరీ' ప్రచారం

**మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి**



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ 'ఓట్ అధికారి యాత్ర, ఓట్ చోరీ'ప్రచారం పూర్తిగా అసత్యంతో కూడుకున్నదని బీజేపీ నేత, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి విమర్శించారు. ఇది ప్రజలను తప్పుదారి పట్టించడానికి చేసిన ప్రయత్నం తప్ప మరొకటి కాదన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు ముందే జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) తప్పనిసరిగా చేపట్టాలన్నారు. డూప్లికేట్ ఓట్లు మాత్రమే కాకుండా, పక్క నియోజకవర్గాల నుంచి లేదా పక్క రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ ఓటర్లుగా నమోదైన వారిని పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలపుడు కాంగ్రెస్ నాయకులు 'రిజర్వేషన్లు తీసేస్తారు, రాజ్యాంగాన్ని రక్షించాలి' అంటూ దుష్ప్రచారం చేశారని, ఇప్పుడు బిహార్ ఎన్నికల్లో ఓట్ చోరీ అంటూ మళ్లీ అదే తరహా ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. గత 35 ఏళ్ల ఎన్నికల లెక్కలు పరిశీలించినా, 2024లో కాంగ్రెస్‌కు, ఇండీ కూటమికి ఇంత పెద్ద సంఖ్యలో ఎప్పుడూ ఓట్లు రాలేదన్నారు. అయినప్పటికీ 'ఓట్ చోరీ'అంటూ బీజేపీపై ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టారు.

### ప్రపంచాన్ని గెలిచినట్లు రేవంత్‌రెడ్డి భావిస్తున్నాడు

**మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్**



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి వచ్చిన సీఎం రేవంత్ ప్రపంచాన్ని జయించినట్లు భావిస్తున్నారని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఎద్దేవా చేశారు. వర్సిటీని వారం రోజులుగా పోలీసు క్యాంపుగా మార్చిన రేవంత్ 20 నెలల్లో విద్యారంగానికి ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఓయూకు రూ.వేయి కోట్లు ఇచ్చేందుకు ఇన్నాళ్లూ సీఎంకు ఎందుకు మనసు రాలేదని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు తదితరులతో కలిసి సుమన్ ఈ మేరకు మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.

# ఒడువని కొరత.. విడువని కష్టాలు

- యూరియా కోసం గోస పడుతున్న రైతులు
- ఒక్క బస్తా కోసం రాత్రీ పగలు పడిగాపులు

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, వరంగల్: రైతులకు యూరియా కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఒక్క బస్తా కోసం రాత్రి, పగలు తేడా లేకుండా వ్యవసాయ సహకార సంఘాల ఆఫీసుల (ప్యాక్స్) వద్ద పడిగాపులు పడుతున్నారు. రేషన్ పద్ధతిలో ఒక రైతుకు ఒక బస్తా చొప్పున కూడా యూరియా దొరక్కపోవడంతో చెప్పులు లైన్‌లో పెట్టి బస్తాల లారీ కోసం ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి వరంగల్, మెదక్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల పరిధిలో ఈ పరిస్థితి మరీ ఎక్కువగా ఉంది. వరి నాట్లు వేసి నెలరోజులు గడుస్తున్నా యూరియా వేయకపోవటంతో పంట ఎదుగుదల ఆగిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న, పత్తి పంటలకు కూడా రెండుమూడు విడతల్లో వేయాల్సిన యూరియా కోసం రైతులు క్యూలు కడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నష్ట నివారణ చర్యలు చేపట్టినా ఆశించిన ఫలితం ఇవ్వడం లేదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన 50 వేల మెట్రిక్ టన్నుల్లో 35 వేల టన్నుల యూరియా దిగుమతి అయిందని వ్యవసాయ శాఖ చెపుతోంది. దీనిని జిల్లాలవారీగా విభజించి పంపించే ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రానికి కేంద్రం ఈ ఖరీఫ్ సీజన్‌కు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించింది. ఆగస్టు వరకు 8.30 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. కానీ, ఇప్పటివరకు 5.72 ఎల్‌ఎంటీ మాత్రమే వచ్చింది. గత సంవత్సరం బఫర్ స్టాక్ 1.92 లక్షల ఎల్‌ఎంటీతో కలిపి సరఫరా చేసినప్పటికీ కొరత తీవ్రంగా ఉంది. ఇప్పటికే రావాల్సిన 2.58 ఎల్‌ఎంటీతోపాటు సెప్టెంబర్‌లో ఇవ్వాల్సిన మరో లక్షన్నర మెట్రిక్ టన్నుల యూరియా వస్తే తప్ప ఈ సమస్య పరిష్కారం అయ్యే సూచనలు కనిపించడం లేదు.

**చేతులు కాలాక..**

ఖరీఫ్, రబీ సీజన్‌లలో రాష్ట్రంలోని ఎన్ని లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమనే లెక్కలు వేసి కేంద్రానికి పంపించే వ్యవసాయ శాఖ.. వాటిని రైతులకు అందించే విషయంలో కనీస ప్రణాళికను అమలు చేయలేదు. ప్రతి ప్యాక్స్ సెంటర్‌లో సీఈఓలు యూరియా అమ్మకాలను డిజిటలైజ్ చేసి, ఎకరాకు ఒకటిరెండు బస్తాల చొప్పున ప్రణాళికాబద్ధంగా అందిస్తే ఈ సమస్య వచ్చేది కాదని వ్యవసాయ అధికారులు కూడా ఒప్పుకుంటున్నారు. జూలై వరకు యూరియాను ఇష్టానుసారంగా విక్రయించి, తీరా సమస్య ఎదురైనప్పుడు రేషన్ విధానం పేరుతో పొదుపు చర్యలు చేపట్టడాన్ని రైతులు తప్పుపడుతున్నారు. పెద్ద రైతులు మే నెల నుంచే అవసరానికి మించి ఎరువులు కొని నిల్వ చేసుకున్నారు. పేద రైతులు మాత్రం సమయానికి ప్యాక్స్ కార్యాలయాల వద్ద ఒక్కో బస్తా కోసం పగలు, రాత్రి పడిగాపులు పడుతున్నారు.

**సమీక్షకు దూరంగా సీఎం, సీఎస్**

రాష్ట్రంలో యూరియా సమస్య తీవ్రరూపం దాల్చటంతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దాదాపు ప్రతిరోజూ ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. రాజకీయంగా బీజేపీ, బీఆర్‌ఎస్ విమర్శలను తిప్పికొట్టే పనిలో ఉంటున్నారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గానీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గానీ ఈ అంశంపై ఇప్పటివరకు ప్రత్యేకంగా సమీక్షలు జరపలేదు. 15 రోజుల క్రితం సీఎం ఢిల్లీకి వెళ్లినప్పుడు కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జె.పి.నడ్డాను కలిసి కేటాయించిన ఎరువులను సక్రమంగా సరఫరా చేయాలని కోరడమినహా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిని క్షేత్రస్థాయిలో సమీక్షించకపోవడాన్ని ప్రతిపక్షాలు తప్పు పడుతున్నాయి. సీఎంతోపాటు సీఎస్ కూడా అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వలేదనే ఆరోపణలు ఉన్నాయి. మంత్రి తుమ్మలతో కలిసి ఒకరోజు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనడం మినహా సీఎస్ ప్రత్యేకంగా యూరియాపై అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేసిన పరిస్థితి లేదని వ్యవసాయ శాఖ అధికారులు కూడా పేర్కొంటున్నారు.

**గిడసబారిన పంటలు..**

సరైన సమయంలో ఎరువులు వేయకపోవటంతో వరి, పత్తి, మొక్కజొన్న పంటలలో ఎదుగుదల ఆగిపోయిందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం పంట ఎదుగుదల సమయంలో యూరియా అవసరం అధికంగా ఉంటుంది. అందుకే రైతులు యూరియా కోసం దుకాణాల వద్ద పడిగాపులు పడుతున్నారు. వర్షాలు పడుతున్న క్రమంలో పత్తి పంట ఎర్రబారుతోంది. యూరియా వాడితే పంట ఏపుగా పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. డిమాండ్‌కు తగినట్లుగా సరఫరా లేకపోవడం.. దీనికి తోడు యూరియా దొరకడం లేదన్న ప్రచారంతో కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

**వానాకాలం - 2025 సాగు ప్రణాళిక.. సాగైన విస్తీర్ణం (ఎకరాల్లో..)**

| | |
|---|---|
| వానాకాలం సాగు అంచనా | 1,32,44,305 |
| సాగైన (13.08.2025 నాటికి) విస్తీర్ణం | 1,08,49,125 (81.92 శాతం) |
| పత్తి సాగు అంచనా | 48,93,016 |
| సాగైన పత్తి విస్తీర్ణం | 44,63,517 (91.22 శాతం) |
| వరిసాగు అంచనా | 62,47,868 |
| సాగైన వరి విస్తీర్ణం | 45,20,974 (72.36 శాతం) |
| మొక్కజొన్న సాగు అంచనా | 5,21,206 |
| సాగైన మొక్కజొన్న విస్తీర్ణం | 5,96,892 (114.52 శాతం) |

**ఉమ్మడి జిల్లాలవారీగా పీఏసీఎస్‌లు.. యూరియా డిమాండ్, సరఫరా వివరాలు (మెట్రిక్ టన్నుల్లో..)**

| జిల్లా | పీఏసీఎస్‌లు | యూరియా డిమాండ్ | సరఫరా |
|---|---|---|---|
| వరంగల్ | 97 | 1,48,250 | 84,700 |
| ఖమ్మం | 101 | 99,450 | 66,106 |
| కరీంనగర్ | 133 | 1,10,542 | 83,244 |
| ఆదిలాబాద్ | 77 | 1,61,000 | 99,997 |
| నిజామాబాద్ | 143 | 1,30,300 | 1,08,479 |
| మహబూబ్‌నగర్ | 78 | 1,17,725 | 81,312 |
| నల్లగొండ | 108 | 1,48,983 | 1,04,174 |
| మెదక్ | 111 | 1,08,002 | 68,491 |
| మొత్తం | 848 | 10,24,252 | 6,96,503 |

### కాళ్లరిగేలా తిరుగుతున్నా యూరియా దొరుకుత లేదు..



రెండు ఎకరాల పొలం సాగు చేసిన. గత ఆరు రోజులుగా ఆఫీసుల చుట్టూ కాగితాలు పట్టుకొని తిరుగుతున్న. ఒక్క బస్తా యూరియా కూడా దొరకడం లేదు. అధికారులు సక్రమంగా సమాధానం చెప్పడం లేదు. రోజూ యూరియా కోసం వచ్చి క్యూలో నిల్చుని టోకెన్ దొరక్కపోవడంతో తిరిగి వెళ్లిపోతున్న. యూరియా దొరికేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– మూడవ సత్తమ్మ, మూడు తండా, నర్సింహులపేట, మహబూబాబాద్ జిల్లా

### పంట దెబ్బతింటోంది



నాకు ఉన్న 5 ఎకరాలతోపాటు మరో 17 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, పత్తి పంటలు వేసిన. వరి 8 ఎకరాలు, పత్తి 14 ఎకరాలు పెట్టిన. వరి పంటకు మొదటిసారి యూరియా సమయానికే వేసిన. ప్రస్తుతం పంట కరుకు దశలో ఉంది. రెండవసారి వేయడానికి యూరియా కోసం ఫెర్టిలైజర్ దుకాణాలు, ప్యాక్స్ కార్యాలయాల చుట్టూ వారం రోజులుగా తిరుగుతున్న. ఎక్కడా దొరకడం లేదు. పంట కరుకు దశ దాటిపోతే యూరియా వేసినా ప్రయోజనం ఉండదు. దిగుబడులు తగ్గి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

– గంట శంకర్, రైతు, అంబారీపేట గ్రామం, శాలిగౌరారం మండలం

### యూరియా లేక పంట ఎదుగుదల సరిగా లేదు



మూడెకరాల్లో పత్తి పంట సాగు చేశాను. కొరతతో సకాలంలో ఎరువులు అందక పంటల్లో ఎదుగుదల లోపించింది. ఈసారి అధిక దిగుబడి వస్తుందని భారీగా పెట్టుబడులు పెట్టి పత్తి సాగు చేస్తే ఓ వైపు యూరియా కొరత, మరోవైపు సరైన వర్షాలు లేకపోవడంతో పంట ఎదుగుదల సరిగా లేదు. పంటలో కలుపు కూడా విపరీతంగా పెరిగింది. కూలీ రేట్లు కూడా భారీగా పెరిగాయి. ఈసారి పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– కొయ్యడ రమేశ్, రైతు, షోడశపల్లి, వేలేరు మండలం, హనుమకొండ జిల్లా

## దొంగ ఓట్లు తొలగించి ఎన్నికలకు వెళ్దామా?

- కాంగ్రెస్ గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా: బండి సంజయ్
- వార్డు సభ్యుడిగా గెలవలేని మహేశ్‌గౌడ్‌కు దొంగ ఓట్ల గురించి ఏం తెలుసు?



కరీంనగర్ టౌన్: దొంగ ఓట్లతో బీజేపీ నేతలు గెలిచారంటూ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చేసిన ఆరోపణలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీనే కాబట్టి వెంటనే దొంగ ఓట్ల జాబితాను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. దొంగ ఓట్లను తొలగించాలని ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాసి, అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు వెళ్లాలని చెప్పారు. కాంగ్రెస్ గెలిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. తనను పార్లమెంట్ ఎన్నికల్లో 2.25 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో గెలిపిస్తే దొంగ ఓట్లంటూ కరీంనగర్ ప్రజలను కాంగ్రెస్ అవమానిస్తోందని మండిపడ్డారు. ఈ దేశంలో 20 నెలల పాలనలో పంచాయతీలకు నయాపైసా ఇవ్వని పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ మాత్రమేనని ధ్వజమెత్తారు. మహేశ్‌గౌడ్‌పై తనకు వ్యక్తిగత కక్ష లేదని, ఒక్కసారైనా వార్డు మెంబర్ గానో, ప్రజాప్రతినిధి గానో గెలిచి ఉంటే ఓట్ల చోరీ సంగతి తెలిసేదని ఎద్దేవాచేశారు. కరీంనగర్‌లో చాలా మైనారిటీ ఇళ్లలో వందల కొద్దీ దొంగ ఓట్లున్నాయన్నారు. బండి సంజయ్ బీసీ కాబట్టే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించారని గతంలో మాట్లాడిన మహేశ్‌గౌడ్, ఇప్పుడు దేశ్‌ముఖ్ అనడం గజిని సినిమాను తలపిస్తోందన్నారు. బీసీ రిజర్వేషన్ల పేరిట ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తున్నారని ఆరోపించారు.

## సన్యాసానికి సిద్ధంగా ఉండు...

- స్థానిక ఎన్నికల్లో ఘోర ఓటమి, మఠంలో మీ స్థిరనివాసం ఖాయం
- మీ పాలన, మా పాలనపై చర్చకు సిద్ధమా?... బండి సవాల్‌కు స్పందించిన మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాజకీయ సన్యాసం తీసుకునేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సిద్ధంగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి ఘోర ఓటమి, బండి సంజయ్ రాజకీయ సన్యాసం, మఠంలో ఆయన స్థిర నివాసం ఖాయమయ్యాయని మంగళవారం ఒక ప్రకటనలో జోస్యం చెప్పారు. రాముడు, దేవుడు పేరు చెప్పకుండా, అయోధ్య అక్షింతలు అని అనకుండా సంజయ్ ఎన్నికల్లో గెలుస్తారా అని ఎద్దేవాచేశారు. దేవుడి పేరుతో ఎన్నికల్లో గెలిచే బండి సంజయ్ కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి, వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి ఒక్క పైసా నిధులిచ్చారా? అని నిలదీశారు. 'కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు రావడం లేదని, ప్రాజెక్టుల కేటాయింపులో అన్యాయం జరుగుతోందని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక దాటవేస్తూ సమస్యను పక్కదారి పట్టిస్తున్నారు. కేంద్ర మంత్రి హోదాలో ఉండి నిన్ను గెలిపించిన కరీంనగర్‌కు, తెలంగాణ రాష్ట్రానికి ఏం నిధులు తెచ్చావో లెక్కలు చెప్పగలవా? కరీంనగర్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఎన్నిసార్లు ఓడిపోయావో గుర్తులేదా? బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కేంద్రం అన్యాయం చేస్తుంటే బీసీ బిడ్డగా ఒక్క మాట మాట్లాడగలిగావా? మీరు పాలించే రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తే తప్పులేనిది ఇక్కడ ఇస్తే తప్పా? మీ 12 ఏళ్ల పాలన, మా ఏడాదిన్నర పాలనపై కరీంనగర్ నడిబొడ్డులో చర్చకు వస్తావా?'అని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు.



శివ్వంపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులు



భూత్పూర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రైతులు

# బస్తా కోసం బారులు

- యూరియా కోసం తెల్లవారుజాము నుంచే క్యూలైన్
- అయినా అందకపోవటంతో హైవేలపై మెరుపు ధర్నాలు
- ఆసిఫాబాద్ జిల్లాలో క్యూలోనే కుప్పకూలిన మహిళా రైతు



గూడూరు పీఏసీఎస్ వీధిలోని పలు షాపుల ఎదుట అర్ధరాత్రి కూర్చొని నిద్రిస్తున్న రైతులు

శివ్వంపేట (నర్సాపూర్)/గూడూరు/బెజ్జూర్: యూరియా కొరత రైతులకు నిద్ర లేకుండా చేస్తోంది. రాష్ట్రంలోని చాలా చోట్ల ప్యాక్స్‌ల వద్ద అర్ధరాత్రి నుంచే రైతులు యూరియా కోసం క్యూ కడుతున్నారు. మెదక్ జిల్లా శివ్వంపేట ప్యాక్స్ వద్ద మంగళవారం తెల్లవారుజాము నుంచే రైతులు బారులు తీరారు. గంటల తరబడి నిలబడలేక క్యూలో చెప్పులు, ఇటుక రాళ్లు పెట్టారు. యూరియా రావడం లేదని తెలియడంతో తూప్రాన్‌- నర్సాపూర్ హైవేపై రాస్తారోకో చేశారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రైతులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. బుధవారం యూరియా పంపిణీ చేస్తామని చెప్పడంతో అన్నదాతలు వెనుదిరిగారు.

మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్, నవాబుపేట, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో కూడా రైతులు యూరియా కోసం రోడ్డెక్కి రాస్తారోకో చేశారు. భూత్పూర్‌లో వందలాది మంది మెరుపు ధర్నాకు దిగటంతో 44వ నంబర్ జాతీయ రహదారిపై కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. వ్యవసాయాధికారి మురళీధర్ వచ్చి బుధవారంలోగా యూరియా ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ, గద్వాల, వనపర్తి జిల్లా అమరచింత, ఆత్మకూర్‌లో ఆందోళనలు కొనసాగాయి. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని ప్యాక్స్ వద్ద సోమవారం అర్ధరాత్రి నుంచే రైతులు యూరియా కోసం పడిగాపులు పడ్డారు. ప్యాక్స్‌కు 330 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న మండలంలోని పలు గ్రామాల రైతులు.. గూడూరుకు చేరుకొని ప్యాక్స్ సమీపంలోని షాపుల ముందు కూర్చొని చీకట్లో దోమలతో ఇబ్బందులు పడ్డారు. మంగళవారం ఉదయం 5 గంటల వరకే సుమారు 1,500 మంది రైతులు చేరుకోగా, మండల వ్యవసాయ అధికారి ఎండీ అబ్దుల్‌మాలిక్ పోలీసుల సహకారంతో యూరియాను రైతులకు పంపిణీ చేశారు.

**క్యూలో కుప్పకూలిన మహిళా రైతు**

యూరియా చిట్టీ కోసం క్యూలో నిలబడిన ఓ మహిళా రైతు కుప్పకూలిన ఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్యాక్స్ కేంద్రం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఇక్కడ యూరియా కోసం రైతులు ఉదయం నుంచే బారులు తీరారు. ఎక్కువ మంది రావడంతో అధికారులు సమీపంలోని రైతు వేదికలో చిట్టీలు రాసి ఇవ్వడం ప్రారంభించారు. ఈ క్రమంలో క్యూలో నిలిచున్న మండల కేంద్రానికి చెందిన మహిళా రైతు నెండుగురి కాసుబాయి ఫిట్స్‌తో కుప్పకూలింది. పక్కనున్న రైతులు సపర్యలు చేసి ఆమెను పీహెచ్‌సీకి తరలించారు. కాగా, తాను నెల రోజుల నుంచి యూరియా కోసం తిరుగుతున్నానని కాసుబాయి తెలిపింది.

## ఓట్లు చోరీ చేస్తే... ఎనిమిది సీట్లే ఎందుకు గెలుస్తాం?

- రాజీనామా చేసి ఎన్నికలకు వెళదామా?
- పీసీసీ అధ్యక్షుడికి ఎంపీ రఘునందన్‌రావు సవాల్



సాక్షి, హైదరాబాద్/ పంజాగుట్ట: పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు చోరీ అయ్యాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోందని, ఓట్లు చోరీ అయితే రాష్ట్రంలో 17 స్థానాలు బీజేపీ గెలవాలి కాని ఎనిమిది మాత్రమే ఎందుకు గెలుస్తామని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. మహేశ్‌కుమార్ గౌడ్‌కు నిజంగా అనుమానం ఉంటే మొదట కాంగ్రెస్ పార్టీ ఎనిమిది మంది ఎంపీలచే రాజీనామా చేయించాలని వారిది ఆమోదిస్తే, వారి స్నేహితుడు హైదరాబాద్ ఎంపీతో రాజీనామా చేయించాలని, తరువాత తాము కూడా రాజీనామా చేస్తామని, తిరిగి ఎన్నికలకు వెళ్దామని సవాల్ విసిరారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో 'డిజిటల్ మీడియా చట్టాలు'అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రఘునందన్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉన్న నేపథ్యంలో వారే ఈసీతో ఓట్లు మొత్తం పరిశీలించి ఎన్ని దొంగ ఓట్లు ఉన్నాయో చూసి తిరిగి 17 స్థానాల్లో ఎన్నికలు పెడితే.. దొంగ ఓట్లతో గెలిచారా ఎలా గెలిచారో తెలిసిపోతుందని ఆయన అన్నారు. మేము దొంగ ఓట్లతో గెలిస్తే, కీలకమైన హైదరాబాద్ సీటును ఎందుకు వదులుకుంటామని ఆయన ప్రశ్నించారు. కాగా, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని బీజేపీని అడిగి ఇచ్చారా అని మహేశ్‌కుమార్‌ను రఘునందన్ నిలదీశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, కుంటిసాకులు చెప్పకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరంపై నిజాయితీగా కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సాక్షి హైదరాబాద్

బుధవారం । 27 । ఆగస్టు । 2025






కొత్తపేటలో పూలు, వినాయక ప్రతిమల విక్రయాలు...

గరిష్టం/కనిష్టం
30.0/22.0

**వాతావరణం**
నగరంలో బుధవార ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం కురవొచ్చు, గరిష్టంగా 30, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.





ఈఎస్‌ఐ వద్ద..

## తొలిపూజకు వేళాయె..

ఖైరతాబాద్‌లో ఈ ఏడాది 69 అడుగుల ఎత్తులో రూపుదిద్దుకున్న శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి భక్తుల పూజలందుకునేందుకు సిద్ధమయ్యాడు. మంగళవారం రాత్రి విగ్రహానికి, దాని ఎదుట స్టేజీకి తుదిమెరుగులు దిద్దారు. మూడు ముఖాలతో..పంచముఖ నాగేంద్రుడి నీడలో నిలబడి ఉన్న ఆకారంలో మట్టితో రూపొందిన మహాగణపతికి బుధవారం ఉదయం 10.30 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తొలిపూజ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతిస్తారు.

# పూలు..పండ్ల ధరలకు రెక్కలు

## రికార్డు స్థాయిలో చామంతి కేజీ రూ.450

**బంతి పూలు కేజీ రూ.150–200**

సాక్షి, సిటీబ్యూరో

గ్రేటర్‌లో గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో పూలు, పండ్లు, ఇతర పూజా సామగ్రి ధరలు అమాంతం పెరిగిపోయాయి. చామంతి పూలు కేజీ రూ.450, బంతి పూలు కిలో రూ.150 నుంచి రూ.200కు విక్రయించారు. అరటి, బత్తాయి, ఆపిల్, దానిమ్మ, జామ వంటి పండ్ల ధరలు సైతం రెట్టింపు చేశారు. మంగళవారం నగరంలోని అన్ని ప్రధాన మార్కెట్లు పండగ కొనుగోళ్లతో సందడిగా మారగా..రేట్లు చూసి సామాన్యులు నిట్టూర్పు విడిచారు. పండగ వేళ కొనక తప్పదు కదా అనుకుంటూ కొనుగోళ్లు జరిపారు. ధరలపై ఎలాంటి నియంత్రణ లేకపోవడంతో పూల, పండ్ల వ్యాపారులు ఇష్టారీతిగా వ్యవహరించారు. కొన్నిచోట్ల తూకంలోనూ మోసాలకు పాల్పడ్డారని వినియోగదారులు మండిపడ్డారు.

**ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు**

వర్షాల కారణంగా ఈ ఏడాది శివారు జిల్లాల్లో పూల సాగు, దిగుబడి తగ్గింది. దీంతో పొరుగు రాష్ట్రాల నుంచి గులాబీ, చామంతి, బంతితో పాటు ఇతర పూలు ఎక్కువ మోతాదులో దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందని మార్కెట్ అధికారులు తెలిపారు. ఈ ఏడాది రంగారెడ్డి, వికారాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో వరుస వర్షాలతో పూల తోటకు భారీగా నష్టం జరిగింది. ఇక నగరానికి ఎక్కువగా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పూలు దిగుమతి చేసుకున్నట్లు తెలుస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దాదాపు 40 వేల కేజీల పూలు అధికంగా మార్కెట్లకు దిగుమతి అయ్యాయి. ప్రత్యేకంగా బంతి, చామంతి ఎక్కువగా దాదాపు ఈ ఏడాది 1.20 లక్షల కిలోల పూలు దిగుమతి అయినట్లు వ్యాపారులు అంటున్నారు. ఇక పండ్ల విషయానికి వస్తే..వీటి దిగుమతి బాగానే ఉన్నా ప్రజల అవసరాలను ఆసరగా చేసుకుని అమాంతం ధరలు పెంచేశారు. మా మూలు రోజుల్లో డజన్ అరటి పండ్లు రూ.40 నుంచి 50 రూపాయలకు ఇవ్వగా..పండగ కారణంగా మంగళవారం ఏకంగా రూ.60 నుంచి 80 రూపాయల వరకు విక్రయించారు. ఆపిల్, దానిమ్మ వంటి ఇతర పండ్ల ధరలు కూడా ఇదే రీతిలో పెంచేశారు.



గుడిమల్కాపూర్ మార్కెట్‌లో సందడి..

# పండగ వేళ.. అంతా సిద్ధం!

## గణేశ్ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు

- వివిధ విభాగాలతో జీహెచ్ఎంసీ సమన్వయం
- చెట్లకొమ్మల తొలగింపు, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా
- ప్రతి చెరువు వద్ద అధికారులు.. నిమజ్జనాలకు క్రేన్లు
- పాట్‌హోల్స్ పూడ్చివేతలు, రోడ్ల మరమ్మతులు

సాక్షి, సిటీబ్యూరో: వినాయక చవితి పండగ ఉత్సవాలకు సంబంధించి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా అటు జీహెచ్ఎంసీ..ఇటు అన్ని శాఖల అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల్లో విగ్రహ ప్రతిష్టలు, నిమజ్జనం తదితర కార్యక్రమాలకు వివిధ ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ జీహెచ్ఎంసీ పనులకు సిద్ధమైంది. ఈమేరకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, సమాచార–పౌరసంబంధాలు, పోలీసు, రవాణా, హెచ్ఎండీఏ, వాటర్‌బోర్డు, హైడ్రా, మెడికల్ అండ్ హెల్త్, ఫైర్ సర్వీసెస్, ఆర్టీసీ, టీఎస్ఎస్‌పీడీసీఎల్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, టూరిజం విభాగాలతో సహ 23 విభాగాలు సమన్వయంతో పనిచేసేలా ప్రణాళిక రూపొందించారు. ఏ విభాగం ఏ పనిచేయాలో పేర్కొన్నారు.

ఆ వివరాలు ఇలా...

- **పారిశుధ్యం, పబ్లిక్ టాయ్‌లెట్లు:** జీహెచ్ఎంసీ
- **చెట్లు, కొమ్మల నరికివేత:** జీహెచ్ఎంసీ, టీఎస్ఎస్‌పీడీసీఎల్
- **రోడ్ల నిర్వహణ, గుంతల పూడ్చివేత:** జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్
- **వివిధ చెరువుల వద్ద క్రేన్ల ఏర్పాట్ల బాధ్యతలు:** హెచ్ఎండీఏ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, జీహెచ్ఎంసీ.
- **బారికేడింగ్, స్టేజీలు, లైటింగ్ ఏర్పాట్లు:** ఆర్‌అండ్‌బీ.
- **హెల్త్‌క్యాంపులు, అంబులెన్సులు:** నాలుగు జిల్లాల డీఎంఓహెచ్‌లు
- **బోట్లు, స్విమ్మర్లు:** టూరిజం, ఫిషరీస్, హైడ్రా విభాగాలు
- **విద్యుత్ అంతరాయం లేకుండా:** టీఎస్ఎస్‌పీడీసీఎల్
- **తాగునీటి సరఫరా:** జలమండలి
- **ఫైర్‌సేఫ్టీ చర్యలు:** ఫైర్ డిపార్ట్‌మెంట్, హైడ్రా
- **కంట్రోల్‌రూమ్స్ ఏర్పాటు:** జీహెచ్ఎంసీ, పోలీస్ విభాగం
- **వీధిదీపాలు:** జీహెచ్ఎంసీ
- **నిమజ్జనం అనంతరం విగ్రహాల తొలగింపు:** హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ

**సమన్వయంతో..**

సమన్వయంతో పనిచేసేందుకు వివిధ విభాగాల అధికారుల ఫోన్‌నెంబర్లు అందరి వద్ద అందుబాటులో ఉంచారు. జోన్లవారీగానూ ఆయా విభాగాల ఉన్నతాధికారుల వివరాలు, ఫోన్‌నెంబర్లు అందుబాటులో ఉంచారు. చిన్న విగ్రహాలు నిమజ్జనాలు జరిగే సర్కిళ్ల పరిధిల్లో కొలనుల వారీగా అధికారులకు బాధ్యతలప్పగించారు. జీహెచ్ఎంసీ సర్కిళ్ల వారీగా నోడల్ ఆఫీసర్లను నియమించారు. అన్ని సర్కిళ్లలో వెరసి చిన్నవి, పెద్దవి కలిసి 80 చెరువులు, కొలనుల్లో నిమజ్జనాలకు ఏర్పాట్లు చేశారు. వీటివద్ద విగ్రహాల నిమజ్జనాల కోసం 331 క్రేన్లు, నిమజ్జన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు మూడు షిఫ్టుల్లో పనిచేసేందుకు 1357 మంది కార్మికులను నియమించారు. నిమజ్జనం చివరి రోజు వెలువడే వ్యర్థాలు పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు పారిశుధ్య కార్మికుల గ్రూపులను నియమించారు.

**పాట్‌హోల్స్ పూడ్చివేతలు**

ఇటీవలి వర్షాలకు 13వేలకు పైగా ప్రాంతాల్లో రోడ్లకు గుంతలు పడగా, వాటిల్లో 10వేల పైచిలుకు ప్రాంతాల్లో ఇప్పటికే పూడ్చివేశారు. నిమజ్జనం చివరి రోజున విగ్రహాలు తరలివచ్చే మార్గాల్లో ప్యాచ్‌వర్క్స్, రీకార్పెటింగ్ వంటి పనులు పూర్తి కావాల్సి ఉంది.



బంజారాహిల్స్‌లోని ఓ కాలనీలో రోడ్డు రీ కార్పెటింగ్ పనులు...

# సీఆర్ఎంపీ పనుల వ్యయం తగ్గింది

## రూ.3825 కోట్ల నుంచి రూ.2828 కోట్లకు తగ్గిన వైనం..

సాక్షి, సిటీబ్యూరో: సీఆర్ఎంపీ (సమగ్ర రోడ్ల నిర్వహణ పథకం) పనులు ఐదేళ్లపాటు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు తొలుత రూ.3825 కోట్లు ప్రతిపాదించిన జీహెచ్ఎంసీ ఇంజినీర్లు..ఆ వ్యయాన్ని దాదాపు రూ.వెయ్యి కోట్లు తగ్గించారు. తాజాగా రూ.2828 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి, నిధుల కోసం ప్రభుత్వానికి పంపించేందుకు సిద్ధమయ్యారు. గతంలో ఇదే పేరిట 811 కిలోమీటర్ల నిర్వహణకు దాదాపు రూ.1800 కోట్లు ఖర్చు చేశారు. ఆ ఐదేళ్ల గడువు ఈ సంవత్సరం ఆరంభంలోనే ముగిసిపోగా, ఒప్పందం మేరకు అన్ని పనులూ జరిగిందీ లేనిదీ తనకు వివరాలతో సహా అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఒప్పందం మేరకు ఫుట్‌పాత్‌లు, డివైడర్లు తదితర పనులైతే జరగలేదు. కేవలం గుంతల పూడ్చివేత, రీకార్పెటింగ్స్ తప్ప ఒప్పందంలోని మిగతా పనులేవీ జరగలేదు. ఆ గడువు ముగిసిపోవడంతో తిరిగి రెండు రకాల ప్రతిపాదనలతో ప్రభుత్వ అనుమతి కోసం పంపించారు. ఆ మేరకు 744 కిలోమీటర్ల మేర నిర్వహణకు రూ. 2491 కోట్ల అంచనా వ్యయంతో ఒక ప్రతిపాదన, 1142 కిలోమీటర్ల నిర్వహణకు రూ.3825 కోట్ల అంచనా వ్యయంతో రెండో ప్రతిపాదన రూపొందించారు. ప్రభుత్వం దేనికి ఆమోదం తెలిపితే దానిని అమలు చేయాలని భావించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశం అందిందో..అసలు అందిందో, లేదో కానీ రెండో ప్రతిపాదనకు తాజాగా అంచనా వ్యయాన్ని రూ.2828 కోట్లకు సవరించారు. అంటే రూ.997 కోట్లు తగ్గింది. ఈ మేరకు నిధులందించేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదంతో ప్రభుత్వానికి నివేదించేందుకు సిద్ధమయ్యారు.

**ఎందుకు తగ్గింది?**

గత ఐదేళ్లపాటు నిర్వహణలో భాగంగా దెబ్బతిన్న రోడ్ల రీకార్పెటింగ్‌తో పాటు ఫుట్‌పాత్‌లు, స్వీపింగ్, గ్రీనరీ వంటి పనులు కూడా ఉండగా, ఈసారి మాత్రం నాలాల్లోని డీసిల్టింగ్ కూడా చేర్చారు. కేవలం డీసిల్టింగ్‌కు మాత్రమే టెండర్లు పిలిచినా పనులు పూర్తి కావడం లేదు. మరోవైపు హైడ్రా సైతం డీసిల్టింగ్ పనులు చేస్తోంది. గతంలో స్వీపింగ్, గ్రీనరీ, ఫుట్‌పాత్‌లు తదితర పనులేవీ చేయకుండానే బిల్లులు చెల్లించారు. ఈ నేపథ్యంలోనే, ఒప్పందంలో ఆ పనులున్నా జరగడం లేదని, ఆ పనులు వేరే విభాగాలు ఎలాగూ చేస్తున్నందున ఒప్పందంలోని లొసుగులు తెలిసిన కమిషనర్ ఆదేశాల కనుగుణంగా కేవలం రోడ్ల నిర్వహణ కోసం ఈ ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిసింది. ఈసారి కూడా భారీ అంచనాలే రూపొందించినప్పటికీ, బ్రేక్ పడినట్లు తెలుస్తోంది.

# 10 నిమిషాల్లోనే..

## భార్య శరీర భాగాలను నరికిన భర్త

- విచారణలో పోలీసులకు వెల్లడించిన నిందితుడు
- స్వాతి హత్య కేసులో మహేందర్ రెడ్డిని కస్టడీకి కోరుతూ కోర్టులో పిటిషన్
- శరీర భాగాల కోసం మూసీలో గాలింపు

సాక్షి, సిటీబ్యూరో: కోడిని కోసినంత సులువుగా.. పదే పది నిమిషాల్లో భార్య మృతదేహాన్ని నాలుగు ముక్కలుగా నరికానని విచారణలో నిందితుడు మహేందర్ రెడ్డి పోలీసులకు తెలిపినట్లు తెలిసింది. కాళ్లు, చేతులు, తల, మొండం వేర్వేరుగా చేసి.. మొండం మినహా మిగిలిన శరీర భాగాలను పర్వతాపూర్ వంతెన పైనుంచి మూసీలో పడేసినట్లు వివరించాడు. మేడిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో గర్భిణి అయిన భార్య స్వాతిని భర్త మహేందర్‌రెడ్డి హత్య చేసిన సంగతి తెలిసిందే. హత్య జరిగి మూడు రోజులు గడుస్తున్నా ఇప్పటికీ హతురాలి శరీర భాగాలు లభించలేదు. మూసీలోకి వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో శరీర భాగాలు వరదలో కొట్టుకుపోవచ్చని, మూసీ వంతెన నుంచి 10 కి.మీ. దిగువన పోలీసులు, డీఆర్ఎఫ్ బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ఇప్పటికే బాలాజీనగర్‌లోని నిందితుడి ఇంటి నుంచి శరీర భాగాలను పారేసిన ప్రతాప సింగారం మూసీ వంతెన వరకూ ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌లను పోలీసులు సేకరించారు. అలాగే హతురాలి మొండం నుంచి డీఎన్ఏ నమూనాలను సేకరించి, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి పంపించారు. కోర్టు అనుమతితో హతురాలిని, ఆమె తల్లిదండ్రుల డీఎన్ఏ పరీక్షలను నిర్వహించారు. నిందితుడు మహేందర్ రెడ్డిని కస్టడీకి కోరుతూ పోలీసులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.

**ఆత్మహత్య చేసుకోవాలని ఒత్తిడి..**

నిందితుడు మహేందర్ రెడ్డి గతంలో స్వాతిని పలుమార్లు ఆత్మహత్య చేసుకోవాలని ఒత్తిడి చేశాడని, భర్తతో ఎదుర్కొన్న వేధింపులు తనతో చెప్పుకొని ఏడ్చిందని స్వాతి చెల్లెలు శ్వేత కన్నీరుమున్నీరైంది. స్వాతిని శారీరకంగా, మానసికంగా హింసించేవాడని ఆరోపించింది. వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడ సమీపంలోని ఒక వరద కాల్వ వద్దకు తీసుకెళ్లి అందులో దూకాలని ఒత్తిడి చేశాడని, చిన్న విషయానికే ఉద్దేశపూర్వకంగానే తగాదా పెట్టుకునేవాడని, ఈ క్రమంలో ఒకరోజు తాడు ఇచ్చి ఉరేసుకోవాలని ఒత్తిడి చేశాడని ఆమె వాపోయింది.

# ‘జీరో’ వాటర్ బిల్లు.. ఇక మూడు నెలలకోసారి!

## ఫ్రీ ట్యాప్ వాటర్‌కు నిబంధనల మార్పు

- 60 వేల లీటర్లు దాటితేనే నీటి చార్జీలు
- జలమండలి కీలక నిర్ణయం



సాక్షి,సిటీ బ్యూరో: మహానగరంలో ఉచిత తాగు నీటి పథకం వర్తిస్తున్న గృహోపయోగ వినియోగదారులకు ఇక మూడు నెలల(త్రైమాసికం)కు ఒకసారి జీరో బిల్లు జారీ కానుంది. నెలకు 20 వేల లీటర్ల చొప్పున మూడు నెలలకు 60 వేల లీటర్ల రీడింగ్ దాటితే మాత్రం అదనపు నీటికి చార్జీల బిల్లింగ్, లేకుంటే జీరో బిల్లు జారీ కానుంది. ఈ మేరకు జలమండలి కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ పరిధిలో గత ఐదున్నర సంవత్సరాలుగా గృహోపయోగ వినియోగదారులకు ఉచిత నీటి పథకం వర్తిస్తోంది. మొత్తం డొమెస్టిక్ కనెక్షన్‌దారుల్లో సుమారు 97 శాతం వినియోగదారులకు ఉచిత నీటి లబ్ధి చేకూరుతోంది. ఇప్పటి వరకు నల్లా మీటర్ రీడింగ్ ఆధారంగా నెలవారీగా జీరో బిల్లు జారీ చేస్తూ వస్తోంది. తాజాగా ఫ్రీ వాటర్ కనెక్షన్లకు త్రైమాసికానికి ఒక సారి జీరో బిల్లు జారీ చేసే విధంగా చర్యలకు ఉపక్రమించింది.

**ఇదీ పరిస్థితి..**

జలమండలి పరిధిలో సుమారు తాగు నీటి నల్లా కనెక్షన్లు దాదాపు 14.19 లక్ష వరకు పైగా ఉన్నాయి. అందులో ఆధార్‌తో అనుసంధానం చేసిన ఉచిత నీటి పథకం వర్తించే గృహ కనెక్షన్లు సుమారు 9.23 లక్షల వరకు ఉన్నాయి. వీరికి నీటి ప్రతి నెలా జీరో బిల్లు జారీ అవు తోంది. ఈ వినియోదారులు నెలకు 20 కేఎల్ (20 వేల లీటర్లు) ఉచితంగా వినియోగించవచ్చు. అంతకంటే ఎక్కువ వాడితే మా త్రం అదనపు నీటి వినియోగానికి బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. ఒక కేఎల్ నీటికి అంటే ఒక వెయ్యి లీటర్ల నీటిని అదనంగా వినియోగిస్తే రూ.10 బిల్లు అవుతోంది. మొత్తం మీద ఆధార్‌తో అనుసంధానమైన కనెక్షన్లలో సుమారు 95 శాతం వినియోగదారులు నెలకు 20 కేఎల్ కంటే అదనంగా ఒకటి నుంచి రెండు కేఎల్ నీటిని అధికంగా వినియోగిస్తుంటారు.అయితే మీటర్ రీడర్లు ప్రతినెల నీటి వినియోగం రీడింగ్ తీసి బిల్లు జారీ చేస్తుంటారు. దీంతో వినియోగదారులు నెలకు రూ.10 లేదా రూ.20 వరకు బిల్లు చెల్లించాల్సి ఉంటుంది.

**బిల్లు జారీకి రూ.41పైన వ్యయం**

నల్లా వాటర్ మీటర్ రీడింగ్ తీసి బిల్లు జనరేట్ చేసేందుకు వివిధ ఏజెన్సీలతో జలమండలి ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ఆయా ఏజెన్సీలు సుమారు 678 మంది మీటర్ రీడర్ల సేవలను వినియోగిస్తోంది. అయితే ప్రతి వినియోగదారుడి నెలవారీ మీటర్ రీడింగ్ తీసి బిల్లు జనరేట్ చేసి జారీ చేసేందుకు ఏజెన్సీలకు ఒక్కో బిల్లుకు రూ. 41లు చార్జ్ చేస్తుండగా దానిని జలమండలి భరిస్తోంది. జీరో బిల్లుల నుంచి రాబడి లేక పోగా.. బిల్లుల జనరేట్, జారీకి మాత్రం ప్రతినెలా రూ.లక్షల వ్యయం జలమండలికి భారంగా మారుతోంది.

**ఖర్చు తగ్గించుకునేందుకు**

జలమండలి వృథా ఖర్చులు తగ్గించుకునేందుకు ఉచిత నీటిని వినియోగించుకుంటున్న క్యాన్ నెంబర్ల బిల్లుల జారీ విషయంలో కొద్ది మార్పులకు సిద్ధమైంది. ఇప్పటికే ఉచిత నీటిపథకం ద్వారా నెలకు రూ.21 కోట్ల 92 లక్షల రాబడిని కోల్పోయి నష్టాలను భరిస్తోంది. మరోవైపు ఫ్రీవాటర్ నెలవారీగా జీరో బిల్లు జారీ కూడా ఆర్థిక సమస్యగా తయారైంది. ఇటీవల జలమండలి ఎండీ కె.అశోక్ రెడ్డి ఫ్రీవాటర్ కనెక్షన్లకు బిల్లు జారీ అంశంపై బోర్డు రెవెన్యూ విభాగం ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఆర్థికపరమైన అంశాలను పరిశీలించి ఒకేసారి మూడు నెలలకోసారి బిల్లులు జారీ చేస్తే బెటర్ అని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

**ఫ్రీ వాటర్‌కు త్రైమాసిక బిల్లు జారీ చేస్తాం**



నగరంలో ఉచిత తాగు నీటి పథకం వర్తిస్తున్న గృహోపయోగ వినియోగదారులకు త్రైమాసికానికి ఒకసారి రీడింగ్ తీసి బిల్లు జారీ చేయాలని నిర్ణయించాం. నెలకు 20 కేఎల్ చొప్పున మూడు నెలలకు 60 కేఎల్‌ల నీటి వినియోగానికి జీరో బిల్లు, అదనంగా వినియోగిస్తే మాత్రం చార్జీలు వర్తిస్తాయి. ఎంతో వ్యయ ప్రయాసతో సుదూర ప్రాంతాల నుంచి నీటిని తరలించి శుద్ధి చేసి ఉచితంగా తాగునీరు సరఫరా చేస్తున్నాం. వినియోగదారులు అదనపు నీటి వినియోగం చార్జీలను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా చెల్లించి మరింత మెరుగైన సేవలు అందించేందుకు జలమండలికి సహకరించాలి.

– అశోక్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, జలమండలి

# ఓటీ అలవెన్స్ సమస్య పరిష్కారం

- రూ. 5 కోట్ల ఓటీ బకాయిలు,
- పరిహారం విడుదల చేస్తూ ఉత్తర్వులు
- జలమండలి ఎండీ అశోక్ రెడ్డితో ఐఎన్‌టీయూసీ జేఏసీ భేటీ


జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ జేఏసీ ప్రతినిధుల బృందం

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి కార్మికుల ఓటీ అలవెన్స్ సమస్యకు గంటల వ్యవధిలోనే పరిష్కారం లభించింది. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రూ. 5 కోట్ల ఓటీ బకాయిలు, పరిహారం విడుదలయ్యాయి. మంగళవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డితో మాజీ ఎంపీ, తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు మధుయాష్కి గౌడ్ , మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీ ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు మొగుళ్ల రాజి రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జలమండలి ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా కార్మికుల ఓటీ అలవెన్సులు తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎండీ అశోక్ రెడ్డి ఫైనాన్స్ విభాగం అధికారులతో మాట్లాడి, జులై వరకు పెండింగ్‌లో ఓటీ అలవెన్సులను విడుదల చేయాలని ఆదేశించారు అనంతరం ప్రతినిధుల బృందం జలమండలి ఫైనాన్స్ విభాగం డైరెక్టర్ పద్మావతిని సంప్రదించగా తక్షణమే ఓటీ అలవెన్సులు విడుదల చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

### ఓటీ అలవెన్స్‌లలో జాప్యం వద్దు..

నిరంతరం సేవలందించే కార్మికులకు ఓటి అలవెన్సులు చెల్లించడంలో ఆలస్యం జరక్కుడదని మధుయాష్కి గౌడ్ అభిప్రాయపడ్డారు. ఇకపై ప్రతి నెల 10లోగా ఓటి అలవెన్స్ లిస్టు పంపిస్తే 15 లోగా కార్మికులకు అలవెన్స్‌లు అందుతాయన్నారు. త్వరలో యూనియన్ ఎన్నికలపైన తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పాటు పడుతుందన్నారు. ఉద్యోగులు కార్మికుల సమస్యలపై సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

### వినాయక చవితి కానుక..

దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న జలమండలి ఉద్యోగుల ఓటి బకాయిలు ,పరిహారం కింద రూ.5 కోట్లు బోర్డు విడుదల చేసి వినాయక చవితి పండగ కానుక అందించిందని ఐఎన్‌టీయూసీ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు మొగుళ్ల రాజి రెడ్డి అన్నారు. ట్రేడ్ యూనియన్స్ జేఏసీ చొరవతోనే ఉద్యోగులకు బకాయిపడ్డ పరిహారాన్ని యాజమాన్యం విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో జలమండలి ఐఎన్‌టీయూసీ జేఏసీ ప్రతినిధులు రాజి రెడ్డి, రాఘవేంద్ర రాజు, అల్లి శ్రవాణ్ కుమార్, ఎండీ జాంగిర్, బి.దేవేందర్, సైద్ అక్తర్ అలీ, బి.నర్సింగ్ రావు, బి.జయ్ రాజ్, బి.మహేష్ బి. సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్ మారో దమ్..!



**విద్యా సంస్థల్లో విచ్చలవిడిగా మాదక ద్రవ్యాలు**
- స్కూళ్లు, కాలేజ్ విద్యార్థులే లక్ష్యంగా డ్రగ్స్ సరఫరా
- చాక్లెట్లు, సిగరెట్ల రూపంలో విక్రయిస్తున్న నేరస్తులు
- విద్యా సంస్థల్లో కనిపించని యాంటీ డ్రగ్ కమిటీలు

సాక్షి, సిటీబ్యూరో: విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల సరఫరా చాపకింద నీరులా విస్తరిస్తోంది. పాఠశాలలు, కళాశాల విద్యార్థులే లక్ష్యంగా గంజాయి, కొకైన్, హాష్ ఆయిల్ ఇలా రకరకాల రూపంలో డ్రగ్స్ సరఫరా అవుతున్నాయి. పార్టీ ఏదైనా 'మత్తు' ఉండాల్సిందేనంటున్నారు విద్యార్థులు. పార్టీలు, పబ్‌లు, డీజే డ్యాన్స్‌లు..ఇలా ఎక్కడైనా ఏదో ఒక స్థాయిలో డ్రగ్స్ వినియోగిసున్నారు. డ్రగ్ పెడ్లర్లు చాక్లెట్లు, సిగరెట్ల రూపంలో విచ్చలవిడిగా విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నారు. తాజాగా సూరారంలోని మహీంద్రా యూనివర్సిటీలో విద్యార్థులు గంజాయి వినియోగించడం కలకలం రేపిన సంగతి తెలిసిందే. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ లేకపోవడంతో పాటు తోటివారి ప్రభావంతోనే యువత ఎక్కువగా మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారు. ఈ విషవలయంలో ఒక్కసారి చిక్కుకున్న వాళ్లు తిరిగి సాధారణ జీవితం గడపలేకపోతున్నారు. ముఖ్యంగా 8వ, ఆపై తరగతి పిల్లల్లో ఈ దురలవాటు ఎక్కువగా కనిపిస్తుంది. కరోనా తర్వాతి నుంచి అన్ని వర్గాలలోనూ 'అలుమ్నీ' గ్రూప్‌లు ఎక్కువైపోయాయి. చిన్నా, పెద్ద ప్రతి ఒక్కరూ 'పూర్వ విద్యార్థుల యూనియన్'గా ఏర్పడుతున్నారు. ఇల్లు, పాఠశాల ఆవరణలో ఎడిబుల్ చాక్లెట్లను తింటే తల్లిదండ్రులు, టీచర్లు గమనిస్తారని..బాస్కెట్‌బాల్, స్కేటింగ్ వంటి క్రీడల శిక్షణ సమయంలో పిల్లలు వీటిని వినియోగిస్తున్నారని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ర్యాపిడో, డుంజో వంటి బైక్ సర్వీస్‌ల ద్వారా బుకింగ్ చేసి తెప్పించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులైతే పార్టీ మూడ్‌ను మరింత పెంచేందుకు, ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం వినియోగిస్తున్నట్లు పలు కేసుల విచారణలో పోలీసులు గుర్తించారు.

### గంజాయి టూర్లు..

వీకెండ్ వస్తే చాలు యువత స్నేహితులతో కలిసి గంజాయి టూర్లు వేస్తున్నారు. హైదరాబాద్ నుంచి 500–600 కిలో మీటర్లు, ఒక్కో వాహనంపై ఇద్దరేసి చొప్పున ప్రయాణిస్తున్నారు. ప్రధానంగా అరకు, సీలేరు, ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతాలకు వెళ్తున్న ట్లు పోలీసులు గుర్తించారు. పర్యాటక ప్రాంతాలు లేదా వాహన రద్దీ తక్కువగా ఉండే నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లి అక్కడే 2–3 రోజులు ఉంటున్నారు. ఉన్నన్ని రోజులు గంజాయి తాగుతూ మరో లోకంలో విహరిస్తున్నారు. తిరుగు ప్రయాణంలో తమ వెంట 2–3 కిలోల గంజాయి, హాష్ ఆయిల్‌ను తీసుకొస్తున్నారు. అడ్డదారుల్లో హైదరాబాద్‌లో విక్రయిస్తున్నారు. కొందరు సొంతంగా వినియోగిస్తున్నారు కూడా.

### తూతూ మంత్రంగానే ఏడీసీలు..

విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు యాంటీ డ్రగ్ కమిటీ (ఏడీసీ)లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిబంధనలు విధించింది. కానీ, వాటి నిర్వహణ, అమలుపై పర్యవేక్షణ లేకపోవడంతో నామమాత్రంగానే ఉంటున్నాయి. ఈ కమిటీల్లో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కనిష్టంగా ఐదుగురు సభ్యులు ఉంటారు. యువత తన జీవితంలో ఎదురవుతున్న ఎలాంటి పరిణామం, పరిస్థితులనైనా ఎదుర్కొంటూ మాదక ద్రవ్యాల వైపు మొగ్గు చూపకుండా వారిని సిద్ధం చేయడం ఈ కమిటీల ప్రాథమిక విధి. ఏడీసీల అంశంలోనూ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తు తరాలు నిర్వీర్యం కాకుండా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు.

### పిల్లలపై ఓ కన్నేయాలి..

పిల్లలకు పాకెట్ మనీ ఇవ్వటం మాత్రమే కాదు దాన్ని ఎలా వినియోగిస్తున్నారో చూడటం కూడా తల్లిదండ్రుల బాధ్యత. కరోనా తర్వాతి నుంచి స్కూల్ విద్యార్థులలో స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరిగింది. ఇంటర్నెట్‌లో ఎక్కువగా ఎలాంటి సైట్లను చూస్తున్నారు? ఏ సమాచారాన్ని తెలుసుకుంటున్నారో తల్లిదండ్రులు పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు. క్రెడిట్, డెబిట్ కార్డులతో ఏ వస్తువులు కొనుగోలు చేస్తున్నారో గమనించాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడితే ఏ తరహా ఆటలాడుతున్నారో తెలుసుకోవాలని సూచించారు.

**మీ పిల్లల్లో ఈ లక్షణాలున్నాయా?**
- రోజులాగా కాకుండా ఒక్కసారిగా హైపర్ యాక్టివ్‌గా అవడం.
- రాత్రివేళ నిద్ర పట్టదు.
- శరీర బరువుగా క్రమంగా తగ్గుతుంటుంది.
- కళ్లు ఎర్రగా మారతాయి. తరుచుగా కంటి చుక్కల మందులు వినియోగిస్తుంటారు.
- ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతుంటారు.
- ఒక్కసారిగా బిగ్గరగా అరుస్తుంటారు.
- ఇన్‌స్ట్రాగామ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాలలో చాలా ఉత్సాహంగా ఉంటారు.
- కోడ్ లాంగ్వేజ్‌లో మాట్లాడుకోవటం, సోషల్ మీడియాలో చాటింగ్ చేస్తుంటారు.
- పై లక్షణాలు కన్పిస్తే తప్పకుండా వారిపై కన్నేసి ఉంచాల్సిందే. లేకుంటే మత్తు పదార్థాలకు బానిసలవడం ఖాయమని నిపుణులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు.




## అక్రమ మద్యం పట్టివేత



సాక్షి, సిటీబ్యూరో: ఎల్బీనగర్ ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో ఎక్సైజ్ పోలీసులు 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు.ఎక్సైజ్ అధికారులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్బీనగర్ చంద్రగిరి కాలనీలోని శ్రీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో మద్యం బాటిళ్ల విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్టీఎఫ్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా చిమిడి జగదీష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేయగా విద్యాసాగర్ రెడ్డి అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న 12 మద్యం బాటిళ్లను సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

**90 కిలోల బెల్లం స్వాధీనం**

హైదరాబాద్ నుంచి కల్వకుర్తికి బెల్లం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్టీఎఫ్ బీ టీం ఎస్సై బాలరాజు బృందం దాడులు నిర్వహించింది. బైక్‌పై తరలిస్తున్న 90 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాయచూరు తండాకు ఈ బెల్లాన్ని తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి మహేశ్వరం ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

## లారీ ఢీకొని అన్న మృతి

తమ్ముడికి గాయాలు...


పార్సీ రోహిత్ (ఫైల్)

బాలానగర్: లారీ ఢీకొని అన్న మృతి చెందగా తమ్ముడికి తీవ్ర గాయాలైన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాలానగర్ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బోయగూడకు చెందిన అన్నదమ్ములు పార్సి రోహిత్(26), పార్సి నితిన్ మంగళవారం నిజాంపేటలో ఫంక్షన్‌కు హాజరై యాక్టివాపై తిరిగి ఇంటికి వెళుతున్నారు. ఐడీపీఎల్ సబ్‌స్టేషన్ సమీపంలో వేగంగా దూసుకొచ్చిన లారీ వెనుక నుంచి వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో పార్సీ రోహిత్ (26) అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి తమ్ముడు పార్సీ నితిన్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్సులో మంటలు



గోల్కొండ: బస్టాప్‌లో నిల్చున్న సిటీ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగిన సంఘటన మెహిదీపట్నం బస్టాండ్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మెహిదీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు లింగంపల్లి నుంచి మంగళవారం ఉదయం మెహిదీపట్నం బస్టాప్‌కు వచ్చింది. సమీపంలోకి రాగానే బస్సు ఆకస్మాత్తుగా ఆగిపోయింది. డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన ఆపి మళ్లీ స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించాడు. అయితే బస్సు తిరిగి స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికులందరూ దిగిపోయారు. దీంతో డ్రైవర్ బస్సు బానెట్ ఓపెన్ చేసి కేబుల్ సరి చేస్తుండగా ఒకేసారి మంటలు చెలరేగాయి. స్థానికులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ సంఘటనా స్థలానికి చేరుకునేలోగా బస్సు ముందుబాగం దగ్ధమైంది. మెహిదీపటన్నం ఆర్టీసీ డిపో మేనేజర్ కే.వీ.ఎస్.మూర్తి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై కారు బోల్తా


ఎక్స్‌ప్రెస్ వేపై పల్టీ కొట్టిన కారు


స్వల్ప గాయాలతో బయటపడిన ఖలీల్

రాజేంద్రనగర్: వేగంగా దూసుకొచ్చిన కారు అదుపుతప్పి పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై పల్టీ కొట్టింది. డివైడర్‌ను ఢీకొట్టి స్ట్రీట్ లైట్ స్తంభాన్ని నెలకూల్చి అవతలి రోడ్డుపై పడింది. అయితే అదృష్టవశాత్తు కారులోని ఎయిర్ బ్యాగ్‌లో ఓపెన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనతో ఎక్స్‌ప్రెస్ వేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వివరాల్లోకి వెళితే..గుడిమల్కాపూర్ మహేంద్ర షోరూమ్‌లో మెకానిక్‌గా పని చేస్తున్న మహ్మద్ ఖలీల్ మంగళవారం సాయంత్రం షోరూమ్‌కు చెందిన కారును ట్రయల్ కోసమని పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే మీదుగా ఆరాంఘర్ వరకు వెళ్లి తిరిగి మెహిదీపట్నం వైపు పయనమయ్యాడు. పిల్లర్ నంబర్ 212 వద్దకు రాగానే అతి వేగం కారణంగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. రోడ్డు మధ్యలో స్ట్రీట్ లైట్ స్తంభాన్ని కూల్చి పల్టీ కొడుతూ పక్క రోడ్డుపైకి వచ్చి బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో ఎయిర్‌బ్యాగ్ ఓపెన్ కావడంతో ఖలీల్‌తో పాటు మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటనతో ఎక్స్‌ప్రెస్‌వేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## యువకుడి అనుమానాస్పద మృతి


పోసెంజిత్ లోహర్ (ఫైల్)

పోచారం: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఐటీ కారిడార్‌లో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఐటీ కారిడార్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్, గాజైల్ ప్రాంతానికి చెందిన పోసెంజిత్ లోహర్ (18) వారం రోజుల క్రితం పోచారం వచ్చాడు. ఇన్ఫోసిస్ సమీపంలోని ఏఎస్‌బీఎల్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి చెందిన స్టోర్‌లో లేబర్‌గా పనిచేస్తున్నాడు. పక్కనే ఉన్న లేబర్ క్యాంప్‌లోని బీ–5 రూమ్‌లో ఒక్కడే ఉంటున్నాడు. సోమవారం రాత్రి ఫోన్ రిపేర్ చేయించుకునేందుకు అన్నోజిగూడ వెళ్లి తిరిగి వచ్చాడు. ఫోన్ రిపేర్‌కి తల్లిదండ్రులను డబ్బులు అడిగితే పంపించలేదని, దీంతో కోపం వచ్చి ఫోన్ పగలగొట్టానని తోటి వర్కర్లతో చెప్పాడు. మంగళవారం ఉదయం పక్క గదిలో ఉన్న వారు అతడిని పనికి తీసుకెళ్లేందుకు వచ్చారు. పలుమార్లు పిలిచినా స్పందన లేకపోవడంతో తలుపు తెరిచి చూడగా ఇనుప రాడ్డుకు ఉరివేసుకుని కనిపించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పోరాటం ఫలించింది

- కారు పార్కింగ్ కోసం 20 ఏళ్ల పోరాటం
- వినియోగదారుడికి దక్కిన విజయం
- కారు పార్కింగ్ బదులు రూ.10 లక్షలు చెల్లించిన ప్రతివాది

సిటీ కోర్టులు : ఓ వ్యక్తి 20 ఏళ్లుగా కారు పార్కింగ్ కోసం కోర్టులో పోరాటం చేసి విజయం సాధించాడు. దీంతో బాధితుడికి ప్రతివాది కారు పార్కింగ్‌కు బదులు రూ.10 లక్షలు చెల్లించాడు. జాతీయ స్థాయిలో కూడా పిటిషనర్‌కు అనుకూలంగా తీర్పు రావడంతో ఇటీవల రంగారెడ్డి జిల్లా వినియోగదారుల ఫోరం పిటిషన్‌ను ముగించింది. వివరాల్లోకి వెళితే.. కే.శివరావు అనే వ్యక్తి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. 2008లో కారు పార్కింగ్ విషయమై కేసు దాఖలు చేసిన అతను 20 ఏళ్ల తర్వాత విజయాన్ని సాధించాడు. 2006లో శివరావు మలేషియన్ టౌన్‌షిప్, రెయిన్ ట్రీ పార్క్ , ఏ బ్లాక్ లో ప్లాటు కొనుగోలు చేశాడు. కారు పార్కింగ్ కోసం డబ్బులు విడిగా చెల్లించినా అతడికి పైపులు లీకయ్యే చోట ఇరుకు, అసౌకర్యమైన పార్కింగ్‌ను కేటాయించారు. తన పార్కింగ్‌ను మార్చాలని పలుమార్లు నిర్వాహకులను కోరినా పట్టించుకోలేదు. దీంతో ప్రతివాది ఏపీహెచ్ బీ. ఐజేఎమ్ టూ జాయింట్ వెంచర్ అయిన సిట్కో ప్రైవేట్ లిమిటెడ్ పై 2008 లో రంగారెడ్డి వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు దాఖలు చేశాడు. జిల్లా కమిషన్ 2011 ఏప్రిల్ 21న ఫిర్యాదికి అనుకూలంగా తీర్పు చెప్పింది. ప్రతివాది రాష్ట్ర కమిషన్‌లో అప్పీలు చేయగా 2013 అక్టోబర్ 11న రూ.10 వేల జరిమానా విధిస్తూ అప్పీలు కొట్టివేయడంతో సిట్కో జాతీయ వినియోగదారుల కమిషన్ లో రివిజన్ పిటిషన్ దాఖలు చేసింది. అక్కడ కూడా 2020 అక్టోబర్ 27 న శివరావు స్వయంగా వాదించి విజయం సాధించాడు. స్టేట్ కమిషన్ తీర్పు తర్వాత 2014 తీర్పు అమలు పిటిషన్ వేసినా రివిజన్ పిటిషన్ మూలంగా అమలు వాయిదా పడుతూ వచ్చింది. ఈ పిటిషన్ కూడా 11 ఏళ్ల నడిచి ఆగస్టు 11న ముగిసింది. కారు పార్కింగ్ కేటాయించే అవకాశం లేనందున ప్రత్యామ్నాయ పరిష్కార మార్గం గా రూ.10 లక్షలు చెల్లించేందుకు అంగీకరిస్తూ ప్రతివాది ఆ డబ్బు శివరావు ఖాతాలో జమ చేయడంతో రంగారెడ్డి కమిషన్ ప్రెసిడెంట్ లతాకుమారి, సభ్యుడు జవహర్ బాబు తీర్పు అమలు కావడంతో పిటీషన్‌ను ముగించారు.

**న్యాయస్థానాలపై నమ్మకమే గెలిపించింది..**
**-కే.శివరావు**

న్యాయస్థానాలపై నమ్మకంతోనే నేను ఇంత వరకు పోరాడి విజయం సాధించగలిగాను. నా నమ్మకం వృథా కాలేదు. నాకు జరిగినా అన్యాయానికి ఎప్పటికైనా న్యాయం దక్కుతుందని ఈ 20 ఏళ్లుగా ఒంటరిగా పోరాటం చేశాను. జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి కోర్టు వరకు పోరాడ గలిగాను అంటే అది కేవలం న్యాయ స్థానాలు బాధితుల పట్ల తీసుకునే ప్రత్యేక శ్రద్ధ అని నేను చాలా గర్వంగా చెప్పుకుంటున్నాను. న్యాయస్థానాలకు ప్రత్యేక కృతజ్ఞతలు.

# తొలిపూజకు వేళాయె..!

**తొలిపూజకు సిద్ధమైన ఖైరతాబాద్ శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి**
**గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా పూజలు ప్రారంభం**



ఖైరతాబాద్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఖైతాబాద్ మహాగణపతి ఈ ఏడాది 69 అడుగుల ఎత్తులో శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా భక్తులకు దర్శనమిచ్చేందుకు సిద్ధమయ్యాడు. బుధవారం ఉదయం 10.30 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తొలిపూజ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మహాగణపతి ఇరువైపులా 12 అడుగుల ఎత్తులో కన్యకా పరమేశ్వరి, గజ్జలమ్మ అమ్మవారి విగ్రహాలు, మహాగణపతి పక్కనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూరిజగన్నాథ స్వామి, లక్ష్మీ సమేత హరిగ్రీవ స్వామి విగ్రహాలు భక్తులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి.

ఖైరతాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు మహాగణపతికి 75 అడుగుల జంధ్యం, చేనేత నూలు కండువా, గరిక మాలను సమర్పిస్తారు. మహాగణపతి ఇరువైపులా కొలువు దీరిన కన్యకా పరమేశ్వరి, గజ్జలమ్మ అమ్మ వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్నట్లు పద్మశాలి సంఘం అధ్యక్షుడు కడారి శ్రీధర్ తెలిపారు.

### మూడు ముఖాలు – పంచముఖ నాగేంద్రుడి నీడలో మహాగణపతి..

శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా నామకరణం చేసి రెండు నెలల పాటు 150 మంది కళాకారులతో కలిసి మహాగణపతి ప్రతి రూపాన్ని తీర్చి దిద్దామని, మూడు ముఖాలతో, పంచముఖ నాగేంద్రుడి నీడలో నిలబడి ఉన్న ఆకారంలో మట్టితో రూపొందిన మహాగణపతిని ఆద్యంతం అద్భుతంగా తీర్చి దిద్దామని శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ తెలిపారు.

### 600 మంది పోలీసులతో భారీ బందోబస్తు

ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు ప్రతి రోజు 1.5 లక్షల నుంచి వారాంతాలు, సెలవు రోజుల్లో 5–6 లక్షల మంది తరలి వచ్చే అవకాశముండటంతో పోలీసులు బారీ బందోస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సైఫాబాద్ ఏసీపీ సంజయ్‌కుమార్ తెలిపారు. ఈ ఏడాది మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు మెట్రో రైల్వేస్టేషన్ నుంచి ఖైరతాబాద్ రైల్వే గేటు మీదుగా, రాజ్ దూత్ చౌరస్తా నుంచి, మింట్ కాంపౌండ్ వైపు నుంచి వచ్చే భక్తులకు ఆయా మార్గాల గుండా దర్శనం కోసం క్యూ లైన్‌లలో వచ్చి దర్శించుకుని తిరిగి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆరుగురు డీఏస్పీలు,, 23 మంది సీఐలు, 52 మంది ఎస్‌ఐలు, 50 మంది మహిళా పోలీసులు, 22 ప్లాటూన్లు, బాంబ్, డాగ్ స్క్వా, షీటీంలతో కలుపుకొని మొత్తంగా 600 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీపీ వివరించారు.

**మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు పోలీసులు పలు సూచనలు చేశారు**
- ప్రతి రోజు ఖైరతాబాద్ మహాగణపతి దర్శనం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే ఉంటుంది
- సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా మార్గాల్లోనే దర్శనానికి రావాలి
- స్వంత వాహనాల్లో వస్తే పార్కింగ్ సమస్య ఎదురయ్యే ప్రమాదం ఉంది.
- అన్ని మార్గాల్లో 5 అంబులెన్స్‌లు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాం
- 60 సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ
- అన్ని మార్గాల్లో మెటల్ డిటెక్టర్ల ఏర్పాటు
- అదనంగా కమిటీ తరపున 100 మంది ప్రైవేటు సెక్యురిటీ నియామకం
- వయస్సు పైబడిన వారు, చిన్న పిల్లలతో వచ్చే వారు డే టైంలో దర్శించుకోవాలి
- విలువైన వస్తువులు, ఆభరణాలు ధరించవద్దు

# మైనర్ బాలికతో ప్రేమాయణం

- నెలరోజులుగా సహజీవనం
- యువకుడి రిమాండ్

బంజారాహిల్స్: తాను హాస్టల్‌లో ఉంటున్నానని, నెల రోజులుగా తల్లిదండ్రులను నమ్మించిన ఓ బాలిక తల్లిదండ్రులు వచ్చి చూసేసరికి గదిలో ఓ అబ్బాయితో ఉన్న ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్‌కు చెందిన బాలిక (16) ఏడాది క్రితం తనకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని తల్లిదండ్రులతో గొడవ పడి హైదరాబాద్‌కు వచ్చింది. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తోంది. హాస్టల్‌లో ఉంటున్నానని తల్లిదండ్రులకు చెప్పేది. అయితే ఈ నెల 25న తల్లిదండ్రులకు ఫోన్ చేసి గత నెల రోజులుగా తాను డెలివరీ బాయ్ (19)గా పనిచేస్తున్న యువకుడితో ఫిలింనగర్‌లోని ఓ గదిలో సహజీవనం చేస్తున్నానని, వారం రోజుల నుంచి సదరు యువకుడు తనను తీవ్రంగా కొడుతున్నాడని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు కుమార్తె చెప్పిన అడ్రస్‌ను వెతుక్కుంటూ నగరానికి వచ్చారు. మైనర్ బాలికను లోబర్చుకుని సహజీవనం చేస్తున్న యువకుడిపై చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





## క్లుప్తంగా...

### అది జీహెచ్ఎంసీ స్థలం.. సొసైటీది కాదు

సాక్షి,సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ సొసైటీ పరిధిలో సోమవారం హైడ్రా స్వాధీనం చేసుకున్న స్థలం జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నదని, అది సొసైటీ స్థలం కాదని సొసైటీ వర్గాలు తెలిపాయి. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ సమీపంలోని సర్వే నెంబర్ 403(1) 4.66 ఎకరాల స్థలాన్ని సొసైటీ 1991లోనే జీహెచ్ఎంసీకి అప్పగించగా ఇందులో ఒక పార్కు, టెన్నిస్ కోర్టు,మున్సిపల్ ఆఫీసు ఏర్పాటు చేయగా, కొంత స్థలాన్ని సత్యనారాయణ అనే వ్యక్తి 2000 గజాల్లో నర్సరీ నడుపుతున్నాడని తెలిపారు. హైడ్రా అధికారులు జీహెచ్ఎంసీ స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తి నుండి స్వాధీనం చేసుకుంటే, కొందరు వ్యక్తులు మాత్రం తాము సొసైటీ స్థలాన్ని కాపాడామని ప్రకటించుకోవటంలో అర్థం లేదని వారు పేర్కొన్నారు

### సన్మానం



అద్దంకి దయాకర్‌ను సన్మానిస్తున్న మనోహర్

లిబర్టీ: శాసన మండలి సభ్యుడిగా ఎన్నికైన అద్దంకి దయాకర్‌కు మహాజన పార్టీ అధ్యక్షుడు సంగటి మనోహర్ శాలువాతో సత్కరించారు. దళిత, బహుజనులు ఎదుర్కొంటున్న సమస్యలను మండలిలో ప్రస్తావిస్తారని మనోహర్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనేక ఏళ్లుగా సామాజిక ఉద్యమాల్లో పని చేయడం కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పని చేసిన ఆయనకు మండలిలో అవకాశం వచ్చిందన్నారు. అన్ని వర్గాల ఎదుర్కొంటున్న సమస్యలపై శాసనసభలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారని దయాకర్ హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, బాబు, షేక్ అమీన్, పీరా, షేక్ హుమేర పాల్గొన్నారు.

### దళిత క్రైస్తవులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న మోజెస్

బంజారాహిల్స్: దళిత క్రైస్తవులకు వారి కులాలను బట్టి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని దళిత క్రైస్తవ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్. మోజెస్ దళిత క్రైస్తవ ఐక్యవేదిక బృందంతో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోజెస్ మాట్లాడుతూ..దళిత క్రైస్తవులు తమ కులాల ఆధారంగా గుర్తింపు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కుల ధ్రువీకరణ పత్రాల లేని కారణంగా దళిత క్రైస్తవులు విద్య, ఉద్యోగ, సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

### మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

వెంగళరావునగర్ : మహిళను వేధిస్తున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్.లత అనే మహిళ హౌస్ కీపింగ్‌గా పని చేస్తుంది. రహమత్‌నగర్‌లో ఉంటున్న వైజాగ్‌కు చెందిన రవి తరచూ ఆమెకు వేర్వేరు నంబర్లతో ఫోన్లు చేస్తూ బెదిరిస్తున్నాడు. తన చెల్లి ఇంటికి పూజకు వెళ్తే అక్కడకు వచ్చి కూడా వేధించాడు. గత ఆదివారం కత్తి తీసుకుని ఇంటికి రాగా భయపడి సోదరి ఇంటికి వెళ్లి పోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.


### ఉత్సాహంగా వీడ్కోలు సమావేశం



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని జవహర్ లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్‌స్టడీస్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్(జేఎన్ఐఏఎస్ ఎస్‌పీయూ) విద్యార్థుల వీడ్కోలు సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించారు. 2020 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులకు 2025 బ్యాచ్ విద్యార్థులు వీడ్కోలు పలికారు. అయిదేళ్ల పాటు కలిసిమెలిసి చదువుకున్న విద్యార్థులు ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ సరదాగా గడిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ డి. సురేష్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఆర్కిటెక్చర్ల పాత్ర ఎంతో ఉందని ఉత్తీర్ణులై బయటకు వెళ్తున్న విద్యార్థులు వినూత్నమైన ఆలోచనలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ హర్షద్ షిండే, హెచ్ఓడీ కె. సౌజన్య పాల్గొన్నారు.

# ముస్తాబైన వినాయక మండపాలు

- బందోబస్తుకు అదనపు బలగాలు
- ఆలయాలకు చేరుకున్న గణపయ్యలు



రోడ్డు నెం. 14లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మండపానికి చేరుకున్న గణనాథుడు

బంజారాహిల్స్: వినాయక చవితి పర్వదిన వేడుకలకు అటు మండపాల నిర్వాహకులు సర్వం సిద్ధం చేసుకోగా ప్రశాంత వాతావరణంలో నవరాత్రులు జరిగేందుకు పోలీసులు అదనపు బలగాలను మోహరించి బందోబస్తు కట్టుదిట్టం చేశారు. బుధవారం వినాయక చవితి పర్వదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఇటు గణపతి ఆలయాలతో పాటు అటు వాడవాడలా కొలువుదీరిన మండపాల్లో ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయి. వెస్ట్‌జోన్ పరిధి కిందకు వచ్చే ఎనిమిది పోలీస్ స్టేషన్ల పరిధిలో అదనపు బలగాలతో పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. మరోవైపు మండపాలను రంగురంగుల విద్యుత్ దీపాలు, పూల మాలలతో కనువిందు చేసే రీతిలో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

**1638 విగ్రహాలు**

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, ఖైరతాబాద్, సోమాజిగూడ, చింతల్‌బస్తీ, పంజగుట్ట, శ్రీనగర్ కాలనీ, ఇందిరానగర్, కృష్ణానగర్, కమలాపురి కాలనీ, యూసుఫ్‌గూడ, బోరబండ, ఎర్రగడ్డ ప్రాంతాల్లో గణేష్ మండపాలను సుందరంగా తీర్చిదిద్దగా ఇప్పటికే విగ్రహాలు ఆయా మండపాలకు చేరుకున్నాయి. ఇదిలా ఉండగా వెస్ట్‌జోన్ పరిధిలో అత్యధికంగా విగ్రహాలు మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు అవుతుండగా అత్యల్పంగా మాసబ్ ట్యాంక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొలువుదీరుతున్నాయి. ఎనిమిది పోలీస్‌స్టేషన్ల పరిధిలో కలిపి మొత్తం 1638 విగ్రహాలు కొలువుదీరబోతున్నాయి. మరోవైపు మొదటి దశలో బందోబస్తుకు వెస్ట్‌జోన్ పోలీస్ స్టేషన్లకు 278 మంది అదనపు బలగాలను కేటాయించారు. ప్రతీ మండపం వద్ద ఒక పోలీస్ విధుల్లో ఉంటారు.

| పోలీస్ స్టేషన్ | విగ్రహాలు | అదనపు పోలీస్ బలగాలు |
|---|---|---|
| బంజారాహిల్స్ | 274 | 44 |
| మాసబ్‌ట్యాంక్ | 44 | 15 |
| పంజగుట్ట | 185 | 13 |
| మధురానగర్ | 287 | 64 |
| జూబ్లీహిల్స్ | 126 | 15 |
| ఫిలింనగర్ | 215 | 32 |
| ఎస్ ఆర్‌నగర్ | 239 | 27 |
| బోరబండ | 268 | 64 |



ఇందిరానగర్‌లో ముస్తాబైన మండపం

# సాంప్రదాయ పరిరక్షణే ముఖ్యం



చర్చలో పాల్గొన్న కళాకారులు, యంగ్ ఫిక్కీ లేడీస్

బంజారాహిల్స్: మనం ధరిస్తున్న వస్త్రాలు కేవలం ఒక గుడ్డముక్క కాదని అది వారసత్వ యాత్ర అని ప్రతి అల్లికలో మన సంస్కృతి, సాంప్రదాయాల శోభ ప్రతిబింబిస్తుందని యంగ్ ఫిక్కి లేడీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు పల్లవిజైన్ అన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో కళాకారులు, పారిశ్రామికవేత్తలు, వినియోగదారులను ఒకే వేదికపై తెచ్చి భారతీయ వస్త్ర సాంప్రదాయాలు, ఎదురవుతున్న సవాళ్లు, అవకాశాలపై చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్నోకు చెందిన సొగత్ చిక్కనారి స్థాపకురాలు నవ్య సచ్దేవా, అబ్దుల్ వహాబ్, హైదర్ అలీ ఖాత్రి, భుజ్, కచ్‌కు చెందిన మూడో తరం కళాకారులుతో పాటు పలువురు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాంప్రదాయ పరిరక్షణ తమకు ముఖ్యమని కళను నమ్ముకొని జీవితాన్ని కొనసాగుతున్నామన్నారు.

# పెండింగ్ ఓటీ బకాయిల విడుదలపై హర్షం



బకాయిల సర్క్యులర్ అందుకుంటున్న దృశ్యం

పంజగుట్ట: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జలమండలి ఉద్యోగులకు ఓవర్‌టైం (ఓటీ) బకాయిలు, పరిహారం రూ. 5 కోట్లు జలమండలి యాజమాన్యం విడుదల చేసిందని ఐఎన్‌టీయూసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ట్రేడ్ యూనియన్స్ జేఏసీ అధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి తెలిపారు. ఖైరతాబాద్ లోని జలమండలి కార్యాలయంలో మంగళవారం జలమండలి డైరెక్టర్ (ఫైనాన్స్) పద్మావతికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ సమక్షంలో రూ. 5 కోట్ల సర్క్యులర్ పత్రాన్ని మొగుళ్ల రాజిరెడ్డికి అందించారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతుందని, జలమండలి ఉద్యోగుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకున్నారన్నారు. బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ.. జలమండలి ఉద్యోగులకు ప్రభుత్వం బకాయిలు చెల్లించి వినాయక చవితికి బహుమతిగా ఇచ్చిందన్నారు. మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ.. జేఏసీ పోరాటాలు, వినతిపత్రాలు ఫలితంగా యాజమాన్యం మంచి నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర రాజు, అల్లి శ్రావణ్, ఎం.డి.జహంగీర్, దేవేందర్, అక్తర్, నర్సింగ్ రావు, జయ్‌రాజ్, బి.మహేష్, సాయి చరణ్ ఉన్నారు.

# ఎన్ఆర్ఆర్‌పురం హౌజింగ్ సొసైటీని రద్దు చేయాలి



మాట్లాడుతున్న మాజీ సొసైటీ సభ్యులు

రహమత్‌నగర్: నిబంధనలకు విరుద్ధంగా వ్యవరిస్తున్న ఎన్ఆర్ఆర్‌పురం హౌజింగ్ సొసైటీని రద్దు చేయాలని మాజీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బోరబండలోని షహీద్ తుర్రేబాజ్ ఖాన్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ అధ్యక్షుడు సత్తార్, ప్రతినిధులు మల్లయ్య, ఖదీర్ సిద్దిఖీ, హనుమంతు, రమేష్ మాట్లాడారు. సొసైటీ బైలాస్‌లను ఏమాత్రం పాటించకుండా ప్రస్తుత కార్యవర్గం అక్రమాలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఇదే విషయంపై తాము సొసైటీ అధికారులకు గతంలోనే ఫిర్యాదు చేశామన్నారు. సొసైటీ సభ్యులుగా అర్హత లేని వారు కొంత మంది కార్యవర్గంలో కొనసాగుతున్నారని తక్షణమే సొసైటీ కార్యవర్గాన్ని రద్దు చేసి, అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలి



నియామకపత్రం అందుకుంటున్న అశోక్ ముదిరాజ్

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని బీసీలకు స్థానిక సంస్థలో 42 శాతం చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో మహాసభ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా పిట్టల అశోక్ ముదిరాజ్‌ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇచ్చి జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలన్నారు. మహాసభను మరింత పటిష్టం చేసి ముదిరాజ్‌లను ఐక్యం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. స్థానిక సంస్థల్లో సత్తా చాటాలని ముదిరాజ్‌లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్ ముదిరాజ్, శైలేంద్ర శివయ్య ముదిరాజ్, డాక్టర్ మద్దెల సంతోష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు పగిడాల సుధాకర్, రాస వెంకట్, నేతలు బి.రాజు, గోపిరాజు, సంపగి పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి



బస్తీల్లో పర్యటిస్తున్న శోభారాణి

రహమత్‌నగర్ : బోరబండ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను తెలగాణ రాష్ట్ర మహిళా కోఆపరేటివ్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు..తూ పనులు సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం ఆమె అన్నానగర్ బస్తీవాసుల సమస్యలపై ఆరా తీశారు. వారివ వెంట జీహెచ్ఎంసీ సర్కిల్-19 డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి, ఎఎంహెచ్ఓ శివ, ఏఈలు భరత్, రంజిత్, జలమండలి మేనేజర్ రాజేందర్ ఉన్నారు.

### ఆకట్టుకున్న నృత్యాలు



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో వినాయక చవితి నేపథ్యంగా విద్యార్థులు పలు కార్యక్రమాలు చేపట్టారు. ఆట, పాటలతో పాటు నాటికలు ప్రదర్శించారు. భక్తి గీతాలను ఆలపించారు. జేహెచ్‌పీఎస్ అధ్యక్షుడు పి. మురళీ ముకుంద్, డైరెక్టర్ ఎం. వరలక్ష్మి, ప్రిన్సిపాల్ కాంచనవల్లి పాల్గొన్నారు.



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్..



ఎస్పీఆర్‌హిల్స్‌లో మట్టి విగ్రహాలను అందజేస్తున్న మురళీగౌడ్

# మట్టి గణపతి..మహా గణపతి

మట్టి గణపతులను ప్రతిష్టించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని పలువురు వక్తలు, ప్రజాప్రతినిధులు సూచించారు. వినాయక నవరాత్రుల్లో భాగంగా మంగళవారం ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ జోన్ల బృందం



విద్యార్థులకు మట్టి గణపతులను అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు



గౌతంనగర్ చౌరస్తాలో మట్టి గణనాథులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న అభిషేక్ యాదవ్



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న నేతలు

### తాకట్టు నగలతో ఉడాయించిన వ్యాపారి

**దుకాణం ఎదుట ఆందోళన**



ఆందోళన చేస్తున్న బాధితులు

బంజారాహిల్స్: తాకట్టు పెట్టిన నగలతో పాటు తీసుకున్న అప్పుతో ఉడాయించిన నగల వ్యాపారి దుకాణం ఎదుట బాధితులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఫిలింనగర్‌లోని గౌతంనగర్ బస్తీలో మానిక్ చౌదరి అనే వ్యాపారి మానిక్ జ్యువెలర్స్ పేరుతో నగల దుకాణం తెరిచి ఆభరణాలు తాకట్టు పెట్టుకొని డబ్బులు ఇచ్చేవాడు. చాలా మంది వద్ద వడ్డీకి అప్పు కూడా తీసుకున్నాడు. ఇటీవల షట్టర్ మూసేసి నగలు, నగదుతో ఉడాయించాడు. దీంతో బాధితులు ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మానిక్ చౌదరి మీద చీటింగ్ కేసు నమోదైంది. తమకు న్యాయం చేయాలంటూ బాధితులు ఆందోళన చేపట్టారు.

### కార్యకర్తల పాత్ర కీలకం

లిబర్టీ: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తలు, నాయకులకు గుర్తింపు ఇవ్వాలని సీనియర్ నాయకులు వి.సదానంద్ విన్నవించారు. కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జి జయంతి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పి.ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించి కార్యకర్తల పనితీరును విన్నవించారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కార్యకర్తల పాత్ర కీలకమన్నారు.

### కేబుల్ తీగల తొలగింపు

బంజారాహిల్స్: విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ తీగల తొలగింపు ప్రక్రియ మంగళవారం ముమ్మరంగా కొనసాగింది. ఫిలింనగర్ సెక్షన్ ఏఈ పవిత్ర ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని విరించి ఆస్పత్రి నుంచి స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ తీగలను తొలగించారు. బంజారాహిల్స్ 24 సబ్ స్టేషన్ల పరిధిలో కేబుల్ తీగలను తొలగించారు.

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై దాడి

**ఐదుగురిపై కేసు**

బంజారాహిల్స్: మద్యంమత్తులో కొందమంది యువకులు ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి చితకబాదిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గాంధీనగర్‌కు చెందిన యశ్వంత్, సంతోష్‌రెడ్డి, అరవింద్, పవన్ తేజ, అభిషేక్ ఆదివారం రాత్రి 9 గంటలకు జూబ్లీహిల్స్‌లోని తమలా రస పబ్‌కు వెళ్లి అర్ధరాత్రి వరకు మద్యం తాగారు. రెండు కార్లలో వచ్చిన వీరు మళ్లీ హైటెక్ సిటీ సమీపంలోని నోవాటెల్‌కు వెళ్లి అక్కడా మద్యం తాగారు. సోమవారం తెల్లవారుజామున 3.30 లకు ఇంటికి వెళ్తే క్రమంలో ఏఎం టూ పీఎం హోటల్ వద్ద ఐస్‌క్రీం తినేందుకు ఆగారు. రెండు కార్లను నడిరోడ్డుపై ఆపి ఐస్‌క్రీం కోసం దిగుతుండగా అదే సమయంలో ఉద్యోగం ముగించుకొని బైక్‌పై వస్తున్న వారాసిగూడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఎండీ. ఫిరోజ్ రోడ్డుకు అడ్డంగా ఉన్న కార్లను తీయాలని కారాడు. మద్యంమత్తులో ఉన్న ఐదుగురు ఫిరోజ్‌పై పిడిగుద్దులతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేసి కార్లను సీజ్ చేశారు.

### ఎల్ఐసీ పేరుతో రూ.44 వేలు స్వాహా

వెంగళరావునగర్ : ఎల్ఐసీ పేరుతో ఆన్‌లైన్‌లో నగదు కాజేసిన ఘటన మధురానగర పీఎస్ పరిధిలో జరిగింది. ఎల్లారెడ్డిగూడలో నివసించే షేక్ మహ్మద్ అయాజ్‌కు ఈ నెల 2న ఫోన్ కాల్ వచ్చింది. రూ.44 వేల ప్రీమియం బకాయి ఉందని, తాము ఇచ్చే క్యూఆర్ కోడ్‌కు పంపాలని తెలపడంతో అయాజ్ రూ.44 వేలు పంపాడు. ఆ తర్వాత ఎల్ఐసీ ఆఫీసుకు వెళ్లి అడగ్గా తమ వద్ద నుంచి ఎవరూ ఫోన చేయలేదని తెలపడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సాక్షి
బుధవారం ౹ 27 ౹ ఆగస్టు ౹ 2025

## సీఎం ప్రజావాణికి 282 దరఖాస్తులు



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి

**లక్డీకాపూల్:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 282 దరఖాస్తులు అందాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ 107, రెవెన్యూ శాఖ 48, విద్యుత్ శాఖ 17, ఇందిరమ్మ ఇండ్లు 58, ప్రవాసి ప్రజావాణికి 01 చొప్పున అర్జీలు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 51 దరఖాస్తులు అందినట్లు సీఎం ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారని పేర్కొన్నారు. వారి సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారన్నారు.

## సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యోగ జేఏసీ నేతలు

**లక్డీకాపూల్:** సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించ తలపెట్టిన పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగ జేఏసీ హైదరాబాద్ నగర శాఖ చైర్మన్ కె.శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం టీఎన్జీవో నగర కార్యదర్శి పంతులు హరికృష్ణ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ డైరెక్టరేట్‌లో ఆయన గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని లలితా కళాతోరణం జరిగే నిరసన సభకు నల్ల రంగు వస్త్రాలు ధరించి పాల్గొన్నాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ నగర శాఖ కన్వీనర్ గండూరి వెంకట్, జిల్లా చైర్మన్ విక్రమ్, కన్వీనర్ ఎం.బి. కృష్ణ యాదవ్, టీజీఓ జిల్లా కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, నగర శాఖ కార్యదర్శి నిరంజన్ రెడ్డి, టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకటేశ్వర్లు, నేతలు అమరేందర్, రాజు, వేణుమాధవ్, నరసింహ చారి, నందిని, కవిత, బెరిల్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బిల్లులకు కేంద్రమే అడ్డంకి

– బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

**హిమాయత్‌నగర్:** బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం పెంచకుండా కేంద్ర ప్రభుత్వమే అడ్డుకుంటోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాజుల మాట్లాడారు. బీసీ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించి ఐదు నెలలు గడిచినప్పటికీ నేటి వరకు ఆమోదించలేదని ధ్వజమెత్తారు. బీసీ రిజర్వేషన్ల పెంపు ఉద్యమంపై భవిష్యత్ కార్యాచరణ ప్రకటించడానికి ఈ నెల 28న హైదరాబాద్‌లో బీసీ సంఘాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. రాజ్యాంగ బద్ధమైన రాష్ట్రపతి, గవర్నర్‌లను స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేక వైఖరితో అడ్డుకుంటుందని ఆరోపించారు. బీసీ బిల్లులను ఆమోదించకపోతే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమికి బీసీలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో సంఘ రాష్ట్ర నాయకులు కులకచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యాం కురుమ, ఉప్పరి శేఖర్ సగర, మహేష్ యాదవ్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, గూడూరు భాస్కర్ మేరు, అనిల్, జాజుల భాస్కర్ గౌడ్, మధు పాల్గొన్నారు.

## నగరంలో నేడు

- ఖైరతాబాద్‌లోని గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన బడా గణేశుని దర్శనం ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ ఉంటుంది.
- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసాబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట ఏర్పాటు చేసిన ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉ. 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

బిగ్ స్టోరీ

# బాటిల్ నెక్.. ఫ్లై'ఓవర్ లుక్'!

## రాజధానిలో రోడ్ల విస్తీర్ణం అరకొరే..

- కనిష్టం కంటే మూడు శాతం తక్కువ
- పెంచే అవకాశమున్నా పట్టని అధికారులు

ప్రమాణాలకు అనుగుణంలేని రహదారులు.. ప్రయాణాలు సవ్యంగా లేక ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు.. పలుచోట్ల బాటిల్ నెక్.. అక్కడ ట్రాఫిక్ పీక్.. అధికారుల ఫ్లై'ఓవర్ లుక్'.. రహదారుల విస్తీర్ణం తక్కువ.. వాహనాల సంఖ్య ఎక్కువ.. కరెంటు స్తంభాల రాస్తారోకో.. ట్రాఫిక్ విభాగం, జీహెచ్ఎంసీ మధ్య కొరవడిన సమన్వయం.. వెరసి హైదరాబాద్ నగరంలో ఎక్కడ చూసినా ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యంగా మారింది. అవకాశమున్నా అవసరమైన మేర రహదారులు విస్తరించకపోవడం వాహనదారులకు శాపంగా మారిన వైనంపై 'సాక్షి' ప్రత్యేక కథనమిది..

– సాక్షి, సిటీబ్యూరో



'పెత్తనం ఒకరి చేతిలో... బెత్తం మరొకరి చేతిలో...' రాజధానిలోని ట్రాఫిక్‌కు ఈ సామెత సరిగ్గా సరిపోతుంది. రోడ్లపై ఉండి స్థితిగతులను పర్యవేక్షించేది ట్రాఫిక్ పోలీసులైతే... వాహన శ్రేణులు సవ్యంగా సాగడానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించే బాధ్యత మాత్రం జీహెచ్ఎంసీది. ఈ రెండింటి మధ్య సమన్వయలేమి కారణంగా ట్రాఫిక్ సమస్యలు తీరడం మిథ్యగా మారిపోయింది. నగరంలోని రోడ్ల విస్తీర్ణం, కనిష్ఠం కంటే తక్కువగా ఉన్న వైనం. పెంచే అవకాశం ఉన్నా పట్టించుకోని యంత్రాంగం వెరసి నగరవాసికి మాత్రం నిత్యం నరకమే కనిపిస్తోంది.

### కనిష్ట స్థాయిలోనూ లేని రోడ్లు...

అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం నగర విస్తీర్ణంలో కనిష్ఠంగా 12 శాతం రహదారులు ఉండాలి. హైదరాబాద్ పురాతన నగరం కావడంతోపాటు అనేక కారణాల వల్ల ఇక్కడ కేవలం 9 శాతం రోడ్లు ఉన్నాయి. ఫలితంగా ఎక్కడ చూసినా, ఎప్పుడు చూసినా ట్రాఫిక్ జామ్‌లే. అడ్డంకులు తొలగిస్తే ఈ విస్తీర్ణాన్ని 15.5 శాతానికి పెంచుకునే అవకాశం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అంటే.. కనిష్ఠం కంటే 3.5 శాతం ఎక్కువన్నమాట. అయితే దీనికి సంబంధించి ట్రాఫిక్ పోలీసులు ఏళ్లుగా పంపిస్తున్న ప్రతిపాదనల్లో సగం వాటిని కూడా జీహెచ్ఎంసీ సహా అనే శాఖలు అమలు చేయకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి.

| నగరంలో వాహనాల సంఖ్య పెరిగిందిలా... | |
|---|---|
| ఏడాది | వాహనాల సంఖ్య |
| 2001 | 10.91 లక్షలు |
| 2005 | 15.27 లక్షలు |
| 2007 | 18.47 లక్షలు |
| 2009 | 20.5 లక్షలు |
| 2011 | 24.5 లక్షలు |
| 2021 | 77 లక్షలు |
| 2024 | 80.43 లక్షలు |

### 60 లక్షల వాహనాలు... 40 ఫ్లైఓవర్లు..

ముంబై మహానగరంలో ఉన్న వాహనాల సంఖ్య 52 లక్షలైనా అక్కడున్న ఫ్లైఓవర్ల సంఖ్య మాత్రం 55. హైదరాబాద్‌లో వాహనాల సంఖ్య 60 లక్షలకు చేరుతున్నా ఫ్లైఓవర్లు 40 మాత్రమే ఉన్నాయి. మరో పురాతన నగరమైన కోల్‌కతా సైతం గతంలో అస్తవ్యస్త ట్రాఫిక్‌తో ఎన్నో ఇబ్బందులు పడేది. అక్కడి రోడ్ల విస్తీర్ణం కేవలం ఆరు శాతం ఉండటమే అందుకు కారణం. ఆ తర్వాత అక్కడ ఫ్లైఓవర్లను అవసరమైన స్థాయిలో నిర్మించడం ద్వారా రోడ్ల విస్తీర్ణం 12 శాతానికి పెరిగింది. నగర ట్రాఫిక్ విభాగం అధికారులు 2007లో సర్వే నిర్వహించి జీహెచ్ఎంసీకి నివేదిక పంపారు. దీని ప్రకారం నగరంలోని 30 ప్రాంతాల్లో 17.83 కిలోమీటర్ల మేర ఫ్లైఓవర్లు నిర్మిస్తే రోడ్ల విస్తీర్ణాన్ని పెంచవచ్చని తేల్చారు. ఈ ఫ్లైఓవర్లు జంక్షన్స్ జామ్ కాకుండా కూడా ఉపకరిస్తాయని నివేదించారు. అయితే ఇప్పటికీ వీటిలో కనీసం సగం ప్రతిపాదనలు కూడా అమలుకాలేదు.

### బాటిల్ నెక్.. ట్రా'ఫికర్'కు ఏదీ చెక్..

నగరంలోని అనేక ప్రాంతాల్లో ఉన్న నేచురల్ బాటిల్ నెక్స్‌తో ఇబ్బందులు అనేకం. భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో ఏర్పడిన వీటి వల్లా ఎన్నో ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. రాణిగంజ్‌లోని సయిదానిమ సమాధి సమీపంలో, ఎస్సార్ నగర్–ఈఎస్ఐ, చాదర్‌ఘాట్–మలక్‌పేట్ మార్గాల్లో ఇలాంటివి అనేకం ఉన్నాయి. నగర వ్యాప్తంగా ఇలాంటి బాటిల్‌నెక్స్ సంఖ్య 26 ఉండగా... చాలా తక్కువ మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి. ట్రాఫిక్ విభాగం అధికారులు, జీహెచ్ఎంసీ కలిసి పనిచేయడంతో శ్యామ్‌లాల్ నాలా సహా అనేక సమస్యలు పరిష్కారమయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లోనూ ఇలాంటి ఫలితాలు రావాలంటే ప్రభుత్వ విభాగాలు సమష్టిగా ముందుకు వెళ్లాలి. నేచురల్ బాటిల్‌నెక్ సమస్యలను పరిష్కరించడం ద్వారా అదనంగా 2 శాతం రోడ్లను విస్తరించవచ్చు.



### సమన్వయం లేక కరెంట్ 'షాక్'...

రాజధానిలోని అనేక ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ పూర్తయినా ఫలితం లేకుండా పోయింది. ఆయా చోట్ల రోడ్ల విస్తీర్ణం పూర్తి అయినా ఒకప్పుడు రోడ్డు పక్కన ఉండి, విస్తర్ణం కారణంగా రోడ్లపైకి వచ్చిన కరెంట్ స్తంభాలతో ఈ పరిస్థితి తలెత్తింది. కొత్తగా రోడ్లు వేసిన చోట, పాత రహదారుల్లోనూ అనేక చోట్ల ఈ సమస్య ఉంది. విద్యుత్, జీహెచ్ఎంసీ విభాగాలు సమన్వయంతో పని చేయకపోవడమే దీనికి కారణం. వీటితోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు అడ్డదిడ్డంగా ఉండటంతో దాదాపు 50 మార్గాలు కుంచించుకుపోయాయి. జీహెచ్ఎంసీతోపాటు ఆయా విభాగాలు స్పందిస్తే మరికొంత రోడ్డును అదనంగా విస్తరించుకోవచ్చు.

### 'అవసరమైనప్పుడే'స్పందన...

ఇలాంటి సమస్యలపై జీహెచ్ఎంసీసహా ఇతర విభాగాలు ప్రజల ఇబ్బందులు తీర్చడం కంటే 'అవసరమైనప్పుడు' మాత్రమే అప్రమత్తమై ఎక్కువగా స్పందిస్తాయి. 2012లో జరిగిన ఇంటర్నేషనల్ బయో డైవర్సిటీ కాన్ఫరెన్స్, 2017లో ఇవాంక ట్రంప్ టూర్, ఇటీవల జరిగిన మిస్ వరల్డ్ పోటీలు వంటి సందర్భాల్లో మాత్రం హడావుడి చేశాయి. అతిథులకు ఇక్కడి రోడ్లకు లేని 'అందాలను' చూపాలని ప్రయత్నిస్తుంటాయి. డెలిగేట్స్ బస చేసే హోటళ్లు, కార్యక్రమాలు జరిగే ప్రాంతాల మధ్య ఉన్న రోడ్లను కూడా అభివృద్ధి చేసేస్తాయి. దీనికోసం బాటిల్‌నెక్స్, ఇతర అడ్డంకులను తొలగించేస్తాయి. అవసరమైతే మ్యాన్‌హోల్స్ సమాచారం సైతం సేకరించి అభివృద్ధి చేసేస్తాయి. దేశ, విదేశాల అతిథుల కోసం చూపించిన 'ప్రేమ'ను కొనసాగిస్తూ తమకు ఈ చిక్కుల నుంచి విముక్తి ప్రసాదించాల్సిన అవసరాన్ని అధికారులు గుర్తించాలని నగరవాసులు, వాహనదారులు కోరుతున్నారు.

| ఇతర నగరాలతో పోలిస్తే... | | |
|---|---|---|
| నగరం | వాహనాల సంఖ్య | రోడ్ల విస్తీర్ణం |
| చెన్నై | 35 లక్షలు | 18 శాతం |
| ముంబై | 55 లక్షలు | 10 శాతం |
| బెంగళూరు | 1.23 కోట్లు | 14 శాతం |
| ఢిల్లీ | 79.5 లక్షలు | 12 శాతం |
| హైదరాబాద్ | 80.43 లక్షలు | 09 శాతం |

| 2007 నుంచి ప్రతిపాదనల్లోనే ఉన్న ఫ్లైఓవర్లు... | | |
|---|---|---|
| చౌరస్తా | ఎక్కడ నుంచి ఎక్కడికి | పొడవు |
| లక్డీకాపూల్ | లక్డీకా పూల్– మహావీర్ ఆసుపత్రి | 1600 మీటర్లు |
| ఎంజే మార్కెట్ | ప్రతిభాభవన్– పూల్‌బాగ్ | 800 మీటర్లు |
| ఎంజే మార్కెట్ | యూసుఫ్ అండ్ కో– విక్రాంత్ థియేటర్ | 300 మీటర్లు |
| ఎస్సార్‌నగర్ | భాష్యం స్కూల్–ఐఐహెచ్ఎఫ్ | 900 మీటర్లు |
| మైత్రివనం | స్వర్ణజయంతి కాంప్లెక్స్– చర్మాస్ | 1500 మీటర్లు |
| వీవీ స్టాచ్యూ | వీవీ స్టాచ్యూ–విద్యుత్ సౌధ/రాజ్‌భవన్ రోడ్ | 300 మీటర్లు |
| మెట్టుగూడ | గాయత్రి ప్లాజా–రైల్వే ఆఫీసర్స్ క్లబ్ | 1000 మీటర్లు |
| ప్యాట్నీ | అలెగ్జాండర్ రోడ్–మెహబూబ్ కాలేజ్ | 350 మీటర్లు |
| లిబర్టీ | అంబేద్కర్ స్టాచ్యూ–ఓల్డ్ 'గాంధీ'కాలేజ్ | 400 మీటర్లు |
| బోయిన్‌పల్లి | సెవెన్ టెంపుల్స్–కంటోన్మెంట్ గ్రౌండ్ | 500 మీటర్లు |
| తిరుమలగిరి | ఆర్టీఏ ఆఫీస్–ఫుట్‌బాల్ గ్రౌండ్స్ | 500 మీటర్లు |
| రసూల్‌పుర | వెస్లీ కాలేజ్ బస్టాప్–బేగంపేట్ పీఎస్ | 600 మీటర్లు |
| రోడ్ నెం.1/12 జంక్షన్ | బంజారా ఫంక్షన్ హాల్–తాజ్ బంజారా | 600 మీటర్లు |
| కార్ఖానా | ఎస్‌బీహెచ్–అపోలో ఆసుపత్రి | 600 మీటర్లు |
| జూబ్లీ చెక్‌పోస్ట్ | ఆప్ ల్యాబ్స్–ఐసీఐసీఐ బ్యాంక్ | 510 మీటర్లు |
| నల్లకుంట | మూసీ బ్రిడ్జ్–తిలక్‌నగర్ బ్రిడ్జ్ | 300 మీటర్లు |
| ఫీవర్ హాస్పిటల్ | మూసీ బ్రిడ్జ్–నల్లకుంట మార్కెట్ | 370 మీటర్లు |
| హిమ్మత్‌పుర | శాలిబండ–బడ్జాజాద్ | 600 మీటర్లు |
| దిల్‌సుఖ్‌నగర్ | మూసరాంబాగ్–చైతన్యపురి | 2000 మీటర్లు |

– మెట్రో నిర్మాణాల కారణంగా వీటిలో కొన్నింటి నిర్మాణం ఇప్పుడు కష్టసాధ్యం

## దూరవిద్యలో డిజిటల్ ఆవిష్కరణలు



కార్యక్రమంలో యశ్వంతరావు చవాన్ వర్సిటీ వీసీ సంజీవ్ సోనావాణే, చక్రపాణి తదితరులు

- యశ్వంతరావు చవాన్ వర్సిటీ వీసీ ప్రొ.సంజీవ్ సోనావాణే
- ఘనంగా అంబేద్కర్ వర్సిటీ 44వ వ్యవస్థాపక దినోత్సవం

**బంజారాహిల్స్:** రోజురోజుకూ మారుతున్న ఆధునిక సవాళ్లను అధిగమిస్తూ సరికొత్త డిజిటల్ ఆవిష్కరణలతో దూరవిద్యా విధానం పురోగమిస్తోందని యశ్వంతరావు చవాన్ మహారాష్ట్ర ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సంజీవ్ సోనావాణే అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ 44వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఇక్కడ నిర్వహించిన ఉత్సవాలకు సంజీవ్ సోనావాణే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ''సార్వత్రిక దూరవిద్యలో కృత్రిమ మేథ ఆధారిత పరివర్తన''అనే అంశంపై ఆయన ప్రసంగించారు. దేశంలో సార్వత్రిక దూరవిద్య విధానం ఒక కొత్త యుగంలోకి ప్రవేశించిందని, దీనిలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆవశ్యకతను సంతరించుకుందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, వాటిని అధ్యాపకులు నిరంతర అభ్యసనతోనే ఎదుర్కోవాలని, ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలని సూచించారు. నూతన అధ్యయనాలు, ఆవిష్కరణలు ఫలితాలను మెరుగుపరుస్తాయని వెల్లడించారు. డిజిటల్ మౌలిక సదుపాయాలలేమి, సుశిక్షితులైన బోధకుల కొరత వంటి సవాళ్లను ప్రభుత్వ విద్యాసంస్థలు అధిగామించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి దూరవిద్యను అందించడమే అంబేద్కర్ వర్సిటీ లక్ష్యమని చెప్పారు. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల పేరిట కుట్ర చేస్తూ సామాన్యులకు సార్వత్రిక దూరవిద్యను దూరం చేస్తున్నారని అన్నారు.

**లైబ్రరీకి చక్రపాణి పుస్తకాల బహూకరణ**

ఇటీవల అకాడమిక్ ఇన్‌సైట్స్ సంస్థ ప్రకటించిన దేశంలోని 10 బిజినెస్ స్కూల్స్‌లో అంబేద్కర్ వర్సిటీ ఎం.బి.ఎ. (హాస్పిటల్ – హెల్త్ కేర్ మేనేజ్మెంట్) గుర్తింపు సర్టిఫికెట్‌ను ఆ విభాగ డీన్ ప్రొ.ఆనంద్ పవార్, విభాగ అధిపతి ప్రొ.రబీంద్రనాథ్ సోలమన్‌కు అందించారు. ఘంటా చక్రపాణి సొంతంగా సేకరించుకున్న 1,100 పుస్తకాలను యూనివర్సిటీ లైబ్రరీకి అందించారు. కార్యక్రమంలో వర్సిటీ అకాడమిక్ డైరెక్టర్ ప్రొ. పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ ఎల్. విజయ కష్ణారెడ్డి, డా.బుద్దా చంద్రశేఖర్, టి.సుష్మనా రావు పాల్గొన్నారు. యూనివర్సిటీకి సరికొత్త లోగో రూపొందించిన ప్రఖ్యాత ఆర్టిస్ట్ ఏలె లక్ష్మణ్, మరో ఆర్టిస్ట్ డా. గోనె లింగ రాజు లను ఘనంగా సత్కరించి క్యాష్ ప్రైజ్ అందించారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ

– రక్షణ చట్టం రూపొందించాలని డిమాండ్

**సిటీ కోర్టులు:** న్యాయవాదులకు వెంటనే రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నగరంలోని ఆయా కోర్టుల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు శ్రీకాంత్‌పై జరిగిన దాడికి నిరసనకు మంగళవారం అన్ని కోర్టుల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఓ సివిల్ కేసులో మంజూరైన కోర్టు ఉత్తర్వులను చూపించేందుకు వెళ్లిన శ్రీకాంత్‌పై సోమవారం కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నాంపల్లి, సిటీ సివిల్ కోర్టు, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, మేడ్చల్ కోర్టుల బార్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో న్యాయవాదులు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేశారు. నాంపల్లి బార్ అసోసియేషన్ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ఇప్పటికే పలు దాడుల్లో చాలా మంది న్యాయవాదులు ప్రాణాలు కోల్పోయారని, పలువురు తీవ్రంగా గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా చోద్యం చూస్తోందని విమర్శించారు. న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేసి ప్రాణాలు కాపాడాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా అతీగతీలేదని వాపోయారు. న్యాయవాదుల భద్రత కోసం రాజ్యాంగబద్ధంగా పోరాటం చేస్తామని పేర్కొన్నారు.



కోర్టులో విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

## వీసీ కక్ష సాధింపులపై టాసా నిరసన

– లంచ్ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన

**ఏజీవర్సిటీ:** ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉద్యోగులపై ఉప కులపతి, రిజిస్ట్రార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మంగళవారం తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా) నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా టాసా నాయకులు మాట్లాడుతూ కొన్ని నెలలుగా విశ్వవిద్యాలయం యాజమాన్యం టీచింగ్ ఉద్యోగులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోందని, ఇష్టం వచ్చినవారికి పదోన్నతులు కల్పిస్తోందని ఆరోపించారు. ప్రశ్నించినవారిని బదిలీ చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో చాలా మందికి అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 65 ఏళ్లకు పెంచారని, ఇక్కడ మాత్రం దానిని అమలు చేయడం లేదన్నారు. సమస్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకపోయినా వీసీ, రిజిస్ట్రార్‌లలో మార్పు రావడం లేదని మండిపడ్డారు. ఈ నెల 20న వీసీకి వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన 13 మందికి మెమోలు జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కులను కాలరాస్తున్న విశ్వవిద్యాలయం యాజమాన్యం నిరంకుశ వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికైనా యూనివర్సిటీ యాజమాన్యం ఉద్యోగుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని, లేనిపక్షంలో తదుపరి కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న టాసా నాయకులు

## నాలాలు ఆక్రమిస్తే నివాసాలకు జలగండం

– హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక



శ్రీకృష్ణానగర్‌లో పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇతర అధికారులు

**వెంగళరావునగర్:** నగరంలోని నాలాలు, చెరువులను ఆక్రమించి నివాసాలు ఏర్పాటు చేసుకుంటే వర్షాలప్పుడు వరదనీటిలో మునిగి పోవాల్సి వస్తుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. ఇందులో భాగంగా వరద కాల్వ పొంగి పొర్లి రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిని పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి నీరు చేరుతుండటంతో స్థానికులు ఆయనకు తమ గోడు వెల్లబోసుకున్నారు. గత కొన్నేళ్ళుగా వరదనీటి కాల్వలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. అక్రమనిర్మాణాల కారణంగా నీటిలో ఉన్న సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించడం సాధ్యం కావడం లేదని, వానలు కురిసినప్పుడు మ్యాన్‌హోల్స్ గుండా పైకిఉబికి వస్తోందని చెప్పారు. వరదనీరు ఎక్కువై ఇళ్లల్లో సైతం చేరి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కొన్నిచోట్ల నానిన గోడలు కూలిపోతున్నాయని అన్నారు. శ్రీకృష్ణానగర్‌లో పది రోజులపాటు పర్యటించి వరదనీటి కాల్వలోని సిల్ట్‌ను తొలగించడానికి చర్యలు చేపడతామని రంగనాథ్ చెప్పారు. కమిషనర్, మంత్రులను తీసుకువచ్చి సమస్యను తెలియజేసి శాశ్వత పరిష్కారం చూపుతామని హామీనిచ్చారు. కార్యక్రమంలో హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, డీఎఫ్ఓ యజ్ఞ నారాయణ, కాంగ్రెస్ సీనియర్ నేతలు లక్ష్మీరెడ్డి, రాధిక, ఈఎల్ రామయ్య, బాబా మున్నా, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## పుదుచ్చేరి ప్రపంచ చరిత్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా చెన్నారెడ్డి

**నాంపల్లి:** పుదుచ్చేరి ప్రపంచ చరిత్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ అధ్యాపకుడు, శ్రీశైల ప్రాంగణం మాజీ పీఠాధిపతి ఆచార్య పెదారపు చెన్నారెడ్డి ఎన్నికయ్యారు. ఈ నెల 22 నుంచి 25 వరకు శ్రీలంకలోని పెరదేనియా విశ్వవిద్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశాల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన గతంలో పుదుచ్చేరి ప్రపంచ చరిత్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ సంచాలకుడిగా సేవలందించారు. చరిత్ర, సంస్కృతిపై ఆయన ఎన్నో పరిశోధనలు చేశారు. చెన్నారెడ్డిని పెరదేనియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ ప్రభాత్ ఏకనాయకే, కాంగ్రెస్ స్థానిక కార్యదర్శి ప్రొఫెసర్ రోహిత దాసనాయక ఘనంగా సత్కరించారు. సదస్సులో చెన్నారెడ్డిపై వెలువడిన అభినందన సంపుటాలు కళ్యాణ మిత్రః ఎ ట్రెజర్ హౌస్ ఆఫ్ హిస్టరీ, కల్చర్ అండ్ ఆర్కియాలజికల్ స్టడీస్ వాల్యూమ్–11, సమకాలీన చరిత్ర, దయాస్పోరా వాల్యూమ్–12, టూరిజం వాల్యూమ్–9, ట్రేడ్, కామర్స్ అండ్ ఎకానమీ సంపుటాలను ఆవిష్కరించారు. పుదుచ్చేరి ప్రపంచ చరిత్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని చెన్నారెడ్డి పేర్కొన్నారు. చరిత్ర, సంస్కృతిపై తన పరిశోధనకు ఫలితం దక్కిందన్నారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నికయ్యేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.



ఆచార్య చెన్నారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ప్రభాత ఏకనాయకే, రోహిత దాసనాయక

## ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయాలని ధర్నా

**సుల్తాన్‌బజార్:** ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు వెంటనే భర్తీ చేయాలని అభ్యర్థులు మంగళవారం కోఠిలోని మెడికల్ హెల్త్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ కార్యదర్శి కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. వానను సైతం లెక్కచేయకుండా వివిధ జిల్లాల నుంచి ల్యాబ్ టెక్నీషియన్లు తరలివచ్చి ధర్నా చేశారు. ధర్నాకు సీఐటీయూ యూనియన్ రాష్ట్ర నాయకుడు భూపాల్ సంఘీభావం తెలిపారు. విషయం తెలుసుకుని సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ నరసింహ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని భూపాల్‌ను బలవంతంగా పెట్రోలింగ్ వ్యాన్‌లోకి ఎక్కించారు. అభ్యర్థులు వ్యాన్‌ను అడ్డుకోవడంతో పోలీసులు వెనక్కి తగ్గి భూపాల్‌ను విడిచిపెట్టారు. బోర్డు కార్యదర్శి గోపికాంత్‌రెడ్డి కిందికి వచ్చి ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీపై ప్రకటన చేశారు. సెప్టెంబర్ రెండో తేదీన ఫైనల్ లిస్టు విడుదల చేస్తామని వెల్లడించారు. సెప్టెంబర్ 8 నుంచి 12 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసి, ఆ తర్వాత వారం, పది రోజుల్లో ఫైనల్ సెలక్షన్ లిస్ట్ విడుదల చేస్తామని చెప్పారు. దీంతో అభ్యర్థులు ధర్నా విరమించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం 2024 సెప్టెంబర్ 11వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసిందని, జూన్ 6న ప్రొవిజినల్ లిస్టు విడుదల చేసినా, నేటికీ ఫైనల్ లిస్టు ప్రకటించలేదని అన్నారు. పంచాయతీ ఎన్నికలకు ముందే మెరిట్ లిస్ట్ విడుదల చేసి పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు.

సాక్షి
13
హైదరాబాద్ । బుధవారం ।
27 । ఆగస్టు । 2025

# సిటీ ప్లస్



నగరంలో కొత్త ఆచారం తెరతీసింది.. వినాయకుని ఉత్సవానికి ముందే ఊరేగింపు కార్యక్రమం మొదలైంది.. విగ్రహాల తరలింపు నవరాత్రి ముగింపు సందర్భంగా నిర్వహించే ఉత్సవాన్ని తలపించింది.. డబ్బువాయిద్యాలు, కళాకారుల విన్యాసాల నడుమ విఘ్నేశ్వరుని ప్రతిమలు మండపాలకు తరలివెళ్లాయి.. దీనినే నగరంలో ఆగమన్..ఉత్సవంగా చెబుతున్నారు. విఘ్నాధిపతి నిర్విఘ్నంగా ఆగమనం పూర్తి చేసుకున్నాడు. నగరవ్యాప్తంగా గణేశ ఉత్సవాల సందర్భంగా వందలాది ప్రతిమలకు మండపాలు ఎదురేగి స్వాగతం పలికాయి. పండుగకి వారం రోజుల ముందే మొదలై బుధవారం తెల్లవారుజాము వరకూ కొనసాగుతూనే ఉన్నాయి. మొత్తానికి ఆగమన సంబరాలు అంబరాన్నంటాయి. దీని కోసం కూడా లక్షల్లో వ్యయం చేస్తున్నారు నిర్వాహకులు.

- సాక్షి, సిటీబ్యూరో / చార్మినార్



ఓల్డ్ సిటీలో మంగళవారం రాత్రి జరిగిన ఆగమన్ కార్యక్రమం

# ఆగమన్.. అదిరెన్..

అంగరంగ వైభవంగా వినాయకుని తరలింపు

- అట్టహాసంగా నవరాత్రి వేడుకలు ప్రారంభం
- డప్పువాయిద్యాలు, కళాకారుల విన్యాసాలు
- ముందు రోజే తరలిన విఘ్నేశుని ప్రతిమలు
- కన్నులపండువగా విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవం
- మండపాల వద్ద గణనాథుని గణాల సందడి

సంగీతం, ఢోల్– నృత్యాలతో ఊరేగింపుగా గణపతి మూర్తులను మండపాలకు, ఇంటింటికీ తీసుకొచ్చే శుభ తరుణాన్ని ఆగమన్ సూచిస్తుంది. ఇళ్ల, వీధులలో ఏర్పాటు చేసిన మండపాలు గణేశుడిని వైభవంగా స్వాగతించేందుకు ముందే అలంకరించి సిద్ధం చేస్తారు. ఈ సంప్రదాయం తొలుత ముంబైలో ఆవిర్భవించగా, గతంలో కన్నా మిన్నగా ఈ సంవత్సరం నగరంలోని చాలా మండపాలు గణేశ ఆగమన్‌ను సందడిగా అనుసరించాయి. హౌసింగ్ సొసైటీలు, గేటెడ్ కమ్యూనిటీలు ఈ ఆగమన్ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు పోటీపడ్డాయి. డ్రోన్ షాట్‌లు, బాణాసంచా కూడా విరివిగా ఉపయోగించారు.



### సోషల్ సందడి..

బప్పా ఆగయా లాంటి వివిధ రకాల ట్యాగ్ లైన్స్‌తో సోషల్ మీడియాలో సాగిన ఆగమన్ సందడి అంబరాన్ని అంటింది. ఈ తరహా సందడి సాంస్కృతిక మార్పుకు దారితీసింది. ఇకపై వినాయక పండుగ ఊరేగింపు విగ్రహ నిమజ్జనానికి మాత్రమే పరిమితం కాదని ఈ ఏడాది అంగరంగ వైభవంగా సాగిన ఆగమన క్రతువు ద్వారా నిరూపితమైంది. నిమజ్జన్ పేరిట వీడ్కోలు పలికినట్టే అంతే స్థాయిలో ఆగమన్ జరుపుకోవడం సంప్రదాయంగా మారుతోంది. ఇన్‌స్టా, ఫేస్‌బుక్, ఎక్స్(ట్విట్టర్), యూట్యూబ్ రీల్స్‌లో ట్రెండింగ్ పాటలు, గణపతి వీడియోల ద్వారా గణపతిని స్వాగతించడం మరింత స్ఫూర్తిని అందించింది.



## గల్లీ గల్లీలో గణేశ్ ఆగమన్

గణేశ్ ఉత్సవాల్లో భాగంగా గల్లీ గల్లీలో గణేశ్ ఆగమన్ జరుగుతోంది. అంతెందుకు ఖైరతాబాద్ మహా గణేశ్ ఆగమనం కార్యక్రమాన్ని కూడా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందుకోసం ఖర్చుకు వెనుకాడకుండా కళా ప్రదర్శనలతో, అడుగడుగునా హారతులతో స్వాగతం పలికిన తీరు ఆకట్టుకుంది. ఔత్సాహిక యువత గుంపులు గుంపులుగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆయా మండపాలకు తరలించి ప్రతిమలకు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పూజలు నిర్వహించారు.

### అంబరాన్నంటేలా..

ఈ నయా ట్రెండ్ కారణంగా ఫైర్ వర్క్స్, బ్యాండ్, ఎల్ఈడీ స్క్రీన్స్, డీజే బాక్సులకు, కళాకారులకు.. ఇలా పలు రంగాలకు చెందిన వారికి డిమాండ్ ఏర్పడింది. గతేడాది నగరంలో అక్కడక్కడ మాత్రమే నిర్వహించిన ఆగమన్.. ఈసారి గ్రేటర్ అంతటా విస్తరించింది. కొంత మంది యువకులు మరో అడుగు ముందుకేసి వీజే (వీడియో జాకీ) ఎఫెక్ట్స్ వినియోగిస్తున్నారు. మరికొంత మంది రిమోట్ క్రాకర్స్, మైన్స్, కోల్డ్ ఫైర్, స్మాష్ ఫోల్డింగ్‌లను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు.

### ఓల్డ్ సిటీ కా రాజా..

పాత బస్తీలో 'ఓల్డ్ సిటీ కా రాజా' పేరుతో సోమవారం తెల్లవారు జాము వరకూ నిర్వహించిన గణేశ్ ఆగమన్ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. లాల్‌దర్వాజ మోడ్‌లో రాత్రంతా సందడి నెలకొన్నది. యువకులు రెట్టించిన ఉత్సాహంతో జై బోలో గణేశ్ మహరాజ్ కీ.. జై అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. శశాంక్ తివారి ఆధ్వర్యంలో యువకులు దారిపొడవునా నృత్యాలు చేస్తూ లాల్ దర్వాజ మోడ్‌లోని దమయంతి టవర్స్ వరకూ ఊరేగింపు నిర్వహించారు.

### గతేడాది నుంచి ఆగమన్..



నేను గతేడాది నుంచి ఆగమన్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నాను. పాతబస్తీలోని లాల్‌దర్వాజ మోడ్‌లో ఓల్డ్ సిటీ కా రాజా.. పేరుతో ఈ ఆగమన్ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించాం. ఐదేళ్ల క్రితం ముంబైలో చూశాను. బాగా నచ్చింది.. స్నేహితులతో కలిసి చేయాలనుకున్నాం..వాస్తవానికి నిమజ్జనోత్సవాల సందర్భంగా చేసే వాళ్లం. ఇప్పుడు ముందే చేస్తున్నాం.

- శశాంక్, లాల్‌దర్వాజ


### ఆధ్యాత్మిక వాతావరణంలో..



నేటి యువతరం సినిమాలు, షికార్లు అంటూ ఏడాది పొడవునా తిరిగినా.. వినాయక ఉత్సవాల్లో మాత్రం ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరం. మన సంస్కృతి, సంప్రదాయలకు అనుగుణంగా యువకులు ఉత్సవాలను నిర్వహించడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఐక్యతను చాటి చెప్పే పండుగ ఇది.

- రాకేష్ తివారి, వ్యాపారి, సంఘ సేవకులు

### రెండో ఏట నిర్వహించాం..



గణేష్ ఆగమన్ గతేడాది నుంచి చేస్తున్నాం. ఈసారి ఘనంగా చేశాం. స్నేహితులందరం కలిసి ఒకే చోట చేరి కేరింతలు కొడుతూ ఈ ఆగమన్ నిర్వహించడం బాగుంది. ఒకప్పుడు మన దగ్గర ఇది లేదు. రెండేళ్ల నుంచి ఎక్కువైంది.

- ఆవుల అంకిత్, అలియాబాద్ రోడ్డు

## పర్యావరణహితుడు..
# కూరగాయల గణనాథుడు..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో వినాయక చవితి పర్వదినం నేపథ్యంగా విద్యార్థులు పర్యావరణం పట్ల తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఇందులో భాగంగా ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే పండ్లు, కూరగాయలు ఉపయోగించి పర్యావరణహిత గణపతులను సుందరంగా తయారు చేశారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో తీర్చిదిద్దిన ఈ గణపతులు విశేషంగా ఆకట్టుకున్నాయి. అంతేకాకుండా ఇక్కడి విద్యార్థులు పాఠశాల ఆవరణలో బంకమట్టితో వారే స్వయంగా మట్టి గణపతులను తయారుచేసుకున్నారు. అంతేకాకుండా ఉపాధ్యాయులకు, సిబ్బందికీ పంపిణీ చేసి తమ ఇళ్లల్లో కూడా వాటినే పూజించేందుకు తీసుకెళ్లారు. విద్యార్థుల సామాజిక స్పృహను స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీ అభినందించారు.







నగరంలోని పలు మండపాల్లో దేశభక్తి కొలువుదీరుతోంది. మునుపెన్నడూ లేని విధంగా గణేశుడి సమక్షంలో జాతీయ భావన వెల్లివిరుస్తోంది. ఇటీవలే పాకిస్తాన్ తీవ్రవాదానికి వ్యతిరేకంగా మన దేశ సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ థీమ్‌తో వినాయక మండపాలు రూపొందాయి.

- సాక్షి, సిటీబ్యూరో

## విఘ్నేశుని నుదుటన..
# విజయ సింధూరం

- నగరంలో 'ఆపరేషన్ సిందూర్' గణేశుడు
- ఆకర్షిస్తున్న 'థీమ్' అలంకరణ
- దేశవ్యాప్తంగా పలు చోట్ల ఇదే థీమ్

జంట నగరాల్లోని గణేశ పూజ మండపాల్లో 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని ప్రదర్శించనున్నట్లు భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి ఇప్పటికే ప్రకటించింది. ఇందులో భాగంగా పలు మండపాలు ఈ తరహా థీమ్‌తో ఏర్పాట్లు చేశాయి. ఆపరేషన్ సిందూర్ యావత్ భారతాన్ని ఏకం చేసింది. కాబట్టి మేము భారత సాయుధ దళాలకు మద్దతుగా నిలుస్తున్నాము' అని పలు మండపాల నిర్వాహకులు అంటున్నారు. అగ్ని, ఆకాశ్ క్షిపణులతో పాటు ఫైటర్ జెట్ తేజస్‌తో సహా భారతదేశ ఆయుధ సంపత్తిని ప్రదర్శించే విగ్రహాలను ప్రదర్శిస్తున్నారు. ఇటీవలే స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడంతో.. ఈ సందడి కొనసాగింపుగా రెట్టింపు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. నగరంలోని ఉప్పుగూడకు చెందిన మండపం సంపూర్ణంగా 'ఆపరేషన్ సిందూర్' థీమ్‌గా స్వీకరించింది. శ్రీ మల్లికార్జున్ నగర్ యువజన సంక్షేమ సంఘం ఆపరేషన్ సిందూర్–నేపథ్య గణేశ విగ్రహంతో పాటు ఇందులో బ్రహ్మోస్ క్షిపణులు, -400 రైఫిల్స్, భారత సైనిక బలాన్ని సూచించే ఆర్మీ మోడల్ థీమ్ జోడించారు. ఈ విగ్రహాన్ని స్థానిక కళాకారులు దాదాపు రూ.6 లక్షల వ్యయంతో రూపొందించారని నిర్వాహకులు చెబుతున్నారు.



### 55 రోజులు శ్రమించి..

విగ్రహాన్ని పూర్తి చేయడానికి కళాకారులు 50–55 రోజులు శ్రమించారని, కనీసం 10 మందికి తగ్గకుండా ఉదయం నుండి రాత్రి 2–3 గంటల వరకూ పనిచేసి విగ్రహాన్ని తయారు చేశారని చెబుతున్నారు. యువజన కమిటీ స్థానిక నివాసితులు విగ్రహంతో పాటు సుదర్శన్ వాహనాన్ని సిద్ధం చేశారని వివరించారు. 'నవరాత్రి 9–10 రోజుల్లో, 20 నిమిషాల చిన్న వీడియోను ఒక చిత్రంగా రూపొందిస్తున్నారు. ఇది మొదటి నుండి చివరి వరకు, భారత సైన్యం, ఉగ్రవాదులు ఏమి చేస్తారో తెలియజేస్తుంది. దీనిని 9 రోజుల పాటు మండపంలో ప్రజలకు చూపిస్తారు.

### చరిత్రను తెలిపే పోస్టర్లు..

విగ్రహంతో పాటు దేశ సైనిక చరిత్రలోని కీలక ఘటనలను హైలైట్ చేసే పోస్టర్లు ఏర్పాటు చేశారు. వాటిలో ఇండో–పాక్ యుద్ధం (1947), రెండో ఇండో–పాక్ యుద్ధం (1965), బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం (1971), కార్గిల్ యుద్ధం (1999), ఉరి దాడి (2016), పుల్వామా దాడి (2019), ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్ (2025) ఉన్నాయి.

## పికిల్‌బాల్ లీగ్ వేలంలో
# స్టార్ ఆటగాళ్లు

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వేదికగా నిర్వహణ

గచ్చిబౌలి: ఆసియాలో 8వ ర్యాంకు పొందిన భారత క్రీడా దిగ్గజాలు సమీర్ వర్మ, టెన్నిస్ ఏఎస్ విష్ణువర్ధన్, కిదాంబి నందగోపాల్ వంటి స్టార్ ఆటగాళ్లు హైదరాబాద్ పికిల్‌బాల్ లీగ్(హెచ్‌పీఎల్) ప్రారంభ ఎడిషన్‌లో పాల్గొనున్నారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న క్రీడకు ఇదో మైలురాయిగా నిలువనుంది. అగ్రశ్రేణి ఆటగాళ్ల ప్రాతినిధ్యం వహిస్తుండడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఈ ఫ్రాంచైజీ కారణంగా ప్రేక్షకులకు ఐపీఎల్–శైలి వినోదాన్ని అందించనుంది. సెంటర్ కోర్ట్ స్పోర్ట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రూపొందించిన ఈ లీగ్ అక్టోబర్ 10న ప్రారంభం కానుంది. శేరిలింగంపల్లి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని జీరో 40 బ్రూయింగ్‌లో జరిగిన ఆటగాళ్ల వేలంతో మొత్తం 8 ఫ్రాంచైజీలు పాల్గొన్నాయి. వేలంలో అగ్రగామిగా ఉన్న స్టార్ ఆటగాళ్లు సమీర్‌వర్మ(ఆల్‌స్టార్స్) శ్రీకర్ మోతుకూరి(క్రెడికాన్‌మావెరిక్స్), వివేక్‌రెడ్డి ప్రియదర్శిని(దాసోస్‌మైనమోస్), జెనాచత్వాల్ (కీర్తివారియర్స్), సాహితిపాన్నాల (నంది చార్జర్స్) హర్ష్ రణసరియా (స్టారీస్మాషర్స్), నిఖిల్ తుమ్మలపల్లి(టెరామోర్‌టైటాన్స్), రిషబ్‌రామ (ది రాప్టర్స్) పికిల్ భాల్ స్టార్స్‌గా నిలిచారు. అధికారిక బిడ్డింగ్ ప్రారంభమయ్యే ముందు కేటగిరీ ఏలో ప్రతి ఒక్కరూ సంబంధిత ఫ్రాంచైజీలు రూ.2 లక్షలకు నేరుగా డ్రాఫ్ట్ చేశాయి.



## ఇంజినీరింగ్ విద్యార్థుల
# స్ట్రీట్‌కాజ్..

చారిటీ కోసం మట్టి గణపతుల విక్రయం



బంజారాహిల్స్: సామాజిక బాధ్యతగా ఇంజినీరింగ్ విద్యార్థులు వినాయక చవితి పర్వదినాన్ని సేవకు వినియోగించుకున్నారు. అటు ఆధ్యాత్మికత.. ఇటు సేవ రెంటినీ మిళితం చేస్తూ ఈ విద్యార్థులు స్ట్రీట్‌కాజ్ అనే కార్యక్రమంలో భాగంగా మట్టి విగ్రహాలను విక్రయించారు. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని వృద్ధాశ్రమాలు, అనాథ ఆశ్రమాలకు అందించాలనే లక్ష్యం పెట్టుకున్నారు. గురునానక్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు గత రెండు రోజులుగా బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కుతో పాటు నగరంలోని వివిధ రద్దీ ప్రాంతాల్లో మట్టి విగ్రహాలను విక్రయించారు. ప్రతియేటా వినాయక చవితికి మట్టి గణేశుని విగ్రహాలు, దీపావళికి ప్రమిదలు, సంక్రాంతికి ముగ్గుల రంగులు.. ఇలా ప్రతి పండుగకూ ఓ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. సమాజం పట్ల విద్యార్థుల బాధ్యతను, కృషిని ప్రతిఒక్కరూ ప్రశంసిస్తున్నారు. వీరి లక్ష్యాన్ని గుర్తిస్తున్న ప్రజలు పెద్ద ఎత్తున విగ్రహాలు కొనుగోలు చేస్తున్నారు. 'ఎకో'దంత థీమ్‌తో వీరంతా విగ్రహాలను విక్రయిస్తున్నారు.



## క్లుప్తంగా...

### ప్రజలందరికీ సకల శుభాలు కలగాలి

**వైఎస్ జగన్ వినాయక చవితి శుభాకాంక్షలు**

**సాక్షి,అమరావతి:** వినాయక చవితి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ గణనాథుని ఆశీస్సులు ఉండాలని, క్షేమ, స్థైర్య, ఆయురారోగ్యాలు, సకల సంపదలు సిద్ధించాలని, సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో మంచి పనులకు విఘ్నాలు తొలగిపోవాలని, గణనాథుని కరుణాకటాక్షాలతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలని మంగళవారం ఓ ప్రకటనలో అభిలషించారు.

### సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఇనేష్, బుచ్చిరెడ్డి



రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా ప్రమాణస్వీకారం చేస్తున్న ఎ.ఇనేష్, బి. బుచ్చిరెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎ.ఇనేష్, బి.బుచ్చిరెడ్డి ఎన్నికయ్యారు. మంగళవారం టీజీవో భవన్‌లో టీజీవో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాస్, ఎ.సత్యనారాయణ సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో సభ్యులందరూ పాల్గొని అందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎ.ఇనేష్, బి.బుచ్చిరెడ్డి, సహ అధ్యక్షుడుగా డి.శ్రీనివాసులు, కోశాధికారిగా మధుసూదన్, ఉపాధ్యక్షులుగా ఎం.నాగేందర్, వై.శ్రీనివాస్‌రెడ్డి, జి.సుజాత, సహ కార్యదర్శులుగా అశోక్, శ్రీనివాసులు, చాంద్ పాషా, కార్యనిర్వాహక కార్యదర్శి: కె శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా సుదర్శన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శ్రీరామ్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వ అధికారులుగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పనిచేస్తూనే ప్రజలలో భాగమై మన హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

### పారా మెడికల్ ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలి

**పారామెడికల్ జేఏసీ డిమాండ్**

**సాక్షి, హైదరాబాద్:** వైద్యవిద్య సంచాలకుల పరిధిలోని పారామెడికల్ ఉద్యోగుల పదోన్నతులను ఆపడం ఆనవాయితీగా మారిందని, వెంటనే వారికి పదోన్నతులు కల్పించాలని పారామెడికల్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రమేర్పడినప్పటి నుంచి డీఎంఈ పరిధిలో డైటీషియన్, బయోకెమిస్ట్, లైబ్రేరియన్, అసిస్టెంట్ లైబ్రేరియన్ పదోన్నతులు చేపట్టడం లేదని జేఏసీ నేత నిజాముద్దీన్ తెలిపారు. ఏటా పదోన్నతుల ప్యానెల్ సంవత్సరం ముగిసే వరకు కాలయాపన చేస్తూ, చివరి నిమిషంలో పదోన్నతుల గురించి ప్రభుత్వానికి రాయడాన్ని ఒకతంతుగా నిర్వహిస్తున్నారని విమర్శించారు. డీఎంఈ పరిధిలోని ఆధ్యాపకులు, కార్యాలయపు పరిపాలన విభాగపు ఉద్యోగుల పదోన్నతులు ఠంచన్‌గా ఇచ్చేస్తున్నారన్నారు. డైటీషియన్ పదో న్నతుల జాప్యం వెనుక డీఎంఈ ఆఫీసు అధికారులు, డైట్ కాంట్రాక్టర్ల పాత్ర ఉందని, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. తమ ఆవేదనను అర్థం చేసుకుని, ప్యానెల్ ఇయర్ ముగియక ముందే, వెంటనే పదోన్నతులు కల్పించాలని హెల్త్ సెక్రటరీని కోరారు.

### వాన్‌పిక్ పిటిషన్ కొట్టివేత

**సాక్షి, హైదరాబాద్:** సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. కింది కోర్టులోనే తేల్చుకోవాలని సూచించింది. సీబీఐ కేసును కొట్టివేయాలని 2021లో వాన్‌పిక్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2022లో హైకోర్టు కొట్టివేసింది. దీనిపై వాన్‌పిక్.. సుప్రీంకోర్టును ఆశ్రయించగా, మరోసారి విచారణ జరపాలని హైకోర్టుకు పిటిషన్‌ను తిప్పి పంపింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఈవీ వేణుగోపాల్ విచారణ చేపట్టి మంగళవారం తీర్పు వెలువరించారు.

### మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి

**సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక**

**సాక్షి, హైదరాబాద్:** పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్ ప్రియాంక సూచించారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం ప్రాంగణంలోని మీడియా సెంటర్‌లో జర్నలిస్టులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ పర్యావరణానికి నష్టం జరగకుండా మట్టి వినాయకులనే పూజించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరుకుంటూ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# రక్షణ రంగంలో తిరుగులేని శక్తిగా భారత్

## ఆత్మనిర్భర్ భారత్‌తో నౌకా నిర్మాణాల్లో నంబర్-1గా నిలిచాం

- కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్‌సింగ్
- విశాఖలో ఐఎన్ఎస్ హిమగిరి, ఉదయగిరి నౌకలు జాతికి అంకితం
- రెండు యుద్ధ నౌకల్ని ప్రారంభించి జాతికి అంకితం చేసిన రక్షణ మంత్రి



ఐఎన్ఎస్ ఉదయగిరి

**సాక్షి, విశాఖపట్నం:** రక్షణ రంగంలో భారత్ తిరుగులేని శక్తిగా ఎదిగిందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్‌తో నౌకా నిర్మాణాల్లో నంబర్-1గా నిలిచామని పేర్కొన్నారు. విశాఖలోని తూర్పు నౌకాదళంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అత్యాధునిక సాంకేతికతో నిర్మించిన ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరి యుద్ధ నౌకల్ని కమిషనింగ్(ప్రారంభోత్సవం) చేసి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి దేశ రక్షణ, ఆత్మనిర్భర్ భారత్ తదితర అంశాలపై మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

**ఆర్థిక భద్రతకు నౌకాదళం మూలస్తంభం**

''సముద్ర రక్షణకే పరిమితం కాకుండా.. దేశ ఆర్థిక భద్రతకు మూలస్తంభంగా నౌకాదళం ఉంది. ఇండియన్ నేవీ సామర్థ్యాన్ని పెంచేలా యుద్ధ నౌకల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. విపత్తుల సమయంలో సహాయ కార్యక్రమాల్లోనూ నేవీ సేవలు శ్లాఘనీయం. అత్యాధునిక స్టెల్త్ ఫీచర్లు, రాడార్లు, అధునాతన నిఘా వ్యవస్థ, సూపర్ సోనిక్ క్షిపణులతో కూడిన వ్యవస్థలు పొందుపరిచిన ఐఎన్ఎస్, ఉదయగిరి, హిమగిరి లీడ్ షిప్స్‌గా వ్యవహరిస్తాయి. వార్‌షిప్ డిజైన్ బ్యూరో ద్వారా రూపొందించిన 100, 101 యుద్ధనౌకలు కావడం గర్వకారణం.

### హిందూ మహాసముద్రంలో పెరిగిన బలం

ఈ రెండు యుద్ధ నౌకలు భారత నౌకాదళంలో చేరడంతో హిందూ మహాసముద్రంలో భారత్ బలం మరింత పెరిగింది. మొదటి ప్రాధాన్య భద్రతా భాగస్వామిగా భారత్ అవతరించనుంది. పైరసీని ఎదుర్కోవడం, స్మగ్లింగ్, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాటం, సముద్ర ఉగ్రవాదాన్ని అరికట్టడంతోపాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో సేవలందించడంలో ఉదయగిరి, హిమగిరి గేమ్ ఛేంజర్స్ కానున్నాయి. అరేబియా సముద్రం నుంచి తూర్పు ఆఫ్రికన్ సముద్ర తీరం వరకు నావికాదళ కార్యకలాపాలు సజావుగా నిర్వహించడం ప్రశంసనీయం.

### ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం

యుద్ధాలు, శత్రుదేశాలైనా సరే దాడులకు భారత్ పూర్తి వ్యతిరేకం. దూకుడుగా వ్యవహరించి ఇప్పటివరకూ ఏ దేశంపైనా భారత్ దాడి చెయ్యలేదు. కానీ పహల్గామ్ ఉగ్రదాడి యావత్ దేశాన్ని కుంగదీసింది. దేశ భద్రతపై దాడి జరిగితే ఎలా స్పందించాలో భారత్‌కు తెలుసు. దానికి ఉదాహరణే ఆపరేషన్ సిందూర్. ఆపరేషన్ సిందూర్ ముగిసిపోలేదు. విరామం మాత్రమే ఇచ్చాం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అలుపెరగని పోరాటానికి సిద్ధంగా ఉన్నాం.''

ఆత్మనిర్భర్‌భారత్‌లో భాగంగా.. స్వదేశీ పరిజ్ఞానాన్ని భారత్ ఎంతలా అందిపుచ్చుకుంటుందో ఈ నిర్మాణాలే ప్రత్యక్ష ఉదాహరణ.

**స్వదేశీ పరిజ్ఞానం వినియోగంలో ముందు**

భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠీ మాట్లాడుతూ.. లీడ్ వార్‌షిప్స్ డబుల్-కమిషనింగ్ భారతదేశ సాగర శక్తి నిరంతర పురోగతి, సామర్థ్య విస్తరణకు స్పష్టమైన సంకేతాలని పేర్కొన్నారు. స్వదేశీ పరిజ్ఞానం ఉపయోగించడంలో ఇండియన్ నేవీ ముందు వరసలో ఉందని తెలిపారు.

**యుద్ధ నౌకల పరిశీలన**

ఉదయగిరి, హిమగిరి యుద్ధ నౌకల్ని జాతికి అంకితం చేసిన అనంతరం వాటిని మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పరిశీలించారు. తర్వాత పాతతరం ఉదయగిరి, హిమగిరి యుద్ధ నౌకల్లో విధులు నిర్వర్తించిన ఎక్స్ కమాండింగ్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి ఫోటోలు తీసుకున్నారు. కార్యక్రమంలో తూర్పునౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, నేవీకి చెందిన ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు.



హిమగిరి యుద్ధ నౌకని జాతికి అంకితం చేస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఇండియన్ నేవీ చీఫ్ అడ్మిరల్ త్రిపాఠి

# మీ బతుకంతా మోసమేనా?

## దివ్యాంగ పెన్షన్ల రద్దుపై మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపాటు



**సాక్షి, అమరావతి:** టీడీపీ నాయకత్వంలోని కూటమి సర్కారు దివ్యాంగుల పట్ల నిర్దయగా వ్యవహరిస్తోందని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి పెన్షన్లను రద్దు చేస్తూ అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. వారికి దివ్యాంగ సర్టిఫికెట్లు ఇచ్చిన వైద్యులను సైతం లంచాలు తీసుకున్నారంటూ దారుణంగా అవమానించడం ఏమిటని ప్రశ్నిస్తూ మంగళవారం 'ఎక్స్'లో చంద్రబాబును ట్యాగ్ చేస్తూ నిలదీశారు.

- సీబీఎన్ గారూ.. మీ బతుకంతా మోసమేనా? మీరొక ఘరానా మోసగాడని మీ పాలనా కాలంలో రోజూ రుజువవుతూనే ఉంది. ప్రజలకు ఏం చెప్పి మీరు అధికారంలోకి వచ్చారు? ఇప్పుడు ఏం చేస్తున్నారు? అధికారంలోకి వస్తే జగన్ ఇస్తున్న పథకాలే కాదు.. అంతకు మించి ఇస్తామన్నారు. సూపర్ సిక్స్ అన్నారు.. సూపర్ సెవెన్ అన్నారు. కానీ ఇదివరకే ఉన్నవాటికి మంగళం పాడేయడమే కాదు.. తప్పనిసరిగా ఇవ్వాల్సిన వాటికీ కోతలు పెడుతున్నారు.
- చంద్రబాబుగారూ.. పెన్షన్లలో కోత లేకుండా, ఎలాంటి ఆంక్షలు పెట్టకుండా ఇస్తామని ఎన్నికల ప్రచారసభల్లో ఊదరగొట్టారు, ఊరూరా మీ వాళ్లతో చెప్పించారు. 2024 మార్చిలో ఎన్నికల నాటికి మా ప్రభుత్వ హయాంలో పెన్షన్ల సంఖ్య 66,34,372. కానీ మీరు ఈ ఆగస్టులో ఇచ్చిన పెన్షన్లు 62,19,472 మాత్రమే. అంటే ఏకంగా 4,14,900 పెన్షన్లను నిర్దాక్షిణ్యంగా మీరు కత్తిరించడమే కాకుండా కొత్తగా ఒక్క పెన్షన్ కూడా మంజూరు చేయలేదు. ఇది మోసం కాదా? దగా కాదా?
- విధివంచితులైన దివ్యాంగుల పట్ల కనీసం జాలి, దయ చూపకుండా అమానవీయంగా వారి పెన్షన్లను కూడా కట్ చేశారు.. చేస్తున్నారు. రీ వెరిఫికేషన్ పేరిట వారికి నరకయాతన చూపిస్తున్నారు. వారిని ఇంతగా కష్టపెట్టడం మానవత్వం అనిపించుకుంటుందా? మనిషి అన్నవారు ఎవరైనా ఇలా చేస్తారా?
- దివ్యాంగులకు ఇచ్చే సర్టిఫికెట్ల కోసం గతంలో ఉన్న దారుణమైన పద్ధతులను మార్చి, మా ప్రభుత్వ హయాంలో వారికోసం ప్రత్యేకంగా సదరం క్యాంపులు ఏర్పాటు నిర్వహించి సర్టిఫికెట్లు మంజూరు చేశాం. 2024 మార్చి నాటికి 8,13,316 మంది దివ్యాంగులకు మేం పెన్షన్లు ఇచ్చి వారి జీవితాలకు భరోసాగా నిలిచాం. కానీ, మీరు వారిని దొంగలుగా చిత్రీకరిస్తూ ఇందులో లక్షల మందికి నోటీసులు ఇచ్చి, వారి జీవనాడిని కత్తిరించే ప్రయత్నాలు చేస్తున్నారు. చంద్రబాబు గారూ ఆరోజు సర్టిఫికెట్లు ఇచ్చింది ఇదే గవర్నమెంటు డాక్టర్లే అయినప్పుడు, మరి అవి తప్పుడు సర్టిఫికెట్లు ఎలా అవుతాయి? పైగా లంచాల కోసం డాక్టర్లు ఆశపడ్డారంటూ తప్పుడు ప్రచారం చేయడం దారుణం కాదా? దివ్యాంగులను ఈ రకంగా ఇబ్బంది పెట్టి వారు బలవన్మరణాలకు పాల్పడేలా చేయడం దుర్మార్గం కాదా? ఇది మోసం కాదా? మీ భారాన్ని తగ్గించుకోవడానికి మీరు ఎన్నుకున్న దారి అన్యాయం కాదా? ఇది మోసం కాదా? దగా కాదా?
- వీటి పరిస్థితి ఇలాఉంటే.. ఇక యాభై ఏళ్లకే పెన్షన్ ఇస్తామంటూ మీరు చేసింది మరో అతి పెద్దమోసం. అది దగా కాదా? అందుకే బాబు ష్యూరిటీ అంటే.. మోసం గ్యారంటీ!

### అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు

- కష్టకాలంలో నిలబడిన వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటా
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడ పద్మనాభం



**కిర్లంపూడి:** తనకు అనారోగ్యంగా ఉన్న సమయంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం ధన్యవాదాలు తెలిపారు. తన కష్టకాలంలో తోడుగా నిలబడిన మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటానన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ లేఖను మీడియాకు విడుదల చేశారు. 'నాకు ఆరోగ్యం బాగోలేదని తెలిసిన వెంటనే వైఎస్ జగన్ స్పందించి.. వైద్యులతో, హాస్పిటల్ నిర్వాహకులతో మాట్లాడారు. ఎప్పటికప్పుడు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఏమన్నా సహాయం కావాలా? అని తరుచూ అడిగేవారు. మాకు కొండంత ధైర్యాన్ని ఇచ్చినందుకు, కష్టకాలంలో నిలబడినందుకు వారికి రుణపడి ఉంటాం. కాకినాడ నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్లేందుకు ఎయిర్ అంబులెన్స్ కూడా ఏర్పాటు చేశారు. అయితే ఆరోగ్యం కుదటపడడంతో రోడ్డు మార్గంలోనే అంబులెన్స్‌లో హైదరాబాద్ చేరుకున్నాం. అలాగే నా ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అని ముద్రగడ పేర్కొన్నారు.

### జాతీయ పార్టీలకు ఓట్లు.. ప్రజలకు పాట్లు

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఢిల్లీ పర్యటనలు, బిహార్ ఎన్నికల ప్రచారంలో తీరిక లేకుండా ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పడుతున్న కష్టాలపై దృష్టి పెట్టకుండా రాష్ట్ర సమస్యలను గాలికి వదిలి జాతీయ రాజకీయాలకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కేటీఆర్ ప్రశ్నించారు. 'రైతుబిడ్డలు ఇక్కడ.. రాష్ట్ర సీఎం, మంత్రులు ఎక్కడ. సమస్యలు ఇక్కడుంటే సీఎం, మంత్రులు ఢిల్లీ, బిహార్‌లోనా? యూరియా కోసం రైతులు తండ్లాడుతుంటే, మీరు ఎక్కడ ఎన్నికలు ఉంటే అక్కడికి ఎగిరిపోతారా' అని కేటీఆర్ ప్రశ్నించారు. 'జాతీయ పార్టీలకు ఓట్లు తెలంగాణ ప్రజలకు పాట్లు. యూరియా సమస్యను పరిష్కరించడంలో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు విఫలమయ్యారు. యూరియాను కాంగ్రెస్ ఎంపీలు తీసుకురాలేరు. బీజేపీ ఎంపీలు అడగరు. యూరియా కొరత అంశంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి, జాతీయ పార్టీల నిర్లక్ష్యాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

### మద్యం ఫుల్లు.. ఎరువులు నిల్లు

- రేవంత్‌రెడ్డి పాలనలో వ్యవసాయం కుప్పకూలింది: హరీశ్‌రావు



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో వ్యవసాయ రంగం పూర్తిగా కుప్పకూలిపోయిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. అప్పుల బాధతో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఈర్లపల్లిలో రవినాయక్ అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపిందని విమర్శించారు. రవినాయక్ ఆత్మహత్య ఘటనలో వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ ఆస్పత్రులు చూపిన నిర్లక్ష్యం కూడా స్పష్టమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాథమిక వైద్య సేవలు అందించడంలోనూ విఫలమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులను నిరాశలోకి నెట్టి వారి జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతోందని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్ర రైతాంగాన్ని నడిరోడ్డు మీదకు తెచ్చి మద్యం ఫుల్లు ఎరువులు నిల్లు అన్నట్లుగా రేవంత్ పాలన సాగుతోందని దుయ్యబట్టారు. కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని మభ్యపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి.. యూరియాను బంగారంలా మార్చాడని ఎద్దేవా చేశారు. యూరియా బస్తాల కోసం రైతులు అధికారుల కాళ్లు పట్టుకుని వేడుకునే దుస్థితి ఏర్పడిందని అన్నారు. యూరియా కోసం కాంగ్రెస్ ఎంపీల పోరాటం ఫలించిందని చెప్పుకోవడం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిపాలన చేయడం బూటకపు వాగ్దానాలు చేసినంత సులభం కాదని అన్నారు. ఎరువులు, విత్తనాలపై రేవంత్ ప్రభుత్వం బాధ్యత, ప్రణాళిక, కార్యాచరణ లేకుండా వ్యవహరిస్తోందన్నారు.

### రింగ్ రైలు @ రూ. 28 వేల కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

కావాలంటే 60 మీటర్ల వెడల్పుతో స్థలాన్ని సేకరించాలని భావిస్తున్నారు.

**ఇంటర్ ఛేంజ్ లైన్లుగా రైల్ వంతెనలు...**

ఔటర్ రింగు రైలు ఆరు ప్రాంతాల్లో వివిధ మార్గాల నుంచి వచ్చే రైల్వే లైన్లను క్రాస్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆరు చోట్ల రైల్ ఓవర్ రైల్ వంతెనలు నిర్మించాలని నిర్ణయించారు. ఈ వంతెనలు ఇంటర్ ఛేంజ్ లైన్లుగా ఉంటాయి. అంటే ఆ ఆరు లైన్ల నుంచి ఔటర్ రింగ్ రైలు అనుసంధానం అవుతుంది. అటూఇటూ రైళ్లు మారేలా ఉంటాయి. అందుకోసం క్రాసింగ్‌కు ఐదు కి.మీ. దూరం నుంచి మెట్రో రైలు తరహాలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. అలాగే 26 నుంచి 30 కొత్త స్టేషన్లను కూడా నిర్మించాల్సి ఉంది. రింగురోడ్డు ఉన్నందున స్టేషన్ భవనాలను కూడా మెట్రో రైలు తరహాలోనే నిర్మించాల్సి ఉంటుందని భావిస్తున్నారు. దీనికి సంబంధించిన డిజైన్లు త్వరలో సిద్ధం చేయనున్నారు.

**రోజువారీ ప్రయాణికుల సంఖ్య 9 లక్షలకు పెరిగే అవకాశం**

ప్రస్తుతం హైదరాబాద్-ఇతర ప్రాంతాల మధ్య నిత్యం రైళ్ల ద్వారా 4 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఔటర రింగ్ రైల్ అందుబాటులోకి వచ్చిన ఐదారేళ్లలో ఆ సంఖ్య 9 లక్షలకు చేరుతుందని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. అదనపు రూట్ అందుబాటులోకి రావడం, పరస్పర లైన్ల అనుసంధానం వల్ల రైళ్ల సంఖ్య కూడా భారీగా పెరగనుంది. ప్రస్తుతం హైదరాబాద్ మీదుగా నిత్యం 130 సరుకు రవాణా రైళ్లు తిరుగుతుండగా ఔటర్ రింగ్ రైలు వచ్చాక ఐదారేళ్ల కాలంలో ఆ సంఖ్య 250కి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

### పులివెందులలో ఓటు తిరస్కరణ సంగతేంటి?

**కడప జిల్లా కలెక్టర్‌కు జాతీయ ఎస్సీ కమిషన్ నోటీసులు**

**కడప సెవెన్‌రోడ్స్:** పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో చోటుచేసుకున్న అక్రమాలు, అవకతవకలను జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఎన్నికల్లో ఓటు తిరస్కరణ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరికి నోటీసులు జారీ చేసింది. ఇటీవల జరిగిన పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా తాము స్వేచ్ఛగా ఓటు వేసుకునే అవకాశాన్ని కాల రాయడమే కాకుండా, తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ పులివెందుల మండలం, ఎర్రబల్లె గ్రామ పంచాయతీ దళితవాడకు చెందిన ఖాదరబాదర ఓబులేశు, అచ్చవెల్లి గ్రామ పంచాయతీ మాలవాడకు చెందిన దన్నాసి జనార్దన్ తదితరులు జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కొంతమంది గూండాలు తమ పేరుతో ఓట్లు వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 21న చేసిన ఈ ఫిర్యాదులపై కమిషన్ స్పందించింది. దీనిపై విచారణ జరపాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా కలెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న 15 రోజుల్లోపు ఈ ఆరోపణలపై తమకు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పోలింగ్ కేంద్రాన్ని ఆక్రమించడం, ఓట్ల దుర్వినియోగం వంటి ఆరోపణలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని ఆదేశించింది. ఓటు హక్కు రాజ్యాంగబద్ధమైన రక్షణ అని నొక్కిచెబుతూనే , షెడ్యూల్డ్ కులాలు, వర్గాల ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించే విషయంలో ప్రతి అంశాన్నీ తీవ్రంగా పరిశీలిస్తామని కమిషన్ నోటీసుల్లో పేర్కొంది. తాము నిర్దేశించిన గడువులోపు కలెక్టర్ నుంచి వివరణ రాకపోతే తమకున్న అధికారాలను ఉపయోగించి సమన్లు జారీ చేస్తామని స్పష్టం చేసింది.

### మృగత్వానికి ప్రతిరూపాలు కాంగ్రెస్ పాలకులే

**హామీలు అమలు చేతకాకే సీఎం పిచ్చి భాష: మధుసూదనాచారి**



**సాక్షి, హైదరాబాద్:** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతకాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బజారు భాష మాట్లాడుతున్నాడని శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు ఎస్.మధుసూదనాచారి విమర్శించారు. మాజీ మంత్రి జోగు రామన్న, ప్రభుత్వ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, బాలరాజు యాదవ్, పల్లె రవికుమార్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్రచారితో కలిసి తెలంగాణ భవన్‌లో మంగళవారం మధుసూదనాచారి మీడియాతో మాట్లాడారు. ఫాంహౌస్‌లో మానవ మృగాలు ఉన్నాయని కేసీఆర్‌పై వ్యాఖ్యలు చేసిన రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మృగత్వానికి ప్రతిరూపాలు కాంగ్రెస్ పాలకులు అని, అదే తత్వాన్ని రేవంత్ ఒంటబట్టించుకున్నాడని మండిపడ్డారు.

# ఏపీ మాజీ మంత్రి పేర్ని నానిపై కేసు

- వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలపై రెడ్‌బుక్ కుట్ర
- దెందులూరు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిని పరామర్శించడమే నేరం

**ఏలూరు సిటీ:** కూటమి నేతల రెడ్‌బుక్ రాజ్యాంగంలో అని పోలీసుల విధి 'సత్యం వధ.. ధర్మం చెర'గానే మారింది. మొదట్లో సోషల్ మీడియా యాక్టివిస్టులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులపై బుసలు కొట్టిన రెడ్‌బుక్ రాజ్యాంగం.. ఆ తరువాత మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులపైనా కోరలు చాస్తోంది. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిపై టీడీపీ మూకలు దాడికి తెగబడగా.. అసలు నిందితులను వదిలేసి అబ్బయ్య చౌదరి, మాజీ మంత్రి పేర్ని నాని, పార్టీ శ్రేణులపైనా తప్పు డు కేసులు నమోదు చేసి రెడ్‌బుక్ రాజ్యాంగం అంటే ఏమిటో పోలీసులు మరోసారి నిస్సిగ్గుగా రుజువు చేశారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరులు, టీడీపీ కార్యకర్తలు ఈ నెల 21న వైఎస్సార్‌సీపీ దెందులూరు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి చెందిన వ్యవసాయ క్షేత్రంలోకి చొరబడి పామాయిల్ గెలలను కోస్తున్న వారిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. అదే క్షేత్రంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఇంటిపై టీడీపీ మూకలు బీరు సీసాలు, కర్రలు, రాళ్లతో దాడి చేసి వీరంగం చేశారు. ఈ ఘటనపై బాధితుడైన అబ్బయ్య చౌదరి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దాడికి యత్నించిన టీడీపీ మూకలను వదిలేసి ఆయనపైనే ఎదురు కేసు నమోదు చేశారు. అక్కడితో ఆగకుండా వైఎస్సార్‌సీపీకి చెందిన జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, మాజీ ఎమ్మె ల్యే సోదరులు చల్లగొళ్ల ప్రదీప్, తేజ, ఉప్పలపాటి ప్రసాద్‌తో పాటు మొత్తం 15 మందిపై కేసులు నమోదయ్యాయి. మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులనూ పోలీసులు వదల్లేదు.

**తాజాగా పేర్ని నానిపై కేసు నమోదు**

ఇదే అంశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మంత్రి పేర్ని నానిపైనా పోలీసులు మంగళవారం అక్రమ కేసు నమోదు చేశారు. అబ్బయ్యచౌదరి నివాసంపై బీరు సీసాలు, కర్రలు, రాళ్లతో టీడీపీ మూకలు దాడికి యత్నించిన విషయం తెలిసి మాజీమంత్రి పేర్ని నాని తదితరులు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ నేపథ్యంలో టీడీపీ నేత ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అబ్బయ్య చౌదరి పొలంలో టీడీపీ శ్రేణులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతుండటంతో వైఎస్సార్‌సీపీ నేతలు, మాజీ మంత్రులు పేర్ని నాని, సాకే శైలజానాథ్, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలతో కూడిన బృందం ఈ నెల 22న దెందులూరు నియోజకవర్గ పరిధిలోని కొండలరావుపాలెంలో అబ్బయ్యచౌదరి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి.. ఆయనకు సంఘీభావం ప్రకటించింది. అనంతరం మాజీ మంత్రులు పేర్ని నాని, సాకే శైలజానాథ్ ఏలూరులోని పోలీస్ ప్రధాన కార్యాలయానికి చేరుకుని అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావుకు వినతిపత్రం సమర్పించారు. అబ్బయ్య చౌదరి నివాసం, ఆయన వ్యవసాయ క్షేత్రంలో దాడికి యత్నించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వినతిప్రంలో కోరారు. అనంతరం పోలీస్ జిల్లా కార్యాలయం వెలుపల మాజీ మంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడుతూ.. ఏదైనా ఉంటే రాజకీయపరంగా చూసుకుందామని, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం సరైన విధానం కాదని దెందులూరు నియోజకవర్గ టీడీపీ నాయకులకు హితవు పలికారు. టీడీపీ నేతలు, కార్యకర్తల దాష్టీకాలపై రాజకీయ విమర్శలు చేశారు. మాజీ మంత్రి పేర్ని నాని విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, రెండు వర్గాల్లో వైషమ్యాలు రెచ్చగొట్టేలే వ్యాఖ్యలు చేశారని ఏలూరు మండలం పాలగూడెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నేతల రవి ఈ నెల 25న పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు త్రీటౌన్ పోలీసులు యూ/ఎస్ 353(2) 351(3) బీఎన్ఎస్ సెక్షన్లతో కింద పేర్ని నానిపై తప్పుడు కేసు నమోదు చేశారు.




### వాణీప్రసాద్‌ను తెలంగాణకు కేటాయించండి : హైకోర్టు

**సాక్షి, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారి ఎ.వాణీప్రసాద్‌ను తెలంగాణకు కేటాయించాలని కేంద్రానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రెండు నెలల్లోగా ఈ మేరకు ఉత్తర్వులు వెలువరించాలని కేంద్ర సిబ్బంది శిక్షణ విభాగం (డీవోపీటీ)తోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి గడువు విధించింది. హైదరాబాద్‌కు చెందిన తనను ఏపీకి కేటాయిస్తూ 2014లో, గతేడాది అక్టోబర్ 9న కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వాణీప్రసాద్ కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్(క్యాట్)ను ఆశ్రయించారు. కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను సమర్థిస్తూ, తాము జోక్యం చేసుకోలేమని క్యాట్ ఏప్రిల్‌లో తీర్పునిచ్చింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ వాణీప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. హైదరాబాద్‌కు చెందిన వాణీప్రసాద్‌ను పుట్టిన ప్రదేశం ప్రాతిపదికన ఏపీకి కేటాయించడం చెల్లదన్నారు. ఆమె తల్లి ప్రసవం కోసం గుంటూరు వెళ్లడంతో పుట్టిన స్థలం గుంటూరుగా పేర్కొన్నారని వివరించారు. వాదనలను విన్న ధర్మాసనం.. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం కేడర్ కేటాయింపులో నివాస ప్రాంతాన్నే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. ఆమెను ఏపీకి కేటాయించడం చెల్లదని తేల్చిచెప్పింది. కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులతోపాటు క్యాట్ ఉత్తర్వులను కూడా రద్దు చేసింది.

● పండుగ


శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోప శాంతయే...

వినాయక చవితి వస్తే అందరి నోటా ఈ ప్రార్థనా శ్లోకం వినిపిస్తుంది. దీని అర్థం చాలా మందికి తెలియకపోవచ్చు. తెలియాల్సిన పద్ధతిలో తెలిసి ఉండకపోవచ్చు. తెలుగువారి మహాకవి విశ్వనాథ సత్యనారాయణ తనే స్వయంగా ఒక సందర్భంలో ఆ శ్లోకానికి అర్థం విడమర్చారు. అదేమిటో ఈ వినాయక చవితి సందర్భంగా తెలుసుకుందాం...



- విశ్వనాథ సత్యనారాయణ

# శుక్లాంబరధరం



ఈ విఘ్నేశ్వర స్తోత్రం మహా వేదాంతార్థం కలిగిన శ్లోకం. దీని అర్థం సర్వము నందు అభివ్యాప్తమైయున్న మహాచైతన్యం ప్రథమావతారాన్ని బోధిస్తుంది. పురాణదశకు వచ్చేసరికి దీని అర్థం వేరు. విఘ్నేశ్వరుడు పార్వతీదేవి కుమారుడు. తెల్లని వస్త్రములు ధరించెడివాడు. విష్ణుమూర్తితో సమానుడు. శశియనగా చంద్రుడు. చంద్రవర్ణము కలవాడు. అనగా తెల్లనివాడు. చతుర్భుజుడు నాలుగు భుజములు కలవాడు. ఆయన ప్రసన్న వదనుడు. మొగము ప్రసన్నమై ఉండునని అర్థం. సర్వ విఘ్నములు ఉపశమించుట కొరకు ధ్యానించవలెను. ఇది శ్లోకార్థం.

పురాణ విఘ్నేశ్వరుడు ఉన్నట్టే తత్త్వభూతుడైన విఘ్నేశ్వరుడు ఉన్నాడు. తత్త్వమైన విఘ్నేశ్వరుణ్ణి ప్రార్థించడం ఉండదు. తత్త్వమైన భగవంతుణ్ణి ప్రార్థించుట ఉండదు. సాధ్యం కాదు. అది మనసున ఏకాగ్రస్థితి వచ్చినప్పుడు అంటే సర్వమైన ఇతర భావాలు తొలగించుకొన్నప్పుడు సాధ్యం కావచ్చు బహుశా.

భగవంతునకు మూర్తి లేదు. మరి నీవు ఎవరిని ధ్యానించుచున్నావు? ఒక భావమును ధ్యానించు చున్నావా? భావమనగా ఊహ. ఆ ఊహ నిలుచునా? ఎట్లు నిలుచును? అందుకే సృష్టి అంటే నామరూపాలు కాబట్టి భగవంతుని గుణాలకు రూపనామాలు ఇచ్చి ధ్యానించడం మనిషి బుద్ధికి సాధ్యం అయ్యింది.

అందుచేత విఘ్నములు పరిహరించు దేవునికి రూపకల్పన చేసి దానిని ధ్యానిస్తున్నాము.

శుక్లాంబరధరుడని, చతుర్భుజుడని, శశివర్ణుడని చెప్తామే కాని వెనుక వున్న అర్థం వేరు.

ఆ అర్థం తెలిసి ధ్యానిస్తే ఫలం అధికం.

శుక్లాంబరము అంటే తెల్లని ఆకాశము. దానిని ధరించినవాడు. ఆకాశానికి వర్ణం లేదు. కానీ విఘ్నేశ్వరుడు శుక్లాంబరధరుడు అంటే తెల్లని ఆకాశమును ధరించినవాడు అయ్యాడు. ఇదో సంకేతం. భాషలో సంకేతాలుంటాయి. మన శాస్త్రములలో సత్త్వ, రజో, తమో అని త్రిగుణములని మూడున్నవి. సత్త్వగుణం తెలుపు. రజోగుణం ఎఱుపు. తమోగుణం నలుపు. ఆకాశమనగా 'నవకాశము'. ఇది పంచభూతములలో ఒకటి. ఇది లేకుండా ఏ రెండు భూతములకు సంయోగం లేదు. ఒక భూతములో వున్న రెండణువుల మధ్య కూడ ఆకాశముండును. ఈ ఆకాశమునందు భగవచ్ఛక్తి అభివ్యాప్తమై యుండును.

సత్త్వగుణముచేత అభివ్యాప్తమైయున్న ఆకాశమును ధరించినవాడు విఘ్నేశ్వరుడు అని అర్థం.

శశివరుడు– శశియనగా చంద్రుడు కదా! శశమును ధరించినవాడు. శశమనగా కుందేలు. చంద్రునిలోనున్న మచ్చ కుందేలని అల్లిబిల్లి కథ. శశమనగా 'దాట్లు పెట్టుచు దూకునది' అని అర్థం. అందుచేతనే చంద్రుని శశియన్నారు. అతడు శుక్ల, కృష్ణపక్షములను చేయును. సూర్యునివలె నిత్య జ్యోతిస్సు కాదు. అందుచేత అతడు శశి. ఈ విఘ్నేశ్వరుడు ఆ జాతి కలవాడు. అనగా కాల స్వరూపుడు.

కాలము రెండు విధములు. ఖండ కాలము, అఖండ కాలము. ఖండకాలమనగా దిన, పక్ష, మాస, సంవత్సరాత్మకమైనది. అఖండ కాలమనగా సూర్యచంద్ర గ్రహచారములు లేని చోట వుండునది. ఈ విఘ్నేశ్వరుడు ఖండకాల స్వరూపుడని అర్థం. అనగా లోకమును పాలించెడివాడని అర్థం. ఈ కాలంలో బతుకుతూ, ఈ కాలానికి అధీనమైవున్న మనం ఖండకాలమును పాలించెడి ఒక తత్త్వమును నిర్మించుకొని దానికి విఘ్నేశ్వర రూపం ఇచ్చినాము.

చతుర్భుజం– చతుర్భుజుడు– నాలుగు భుజములు కలవాడు. భుజమనగా ఒక అర్థం భోజనము చేయునది. రెండవ అర్థం పాలించునది. నాల్గు భుజములతో విఘ్నేశ్వరుడు భుజించును. దేనిని? కాలమును అనగా ఖండకాలమును అఖండకాలముగా మార్చునన్న మాట. ధర్మార్థ కామ మోక్షములు నాలుగు. ఈ నాల్గింటిని పాలించుచున్నాడు. మనం ఒక కార్య ప్రారంభంలో పూజిస్తే మన ధర్మార్థ కామములను పాలించుచున్నాడు. అందుకనే మనం విఘ్నేశ్వరుని నిత్యం ధ్యానిస్తున్నాం. విఘ్నేశ్వరుడినే పరమేశ్వరుడుగా ధ్యానించినచో మోక్షమును గూడ నొసంగగలడు. కాలమును నాలుగు చేతులతో భుజించుచున్నాడు కదా! నాలుగు యుగములుగా తనలో లయింపచేసి కొనుచున్నాడని అర్థం.

ఇంత పూజ దేనికి? సర్వవిఘ్నోప శాంతి కొరకు, విఘ్నములు ఉపశమించుట కొరకు, ఉపశమించునేగాని నశించవు. కాని విఘ్నేశ్వరుణ్ణి ధ్యానించినచో ఉపశమించును. విఘ్నమనగా కార్యమును చంపునట్టి లక్షణం. ఇది సృష్టిలో ఉన్నది. సృష్టిలక్షణం అన్నా తప్పు లేదు. ఆ సృష్టి లక్షణాన్ని ఉపశమింప చేయడానికి విఘ్నేశ్వరుని పూజ చేస్తున్నాము.

('సాహిత్య సురభి' అనే పుస్తకంలో విశ్వనాథ ఈ వ్యాఖ్య చేశారు)

## గణమైన ఔషధాలు

**గణేష్ చతుర్థి పూజకి ఉపయోగించే 21 రకాల పత్రులు సాధారణమైనవి కావు. శక్తిమంతమైన దివ్య ఔషధాలు. ఈ మొక్కలు ఏ అడవుల్లోనో ఉండేవి కావు. అన్నీ మన చుట్టూ పెరుగుతున్న మొక్కలే. ఈ 21 రకాల పత్రాల గురించి వివిధ రకాల గ్రంథాల్లో ప్రస్తావించారు.**

### సిద్ధి వినాయక పూజ పత్రాలు

**1. మాచిపత్రి:** (శాస్త్రీయనామం - ఆర్టిమిజీయ పాలెన్స్. ఇది ఆస్టరేసి కుటుంబానికి చెందినది) ఇది మంచి సువాసన గల పత్రి. దీన్ని దద్దుర్లు, తల నొప్పి, వాతనొప్పులు, మధుమేహం, ఉబ్బసం, మూర్ఛ వ్యాధుల నివారణకు వాడతారు.

**2. బృహతీపత్రం అంటే వాకుడు:** శాస్త్రీయనామం పసా- సోలానం సూరత్రేన్స్. ఇది సొలనెసీ కుటుంబానికి చెందినది. దీన్ని దగ్గు, జలుబు, జ్వరం, మూత్ర వ్యాధులు, నేత్రవ్యాధుల నివారణకు వాడతారు.

**3.బిల్వపత్రం (మారేడు):** శాస్త్రీయ నామం - ఈగల్ మార్మిలస్. ఇది రూటేసి కుటుంబానికి చెందినది. దీన్ని జిగట విరేచనాలు, జ్వరం, మధుమేహం, కామెర్లు, నేత్రవ్యాధులు, రక్తహీనత, పగుళ్ళు, గాయాలు మానడానికి వాడతారు.

**4.దుర్వాయుగ్మము (గరిక ):** శాస్త్రీయ నామం - సైనోడాన్ డాక్టైలాన్. ఇది పోయేసి కుటుంబానికి చెందినది.ఇది గాయాలు మానడానికి, చర్మవ్యాధుల నివారణకు, ఉదర, మొలల నివారణకు వాడతారు.

**5.దత్తూరపత్రం (ఉమ్మెత్త ):** శాస్త్రీయనామం - దత్తూర ఇనోక్సీయా. ఇది సొలనేసీ కుటుంబానికి చెందినది. దీన్ని ఉబ్బసం, దగ్గు, శ్వాసకోస సమస్యలు, చర్మవ్యాధులు, కుక్క కాటు చికిత్సకి వాడతారు.

**6. అపామార్గ పత్రం (ఉత్తరేణి):** శాస్త్రీయనామం - అఖిరాంథస్ ఆస్పెరా. ఇది అమరాంథేసి కుటుంబానికి చెందినది. దీనిని దగ్గు, ఆస్తమా సమస్యలు తగ్గించడంలో, దంతాలు శుభ్రపరచడానికి వాడతారు.

**7.బదరీ పత్రం (రేగు):** శాస్త్రీయ నామం - జిజిఫస్ మారిటియాన. ఇది రామినెసీ కుటుంబానికి చెందినది. చర్మ సమస్యలు, మలబద్ధకం,వీరేచనాల నివారణకు వాడతారు.

**8.చూత పత్రం (మామిడి):** శాస్త్రీయ నామం - మాంగిఫెరా ఇండికా. ఇది అనకార్డియేసి కుటుంబానికి చెందినది.నోటి దూర్వసన, చిగుళ్ల వాపు సమస్యలను మామిడి ఆకు బాగా తగ్గిస్తుంది. మామిడి పండ్లలో బీటా కెరొటీన్ పుష్కలంగా ఉంటుంది. ఇది అస్తమా నుండి ఉపశమనం కలిగిస్తుంది.

**9. కరవీర పత్రం (గన్నేరు):** శాస్త్రీయ నామం - నీరియం ఓడోరం. ఇది అపోసైనేసి కుటుంబానికి చెందినది. గడ్డలు, పుండ్లు, గాయాలు తగ్గేందుకు ఈ మొక్క వేరు, బెరడును ఉపయోగిస్తారు.

**10.మరువక పత్రం (మరువం):** శాస్త్రీయనామం - ఒరిగానం మజోరాన. ఇది లామియేసి కుటుంబానికి చెందినది. ఈ ఆకులు సువాసనను వెదజల్లుతాయి. వీటి వాసన చూస్తే ఒత్తిడి వెంటనే తగ్గుతుంది.

**11.శమి పత్రం (జమ్మి):** శాస్త్రీయనామం -ప్రొసోఫిస్ సినరేరియా. ఇది మైమోసేసీ కుటుంబానికి చెందినది. నోటి సంబంధ వ్యాధులు తగ్గించడంలో జమ్మి ఆకులు బాగా పని చేస్తాయి.

**12.విష్ణుక్రాంత పత్రం (నీలపుష్పి)** శాస్త్రీయనామం : ఇవాల్వులస్ అల్సినాయిడిస్. ఇది కన్వాల్వులేసీ కుటుంబానికి చెందినది. దీన్ని నిద్రలేమి, దగ్గు, జ్వరం, విరేచనాలు, కడుపునొప్పి, గాయాలు మానడంలో బాగా సహాయపడుతుంది.

**13.సింధువార పత్రం (వావిలాకు)** శాస్త్రీయనామం - వైటెక్స్ నిగుండో. ఇది వెర్బినెసీ కుటుంబానికి చెందినది. కీళ్ల నొప్పుల సమస్యలు వున్న వారు ఈ ఆకును వాడితే మంచి ఫలితం వస్తుంది.

**14.అశ్వత్థ పత్రం (రావి)** ఈ మొక్క శాస్త్రీయ నామం -ఫైకస్ రెలిజియోస. ఇది మొరేసీ కుటుంబానికి చెందినది. చర్మ సమస్యలకు రావి ఆకు బాగా పనిచేస్తుంది.

**15. దాడిమీ పత్రం (దానిమ్మ ):** శాస్త్రీయనామం - ప్యూనిక గ్రానేటం. ఇది ప్యూనికేసీ కుటుంబానికి చెందినది. వాంతులు, విరేచనాలు అరికట్టడంలో దానిమ్మ ఆకులు బాగా సహాయపడతాయి.

**16. జాజి పత్రం (జాజి మల్లి ):** శాస్త్రీయనామం -జాస్మినం ఆరిక్యులేటం. ఇది ఓలియేసీ కుటుంబానికి చెందినది. చర్మ సమస్యలు వున్న వారు, స్త్రీ సంబంధ వ్యాధులకు ఈ ఆకులు మంచి ఔషధంగా పనిచేస్తాయి.

**17. అర్జున పత్రం (తెల్ల మద్ది):** శాస్త్రీయనామం టెర్మినేలియా అర్జున. ఇది కాంబ్రిటేసి కుటుంబానికి చెందినది. గుండెకు రక్తం బాగా సరఫరా అవడానికి ఈ ఆకులు ఉపయోగపడతాయి. అంతేగాక అల్సర్లు, మధుమేహం, దగ్గు, ఉబ్బసం, చర్మ వ్యాధుల నివారణకు దీని ఆకులు దోహదపడతాయి.

**18.దేవదారు పత్రం(దేవదారు):** శాస్త్రీయనామం -సిడ్రస్ దియోధర. ఇది పైనేసి కుటుంబానికి చెందినది. ఇది చల్లని ప్రదేశాలు అనగా హిమాలయాలల్లో పెరుగుతుంది. ఈ మొక్క ఆకులను ఆరబెట్టి తర్వాత నూనె లో వేసి కాచి చల్లార్చిన తర్వాత నూనె తలకు రాసుకుంటే మెదడు, కంటి సంబంధ వ్యాధులు రాకుండా ఉంటాయి. దేవదారు మాను నుండి తీసిన నూనె చుక్కలను వేడి నీళ్లలో వేసి ఆ నీటితో స్నానం చేస్తే శ్వాస సంబంధ సమస్యలు తొలగుతాయి.

**19. తులసీపత్రం (తులసి):** శాస్త్రీయ నామం -ఆసిమం శాంక్టమ్. ఇది లామియేసీ కుటుంబానికి చెందినది.ఇది రోగ నిరోధక శక్తిని పెంచి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. అంతేగాక జలుబు, దగ్గును నివారిస్తుంది.

**20. గణికా పత్రం (కామంచి):** ఈ మొక్క శాస్త్రీయనామం - సోలానం వర్జినియానం. ఇది సొలనేసీ కుటుంబానికి చెందినది. దగ్గు, జ్వరం, తలనొప్పి, అస్తమా, అతి మూత్ర వ్యాధికి ఈ ఆకులు బాగా పనిచేస్తాయి.

**21.అర్క పత్రం (జిల్లేడు):** ఈ మొక్క శాస్త్రీయ నామం - కెలాట్రోపిస్ జైగాన్షియా. ఈ మొక్క ఆకులు నరాల బలహీనతకి, చర్మ వ్యాధుల నివారణకు వాడతారు.




- డాక్టర్. ఎన్. నారాయణ రెడ్డి, అసోసియేట్ డీన్
డాక్టర్. ఎల్. నాగిరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, పర్యావరణ శాస్త్ర విభాగం

శ్రీ కృష్ణ దేవరాయ ఉద్యాన కళాశాల, అనంతపురం

"తుండమునేకదంతమును, తోరపు బొజ్జయు, వామ హస్తమున్!
మెండుగ మ్రోయు గజ్జెలును, మెల్లని చూపులు, మందహాసమున్ !
కొండొక గుజ్జు రూపమున, కోరిన విద్యల కెల్ల, ఒజ్జయై!
యుండెడి పార్వతీ తనయ, ఓయి గణాధిప నీకు మ్రొక్కెదన్ !!

'వినాయకుడు' అంటే విశిష్టమైన నాయకత్వ లక్షణాలు కలవాడనీ, తనకన్నా పైన వేరే ఎవరూ నాయకుడు లేనివాడనీ అర్థం. వినాయకుడిలోని నాయకత్వ లక్షణాలను, ఆయన రూపాన్ని, ఉత్తమ వ్యక్తిత్వాన్ని మనం సరిగ్గా అర్థం చేసుకుంటే మంచి నాయకులుగా.. వ్యక్తులుగా... వక్తలుగా రాణించ గలుగుతాం. ఆయన నామ, రూపాలలోని విశేషాలను తెలుసుకుందాం.

# భజేహం... భజేహం... మహా గుణపతిం

గణేశ షోడశ నామాల విషయానికొస్తే...

**ఓం వికటాయ నమః**

సగం గజం– సగం మానవ రూపం కలగలసిన వికట రూపుడాయన. సగం మనుష్య, సగం జంతు రూపాలు ధరించిన దేవతలు అంటే వినాయకుడు, హనుమంతుడు, నరసింహస్వామి, హయగ్రీవుడు, వారాహీ మాత, వరాహస్వామి వంటి దేవతలు ఉపాసకులకు సత్వర ఫలితాలు ఇస్తారని పెద్దలు చెబుతారు. ఆయన వికట రూపం ఆనందాన్ని కలిగిస్తుంది. ఆయన వికటకవి అనే విషయాన్ని ఈ నామం తెలియజేస్తుంది!!

**ఓం సుముఖాయ నమః**

ఆయన ముఖం గజ ముఖం. గజం అంటే ఏనుగు! గజాన్ని తిరగ వేస్తే జగం అంటే ప్రపంచం. అంటే ఆయనే విశ్వం– విశ్వమే అయన! గజం ఐశ్వర్య స్వరూపం. అందుకే లక్ష్మీదేవికి ఇరువైపులా అమృతధారలు లేదా కనకాన్ని వర్షించే ఏనుగులు ఉంటాయి.

సుముఖత్వం అంటే ప్రతి మంచి విషయం పట్ల సానుకూలత వ్యక్తం చేయటం



**ఓం వక్రతుండాయ నమః**

ఏనుగు తుండము వక్రంగా ఉంటుంది!!

తుండము 'ఓం' కారానికి ప్రతీక.

ఒక భారీ ఇనుప దూలాన్ని ఎత్తాలంటే ఇప్పుడు మనం భారీ క్రేన్ వాడుతున్నాము కానీ దానిని ఏనుగు తన తొండంతో ఎత్తగలదు అలాగే, ఒక చిన్న సూదిని కూడా తన తొండంతో తీయగలదు. అంటే ఎంత కఠినమైన పని అయినా మనం చేయగలగాలని ఆయన తొండం చెబుతోంది.

**ఓం గజ కర్ణికాయ నమః**
**ఓం శూర్ప కర్ణాయ నమః**

గజ కర్ణములు అంటే ఏనుగులాగా చాలా పెద్ద చెవులున్నాయి. అంటే అనేక విషయాలను పెద్దల ద్వారా వినాలి! విని ఆకళింపు చేసుకోవాలి. వాటిని బాగా అర్థం చేసుకోవాలి.

పెద్ద చెవులు దీర్ఘాయుష్షుకు ప్రతీక. శూర్పకర్ణుడు అంటే చేటల్లాంటి చెవులు గలవాడని అర్థం. శూర్పం అంటే చేట, చేటతో ధాన్యాన్ని చెరిగి, తాలును, పొట్టును వేరు చేసినట్టుగా మనం విన్న అనేక విషయాలలో కేవలం మంచిని మాత్రమే స్వీకరించి, చెడును వదిలేయాలని అర్థం. ఆయన పెద్దచెవులు ఎక్కువ వినాలని, చిన్ననోరు తక్కువ తినాలి... తక్కువ మాట్లాడాలనే సందేశాన్నిస్తాయి.

**ఓం గజాననాయ నమః**

గజాననుడు అంటే ఏనుగు ముఖం కలవాడు! అంటే సూక్ష్మ దృష్టిని. సూక్ష్మబుద్ధిని పెంచుకోవాలని తెలియజేస్తాడు. అంటే నిశితమైన పరిశీలన దృష్టి వుండాలన్నమాట! మందహాసం అంటే ఎల్లప్పుడు నవ్వుతూ ఆనందంతో ఉండాలని మనకు తెలియజేస్తుంది. గజాననుడి రూపం చూస్తేనే పరమానందం కలుగుతుంది.

**ఓం లంబోదరాయ నమః**

కొండొక గుజ్జు రూపమున... అంటారు. అంటే అఖిలాండ కోటి బ్రహ్మాండాలు ఆయన కడుపు (బొజ్జ)లో వున్నాయి. ఆయనకు ఉండ్రాళ్ళు అంటే ఇష్టం. ఆయన పొట్టలో వున్నవన్నీ ఉండ్రాళ్లే కదా! ఇక్కడ ఉండ్రాళ్ళు అంటే బ్రహ్మాండాలు. అనేక కోటి బ్రహ్మాండాలను తన ఉదరంలో దాచుకున్న దామోదర స్వరూపమే ఆయన. అండ-పిండ-బ్రహ్మాండ నాయకుడు. సమస్త విషయాలు ఆయనకు తెలుసు, ఆయనకు తెలియనిది ఏమీ లేదు!!

**ఓం ఏక దంతాయ నమః!!**

ఆయన ఏకదంతుడు! భగవంతుడు ఒక్కడే, నామ రూపాలు వేరైనా పరమాత్మ ఒక్కడే అని సూచిస్తుంది ఈ నామం!!

సకల విద్యలకు ఒజ్జ వినాయకుడు. ఉపాధ్యాయుడికి వికృతి పదం ఒజ్జ. అంటే ఆయన పాదాలను పట్టుకుంటే సర్వ విద్యలను, సర్వ సంపదలను ప్రసాదిస్తాడు.

ఆయనకు ఇద్దరు భార్యలు!! సిద్ధి, బుద్ధి. ఇద్దరు పుత్రులు... ఒకరు క్షేమం, ఇంకొకరు లాభం! అంటే ప్రతి ఒక్కరికీ సిద్ధ సంకల్పం ఉండాలని. మంచి బుద్ధి వుండి దృఢ సంకల్పంతో పని చేస్తే సంకల్పసిద్ధి లభిస్తుంది. అదే మన అనంత జీవన ప్రయాణంలో క్షేమంగా వెళ్ళి లాభంగా రావటానికి సహకరిస్తుంది!!


**మూషిక వాహనాయ నమః**

ఆయన వాహనం ఎలుక. అంత భారీ కాయానికి ఇంత చిన్న ఎలుక వాహనమా... అని ఆశ్చర్యం కలుగుతుంది. ఎలుక మనస్సుకు సంకేతం. అంటే ఎలుకలా చంచలంగా ఉండే మనసును అదుపులో పెట్టుకోవాలని, మనోఏకాగ్రత, చిత్తశుద్ధి, ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండాలని ఈ నామం తెలియజేస్తుంది!!

**ఇది గణేశ తత్త్వం! వ్యక్తిత్వవికాసం**

"ఓ పార్వతీ తనయా! ఓయి గణాధిపా! నీకు ఎల్లవేళలా నమస్కరిస్తున్నాము. మహా గుణపతివైన ఓ స్వామీ! మాకు సకల శుభాలూ ప్రసాదించు!!

– డి.వి.ఆర్. భాస్కర్



● సోషల్ మీడియా

## నైజీరియాలో దేవశ్రీ గణేశ

వినాయక చవితి సందడి, సంబరం మన దేశానికే పరిమితం కాలేదు. నైజీరియన్ స్టూడెంట్స్ కూడా జై గణేశా అంటున్నారు. గణేష్ చతుర్థిని పురస్కరించుకొని నైజీరియన్ విద్యార్థుల బృందం ప్రఖ్యాత ఆధ్యాత్మిక గీతం 'దేవశ్రీ గణేష'కు చేసిన నృత్యం ఆహా అనిపిస్తోంది. నైజీరియాలోని 'గ్రీన్ క్యాచర్స్ అకాడమీ' అనే స్వచ్ఛంద సంస్థ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'హలో ఇండియా...వి హోప్ యూ లవ్ దిస్ వన్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ వీడియోకు మిలియన్ వ్యూస్, 31,000 కామెంట్స్ వచ్చాయి.



**బులియన్** (బంగారం 10 గ్రా.: వెండి కిలో; ఆగస్టు 26న ముగింపు రూ.లలో)

| | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|---|
| బంగారం (24 క్యారెట్లు) | 1,02,610 | 1,04,000 | 1,02,060 | 1,04,000 | 1,02,250 | 1,02,050 |
| బంగారం (22 క్యారెట్లు) | 95,560 | 93550 | 93,550 | 96,360 | 94,070 | 93,550 |
| వెండి | 1,20,000 | 1,20,100 | 1,30,000 | 1,20,100 | 1,19,10 | 1,30,000 |


గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## సంయుక్త ఆధిక్యంలో ప్రజ్ఞానంద



సింక్‌ఫీల్డ్ కప్ గ్రాండ్ చెస్ టూర్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానందలకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. వరుసగా ఐదు 'డ్రా'ల తర్వాత ప్రజ్ఞానంద ఖాతాలో రెండో విజయం చేరగా... ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ రెండో పరాజయం చవిచూశాడు. అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో ఈ టోర్నీ జరుగుతోంది. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు నిర్వహిస్తున్న ఈ టోర్నీలో ఏడో రౌండ్ తర్వాత ఫాబియానో కరువానా (అమెరికా), ప్రజ్ఞానంద 4.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. గుకేశ్ మూడు పాయింట్లతో తొమ్మిదో స్థానంలో ఉన్నాడు. మంగళవారం జరిగిన ఏడో రౌండ్‌లో ప్రజ్ఞానంద 31 ఎత్తుల్లో అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. వెస్లీ సో (అమెరికా)తో జరిగిన గేమ్‌లో గుకేశ్ 39 ఎత్తుల్లో ఓడిపోయాడు. అరోనియన్ (అమెరికా)-కరువానా (అమెరికా) గేమ్ 34 ఎత్తుల్లో... సామ్ సెవియాన్ (అమెరికా)-మాక్సిమి లాగ్రెవ్ (ఫ్రాన్స్) గేమ్ 57 ఎత్తుల్లో 'డ్రా' కాగా... నొదిర్బెక్ (ఉజ్బెకిస్తాన్)తో జరిగిన గేమ్‌లో జాన్ క్రిస్టాఫ్ డూడా (పోలాండ్) 57 ఎత్తుల్లో నెగ్గాడు. ఎనిమిదో రౌండ్‌లో నొదిర్బెక్‌తో అలీరెజా; వెస్లీ సోతో ప్రజ్ఞానంద; సెవియాన్‌తో జాన్ క్రిస్టాఫ్ డూడా; లాగ్రెవ్‌తో కరువానా; అరోనియన్‌తో గుకేశ్ తలపడతారు.

# అల్‌కరాజ్ అలవోకగా...



అల్‌కరాజ్

**రెండో రౌండ్‌లోకి స్పెయిన్ స్టార్**
- స్వియాటెక్ గెలుపు బోణీ
- తొలి రౌండ్‌లోనే నిశేష్ అవుట్

**న్యూయార్క్:** కెరీర్‌లో ఆరో గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంగా యూఎస్ ఓపెన్‌లో బరిలోకి దిగిన ప్రపంచ రెండో ర్యాంకర్, స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ శుభారంభం చేశాడు. అమెరికా ఆజానుబాహుడు, ప్రపంచ 67వ ర్యాంకర్ రీలీ ఒపెల్కాతో మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో అల్‌కరాజ్ 6-4, 7-5, 6-4తో గెలుపొందాడు. 2 గంటల 5 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ నాలుగు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. నెట్ వద్దకు 13 సార్లు దూసుకొచ్చి పదిసార్లు పాయింట్లు గెలిచాడు. 19వ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడుతున్న అల్‌కరాజ్ ఏనాడూ తొలి రౌండ్‌లో ఓడిపోలేదు. మరోవైపు 6 అడుగుల 11 అంగుళాల ఎత్తు, 102 కేజీల బరువున్న ఒపెల్కా 14 ఏస్‌లతో విరుచుకుపడ్డా... తొమ్మిది డబుల్ ఫాల్ట్‌లు, 32 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు. ఐదో సీడ్ డ్రేపర్ (బ్రిటన్), 8వ సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ), 11వ సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్), 12వ సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) కూడా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. తొలి రౌండ్‌లో డ్రేపర్ 6-4, 7-5, 6-7 (7/9), 6-2తో ఫెడెరికో గోమెజ్ (అర్జెంటీనా)పై, ముసెట్టి 6-7 (3/7), 6-3, 6-4, 6-4తో పెరికార్డ్ (ఫ్రాన్స్)పై, రూడ్ 6-1, 6-2, 7-6 (7/5)తో ఆఫ్నెర్ (ఆస్ట్రియా)పై, రూనె 6-3, 7-6 (7/4), 7-6 (7/2)తో జాండ్‌షుల్ప్ (నెదర్లాండ్స్)పై గెలిచారు. తెలుగు సంతతికి చెందిన అమెరికా ప్లేయర్ నిశేష్ బసవరెడ్డి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. 'వైల్డ్ కార్డు'తో పోటీపడ్డ 20 ఏళ్ల నిశేష్ 7-6 (7/5), 3-6, 5-7, 1-6తో తొమ్మిదో సీడ్ ఖచనోవ్ (రష్యా) చేతిలో పోరాడి ఓడాడు. తొలి రౌండ్‌లో ఓడిన నిశేష్‌కు 1,10,000 డాలర్లు (రూ. 96 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.



వీనస్

**వీనస్ తొలి రౌండ్‌లోనే...**

మహిళల సింగిల్స్ విభాగంలో అమెరికా వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. 2000, 2001లలో విజేతగా నిలిచిన 45 ఏళ్ల వీనస్‌కు నిర్వాహకులు ఈసారి 'వైల్డ్ కార్డు' కేటాయించడంతో 25వ సారి ఆమె యూఎస్ ఓపెన్ టోర్నీలో బరిలోకి దిగింది. ప్రపంచ 13వ ర్యాంకర్ కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్)తో జరిగిన తొలి రౌండ్‌లో వీనస్ 3-6, 6-2, 1-6తో ఓటమి పాలైంది. రెండు గంటలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో వీనస్ పది డబుల్ ఫాల్ట్‌లు, 24 అనవసర తప్పిదాలు చేసింది. మరోవైపు రెండో సీడ్ స్వియాటెక్ (పోలాండ్), ఐదో సీడ్ మీరా ఆంద్రీవా (రష్యా), తొమ్మిదో సీడ్ రిబాకినా (కజకిస్తాన్) శుభారంభం చేశారు. తొలి రౌండ్‌లో స్వియాటెక్ 6-1, 6-2తో ఎమిలియానా అరాంగో (కొలంబియా)పై, ఆంద్రీవా 6-0, 6-1తో అలీసియా పార్క్స్ (అమెరికా)పై, రిబాకినా 6-3, 6-0తో జూలియెటా పరీజా (అమెరికా)పై నెగ్గగా... 12వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) తొలి రౌండ్‌లో 2-6, 4-6తో అనా బొండార్ (హంగేరి) చేతిలో ఓడిపోయింది.



# సింధు శుభారంభం

- ప్రణయ్ కూడా రెండో రౌండ్‌లోకి
- ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

**పారిస్:** మరో పతకం లక్ష్యంగా ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో అడుగు పెట్టిన భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, ప్రణయ్ తొలి రౌండ్ అడ్డంకిని దాటారు. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో మాజీ చాంపియన్ సింధు 23-21, 21-6తో ప్రపంచ 69వ ర్యాంకర్ కలోయానా నల్బంతోవా (బల్గేరియా)పై విజయం సాధించింది. 39 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ 15వ ర్యాంకర్ సింధుకు తొలి గేమ్‌లో గట్టిపోటీ ఎదురైంది. సింధు రెండుసార్లు గేమ్ పాయింట్లను కాచుకోవడం గమనార్హం. తొలి గేమ్‌ను సొంతం చేసుకున్న సింధు రెండో గేమ్‌లో మాత్రం దూకుడుగా ఆడింది. స్కోరు 6-5 వద్ద సింధు చెలరేగి వరుసగా 14 పాయింట్లు స్కోరు చేయడం విశేషం. నేడు జరిగే రెండో రౌండ్‌లో ప్రపంచ 40వ ర్యాంకర్ కరుపథెవన్ లెట్షానా (మలేసియా)తో సింధు ఆడుతుంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో 2023 ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత ప్రణయ్ 21-18, 21-15తో ప్రపంచ 47వ ర్యాంకర్ జోకిమ్ ఒల్డార్ఫ్ (ఫిన్‌లాండ్)పై గెలుపొందాడు. 47 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో ప్రణయ్‌కు ప్రత్యర్థి నుంచి ప్రతిఘటన ఎదురైనా కీలకదశలో పైచేయి సాధించి విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. నేడు జరిగే రెండో రౌండ్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఆండెర్స్ ఆంటోన్‌సెన్ (డెన్మార్క్)తో ప్రణయ్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో ఇద్దరు 2-2తో సమంగా ఉన్నారు.

**రుత్విక-రోహన్ జోడీ బోణీ**

మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్) ద్వయం 18-21, 21-16, 21-18తో లియోంగ్ లోక్ చోంగ్-ఎన్జీ వెంగ్ చి (మకావ్) జంటపై గెలుపొందింది. నేడు జరిగే రెండో రౌండ్‌లో ప్రపంచ నాలుగో ర్యాంక్ జోడీ చెన్ టాంగ్ జి-తో ఈ వె (మలేసియా)తో రుత్విక-రోహన్ ద్వయం పోటీపడుతుంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో హరిహరన్-రూబన్ కుమార్ (భారత్) జోడీ 15-21, 5-21తో లియు కువాంగ్ హెంగ్-యాంగ్ పో హాన్ (చైనీస్ తైపీ) జంట చేతిలో ఓడిపోయింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం నేడు జరిగే రెండో రౌండ్‌లో లియు కువాంగ్ హెంగ్-యాంగ్ పో హాన్‌లతో ఆడుతుంది.



సిఫ్ట్ కౌర్

# భారత షూటర్ల పసిడి పంట

- రెండు స్వర్ణాలతో సిఫ్ట్ కౌర్, అనుష్క డబుల్ ధమాకా
- ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్

**షిమ్‌కెంట్ (కజకిస్తాన్):** ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఇటు సీనియర్లు, అటు జూనియర్లు పసిడి పంట పండిస్తున్నారు. సీనియర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్‌లో ఒలింపియన్ సిఫ్ట్ కౌర్ సమ్రా వ్యక్తిగత, టీమ్ ఈవెంట్‌లో బంగారు పతకాలు గెలుచుకుంది. ఫైనల్లో 23 ఏళ్ల సిఫ్ట్ కౌర్ 459.2 స్కోరుతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. టీమ్ విభాగంలో సిఫ్ట్ కౌర్ సమ్రా (589), ఆషి చౌక్సీ (586), అంజుమ్ మౌద్గిల్ (578)లతో కూడిన భారత బృందం మొత్తం 1753 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. క్వాలిఫయింగ్‌లో భారత్‌కే చెందిన శ్రీయాంక సదంగి 'టాప్'లో నిలిచింది. అయితే శ్రీయాంక 'ర్యాంకింగ్ పాయింట్స్ ఓన్లీ' (ఆర్‌పీఓ)లో పోటీపడటంతో పతకం బరిలో నిలిచే అవకాశం దక్కలేదు. ఆర్‌పీఓ షూటర్లకు మెడల్ రౌండ్ చాన్స్ ఉండదు.

జూనియర్ ఈవెంట్‌లో షూటర్ అనుష్క ఠాకూర్ పసిడిపై గురిపెట్టి తొలిసారి అంతర్జాతీయ పతకాలతో డబుల్ ధమాకా సాధించింది. జూనియర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్‌లో 18 ఏళ్ల అనుష్క 460.7 స్కోరుతో ప్రథమ స్థానంలో నిలిచింది. అనుష్క (583), ప్రాచీ గైక్వాడ్ (588), మహిత్ సంధూ (587) బృందం 1758 స్కోరుతో పసిడి పతకాన్ని గెల్చుకుంది.

జూనియర్ పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో సమీర్ కాంస్యం నెగ్గాడు. ఫైనల్లో సమీర్ 21 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. సమీర్, సూరజ్ శర్మ, అభినవ్ కలిసి టీమ్ ఈవెంట్‌లో పసిడి పతకం నెగ్గారు. జూనియర్ మహిళల ట్రాప్ ఈవెంట్‌లో హరీస్ సబీరా స్వర్ణం, ఆద్య రజతం నెగ్గారు. టీమ్ ఈవెంట్‌లో సబీర-ఆద్య-భవ్యలతో కూడిన త్రయం కూడా బంగారు పతకం గెలిచింది. ఆర్యవంశ్-అర్జున్-ఉద్ధవ్‌లతో కూడిన జూనియర్ పురుషుల టీమ్ కూడా పసిడి పతకం నెగ్గింది. ఓవరాల్‌గా భారత్ 31 స్వర్ణాలు, 11 రజతాలు, 14 కాంస్యాలతో కలిపి 56 పతకాలతో 'టాప్' ర్యాంక్‌లో కొనసాగుతోంది.

## గోవాలో ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్

- అక్టోబర్ 30 నుంచి పోటీలు
- బరిలో కార్ల్‌సన్, గుకేశ్, ప్రజ్ఞానంద


**ముంబై:** భారత్ మరో ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్‌కు ఆతిథ్యమివ్వబోతోంది. గోవాలో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 27 వరకు ఈ మెగా టోర్నీ జరుగుతుంది. టోర్నీ ప్రైజ్ మనీ 20 లక్షల డాలర్లు (రూ.17 కోట్ల 37 లక్షలు). నార్వే దిగ్గజం కార్ల్‌సన్, ప్రస్తుత ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్, అమెరికా స్టార్ కరువానా, ప్రజ్ఞానంద, ఇరిగేశి అర్జున్ సహా ప్రపంచ వ్యాప్తంగా 206 మంది ప్లేయర్లు ఈ టోర్నీలో పాల్గొంటారు. భారత్ నుంచి 21 మంది ఆటగాళ్లు బరిలోకి దిగుతారు. ఈ టోర్నీలో టాప్-3 స్థానాల్లో నిలిచిన ప్లేయర్లు వచ్చే ఏడాది జరిగే 'క్యాండిడేట్స్ టోర్నీ'కి అర్హత సాధిస్తారు. మొత్తం మీద 23 ఏళ్ల తర్వాత భారత్‌లో మళ్లీ ప్రపంచకప్ టోర్నీ జరగనుంది. ప్రతిష్టాత్మక ఈ టోర్నీ 2002లో హైదరాబాద్‌లో నిర్వహించగా... ఆనంద్ విజేతగా నిలిచాడు.

**ఆంధ్రకు విహారి గుడ్‌బై**

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

# సాక్షి సినిమా

## బాహుబలి: ది ఎపిక్



ప్రభాస్

తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన చిత్రం 'బాహుబలి'. ప్రభాస్ హీరోగా, అనుష్క, తమన్నా హీరోయిన్లుగా, రానా, రమ్యకృష్ణ, సత్యరాజ్ ముఖ్య తారలుగా నటించారు. ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహించారు. శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మించిన 'బాహుబలి: ది బిగినింగ్' 2015 జూలై 15న, 'బాహుబలి 2: ది కన్‌క్లూజన్' 2017 ఏప్రిల్ 28న రెండు భాగాలుగా విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచి, ఎన్నో రికార్డులు సాధించిన సంగతి తెలిసిందే. కాగా 'బాహుబలి: ది బిగినింగ్' విడుదలై పదేళ్లు అయిన సందర్భంగా ఈ చిత్రాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు మేకర్స్. తొలి, ద్వితీయ భాగాలను కలిపి 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో అక్టోబరు 31న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ని మంగళవారం సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు రాజమౌళి. విడుదలైన కొద్ది సమయంలోనే టీజర్ ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారడం విశేషం. 'బాహుబలి: ది ఎపిక్' ప్రమోషన్స్‌ని త్వరలోనే ప్రారంభించనున్నారట మేకర్స్.

## మాస్ జాతర వాయిదా



రవితేజ

రవితేజ హీరోగా నటించిన 'మాస్ జాతర' సినిమా విడుదల వాయిదా పడింది. రవితేజ కెరీర్‌లోని ఈ 75వ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో లక్ష్మణ్ భేరి అనే రైల్వే పోలీసాఫీసర్ పాత్రలో నటించారు రవితేజ. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో నవీన్ చంద్ర కీలక పాత్ర పోషించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రాన్ని నేడు విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే నేటి విడుదలని వాయిదా వేశామని చిత్రబృందం మంగళవారం ప్రకటించింది. ''ఇటీవల తెలుగు చిత్ర పరిశ్రమలో జరిగిన సమ్మె, కీలకమైన కంటెంట్‌ను పూర్తి చేయడంలో ఊహించని జాప్యం కారణంగా 'మాస్ జాతర' రిలీజ్‌ను వాయిదా వేస్తున్నాం. ఆలస్యమైనా మంచి అనుభూతిని అందించే విధంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

## వారం ఆలస్యంగా మిరాయ్



తేజ సజ్జా, మంచు మనోజ్

'హను మాన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత తేజా సజ్జా హీరోగా నటించిన చిత్రం 'మిరాయ్'. ఈ సినిమాలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, మంచు మనోజ్, శ్రియ శరణ్, జగపతి బాబు, జయరామ్ కీలక పాత్రల్లో నటించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రంలో సూపర్ యోధ పాత్రలో తేజ నటించగా, బ్లాక్ స్వోర్డ్‌గా మనోజ్ కనిపిస్తారు. ఈ సినిమాని సెప్టెంబరు 5న రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. అయితే వారం ఆలస్యంగా సెప్టెంబరు 12న రిలీజ్ చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''ఈ నెల 28న 'మిరాయ్' ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం. సెప్టెంబరు 12న ఎనిమిది భాషల్లో 2డీ, 3డీ ఫార్మాట్స్‌లో సినిమాను రిలీజ్ చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: గౌర హరి.

## నా పాత్ర సరికొత్తగా ఉంటుంది
**- వశిష్ట ఎన్. సింహా**



''త్రిబాణధారి బార్బరిక్' చిత్ర కథ మన చుట్టూనే జరుగుతున్నట్టుగా అనిపిస్తుంది. ఇప్పటి వరకు నేను నెగెటివ్ రోల్స్ పోషించాను. కానీ, ఈ సినిమాలో నా పాత్ర సరికొత్తగా ఉంటుంది. సమాజాన్ని ప్రతిబింబించేలా మా చిత్రం, నా పాత్ర ఉంటుంది'' అని వశిష్ట ఎన్. సింహా తెలిపారు. సత్యరాజ్, 'సత్యం' రాజేష్, ఉదయభాను, వశిష్ట ఎన్. సింహా కీలక పాత్రలు పోషించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. మారుతీ టీమ్ ప్రొడక్ట్ సమర్పణలో విజయపాల్ రెడ్డి అడిదల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో వశిష్ట ఎన్. సింహా మాట్లాడుతూ- ''ఈ చిత్రంలో బార్బరికుడు కనిపించడు.. అతని శక్తిని చూస్తారు. ఈ చిత్రం చూశాక మన జీవితంలోనూ సత్య రాజ్‌గారి లాంటి ఓ తాత ఉంటే బాగుంటుందనిపిస్తుంది. ఉత్తరాది, దక్షిణాది అని కాకుండా అందరికీ కనెక్ట్ అయ్యే భావోద్వేగాలతో తీశాం. మా చిత్రం ప్రేక్షకులను ఎక్కడా నిరాశ పరచదు. విజయ్‌పాల్ రెడ్డికి సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. దర్శకుడు మోహన్‌కి మంచి భవిష్యత్తు ఉంటుంది. మా అబ్బాయికి ప్రస్తుతం ఏడు నెలలు. బాబే మా ప్రపంచం (హరిప్రియ-వశిష్ట). షూటింగ్‌కి వెళ్లినప్పుడు తనని చాలా మిస్ అవుతున్నాను'' అని చెప్పారు.

## ఎందుకు రప్పించారు?



నస్లెన్, కల్యాణి

''నన్ను ఇప్పుడు ఇక్కడికి ఎందుకు రప్పించారు? ఏదైనా సమస్యా?' అంటూ మొదలవుతుంది 'కొత్తలోక 1: చంద్ర' సినిమా ట్రైలర్. సూపర్ హీరో చంద్రగా కల్యాణీ ప్రియదర్శన్ నటించిన మలయాళ చిత్రం 'లోక చాప్టర్1: చంద్ర'. డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహించారు. 'ప్రేమలు' ఫేమ్ నస్లెన్ కె.గఫూర్ కీలక పాత్ర పోషించారు. వేఫేరర్ ఫిలిమ్స్‌పై దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ చిత్రాన్ని తెలుగులో 'కొత్త లోక 1: చంద్ర' పేరుతో నిర్మాత సూర్యదేవర నాగవంశీ పంపిణీ చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను మంగళవారం రిలీజ్ చేశారు మేకర్స్.

## ఎన్నో ఒడుదొడుకులు ఉంటాయి
**- మంచు మనోజ్**



నారా రోహిత్, మంచు మనోజ్

''ఓ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం అంత సులభం కాదు. దాని వెనుక ఎంతో మంది శ్రమ ఉంటుంది. ఇండస్ట్రీలో పనిచేసే వారిని సినిమా వాళ్లులే అని చాలా మంది సులభంగా అనేస్తారు. దాని వెనుక ఎన్నో త్యాగాలు, మరెన్నో ఒడుదొడుకులు ఉంటాయి. వాటిని దాటుకొని రాగలిగితేనే ఇక్కడ ఉండగలం'' అని హీరో మంచు మనోజ్ చెప్పారు. నారా రోహిత్ హీరోగా, వృతి వాఘాని, శ్రీదేవి విజయ్ కుమార్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సుందరకాండ'. వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన మంచు మనోజ్ మాట్లాడుతూ- ''సుందర కాండ' చిత్రానికి ప్రేక్షకులు గొప్ప విజయం అందించాలి'' అని కోరారు. ''ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో కలిసి మా సినిమా చూసి, మమ్మల్ని ఆశీర్వదించండి'' అని నారా రోహిత్ పేర్కొన్నారు. ''మా మూవీ చూసి ఎంజాయ్ చేస్తారనుకుంటున్నాం'' అని సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి తెలిపారు.

## ఒగ్గు కళాకారుల నేపథ్యంతో...



బన్నీ రాజు, కనిక

బన్నీ రాజు, ఆమని, బలగం జయరాం, కొమరక్క, కనిక ప్రధాన పాత్రల్లో ఒగ్గు కళాకారుల నేపథ్యంతో రూపొందిన సినిమా 'బ్రహ్మాండ'. రాంబాబు దర్శకత్వంలో దాసరి సురేష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆమని మాట్లాడుతూ- ''బ్రహ్మాండ' ప్రేక్షకులకి కొత్త అనుభూతిని ఇస్తుంది. ఇంత మంచి సినిమా చేసిన దర్శకుడు రాంబాబుగారు మన మధ్య లేకపోవడం బాధాకరం'' అని తెలిపారు. 'ఈ సినిమా నా కెరీర్‌లో గుర్తుండిపోతుంది'' అని చెప్పారు బన్నీ రాజు. ''మేము అనుకున్న కథని అనుకున్నట్టుగా తెరకెక్కించాం'' అన్నారు దాసరి సురేష్. ఈ సినిమాకు సంగీతం: వరికుప్పల యాదగిరి.

## హర హర శంకర...



రమణ్, వర్ష

''నలభై ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉంటున్నాను. ప్రస్తుతం కొత్త రక్తం వస్తోంది. 'మటన్ సూప్' టీమ్ కష్టానికి తగ్గ ప్రతిఫలం రావాలి. ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి'' అని తనికెళ్ల భరణి చెప్పారు. రమణ్, వర్ష విశ్వనాథ్, జెమినీ సురేష్, గోవింద్ శ్రీనివాస్, శివరాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మటన్ సూప్'. రామచంద్ర వట్టికూటి దర్శకత్వంలో రామకృష్ణ వట్టికూటి సమర్పణలో మల్లికార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మించారు. ఈ చిత్రంలోని 'హర హర శంకర...' పాటను తనికెళ్ల భరణి విడుదల చేశారు. ''ఈ పాటను వింటుంటే నాకు కన్నీళ్లు వస్తాయి. సినిమాను ఆదరించాలి'' అన్నారు రమణ్. ''సెప్టెంబరులో మా సినిమా విడుదల చేయనున్నాం'' అని తెలిపారు రామచంద్ర వట్టికూటి. ''తనికెళ్ల భరణి'గారు మా సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి రావడమే మా సినిమా తొలి సక్సెస్'' అన్నారు నిర్మాతలు. ఈ కార్యక్రమంలో నటి సునీత, నటుడు గోవింద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు, నిర్మాత శివ మల్లాల మాట్లాడారు.

## హరి గాని కథ



ప్రియ, హరి

హరి ఎడ్లపల్లి, ప్రియ హెగ్డే జంటగా నటిస్తున్న చిత్రం 'హరి గాని హరి కథ'. సర్వేష్ వైవి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సురభి ఎంటర్‌టైన్మెంట్స్‌పై సురభి హరీందర్ రావు నిర్మిస్తున్న ఈ సినిమాలో ఫారిన్ నటి అలేస్సంద్ర వేల్లన్ ప్రతి నాయకిగా నటిస్తున్నారు. ''వైవిధ్యమైక కథాంశంతో రూపొందుతోన్న చిత్రమిది. మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: ప్రవీణ్ రెడ్డి, సంగీతం: మాధవ ఆడి.

సాక్షి బిజినెస్
బుధవారం
27-8-2025

**స్టాక్ మార్కెట్లు** (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
|---|---|
| 849 | 256 |
| 80,787 | 24,712 |


**విదేశీ సూచీలు**

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 21,464 | △ | 14 |
| డోజోన్స్ | 45,287 | △ | 5 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 9,248 | ▽ | 74 |
| డాక్స్ | 24,194 | ▽ | 79 |
| షాంఘై | 3,868 | ▽ | 15 |
| నికాయ్ | 38,211 | ▽ | 413 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 87.34 | 88.36 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 115.80 | 118.75 |
| € | యూరో | ఎస్‌బీఐ | 100.80 | 103.56 |
| ¥ | జపాన్ యెన్ (100) | ఎస్‌బీఐ | 58.74 | 60.23 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 55.63 | 57.87 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 65.91 | 69.61 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 22.47 | 23.97 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 22.95 | 24.21 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 11.36 | 13.19 |



# అదనపు సుంకాల మోత షురూ!

- అమెరికాకు ఎగుమతులపై మరో 25% టారిఫ్‌లు నేటి నుంచే అమల్లోకి
- కార్మికులు అత్యధికంగా ఉండే రంగాలపై తీవ్ర ప్రభావం
- దుస్తులు, తోలు ఉత్పత్తులు, రొయ్యలు, రత్నాభరణాలపై ఎఫెక్ట్
- 66 శాతం ఎగుమతులకు ప్రతికూలం

**రష్యా నుంచి చమురు కొంటున్నామన్న సాకుతో భారత ఎగుమతులపై అమెరికా ప్రకటించిన 25 శాతం అదనపు సుంకాలు నేటి నుంచే (ఆగస్టు 27) అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే ప్రకటించిన 25 శాతానికి ఇవి అదనం కావడంతో టారిఫ్‌ల భారం 50 శాతానికి పెరిగినట్లవుతుంది. ఫలితంగా ఎగుమతుల్లో ఏకంగా 66 శాతం వాటాతో, కార్మిక శక్తి అత్యధికంగా ఉండే రొయ్యలు, దుస్తులు, తోలు, రత్నాభరణాల్లాంటి ఎక్స్‌పోర్ట్ ఆధారిత పరిశ్రమలపై తీవ్ర ప్రభావం పడనుంది.**

*- సాక్షి, బిజినెస్ డెస్క్*

'అమెరికాలో వినియోగానికి భారత్ నుంచి వచ్చిన ఉత్పత్తులపై అదనపు సుంకాలు ఆగస్టు 27 ఈస్టర్న్ డేలైట్ సమయం 12.01 గం.ల నుంచి (భారతీయ కాలమానం ప్రకారం ఆగస్టు 27 ఉదయం 9.31 గం.లు) వర్తిస్తాయి' అని అమెరికా ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. దీని వల్ల అమెరికా మార్కెట్లో చాలా మటుకు భారతీయ ఉత్పత్తులకు చోటు లేకుండా పోతుందని ఎగుమతిదార్లు ఆందోళన వ్యక్తం చేశారు. మనకన్నా తక్కువ సుంకాలు వర్తించే బంగ్లాదేశ్, వియత్నాం, శ్రీలంక, కాంబోడియా, ఇండొనేషియా లాంటి దేశాలతో పోటీ పడే పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, పెట్రోలియం ఉత్పత్తుల్లాంటి 30 శాతం ఎగుమతులకు మాత్రమే ప్రస్తుతం మినహాయింపు ఉంటుంది. అమెరికా వాణిజ్య గణాంకాల ప్రకారం గతేడాది భారత్ నుంచి ఎగుమతులు 91.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అయితే, జీఎస్‌టీ రేట్ల సవరణతో దేశీయంగా వినియోగం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి కాబట్టి, అమెరికా సుంకాల భారం పడినప్పటికీ భారత్ వృద్ధిపై పెద్దగా ప్రభావం ఉండదని ఆర్థికవేత్తలు తెలిపారు.

**ఈసారి 49 బిలియన్ డాలర్లకు డౌన్..**

టారిఫ్‌ల భారం వల్ల అమెరికాకు 66 శాతం ఎగుమతులపై (దాదాపు 60.2 బిలియన్ డాలర్ల విలువ) ప్రభావం పడుతుందని మేధావుల సంఘం జీటీఆర్‌ఐ తెలిపింది. 'ఇటీవలి కాలంలో భారత్‌కి తగిలిన అత్యంత తీవ్రమైన వాణిజ్య షాక్‌లలో ఇదొకటి. 86.5 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎగుమతుల్లో మూడింట రెండొంతుల వాటిపై భారీ స్థాయిలో 50 శాతం టారిఫ్‌లు విధించడం వల్ల టెక్స్‌టైల్స్, రత్నాభరణాలు, రొయ్యలు, కార్పెట్లు, ఫర్నిచర్ మొదలైన కార్మిక శక్తి ఎక్కువగా ఉండే రంగాలు పోటీని దీటుగా ఎదుర్కోలేని పరిస్థితి ఏర్పడి ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ రంగాల నుంచి ఎగుమతులు 70 శాతం పడిపోయి 18.6 బిలియన్ డాలర్లకు క్షీణించవచ్చు. వేల కొద్దీ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతుంది' అని జీటీఆర్‌ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ చెప్పారు. దీనితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు ఎగుమతులు గణనీయంగా 49.6 బిలియన్ డాలర్లకు పడిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఒకవేళ తర్వాతెప్పుడో టారిఫ్‌లను సవరించినా.. అప్పటికే ఆలస్యమవుతుందని, చైనా, వియత్నాం, మెక్సికోతో పాటు ఆఖరికి పాకిస్తాన్, నేపాల్‌లాంటి దేశాలు కూడా మన స్థానాన్ని ఆక్రమించేసే అవకాశం ఉందని శ్రీవాస్తవ పేర్కొన్నారు.

**తిరుపూర్, సూరత్‌లో నిల్చిపోయిన ఉత్పత్తి..**

సుంకాల పెంపు కారణంగా తిరుపూర్, నోయిడా, సూరత్‌లోని దుస్తుల తయారీ సంస్థలు ఉత్పత్తి నిలిపివేసినట్లు ఎగుమతి సంస్థల సమాఖ్య ప్రెసిడెంట్ ఎస్‌సీ రాల్హన్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం రెడీమేడ్ గార్మెంట్స్ పరిశ్రమ ఆదాయ వృద్ధి సగానికి పడిపోయి 3–5 శాతం స్థాయికి పరిమితం కావొచ్చని క్రిసిల్ రేటింగ్స్ ఒక నివేదికలో తెలిపింది. దీంతో కంపెనీలు యూరోపియన్ యూనియన్, బ్రిటన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లాంటి ఇతరత్రా మార్కెట్ల వైపు చూడాల్సి ఉంటుందని వివరించింది.

**సిబ్బంది.. ఉత్పత్తి కోత ..**

అదనపు టారిఫ్‌ల మోత మొదలవుతున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై (బీటీఏ) స్పష్టత వచ్చే వరకు ఉత్పత్తిని నిలిపివేసి, సిబ్బందిని తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తోలు, పాదరక్షల పరిశ్రమ వర్గాలు తెలిపాయి. 'మనకు అమెరికానే అతి పెద్ద మార్కెట్ కాబట్టి ఆభరణాలు, వజ్రాల రంగంలో ఉద్యోగాల కోత తప్పదు' అని రత్నాభరణాల ఎగుమతిదారు ఒకరు తెలిపారు. ఇలాంటి భారీ టారిఫ్‌లను ఎదుర్కొనేందుకు దీర్ఘకాలిక ఎగుమతి వ్యూహం అవసరమని పేర్కొన్నారు. వడ్డీ సబ్సిడీ, వ్యాపారాల నిర్వహణను సులభతరం చేయడం, సకాలంలో జీఎస్‌టీ బకాయిలను రిఫండ్ చేయడం, ప్రత్యేక ఆర్థిక మండలి చట్టాన్ని సంస్కరించడం తదితర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. 10.3 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేసే టెక్స్‌టైల్స్ పరిశ్రమ, టారిఫ్‌ల మోత వల్ల అత్యధికంగా నష్టపోనుందని అపారెల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఏఈపీసీ) సెక్రటరీ జనరల్ మిథిలేశ్వర్ ఠాకూర్ తెలిపారు.

### అనిశ్చితి.. సవాళ్లు

కొన్ని ఉత్పత్తుల విషయంలో సగానికి పైగా ఎగుమతులకు అమెరికా గమ్యస్థానంగా ఉంటోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కోవడం సవాలుగా మారనుంది. ప్రధానంగా సోలార్ మాడ్యూల్స్ ఎక్స్‌పోర్ట్స్‌లో 98% అమెరికా వాటా ఏకంగా 98%గా (1.6 బిలియన్ డాలర్లు) ఉంది. బ్రిటన్, యూఏఈ, ఆస్ట్రేలియా లాంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ) కుదుర్చుకున్నప్పటికీ ఆ మార్కెట్లు ఇంత భారీ స్థాయిలో ఉత్పత్తులను తీసుకునే పరిస్థితి లేకపోవడం వల్ల పెద్దగా ఊరట ఉండకపోవచ్చు. అమెరికాపై అత్యధికంగా ఆధారపడే 1 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉండే ఉన్ని కార్పెట్లు, బెడ్ లినెన్ ఎగుమతులకూ రిస్కులు నెలకొన్నాయి. సిమెంటు, ఆర్టిఫిషియల్ స్టోన్స్ 88 శాతం ఎగుమతులకు అమెరికానే గమ్యస్థానంగా ఉంటోంది. రొయ్యల ఎగుమతుల్లో 80 శాతం (సుమారు 420 మిలియన్ డాలర్లు) అగ్రరాజ్యానికే వెళ్తున్నాయి.

**ప్రత్యామ్నాయ మార్కెట్లపై ఫోకస్..**

ఎగుమతుల కోసం అమెరికాపై పెద్దగా ఆధారపడాల్సిన అవసరం లేని ఉత్పత్తులు కూడా కొన్ని ఉన్నాయి. ప్రస్తుతం అమెరికాకు ఎగుమతుల్లో వీటి విలువ దాదాపు 10 బిలియన్ డాలర్లుగా ఉంటోంది. ఇంద్రనీలం, కెంపులు, న్యూమాటిక్ టైర్లలాంటివి వీటిలో ఉన్నాయి. వీటిని వేరే మార్కెట్ల వైపు మళ్లించే అవకాశం ఉంటుంది.

| 'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో .. | |
|---|---|
| పవన విద్యుత్‌కు మహర్దశ | లిస్టింగ్‌లో 3 హిట్.. 1 ఫట్ |

## టారిఫ్ దెబ్బ.. అమ్మకాల వెల్లువ

- సెన్సెక్స్ 849 పాయింట్లు డౌన్
- 256 పాయింట్లు పతనమైన నిఫ్టీ



**ముంబై:** అమెరికాలో దిగుమతయ్యే భారతీయ ఉత్పత్తులపై అదనపు 25% సుంకం విధిస్తున్నట్లు అమెరికా డ్రాఫ్ట్ నోటీసు జారీ చేయడంతో దేశీయ స్టాక్ మార్కెట్లో ఒక్కసారిగా అమ్మకాలు వెల్లువెత్తాయి. విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు సెంటిమెంట్ దెబ్బతీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 849 పాయింట్లు నష్టపోయి 80,787 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 256 పాయింట్లు పతనమై 24,712 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో సూచీలు బలహీనంగా మొదలయ్యాయి. ఎఫ్‌ఎంసీజీ మినహా అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. రియల్టీ, ఫార్మా, బ్యాంకింగ్, మెటల్ షేర్లలో పెద్ద ఎత్తున అమ్మకాలు తలెత్తాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 949 పాయింట్లు క్షీణించి 80,686 వద్ద, నిఫ్టీ 278 పాయింట్లు కోల్పోయి 24,690 వద్ద కనిష్టాన్ని తాకాయి.

- సూచీల పతనంతో రూ.5.41 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద హరించుకుపోయింది. బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.449.45 లక్షల కోట్లకు తగ్గింది.

వినాయక చవితి సందర్భంగా
**నేడు మార్కెట్లకు సెలవు**

# 5 ఏళ్లు.. 70,000 కోట్లు

- సుజుకీ మోటార్ పెట్టుబడి ప్రణాళికలు
- దేశీ కార్యకలాపాల పటిష్టతకు దన్ను
- కంపెనీ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ
- మారుతీ తొలి ఎలక్ట్రిక్ కారు ఈ–విటారా ఎగుమతులు ప్రారంభం

**హన్సల్‌పూర్, గుజరాత్:** ఆటో రంగ జపనీస్ దిగ్గజం సుజుకీ మోటార్ కార్పొరేషన్ భారత్‌లో రానున్న 5–6ఏళ్లలో రూ. 70,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. తద్వారా దేశీయంగా కార్యకలాపాలను మరింత పటిష్టపరచుకోనున్నట్లు కంపెనీ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ పేర్కొన్నారు. దేశీ అనుబంధ సంస్థ మారుతీ సుజుకీ తొలిసారిగా రూపొందించిన ఎలక్ట్రిక్ కారు ఈ–విటారా ఎగుమతులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. అంతేకాకుండా హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహన తయారీలో వినియోగించే లిథియంఅయాన్ బ్యాటరీ సెల్స్ ఉత్పత్తికి సైతం ప్రధాని తెరతీశారు. రానున్న 5–6 ఏళ్లలో దేశీయంగా రూ. 70,000 కోట్ల పెట్టుబడులను చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొషిహిరో వెల్లడించారు. భారత్ మొబిలిటీ ప్రయాణంలో నాలుగు దశాబ్దాలుగా భాగస్వామి అయినందుకు గర్వపడుతున్నట్లు చెప్పారు. గ్రీన్ మొబిలిటీ, వికసిత భారత్ లక్ష్యాల సాధనలో మద్దతివ్వడానికి కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నారు. వార్షికంగా 40 లక్షల యూనిట్ల తయారీ లక్ష్యాన్ని అందుకునేందుకు తాజా పెట్టుబడులను వినియోగించనున్నట్లు మారుతీ సుజుకీ ఇండియా చైర్మన్ ఆర్‌సీ భార్గవ తెలిపారు. ఇందుకు మద్దతుగా మౌలికసదుపాయాలు, ఆర్‌అండ్‌డీ, కొత్త టెక్నాలజీలపై పెట్టుబడులను వెచ్చించనున్నట్లు వివరించారు.

**జీఎస్‌టీ సమావేశం తర్వాత..**

వచ్చే నెలలో నిర్వహించనున్న జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం తదుపరి గుజరాత్‌లో రెండో ప్లాంటు ఏర్పాటుపై స్పష్టత రాగలదని భార్గవ పేర్కొన్నారు. రూ. 35,000 కోట్ల పెట్టుబడితో రెండో ప్లాంటును నెలకొల్పనున్నట్లు గతేడాది ప్రకటించిన నేపథ్యంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు జవాబుగా భార్గవ జీఎస్‌టీ నిర్ణయాల కోసం వేచిచూస్తున్నట్లు తెలియజేశారు. ఎగుమతులకు ఉద్దేశించిన ఈ–విటారా కార్లను 100 దేశాలకు సరఫరా చేయనున్నట్లు భార్గవ వెల్లడించారు. అయితే దేశీయంగా ఎప్పుడు విడుదల చేసేదీ వెల్లడించలేదు. బ్యాటరీలను దిగుమతి చేసుకుంటుండటంతో కార్ల తయారీ ధర అధికంగా ఉందన్నారు. కాగా.. సుజుకీ గ్రూప్ ఇప్పటికే భారత్‌లో రూ. లక్ష కోట్లను ఇన్వెస్ట్ చేసినట్లు మారుతీ సుజుకీ పేర్కొంది. వీటి ద్వారా ప్రత్యక్షంగా 11 లక్షలకు పైగా ఉద్యోగాల కల్పన జరిగినట్లు తెలియజేసింది.



ఈ–విటారా ఎగుమతులను ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ, తొషిహిరో సుజుకీ

---

# భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

**నేటి భవిత ఈ పేపర్‌లో..**
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–టీచింగ్ ఆప్టిట్యూడ్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–తెలంగాణ హిస్టరీ» బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– మార్కెటింగ్ అవేర్‌నెస్

## ఐఈఎల్‌టీఎస్‌లో బెస్ట్ స్కోర్ ఇలా



స్టడీ అబ్రాడ్

విదేశాల్లో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కోరుకునే వారు రాయాల్సిన పరీక్ష ఐఈఎల్‌టీఎస్. వివిధ దేశాల్లో ఉద్యోగాలు సొంతం చేసుకోవడానికి.. అకడమిక్ అర్హతలతోపాటు ఐఈఎల్‌టీఎస్ స్కోర్ కూడా ప్రధాన అర్హతగా పేర్కొన్నారు. ఐఈఎల్‌టీఎస్‌లో బెస్ట్ స్కోర్ సాధించడానికి మార్గాలు.

**లిజనింగ్**

ఎగ్జామినర్ చెప్పే సంభాషణను విని దానికి సంబంధించి అడిగే ప్రశ్నలకు సమాధానమివ్వాల్సి ఉంటుంది. ఈ సంభాషణ అన్ని 'యాస'ల్లోనూ ఉండవచ్చు. ముప్ఫై నిమిషాల సమయంలో 40 ప్రశ్నలను ఎదుర్కోవాలి.

**రీడింగ్**

నిర్ణీత అంశానికి సంబంధించి చదివిన విషయాన్ని లేదా కాన్సెప్ట్‌ను విద్యార్థి ఏ స్థాయిలో అవగతం చేసుకోగలడనే ఉద్దేశంతో ఈ పరీక్ష జరుగుతుంది. ఈ విభాగంలో మూడు ప్యాసేజీల నుంచి 40 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్యాసేజ్‌కి 20 నిమిషాల చొప్పున మొత్తం 60 నిమిషాల సమయం ఉంటుంది.

**రైటింగ్**

విద్యార్థికున్న ఇంగ్లిష్ రాత నైపుణ్యాన్ని పరీక్షించేదే ఈ విభాగం. రెండు పరీక్షల్లోనూ రెండేసి సెక్షన్లుంటాయి. ఐఈఎల్‌టీఎస్ మొదటి సెక్షన్‌లో గ్రాఫ్ లేదా టేబుల్ ఇచ్చి దానిపై విశ్లేషణ రాయమంటారు.

**సన్నద్ధత**

ఐఈఎల్‌టీఎస్‌కు ప్రిపరేషన్ సాగించే క్రమంలో.. 'స్కిల్ డెవలపింగ్ వ్యూ'లో చదవాలి. స్టాండర్డ్ గ్రామర్ బుక్స్‌కంటే వొక్యాబులరీని పెంచే పుస్తకాలు చదవడం ఉపకరిస్తుంది. రీడింగ్‌లో పరిజ్ఞానం పెంచుకోవడానికి నవలలు, ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు క్రమం తప్పకుండా చదవాలి. కేవలం ఇంగ్లిష్ లిటరేచర్‌కు సంబంధించినవే కాకుండా.. బిజినెస్, సైన్స్, ఆర్ట్స్ సంబంధిత వ్యాసాలు చదవడం, వినడం ద్వారా పదజాలంపైనా అవగాహన లభిస్తుంది. ఇది పరీక్ష సమయంలో ముఖ్యంగా లిజనింగ్, రీడింగ్ విష యంలో ఎంతో లాభిస్తుంది. రైటింగ్ కోసం గ్రమెటికల్ వొక్యాబులరీని పెంచుకోవాలి. రీడింగ్ నాలెడ్జ్ పెంచుకోవడానికి 'యాక్టివ్, ప్యాసివ్ వాయిస్', 'సబ్జెక్ట్ అండ్ వెర్బ్ అగ్రిమెంట్', 'కాంప్లెక్స్ సెంటెన్స్ ఫార్మేషన్'పై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలి. అంతేకాకుండా ప్రాక్టీస్ సమయంలో స్పీడ్ రీడింగ్ అలవర్చుకోవాలి.

ప్రతి పదానికి, ప్రతి వాక్యానికి అర్థం వెతకడానికి ప్రయత్నించే బదులు కాన్సెప్ట్ తొందరగా అర్థం చేసుకోవాలి. ఇది స్పీడ్ రీడింగ్‌కు ఉపయోగపడుతుంది. ఇక.. లిజనింగ్‌లో నైపుణ్యం కోసం ఇంగ్లిష్ సినిమాలు, ఇంగ్లిష్ న్యూస్ ఛానెల్ చూడటం లాభిస్తుంది. స్పీకింగ్ నైపుణ్యం అనేది విద్యార్థుల చేతుల్లోనే ఉంటుందని చెప్పవచ్చు. ఈ నైపుణ్యాన్ని పెంచుకోవడానికి విద్యార్థులు ఆయా పత్రికలు, పుస్తకాల్లోని అంశాలను, ప్యాసేజీలను బిగ్గరగా చదవడం అలవర్చుకోవాలి.





### ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్‌లో 37 పోస్టులు

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్(ఓఎఫ్‌ఎంకె).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 37.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ మేనేజర్–21, డిప్లొమా టెక్నీషియన్–06, అసిస్టెంట్–10.
» **విభాగాలు:** ప్రొడక్షన్, మెకానికల్, క్వాలిటీ, ఇంటిగ్రేటెడ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్, సివిల్, ఐటీ, టూల్ డిజైన్, డిజైన్, క్వాలిటీ ,ఇన్‌స్పెక్షన్, స్టోర్స్, హెచ్‌ఆర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 30 ఏళ్ల ఉండాలి.
» **వేతనం:** నెలకు జూనియర్ మేనేజర్‌కు రూ.30,000, డిప్లొమా టెక్నీషియన్‌కు రూ.23,000, అసిస్టెంట్‌కు రూ.23,000.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిప్యూటీ జనరల్ మేనేజర్/హెచ్‌ఆర్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్, ఎద్దుమైలారం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ–502205 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 06.09.2025.
» **వెబ్‌సైట్:** https://ddpdoo.gov.in

### సీబీఐ-ఎస్‌యూఏపీఎస్, ఛత్తీస్‌గఢ్‌లో 13 పోస్టులు

ఛత్తీస్‌గఢ్‌లోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సీబీఐ) సమాజిక్ ఉత్థాన్ అవమ్ ప్రశిక్షణ్ సంస్థాన్(సీబీఐ–ఎస్‌యూఏపీఎస్)ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 13.
» **పోస్టుల వివరాలు:** ఫ్యాకల్టీ–02, ఆఫీస్ అసిస్టెంట్–02, అటెండర్–02, వాచ్‌మెన్–కమ్–గార్డెనర్–07.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, డిగ్రీ, పీజీ(గ్రామీణాభివృద్ధి, సోషియాలజీ /సైకాలజీ, వెటర్నరి, హార్టికల్చర్, అగ్రి మార్కెటింగ్)లో ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
» **వయసు:** 22 ఏళ్ల నుంచి 40 ఏళ్ల ఉండాలి.
» **వేతనం:** నెలకు ఫ్యాకల్టీకి రూ.30,000, ఆఫీస్ అసిస్టెంట్‌కు రూ.20,000, అటెండర్‌కు రూ.14,000, వాచ్‌మెన్–కమ్–గార్డెనర్‌కు రూ.12,000.
» **ఎంపిక విధానం:** పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రీజనల్ హెడ్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్, అంబికాపూర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ధంజల్ కాంప్లెక్స్ దగ్గర, నెమ్నాకల, అంబికాపూర్, జిల్లా సర్గుజా, ఛత్తీస్‌గఢ్–479001 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 03.09.2025.
» **వెబ్‌సైట్:** www.central-bankof-india.co.in

### ఐఐటీ గౌహతిలో పీడీటీ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) గౌహతి ఒప్పంద ప్రాతిపదికన పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్(పీడీటీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి కనీసం 60 శాతం మార్కులతో పీజీలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.40,000.
» **ఎంపిక విధానం:**ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.08.2025
» **ఆన్‌లైన్ ఇంటర్వ్యూ తేది:** 05.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.iitg.ac.in

### ఎన్‌సీహెచ్‌ఎంసీటీ, నోయిడాలో స్టెనోగ్రాఫర్ పోస్టులు


నోయిడాలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ(ఎన్‌సీహెచ్‌ఎంసీటీ)..డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన స్టెనోగ్రాఫర్ గ్రేడ్–డి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఇంటర్మీడియట్ లేదా తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి. హిందీ, ఇంగ్లిష్ టైపింగ్ వచ్చి ఉండాలి. » **వయసు:** 27 ఏళ్ల మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్(టైపింగ్ టెస్ట్) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది డైరెక్టర్, ఎన్‌సీహెచ్‌ఎంసీటీ, ఏ–34, సెక్టార్ 62, నోయిడా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 16.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.nchm.gov.in

## ఇంటర్‌తో బీఎస్‌ఎఫ్‌లో పోలీస్ కొలువు

» మొత్తం 1121 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» పదో తరగతి, ఇంటర్, ఐటీఐ అభ్యర్థులు అర్హులు
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

**ఇంటర్ పూర్తిచేసి... ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్‌ఎఫ్) స్వాగతం పలుకుతోంది. ఇందులో భాగంగా 1121 హెడ్ కానిస్టేబుల్ (రేడియో ఆపరేటర్, రేడియో మెకానిక్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయ వేతనంతో పాటు ఇతర అలవెన్సులు అందుతాయి. ఈ నేపథ్యంలో.. హెడ్ కానిస్టేబుల్ పోస్టులు, విద్యార్హతలు, వయస్సు, దరఖాస్తు విధానం, ఎంపిక విధానం తదితర వివరాలు..**



ఆర్మీ జాబ్స్

- మొత్తం పోస్టుల సంఖ్య: 1121.
- పోస్టుల వివరాలు: హెడ్ కానిస్టేబుల్ (రేడియో ఆపరేటర్)–910, హెడ్ కానిస్టేబుల్ (రేడియో మెకానిక్)–211.

**అర్హతలు**

గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 60 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి. లేదా మెట్రిక్యులేషన్ (పదో తరగతి)/ తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ సర్టిఫికేట్ కలిగి ఉండాలి.

**వయసు**

23.09.2025 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల వయసు సడలింపు ఉంటుంది.

**వేతనం**

ఎంపికైన వారికి నెలకు రూ.25,500 నుంచి రూ.81,100 వేతనం లభిస్తుంది. దీంతో పాటు ఇతర అలవెన్సులు కూడా ఉంటాయి.

**ఎంపిక విధానం**

- మూడు దశలలో అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
- మొదటి దశ:
  పీఎస్‌టీ, పీఈటీ: శారీరక ప్రమాణాలు, ఎత్తు, బరువు, ఛాతీ కొలతలు తదితరాలు ఉంటాయి.
- రెండో దశ: మొదటి దశలో ఎంపికైన అభ్యర్థులకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు.

**హెడ్ కానిస్టేబుల్ (ఆర్‌వో, ఆర్‌ఎం)**

మొత్తం 200 మార్కులకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఉంటుంది. ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఇంగ్లిష్/హిందీ మీడియంలో ప్రశ్న పత్రం ఉంటుంది. ఫిజిక్స్ నుంచి 40 ప్రశ్నలు, మ్యాథ్స్ నుంచి 20 ప్రశ్నలు, కెమిస్ట్రీ నుంచి 20 ప్రశ్నలు, ఇంగ్లిష్, జి.కె. సబ్జెక్టుల నుంచి 20 ప్రశ్నలు వస్తాయి. మొత్తం 100 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 నెగెటివ్ మార్కులు ఉంటాయి.

**50 మార్కులకు డిక్టేషన్ పరీక్ష**

ఆ తర్వాత హెడ్ కానిస్టేబుల్(ఆర్‌వో) పోస్టుకు 50 మార్కులకు డిక్టేషన్ పరీక్ష, పేరాగ్రాఫ్ రీడింగ్ టెస్ట్ ఉంటాయి.

**మూడో దశ**

డాక్యుమెంట్ వెరిఫికేషన్, డిక్టేషన్/రీడింగ్ టెస్ట్(ఆర్‌వో కోసం), మెడికల్ పరీక్ష ఉంటుంది.

**దరఖాస్తు ఫీజు**

జనరల్ అభ్యర్థులు రూ.100 దరఖాస్తు ఫీజుగా చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, మహిళ, ఈఎస్‌ఎం అభ్యర్థులకు ఫీజు ఉండదు.

- దరఖాస్తు విధానం:
  ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 24.08.2025.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 23.09.2025.
- వెబ్‌సైట్: http://rectt.bsf.gov.in

# 33 శాతం చేరేందుకు మరో 23 ఏళ్లు!

- తెలంగాణ పోలీస్ శాఖలో 8.6 శాతానికే పరిమితమైన మహిళా సిబ్బంది సంఖ్య
- 90 శాతం మంది మహిళా సిబ్బంది కానిస్టేబుళ్లుగానే విధులు
- ప్రతి స్టేషన్‌లో కనీసం ముగ్గురు మహిళా ఎస్సైలు, 10 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉండాలని పేర్కొన్న కేంద్ర హోంశాఖ



**సాక్షి, హైదరాబాద్:** 'ప్రతి పోలీస్‌స్టేషన్‌లో కనీసం ముగ్గురు మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్లు, 10 మంది మహిళా పోలీస్ కానిస్టేబుళ్లు ఉంటేనే మహిళా హెల్ప్‌డెస్క్ 24 గంటలపాటు బాధితులకు అందుబాటులో ఉంటుంది. ఆ మేరకు సిబ్బందిని పెంచండి. ప్రతి జిల్లాలో కనీసం ఒక మహిళా పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయండి'.. 2022 ఏప్రిల్ 21న కేంద్ర హోంశాఖ డిప్యూటీ సెక్రెటరీ దేవేంద్రసింగ్ పరిహార్ అన్ని రాష్ట్రాల పోలీసు శాఖలకు పంపిన ఆదేశాలు ఇవి. పోలీసు శిక్షణ, ఆధునీకరణ-సంస్కరణల అంశంపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్థాయీ సంఘం ప్రతిపాదనల మేరకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. కానీ క్షేత్రస్థాయిలో మహిళా పోలీస్ సిబ్బంది సంఖ్య అందుకు అనుగుణంగా పెరగట్లేదు. తెలంగాణ పోలీస్ శాఖలో ప్రస్తుతం వివిధ స్థాయిల్లో కలిపి సుమారు 8 వేల మహిళా సిబ్బంది పనిచేస్తున్నారు. గత పదేళ్లలో భారీగా మహిళా సిబ్బంది నియామకాల తర్వాత కూడా మొత్తం పోలీస్‌శాఖ సిబ్బందిలో మహిళా సిబ్బంది సంఖ్య 8.6 శాతానికే పరిమితమైంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ప్రకారం తెలంగాణ పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది సంఖ్య అంతకు పెరిగేందుకు మరో 23 ఏళ్లు పట్టొచ్చని ఇండియన్ జస్టిస్ రిపోర్ట్ (ఐజేఆర్) 2025 నివేదిక స్పష్టం చేస్తోంది. తెలంగాణ పోలీస్ శాఖలోని మహిళా సిబ్బంది సమస్యలపై పోలీసు అకాడమీలో జరిగిన రాష్ట్రస్థాయి మహిళా పోలీసు సదస్సులో కీలకంగా చర్చించారు.

**జాతీయ స్థాయిలోనూ 12.32 శాతమే..**

బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్అండ్‌డీ)-2023 నివేదిక ప్రకారం 2023 జనవరి ఒకటి నాటికి దేశవ్యాప్తంగా మొత్తం మహిళా పోలీసుల సంఖ్య 2,63,762 (12.32 శాతం)గా ఉంది. ఇండియా జస్టిస్ రిపోర్ట్ (ఐజేఆర్)-2025 నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా పోలీసు శాఖల్లోని మహిళా సిబ్బందిలో 960 మంది ఐపీఎస్‌లు, 24,322 మంది డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్-ఇన్‌స్పెక్టర్ల ర్యాంకుల్లో పనిచేస్తున్నారు. మిగిలిన వారు కానిస్టేబుళ్లుగానే పనిచేస్తున్నారు.

**కొన్ని దేశాల్లోని పోలీసు శాఖల్లో మహిళా సిబ్బంది శాతం..**



| | |
|---|---|
| అమెరికా | 15% |
| ఆస్ట్రేలియా | 25% |
| యూకే | 30% |
| కెనడా | 22% |
| నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, డెన్మార్క్, ఐస్‌ల్యాండ్ | 30-40% |

## కుటుంబం, శారీరక ఇబ్బందులు

గృహహింస, మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, లింగ వివక్ష వంటి కేసుల్లో బాధితులకు భరోసా ఇవ్వడంలో మహిళా పోలీస్ సిబ్బంది పాత్ర కీలకంగా ఉంటుంది. ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్లు, హెల్ప్ డెస్కులు, శిక్షణా మాడ్యూళ్ల నిర్వహణ బాధితుల్లో భరోసా నింపేందుకు ఉపకరిస్తుంది. అయినప్పటికీ పక్షపాత ధోరణి, శారీరక ఇబ్బందులు మహిళా సిబ్బంది పెరగకపోవడానికి కారణమవుతున్నాయి.

**వివిధ రాష్ట్రాల్లో మహిళా పోలీసులు 33 శాతానికి చేరుకోవడానికి పట్టే టైం..**

| రాష్ట్రం | పట్టే సమయం(ఏళ్లలో..) |
|---|---|
| ఏపీ, బిహార్ | 3.3 |
| తెలంగాణ | 23 |
| తమిళనాడు | 20 |
| గుజరాత్ | 13 |
| మహారాష్ట్ర | 12 |
| కేరళ | 29 |
| ఢిల్లీ | 17.2 |
| ఉత్తరప్రదేశ్ | 45 |
| హరియాణా | 56 |
| మధ్యప్రదేశ్ | 80 |
| పశ్చిమ బెంగాల్ | 80 |
| రాజస్థాన్ | 92 |
| కర్ణాటక | 115 |



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 

సాక్షి ప్లస్
బుధవారం । 27-8-2025





ఆల్వాన్‌పల్లి శివారులోని గొల్లత్త గుడి, మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి మ్యూజియంలో భద్రపరిచిన గొల్లత్త గుడి ప్రాంగణంలో దొరికిన భైరవుడి, మహావీరుడి విగ్రహాలు

# గతమెంతో ఘనం..

## నాటి చరిత్రకు దర్పణంగా గొల్లత్త గుడి

- 65 అడుగుల ఎత్తులో అద్భుతమైన కట్టడం
- జైనులకు ప్రధాన కేంద్రంగా వర్ధిల్లిన ఆలయం
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో శిథిలం



కంప చెట్ల మధ్య గొల్లత్త గుడి

**జడ్చర్ల:** ఎంతో విశిష్టత గల ఆ ప్రాచీన ఆలయ చరిత్రను తెలుసుకుంటే గర్వంగా ఉంటుంది. ఆలయ ప్రాంగణంలోని శిథిలాలను చూస్తే అయ్యో అనిపిస్తుంది. ఇటుక మీద ఇటుకను పేర్చి నిర్మించిన ఆ అద్భుతమైన కట్టడం.. ఇప్పుడు గత వైభవానికి సాక్ష్యంగా నిలిచింది. తల తెగిన శిల్పాలు, గుప్త నిధుల వేటలో మిగిలిన శిథిలాలు.. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తాయి. శతాబ్దాల చరిత్ర కలిగిన గొల్లత్త గుడిపై కథనమిది.

### రాష్ట్ర కూటుల కాలం నాటి నిర్మాణం

జడ్చర్ల మండలం గంగాపూర్–ఆల్వాన్‌పల్లి గ్రామాల మధ్య 167 నంబర్ జాతీయ రహదారిని ఆనుకుని.. దాదాపు 6 ఎకరాల విస్తీర్ణంలో గొల్లత్త గుడి ఆలయాన్ని నిర్మించారు. దీన్ని 8వ శతాబ్దంలో రాష్ట్రకూటులు నిర్మించినట్లు పురావస్తు శాస్త్రవేత్తలు, చరిత్రకారులు చెబుతున్నారు. దాదాపు 65 అడుగుల ఎత్తులో.. నాలుగు అడుగుల మందంతో.. కేవలం ఇటుకపై ఇటుకను పేర్చి నిర్మించారు. మధ్యలో ఎలాంటి బంక మట్టి లేకుండా అంత ఎత్తు వరకు.. అత్యంత కళాత్మకంగా గుడి నిర్మాణం చేపట్టారు. ఈ తరహాలో నిర్మించిన గుడి దక్షిణ భారతంలోనే ఒకటి.. ఇలాంటిదే మరొకటి ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ భీతర్‌గావ్ శివారులో ఉంది.

### జైనుల ఆలయంగా ప్రసిద్ధి..

ఒకప్పుడు ఈ ప్రాంతంలో జైన మతం బాగా ప్రాచుర్యంలో ఉండేది. ఎంతో మంది జైన తీర్థంకరులు నడయాడిన నేలగా ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందినట్లు చరిత్రకారులు పేర్కొంటున్నారు. జైనీయుల స్థిర నివాసంగా, ధాన్య భాండాగారంగా గొల్లత్త గుడి పేరు గాంచింది. ఈ గుడిలో బంగారు కుండలు ఉండేవన్న ప్రచారం ఉంది. ఉత్తర భారతం నుంచి దక్షిణ భారతానికి కాలి నడకన తరలివచ్చే జైన గురువులు.. దీన్ని సందర్శించేవారని అప్పటి శాసనాల ద్వారా గుర్తించారు. ఆలయం లోపల వర్ధమాన మహావీరుడు, పార్శ్వనాథుడి విగ్రహాలు ఉండేవి. భద్రత దృష్ట్యా ఇక్కడి నుంచి ఒకటి హైదరాబాద్‌లోని గోల్కొండకు, మరొకటి పాలమూరు పిల్లలమర్రిలోని మ్యూజియాలకు తరలించారు.

### శిథిలావస్థలో గుడి..

గొల్లత్త గుడి కాలక్రమేనా శిథిలావస్థకు చేరుకుంది. గుడి పైకప్పు కూలిపోయింది. వర్షాల కారణంగా చుట్టూ ఉన్న కొన్ని ఇటుకలు పట్టు తప్పిపోగా, కరిగిపోయాయి. దీంతో గుడి పటిష్టానికి పురావస్తుశాఖ అధికారులు.. కింద నుంచి దాదాపు 7 అడుగుల వరకు తాత్కాలికంగా సిమెంట్ పనులు చేయించారు. ఊడిన ఇటుకల స్థానంలో కొత్తగా చేర్చిన ఇటుకలు కరిగిపోగా.. శతాబ్దాల కిందటి ఇటుకలు చెక్కుచెదరక పోవడం గమనార్హం. ప్రస్తుత గుడి మాదిరిగానే.. చుట్టూ మరో ఐదు గుళ్లు ఉండగా.. కాలక్రమేణా కనుమరుగయ్యాయి.

### గుడి వెనుక దిబ్బలు

గొల్లత్త గుడి వెనుక భాగంలో రెండు ప్రధాన దిబ్బలు ఉన్నాయి. వీటిలో ఒక దిబ్బ కనుమరుగవగా.. ఈ దిబ్బ చుట్టూ పండుగల సందర్భంగా ఎడ్ల బళ్లతో వచ్చి జనం తిరిగేవారని చెబుతుంటారు. మరో దిబ్బ ఇప్పటికీ కనిపిస్తుంది. ఈ దిబ్బలో అప్పటి నిర్మాణాల ఆనవాళ్లు కనిపిస్తాయి. పాదాల గుట్టలో శిథిలావస్థలో ఎన్నో విగ్రహాలు కనిపిస్తాయి. ధ్వంసమైన నంది విగ్రహాలు చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తాయి. నాలుగు అడుగుల పొడవు, మూడు అడుగుల వెడల్పుతో మహిళల పాదముద్రలు చెక్కిన రాతి గుర్తులు ఉన్నాయి. గజ్జెలు, గొలుసులు, నాలుగు వేళ్లకు మెట్టెలతో చెక్కి ఉన్నాయి. అత్యంత సుందరంగా చెక్కిన ఈ పాదాలు అప్పటి శిల్పకళా నైపుణ్యానికి ప్రతీకగా పేర్కొనవచ్చు.

### గుప్త నిధుల కోసం తవ్వకాలు

ఈ ప్రాంతంలో గుప్త నిధుల కోసం కొందరు విచ్చలవిడిగా తవ్వకాలు చేపట్టారు. వారి చేతుల్లో ఆలయ ప్రాంగణం చాలా వరకు ధ్వంసమైంది. గుడి పైకప్పులో సైతం తవ్వకాలు జరపడంతో కూలిపోయింది. గుడి దక్షిణ భాగంలో సైతం తవ్వకాలు జరిపారు. ప్రస్తుతం గుడి చుట్టూ ముళ్ల పొదలు, కంపచెట్లు ఏపుగా పెరగడంతో.. గుడి ఉనికికి ప్రమాదం ఏర్పడింది.

### పేరు వెనుక కథ

ఈ గుళ్ల నిర్మాణం వెనుక స్థానికంగా ఓ కథ ప్రచారంలో ఉంది. పాలు, పెరుగు అమ్ముకునే ఈ ప్రాంతానికి చెందిన ఓ గొల్ల పడుచు.. తన ఆస్తినంతా వెచ్చించి ఈ గుళ్లని నిర్మించిందని.. అందుకే ఈ గుళ్లకు గొల్లత్త గుళ్లు అనే పేరు వచ్చిందని ఒక కథనం ప్రచారంలో ఉంది.

### రూ.2 కోట్లతో ప్రతిపాదనలు

గొల్లత్త గుడిని పరిరక్షించేందుకు రాష్ట్ర పురావస్తు శాఖ మేనేజింగ్ డైరెక్టర్ విశాలాక్షి హయాంలో రూ.2 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి కేంద్రానికి నివేదించారు. ఇప్పటికే కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో రూ.54 లక్షల వ్యయంతో గుడి స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు.



### అమలుకాని ప్రతిపాదనలు

“గొల్లత్త గుడి అభివృద్ధికి కలెక్టర్ రొనాల్డ్‌రోస్ హయాంలో పురావస్తుశాఖ అధికారులు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తదుపరి ఎలాంటి చొరవ లేకపోవడంతో ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గొల్లత్త గుడి అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలి.

– రాములు, మాజీ మండల ఉపాధ్యక్షుడు, గంగాపూర్



### పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

“గొల్లత్త గుడిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ గుడిని కాపాడాలి. ఇప్పటికే గుప్త నిధుల కోసం వేటగాళ్లు ఈ ప్రాంతమంతా తవ్వేశారు. నాటి చరిత్రకు సంబంధించిన విగ్రహాలు, తదితర కట్టడాలు ధ్వంసమయ్యాయి.

– శ్రీనివాసులు, గంగాపూర్



## వారసత్వ సంపదకు నెలవు నిడిగొండ

### పలుచోట్ల 10 గణపతి మూర్తులు

**రఘునాథపల్లి:** జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ గ్రామం చారిత్రక వారసత్వ సంపదకు నెలవుగా మారింది. నాటి కళాత్మక, ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా శతాబ్దాల క్రితంనాటి శిల్పాలు, దేవతామూర్తులు గ్రామంలో ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. రాష్ట్ర కూటులు, చాళుక్యులు, కాకతీయుల కాలం నాటి విగ్రహాలు ఇప్పటికే నిడిగొండలో దర్శనమిస్తాయి. తాజాగా, గణపతి విగ్రహం బయటపడింది. రాతితో చేసిన విగ్రహం చక్కని రూపలావణ్యం, శిల్పకళావిశేషాలతో కూడి ఉంది. 10 గణపతి మూర్తులను ఇప్పటికే మనం ఇక్కడ దర్శించుకోవచ్చు. ఈ విగ్రహాల పరిరక్షణకు ప్రభుత్వం కృషిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలు తొలగాలి

### మంత్రులు, టీపీసీసీ చీఫ్ వినాయక చవితి శుభాకాంక్షలు

**సాక్షి, హైదరాబాద్:** వినాయక చవితి పర్వదినాన ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలు తొలగి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మంత్రులు, టీపీసీసీ చీఫ్ ప్రార్థించారు. వేర్వేరు ప్రకటనల్లో రాష్ట్ర ప్రజలకు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయక ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు మండపాల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. వినాయక మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా భక్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నగరంలో వినాయక ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొనసాగుతున్న సంక్షేమం, అభివృద్ధి మరింత ముందుకు సాగాలని ఆ విఘ్నేశ్వరుడిని పొన్నం ప్రార్థించారు.

## సమీకృత రిజిస్ట్రార్ కార్యాలయ యోచన విరమించుకోవాలి

### ఐజీ రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్‌కు బీజేపీ నేతల వినతి

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించిన సమీకృత రిజిస్ట్రార్ కార్యాలయ యోచన ప్రజలకు అసౌకర్యం కలిగించేలా ఉన్నందున దానిపై పునరాలోచించాలని ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్‌కు బీజేపీ నేతలు విజ్ఞప్తిచేశారు. ప్రస్తుతం ఉన్న చోటనే అన్ని సౌకర్యాలతో నూతన భవనాలను నిర్మించాలని కోరారు. ప్రభుత్వ ప్రతిపాదన మేరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులను 11కు కుదించడం ఎంత మాత్రం సబబు కాదని తెలిపారు. హైదరాబాద్‌లోకూడా వివిధ ప్రాంతాల్లో నడుస్తున్న కార్యాలయాలను కుదించారన్నారు. ప్రస్తుతమున్న కార్యాలయాల సమీపంలోనే నూతన కార్యాలయాలు నిర్మించాలని సూచించారు. మంగళవారం ఈ మేరకు ఐజీ రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్‌కు బీజేపీ నేతలు మల్లారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌భూపాల్‌గౌడ్ తదితరులు వినతిపత్రం అందించారు.

## ఓయూ అభివృద్ధికి పునాది వేసిన సీఎం రేవంత్‌రెడ్డి

### టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్

**సాక్షి, హైదరాబాద్:** ఏళ్ల చరిత్ర ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ విద్యాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పునాది వేశారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఓయూను రూ.1,000 కోట్లతో ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలకు దీటుగా అభివృద్ధి చేయాలని ఆలోచన ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రమే యూనివర్సిటీల అభివృద్ధి సాధ్యమని నిరూపితమైందని తెలిపారు. అలాగే ఓయూ చరిత్రతో పాటు గద్దర్, జార్జిరెడ్డి, పీవీ నరసింహారావు, జైపాల్‌రెడ్డిలను స్మరించుకోవడం విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిందన్నారు. 20 ఏళ్ల తర్వాత ఓయూకు సీఎం రావడం చరిత్ర అని, కేసీఆర్ చేయని పనిని రేవంత్‌రెడ్డి చేశారని దయాకర్ పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఓయూను విస్మరించారని, ఏ రోజు కూడా కేటీఆర్, హరీశ్‌రావు ఓయూకు వచ్చిన మొహం ఉందా? అని ప్రశ్నించారు. ఓయూకు సీఎం రేవంత్‌రెడ్డిని విద్యార్థులు స్వాగతించారని, బీఆర్ఎస్ నేతలకు ఒక్కరికి కూడా అడ్మిషన్ లేదని దయాకర్ వ్యాఖ్యానించారు.

## 20 నెలల పాలనలో 50సార్లు ఢిల్లీ టూర్

### సీఎంపై ఎన్వీ సుభాష్ విమర్శ

**సాక్షి, హైదరాబాద్:** గత 20 నెలల పాలనలో ప్రజాసమస్యలను పట్టించుకోకుండా 50 సార్లు ఢిల్లీతో పాటు బిహార్, కోల్‌కతా, విదేశాల టూర్లకు వెళ్లిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తాము ఎన్నుకున్న సీఎం ఎక్కడ? ఎప్పుడూ ఢిల్లీలోనా, బిహార్‌లోనా, లేక విదేశాల్లోనా అని ప్రజలు అడుగుతున్నారని వ్యాఖ్యానించారు. ఇటీవల వివిధ జిల్లాల్లో తమ పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌రావు పర్యటించినపుడు ప్రజలు పిటిషన్లు, వినతిపత్రాలు ఇచ్చి సీఎంకు చెప్పి తమ సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరుతున్నారన్నారు. అశోక్‌నగర్‌కి వెళ్లి విద్యార్థులకు మొహం చూపే ధైర్యం రాహుల్‌గాంధీకి ఉందా అని సుభాష్‌ప్రశ్నించారు.

## సెలవుల్లో క్లాసులు అడ్డుకోవాలి: మహిళా కమిషన్

**సాక్షి, హైదరాబాద్:** వినాయక చవితికి ప్రభుత్వం అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినా, కొన్ని ప్రైవేటు సంస్థలు ఈ ఆదేశాలను అమలు చేయడం లేదని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవు దినాల్లో ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఇంటర్ బోర్డ్‌ను ఆమె కోరారు. ఈ మేరకు బోర్డ్‌కు మంగళవారం లేఖ రాశారు.



వినాయక చవితి సందర్భంగా సందడిగా మారిన హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ మార్కెట్



బిహార్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో జరుగుతున్న 'ఓట్ అధికార్ యాత్ర'లో పాల్గొన్న సందర్భంగా ఫూల్ పరాస్ వద్ద లోక్‌సభ ఎంపీ ప్రియాంక గాంధీని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి తదితరులు

## ఆ స్థలాన్ని వెంటనే ఖాళీ చేయండి

### మాదాపూర్ ఆస్తిపై హైడ్రాకు హైకోర్టు ఆదేశం

**సాక్షి, హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాదాపూర్ సర్వే నంబర్ 66, 67లో దాదాపు 2,000 చదరపు గజాల భూమి విషయంలో హైడ్రా తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ భూమిలో హైడ్రాతో పాటు ఇతర అధికారులు జోక్యం చేసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. స్వాధీనం చేసుకున్న స్థలాన్ని వెంటనే ఖాళీ చేయాలని, అక్కడ ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించాలని ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే నెల 18కి వాయిదా వేసింది. తమ ఇళ్ల స్థలంలో హైడ్రా, జీహెచ్‌ఎంసీ చట్టవిరుద్ధంగా జోక్యం చేసుకున్నాయని ఆరోపిస్తూ వై.జగల్ రెడ్డి, వై.వెంకట్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ వెంటనే ఆ స్థలం చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసి బోర్డులు పాతిందన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సదరు ఆస్తికి సంబంధించి జనవరి 28న జారీ చేసిన నోటీసులకు ఫిబ్రవరి 3న పిటిషనర్లు సమాధానం ఇచ్చారన్నారు. అర్బన్ ల్యాండ్ (సీలింగ్ అండ్ రెగ్యులేషన్) చట్టం–1976 కింద క్రమబద్ధీకరించారని పేర్కొన్నారు. అది పార్కు భూమి అని జూబ్లీ ఎన్‌క్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆరోపిస్తూ వస్తోందన్నారు. క్రమబద్ధీకరణ జీవోను రద్దు చేయాలని కొంత మంది హైకోర్టుకు వెళ్లగా 2015లో క్రమబద్ధీకరణ జీవో సరైనదేనని తీర్పు ఇచ్చిందని తెలిపారు. విజిలెన్స్ కమిటీ కూడా విచారణ చేసి ఈ భూమి వెంకట్‌రెడ్డి, జగల్‌రెడ్డిలకే చెందుతుందని 2017లో నివేదిక ఇచ్చిందన్నారు. ఇప్పుడు అది పార్క్ స్థలం అంటూ హైడ్రా కూల్చివేతలు చేపట్టిందని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్ సబ్జెక్ట్ ప్లాట్ యజమాని అని, పార్క్ పరిధిలోకి రాదని ప్రాథమికంగా అభిప్రాయపడ్డారు.

# మహాగణపతిం భజే..!



శ్రీముఖలింగం.. అష్ట వినాయకులకు నిలయం

సాధారణంగా ఏ ఆలయంలోనైనా ఒకే వినాయక విగ్రహం దర్శనమిస్తుంది. ప్రముఖ శైవ క్షేత్రం, విశిష్ట శిల్ప సంపదకు నిలయమైన శ్రీకాకుళం జిల్లా శ్రీముఖలింగంలో మాత్రం అష్ట గణపతులు సాక్షాత్కరిస్తారు. అరుదైన ముఖాకృతులతో ఆకట్టుకుంటారు. వీటికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తుంటారు.


– జలుమూరు

### చింతామణి గణపతి




చింతలు, దుఃఖాలు, ఈతి బాధలు పోగొట్టే స్వామి. దక్షిణవైపు ఉత్తర ముఖంగా ఉంటారు.

### దుండీ గణపతులు



పంచాయతన క్షేత్రానికి సంబంధించి కాశీలో రెండు గణపతి విగ్రహాలు ఉంటాయి. మళ్లీ శ్రీముఖలింగంలోనే రెండు గణపతులు కనిపిస్తారు. ఈ ఇద్దరు స్వాములను దర్శనం చేసుకుంటే చాలు మనస్సులో కోర్కెలు, మోక్షం సిద్ధిస్తుందని అర్చకులు చెబుతున్నారు. ఉత్తర ముఖం దక్షిణంలో కొలువు దీరి ఉంటారు.

### సాక్షి గణపతి



భక్తులు ఆలయానికి వచ్చిన తర్వాత ముందుగా ఈ స్వామిని దర్శనం చేసుకుంటే ఈయన తన తండ్రి అయిన పరమేశ్వరునికి చెబుతారంట. భక్తులు నా అనుమతి తీసుకున్నారు.. మీరు మీ దర్శనం బాగ్యం కల్పించాలని కోరుతారట. దక్షిణ ముఖంగా ఉత్తర వైపు కొలువై ఉంటారు.

### నాట్య గణపతి



కళాకారులు, విద్యార్థులు నాట్యం తదితర కళలు నేర్చుకునే ముందు ఈ స్వామిని దర్శించుకోవాలంటారు. తూర్పు ముఖం పశ్చిమలో భక్తులకు దర్శనం ఇస్తారు.

### శక్తి గణపతి



దీర్ఘకాలిక బాధలు, అనారోగ్య సమస్యలు తొలగిపోవాలని ఈ గణపతిని పూజిస్తారు. ఇంద్రుని ఆలయం తూర్పు దిక్కున పశ్చిమ ముఖంగా దర్శనం ఇస్తారు స్వామి.

### కార్యసిద్ధి గణపతి



మనస్సులో ఒక కార్యం తలచుకొని ఈ స్వామికి చెబితే చాలు ఆ కార్యం నెరవేరుతుంది. ఆలయం పైన దక్షిణ ముఖం ఉత్తర దిక్కుగా ఉంటారు.

### వరసిద్ధి గణపతి



వరాలు ప్రసాదించే స్వామివారు. భక్తులు కోరిన వరాలు ఇస్తారు. వారాహి అమ్మవారు ముందు ఎడమ వైపు దక్షిణ ముఖంతో భక్తులు దర్శనం ఇస్తారు.

## క్లుప్తంగా...

### పొగాకు రైతుల చెల్లింపులకు రూ.55 కోట్ల రుణానికి అనుమతి

సాక్షి, అమరావతి: నల్లబర్లీ పొగాకు రైతులకు ఇవ్వాల్సిన బకాయిల చెల్లింపుల కోసం జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్సీడీసీ) నుంచి రుణం పొందేందుకు మార్క్‌ఫెడ్‌కు అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కనీస గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయిన రైతుల నుంచి 20 వేల టన్నుల నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. కాగా, ఇప్పటి వరకు 12 వేల టన్నులు సేకరించగా, రైతులకు రూ.90 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. ఇందుకు రూ.55 కోట్లు విడుదల చేయాల్సిందిగా మార్క్‌ఫెడ్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ నిధులను ఎన్సీడీసీ నుంచి తీసుకునే రుణం నుంచి వినియోగించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### ఐపీఎస్ సునీల్ కుమార్ సస్పెన్షన్ పొడిగింపు

సాక్షి, అమరావతి: దళిత ఐపీఎస్ అధికారులపై చంద్రబాబు ప్రభుత్వం రెడ్‌బుక్ కుట్రను కొనసాగిస్తోంది. సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ సస్పెన్షన్‌ను మరో 6 నెలల పాటు పొడిగించింది. డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆయన సస్పెన్షన్‌ను ఆరు నెలలపాటు అంటే 2026, ఫిబ్రవరి 24 వరకు పొడిగించినట్లు సీఎస్ కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

### వచ్చే నెలలో పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

సాక్షి, అమరావతి: గ్రామ పంచాయతీలకు వచ్చే నెల మొదటి వారంలో 15వ ఆర్థిక సంఘం పెండింగ్ నిధులు రూ.1,120 కోట్లను విడుదల చేయనున్నట్టు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈమేరకు సీఎం హామీ ఇచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. నిధులను సకాలంలో విడుదల చేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పవన్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాగా, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి విడుదల చేసిన నిధులను గత 8 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ ఖాతాల్లో జమ చేయకుండా కాలయాపన చేసిన తీరుపై మూడు రోజుల క్రితం 'సాక్షి' పత్రిక ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే.

### ఆర్టీసీలో పదోన్నతులకు లైన్ క్లియర్

సాక్షి, అమరావతి: ఆర్టీసీలో పెండింగులో ఉన్న పదోన్నతులను ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదించింది. 2వేలమందికిపైగా పదోన్నతులు లభించే అవకాశాలున్నాయి. రీజియన్, జోనల్ స్థాయిలో పదోన్నతి కల్పించనున్నారు. ఈ నెలాఖరుకు అధికారికంగా ఉత్తర్వులు వెలువడతాయని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

### తదుపరి డీఎంఈగా డాక్టర్ రఘునందన్?

సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)గా డాక్టర్ రఘునందన్‌ను నియమించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుత డీఎంఈ డాక్టర్ నరసింహం ఈ నెలాఖరుకు రిటైర్ అవ్వనున్నారు. ఈ నేపథ్యంలో డీఎంఈగా పూర్తి అదనపు బాధ్యతలు ఇవ్వడానికి అదనపు డీఎంఈల్లో సీనియర్ అయిన రఘునందన్ పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. గుంటూరు, విజయవాడ, కడపలో అదనపు డీఎంఈ హోదాలో పని చేస్తున్న కొందరు వైద్యులు ఇన్‌చార్జి డీఎంఈ అవ్వాలని ప్రయత్నిస్తున్నారు. వీరు ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనుల్లో ఉన్నారని వైద్య వర్గాల్లో చర్చ నడుస్తోంది.

## చార్జీలు పెరిగాయి.. కరెంటు వాడకం తగ్గిద్దాం!

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..**

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు నిరంతరం సరఫరా. అద్భుత ఫలితాలు సాధించిన రాష్ట్ర విద్యుత్ సంస్థలు. ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధి, వినియోగదారుల సంక్షేమానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం అత్యంత కీలకమనే భావన. రాష్ట్రంలో సగటు విద్యుత్ వినియోగం జాతీయ సగటు కంటే ఎక్కువగా నమోదు.

**కూటమి సర్కారులో..**

విద్యుత్ చార్జీలను భారీగా పెంచి ప్రజలపై భారం మోపేందుకు అన్ని విధాలా ప్రయత్నం. ఫలితంగా విద్యుత్ వాడాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి. ఏకంగా 20 మిలియన్ యూనిట్ల వరకు డిమాండ్ తగ్గిపోయింది.

**ప్రజలపై రూ.31,886 కోట్ల భారం**

- కరెంటు బిల్లులు చూసి బెంబేలు
- వినియోగం నియంత్రణకు యత్నం
- భారీగా పడిపోతున్న వాడకం
- కూటమి పాలనలో చార్జీల పెంపు ఫలితం
- ప్రజల ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం
- నిరుటి కంటే 20 మి.యూ. వరకు తక్కువ డిమాండ్




సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఐదేళ్ల కిందట విద్యుత్ వినియోగదారుల సంఖ్య 1.45 కోట్లు. మూడేళ్ల క్రితం ఈ సంఖ్య 1.92 కోట్లకు పెరిగింది. కోతలు లేకుండా సరఫరా అందించడంతో పాటు వివిధ వర్గాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యుత్ రాయితీలు కల్పించింది. చార్జీల భారం వేయకుండా ఊరటనిచ్చింది. దీంతో సర్వీసులు తీసుకునేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. మారుమూల పల్లెలకు సైతం లైన్లు వేయడంతో ఇదివరకు బిల్లులకు భయపడి వెలుగులకు నోచుకోని వారి ఇంట కూడా విద్యుత్ కాంతులు ప్రకాశించాయి. ఇది రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాల మెరుగు, విద్యుత్ రంగ ప్రగతికి సూచిక అని నిపుణులు అభివర్ణించారు. కానీ ఇప్పుడు పరిస్థితి తలకిందులు అవుతోంది.

- కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే రూ.15,485.36 కోట్ల కరెంట్ చార్జీల భారాన్ని ప్రజలపై వేసి బాదుడికి శ్రీకారం చుట్టింది. మరో రూ.3,629.36 కోట్ల చార్జీల మోతకు అనుమతించాలంటూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ)కి ప్రతిపాదనలు సమర్పించింది. అంటే, చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే ఏకంగా రూ.19,114.72 కోట్ల భారం ప్రజలపై మోపినట్టైంది.
- తాజాగా ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు 4వ నియంత్రణ కాలానికి వాస్తవ ఆదాయ, ఖర్చుల వ్యత్యాసాన్ని రూ.12,771.96 కోట్లుగా లెక్కించాయి. ఈ మొత్తాన్ని బిల్లుల్లో కలిపి వినియోగదారుల నుంచి వసూలు చేసుకునేందుకు అనుమతినివ్వాలని కమిషన్‌ను కోరాయి. దీనిని రాష్ట్ర ప్రభుత్వం భరించకపోతే ప్రజలపై మొత్తంగా రూ.31,886.68 కోట్ల చార్జీల భారం వేసినట్లవుతుంది.
- భారీ విద్యుత్ భారాన్ని చూసి బెంబేలెత్తిపోతున్న ప్రజలు వినియోగం తగ్గించేస్తున్నారు. కాగా,సూక్ష్మ, చిన్న మధ్య తరహా, కుటీర పరిశ్రమలు, వాణిజ్య కేంద్రాలు, గృహాల్లో విద్యుత్ వాడకం తగ్గడంతో ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**గడిచిన పది రోజుల్లో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం, తగ్గుదల(మిలియన్ యూనిట్లలో) గతేడాదితో పోల్చితే ఇలా ఉంది:**

| తేదీ | గతేడాది | ప్రస్తుతం | తగ్గుదల |
|---|---|---|---|
| 11.08.25 | 217.328 | 210.901 | 2.96 |
| 12.08.25 | 223.659 | 210.72 | 5.90 |
| 13.08.25 | 225.707 | 197.232 | 12.62 |
| 14.08.25 | 228.897 | 193.345 | 15.53 |
| 15.08.25 | 230.392 | 191.995 | 16.67 |
| 16.08.25 | 235.047 | 194.405 | 17.29 |
| 17.08.25 | 228.941 | 188.422 | 17.70 |
| 18.08.25 | 227.755 | 182.289 | 19.96 |
| 19.08.25 | 230.718 | 182.956 | 20.70 |
| 20.08.25 | 225.964 | 197.663 | 12.14 |



| | |
|---|---|
| CIRCLE NAME | DR.B.R.AMBEDKAR K... |
| DIVISION NAME | RAMACHANDRAPURAM |
| SUBDIV NAME | RCPURAM |
| ERO NAME | ERO-RCPURAM |
| SECTION NAME | PAMARRU |
| SCNO | 144215270800202 |
| BILL UNITS | 90 |
| ENGCHG | 519.6 |
| CUSTCHG | 45 |
| EDCHG | 5.4 |
| FIXEDCHG | 10 |

1 నెలకు 90 యూనిట్లు గృహ విద్యుత్ వినియోగానికి యూనిట్‌కు రూ.5.76 చొప్పున వేసిన బిల్లు.

### చవితికి కాణిపాకం సిద్ధం



కాణిపాకం: చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీవర సిద్ధి వినాయకస్వామి దేవస్థానం చవితి, వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో కళకళలాడేలా తీర్చిదిద్దారు. పలు రకాల పుష్పాలు, కూరగాయాలతో సుందరమయంగా అలంకరించారు. బుధవారం చవితి పర్వదినాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం నుంచే స్వామికి అభిషేకం చేసి దర్శనభాగ్యం కల్పించనున్నారు. రాత్రి 10గంటలకు ఈ దర్శన సేవలు కొనసాగనున్నాయి.

### ఎన్నికల విధులకు ఆర్జిత సెలవులు ఇవ్వాలి

**ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక**

సాక్షి, అమరావతి: గతేడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రభుత్వాన్ని మంగళవారం డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలల్లోని అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఈ ఏడాది వేసవి సెలవుల్లో అదనంగా పనిచేసినందుకు ప్రభుత్వం ఆర్జిత సెలవులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. అయితే, గతేడాది ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవుల మంజూరు విషయంలో ఒక్కో జిల్లాలో ఒక్కోలా సెలవులు ఇస్తుండగా మరికొన్ని జిల్లాల్లో జీవో ఇవ్వలేదన్న కారణంగా ఆర్జిత సెలవులు ఇవ్వడం లేదన్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై జీవో విడుదల చేసి ఉపాధ్యాయులు ఎన్నికల శిక్షణ తరగతులతో సహా ఎన్ని రోజులు విధులు నిర్వహిస్తే అన్ని ఆర్జిత సెలవులు ఇవ్వాలని కోరారు.

## ఎన్ఎంఆర్‌పై తగ్గిన ఎన్ఎంసీ

దేశంలో అర్హులైన అల్లోపతి వైద్యుల సమగ్ర డేటాబేస్ కోసం ప్రవేశపెట్టిన నేషనల్ మెడికల్ రిజిస్టర్ (ఎన్ఎంఆర్)పై నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) వెనక్కి తగ్గింది. ఎన్ఎంఆర్ కార్యక్రమాన్ని గతేడాది ఆగస్టులో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రారంభించింది. ఎన్ఎంసీ చట్టం–2019లోని సెక్షన్ 31 ప్రకారం ఎంబీబీఎస్ పూర్తిచేసిన వైద్యులందరికీ ఎన్ఎంఆర్‌లో నమోదు తప్పనిసరి అని ప్రకటించింది. ఎన్ఎంఆర్ పోర్టల్‌లో వైద్యులు రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో అనేక ప్రతికూలతలు ఉండటంతో ఈ కార్యక్రమం అమలులో పురోగతి కనిపించలేదు. ఈ నేపథ్యంలో ఎన్ఎంఆర్ స్వచ్ఛందమేనని ఇటీవల లోక్‌సభలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్ స్పష్టం చేశారు. దీంతో ఎన్ఎంఆర్‌పై ఎన్ఎంసీ వెనక్కి తగ్గినట్లయింది. –సాక్షి, అమరావతి



- వైద్యుల రిజిస్ట్రేషన్ స్వచ్ఛందమేనని కేంద్ర ఆరోగ్యశాఖ స్పష్టీకరణ
- అల్లోపతి వైద్యుల సమగ్ర డేటాబేస్ కోసం గతేడాది ఎన్ఎంఆర్ ప్రవేశపెట్టిన ఎన్ఎంసీ
- క్లిష్టమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియతో ప్రతికూల ప్రభావం
- దేశంలో 13 లక్షలమంది వైద్యులకుగాను.. 10 వేల దరఖాస్తులు

వైద్యవిద్య చదివి ప్రాక్టీస్ చేసే వైద్యుల కచ్చితమైన వివరాలను అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా ఎన్ఎంఆర్‌కు శ్రీకారం చుట్టారు. సమగ్ర డేటాబేస్‌తో నకిలీ వైద్యులను ఏరివేయడంతో పాటు, వైద్యం చేసేవారి సమాచారాన్ని ప్రజలు సులువుగా పొందేలా చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అయితే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎన్ఎంసీ ఎంతో క్లిష్టతరంగా రూపొందించడంతో దేశవ్యాప్తంగా వైద్యుల నుంచి నిరసన వ్యక్తమైంది.

**వైద్యుల నిరసన**

రిజిస్ట్రేషన్ ప్రక్రియ నత్తనడకన సాగింది. గతేడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది మే వరకు ఒక్కశాతం కన్నా తక్కువమంది వైద్యులు మాత్రమే రిజిస్టర్ అయ్యారు. దేశంలో జాతీయ, రాష్ట్ర వైద్యమండళ్లలో రిజిస్టర్డ్ వైద్యులు 13 లక్షల మందికిపైగా ఉన్నారు. వీరిలో మే నాటికి కేవలం 10,411 మంది వైద్యులు దరఖాస్తు చేసుకోగా, 10,237 మందికి ఆమోదం లభించింది. ఉమ్మడి ఏపీ వైద్యమండలిలో 1.38 లక్షలమంది రిజిస్టర్డ్ వైద్యులున్నారు. 2016లో విభజిత ఏపీలో వైద్యమండలి కార్యకలాపాలు ప్రారంభించగా ఇప్పటివరకు 40 వేలమంది వైద్యులు సభ్యత్వం పొందారు. అయితే ఇప్పటివరకు రాష్ట్రం నుంచి 500 మంది వైద్యులు మాత్రమే ఎన్ఎంఆర్‌కు దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది.




పంట పొలాల్లో అటవీ వ్యవసాయ వ్యాప్తికి మోడల్ రూల్స్ జారీ చేసిన కేంద్రం

రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించి, అమలు చేస్తే రైతులకు, పర్యావరణానికీ మేలు

# ఆగ్రోఫారెస్ట్రీ మేడ్ ఈజీ!

**అడవి, పొలం వేర్వేరు...**

అడవిలో విత్తిన పంటలు ఉండవు..

పొలంలో చెట్లు ఉండవు..

అయితే, 'ఆగ్రోఫారెస్ట్రీ'లో రెండూ కలగలిసి ఉంటాయి. దీన్ని 'అటవీ వ్యవసాయం' అనొచ్చు.

పొలాల మధ్యలోనే కాదు గట్ల మీద కూడా మచ్చుకు ఒక చెట్టు కూడా లేని వ్యవసాయ భూములు మన గ్రామాల్లో విస్తారంగా కనిపిస్తాయి. చెట్టు నీడ పడిన చోట పంట మొక్కలు సరిగ్గా పెరగవని ఉన్న చెట్లు కొట్టెయ్యటం మనకు తెలిసిందే. విస్తారమైన పొలాల మధ్య ఒక్క చెట్టూ లేని ప్రాంతాలు కూడా కనిపిస్తున్నాయి. 3–6 నెలల్లో పూర్తయ్యే పంటలను ఎప్పటికప్పుడు విత్తుకొని, పంటయ్యాక శుభ్రం చేసి దున్ని పెట్టుకునే అలవాటు వల్ల వ్యవసాయ భూములు నిస్సారంగా మారిపోతున్నాయి.

ఈ దుస్థితి మారాలి.. అంటే, పంట భూముల్లోకి తిరిగి చెట్లను ప్రవేశపెట్టాలి. అందుకని, 'ఆగ్రోఫారెస్ట్రీ'ని ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం చొరవ చూపుతోంది. స్వల్పకాలిక పంటలు సాగు చేసే పొలాల్లోనూ ఆదాయాన్నిచ్చే రకరకాల చెట్లు, పశువులను కలిపి పెంచటాన్ని.. ఆగ్రోఫారెస్ట్రీని.. ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం తలపెట్టింది. రైతుల ఆర్థిక ప్రయోజనం కోసం, పనిలో పనిగా పర్యావరణ సేవల కోసం ఈ అటవీ వ్యవసాయాన్ని పెంపొందించాలన్నది లక్ష్యం.

విలువైన కలప చెట్లను పెంచుతున్న రైతులు ఆ చెట్లు ఎదిగిన తర్వాత నరికి అమ్ముకోవటానికి సవాలక్ష ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ బాధల నుంచి రైతులను ఒడ్డునపడెయ్యటం ద్వారా చెట్ల పెంపకాన్ని పంట పొలాల్లోనూ ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం తలపెట్టింది.

వాస్తవానికి, రైతులు తమ పొలాల్లో పెంచే (ముఖ్యంగా విలువైన కలప జాతి) చెట్ల నరికివేత సమయంలో పొందాల్సిన అనుమతుల ప్రక్రియ ఇప్పుడు చాలా సంక్లిష్టంగా ఉంది. దీన్ని సులభతరం చేస్తూ ఇటీవలే నమూనా నియమాలను విడుదల చేసింది కేంద్రం. ఈ రైతుల కోసం ఒక ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేస్తోంది. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకొన్న రైతులు ఆన్‌లైన్‌లోనే అనుమతులు తీసుకునే ఏర్పాటు చేస్తోంది. అయితే, ఆగ్రోఫారెస్ట్రీపై సరికొత్త నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించి, అమలు చేయాల్సి ఉంది! ఆ నియమాలేమిటో చూద్దాం...

ఆగ్రోఫారెస్ట్రీ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో భారత పర్యావరణ, అటవీ, క్లైమెట్ ఛేంజ్ మంత్రిత్వ శాఖ వ్యవసాయ భూమిలో పెంచిన చెట్లను నరకటం, రవాణా చేయటానికి సంబంధించిన నియమ నిబంధనలను సులభతరం చేసే నమూనా నియమ నిబంధనలను ఇటీవల ప్రకటించింది. ప్రైవేట్ భూమిలో చెట్ల పెంపకాన్ని సులభతరం చేయడం, రైతుల ఆదాయాన్ని పెంచడం, నేలను పునరుద్ధరించడం, డిజిటల్ ట్రేసబిలిటీ ద్వారా అధికారిక అనుమతుల తిప్పలు తగ్గించడం.. తద్వారా విదేశీ కలప దిగుమతులను తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకుంది. వ్యవసాయ భూమిలో పెరిగిన చెట్లను నరికివేతకు స్పష్టమైన నియమాలు ఇప్పటి వరకు లేకపోవటంతో నమూనా నియమ నిబంధనలను కేంద్రం రూపొందించింది. అయితే, సాధారణ పంట పొలాలను అటవీ వ్యవసాయ క్షేత్రాలుగా మార్చేందుకు దోహదపడే ఈ 'నమూనా నియమాల' ప్రయోజనాలు ఎంత వరకు రైతులకు అందుతాయనేది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాల అంగీకారం, అమలు తీరుపై ఆధారపడి ఉంటుంది. కేంద్రం చెప్పినంత మాత్రాన రాష్ట్రాలు వాటిని విధిగా అనుసరించాల్సిన బాధ్యత లేదు.

**రూ. లక్ష కోట్ల కలప దిగుమతి**

మన దేశం ప్రతి సంవత్సరం దాదాపు రూ. లక్ష కోట్ల విలువైన కలపను దిగుమతి చేసుకుంటున్నది. చెక్క ఫర్నీచర్, తలుపులు, కిటికీలు చాలా వరకు మలేషియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా లేదా ఇండోనేషియా నుండి దిగుమతి చేసుకున్న కలపతో తయారవుతున్నాయి. అదే సమయంలో, మన దేశంలో, అటవీ వ్యవసాయం చేయడానికి అనువైన కోట్ల హెక్టార్ల వ్యవసాయ యోగ్యమైన భూమి ఉంది. కానీ, కారణం ఏదైతేనేమి, మన దేశంలోని రైతులు ఈ భారీ మార్కెట్‌ను ఉపయోగించుకోలేకపోయారు. భారతీయ రైతులు ఇంత ఆశాజనకమైన అవకాశాన్ని ఎందుకు ఉపయోగించుకోకూడదు? అని ప్రశ్నించుకునే సందర్భం వచ్చింది. కోట్లాది మంది రైతులు ప్రతిరోజూ తమ పొలాలను జాగ్రత్తగా చూసుకుంటుంటారు. ఆ సాగు భూమిని 'చెట్లతో కూడిన వ్యవసాయం' కోసం ఉపయోగించడం ద్వారా కలప దిగుమతికి స్వస్తి చెప్పవచ్చు.

అటవీ వ్యవసాయం కేవలం కలప గురించి మాత్రమే కాదు. ఇది నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, పంట దిగుబడిని పెంచడానికి, ఆహార భద్రతను పరిపూర్ణం చేయటంలో, వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో సహాయపడుతుంది. నదులను పునరుద్ధరించడంలో చెట్ల ఆధారిత వ్యవసాయం ఎలా సహాయపడుతుందో చూపే ఉద్యమ ఉదాహరణలు ఉన్నాయి. అయినా, ఇన్నాళ్లు అటవీ వ్యవసాయం విస్తరించకపోవటానికి కారణాలు ఉన్నాయి.

**సోషల్ ఫారెస్ట్రీ - ఆగ్రోఫారెస్ట్రీ మధ్య వ్యత్యాసాలేమిటి?**

| అంశం | సోషల్ ఫారెస్ట్రీ | ఆగ్రోఫారెస్ట్రీ |
|---|---|---|
| నిర్వచనం | సహజసిద్ధమైన అడవులకు వెలుపల ప్రజల సామాజిక అవసరార్థం చెట్లు పెంచటం. | రైతుల వ్యవసాయ భూముల్లో వార్షిక పంటలు, పశువులతో పాటు కలిపి లేదా విడిగా చెట్లు పెంచటం. |
| ప్రాథమిక లక్ష్యం | గ్రామీణులు, బడుగు వర్గాల ప్రజల అవసరాలు తీర్చటం కోసం వంట చెరకు, పశుగ్రాసం, కలపనిచ్చే చెట్లు పెంచటం. | పంట పొలాల ఉత్పాదకతను, రైతుల ఆదాయాన్ని, పనిలో పనిగా పర్యావరణ సమతుల్యతను పెంపొందించటం. |
| ఎవరి కోసం? | నిరుపేద, అణగారిన వర్గాల ప్రజల సమష్టి /సామాజిక ప్రయోజనాలను పరిరక్షించటం. | పంట పొలాల్లో భూమిని కొద్ది నెలల్లో పూర్తయ్యే పంటలకే పరిమితం చేయకుండా ఏడాది పొడవునా పచ్చని చెట్లతో నిండి ఉండేలా చేస్తూ రైతులకు ప్రయోజనం కలిగించటం. |
| ఉదాహరణలు | గ్రామాల్లో ప్రభుత్వ ఖాళీ భూములు, బంజర్లు, రోడ్ల పక్కన ఖాళీ స్థలంలో చెట్లు పెంచటం. | పంట భూముల్లో సాధారణ పంటలతో పాటు పండ్ల చెట్లు, పశుగ్రాసాన్నిచ్చే దీర్ఘకాలిక చెట్లు పెంచటం. అదేవిధంగా టేకు, శ్రీగంధం, ఎర్రచందనం, మహాగని, మలబారువేప, సుబాబుల్, సర్వి వంటి కలప చెట్లతో పాటు అంతర పంటలు సాగు చేయటం, పశువులను పెంచటం. |
| విధానాల మద్దతు | సామాజిక అటవీ పెంపకం పథకాలు, ఉమ్మడి అటవీ యాజమాన్య పథకాలకు సంబంధించిన చట్టాలు వచ్చాయి. | జాతీయ అటవీ వ్యవసాయ (ఆగ్రో ఫారెస్ట్రీ) విధానం(2014) ప్రకటించింది. |

**అటవీ వ్యవసాయం ముఖ్య ప్రయోజనాలు...**

**పర్యావరణ సమతుల్యత:** చెట్లు వాటి వేళ్ళతో మట్టిని కోతకు గురికాకుండా నిలుపుకుంటాయి. నీటిని భూమిలోకి ఇంకింపజేస్తాయి. నేలలో సేంద్రియ పదార్థం పెరుగుతుంది. ప్రకృతిలో పోషక చక్రాన్ని మెరుగవుతుంది. తీవ్ర వాతావరణ ప్రతికూలతల నుంచి భూమిని రక్షించడంలో అటవీ వ్యవసాయం సహాయపడుతుంది.

**జీవవైవిధ్యం:** అటవీ వ్యవసాయ క్షేత్రాలు ఏక పంటలు (మోనోకల్చర్) సాగయ్యే పొలంలో కంటే సంక్లిష్టమైన ఆవాసాలను సృష్టిస్తాయి. ఇవి వివిధ రకాల జంతువులు, మేలు చేసే కీటకాలు, మొక్కలకు ఆశ్రయం ఇవ్వడం ద్వారా జీవవైవిధ్యాన్ని పెంచుతాయి.

**భూతాపం తగ్గింపు:** చెట్లు వాతావరణంలో నుంచి కర్బనాన్ని గ్రహించి తమ కలపలో, నేలలోనూ నిల్వ చేస్తాయి. ఇది గ్రీన్‌హౌస్ వాయువులను తగ్గించడానికి సహాయపడుతుంది.

**రైతులకు అనేక రకాల ఆదాయం:** రైతులు ఒకే పంటపై ఆధారపడే అవసరం తగ్గుతుంది. అటవీ వ్యవసాయంలో చెట్లు, పంటలు, పశువులను ఒకే పొలంలో పండించటం వల్ల రైతుకు అనేక రకాలుగా ఆదాయం వస్తుంది. కలప, పండ్లు, గింజలు, పశుగ్రాసం వంటి బహుళ ఉత్పత్తులు అందుతాయి. మార్కెట్ అస్థిరత లేదా పంట వైఫల్యం వంటి విపత్తుల నుంచి రక్షణ కలుగుతుంది.

**మెరుగైన జీవనోపాధి:** మొత్తంగా రైతు ఆదాయం పెరుగుతుంది. దీంతో పాటు, వైవిధ్యభరితమైన ఉత్పాదనలు గ్రామీణ సమాజాలకు అందుతాయి. మెరుగైన పోషణ, ఆరోగ్యం లభిస్తాయి. కొన్ని ప్రాంతాల్లో మహిళలు వంట చెరకు కోసం కలపను సేకరించడానికి చాలా గంటల సమయం వెచ్చిస్తారు. అటవీ వ్యవసాయం ఆ సమయాన్ని కూడా తగ్గిస్తుంది. ఆ సమయాన్ని మరో పనికి ఉపయోగించుకోవచ్చు.

**ఆకు విలువ రూ.5!**

చెట్టు అందించే పర్యావరణ సేవలు అన్నీ, ఇన్నీ కాదు. తనపైన పడిన వర్షాన్ని వేర్ల ద్వారా భూమిలోకి ఇంకింపజేస్తుంది. ఏడాది పొడవునా పచ్చగా ఉంటుంది. పక్షులకు ఆవాసాన్ని కల్పిస్తుంది. పక్షులు పంటలపై పురుగుల్ని ఏరుకొని తిని రైతుకు మేలు చేస్తాయి. పక్షుల విసర్జితాలు పంట భూమిలో సూక్ష్మజీవరాశిని పెంచి సారవంతం చేస్తాయి. చెట్టు ఆకులు రాల్చుతుంటుంది. ఆ ఆకులు భూమిలో కలిసి భూసారం పెరుగుతుంది. భూమి లోపలి పొరల్లో నుంచి చెట్టు గ్రహించిన పోషకాలను ఆ ఆకుల ద్వారా నేలను సారవంతం చెయ్యటానికి చెట్టు ఆకులు రాల్చుతూ ఉంటుంది. అందుకే, 'రాలే ప్రతి ఆకూ రూ.5తో సమానం' అని ప్రసిద్ధ సేంద్రియ వ్యవసాయ రైతు శాస్త్రవేత్త దివంగత డాక్టర్ ఎల్. నారాయణరెడ్డి అన్నారు.

**చట్టపరమైన చిక్కు**

ఒక మారుమూల గ్రామంలో మీరు ఒక రైతు అని ఊహించుకోండి. కలపకు పెరుగుతున్న డిమాండ్ చూసి, మీ భూమిలో అధిక విలువైన కలప చెట్లను నాటారు. మొక్కలు కొని, గుంతలు తవ్వి నాటారు. నీటిపారుదల ఏర్పాటు చేశారు. చెట్లను ఏళ్ల తరబడి జాగ్రత్తగా చూసుకున్నారు. దీర్ఘకాలిక పెట్టుబడిగాను, ఒక రకమైన బీమాగా కూడా భావించి ఆశలు పెంచుకున్నారు. కానీ చివరకు చెట్లు నరికే సమయం వచ్చినప్పుడు, సమస్య వచ్చిపడుతుంది. మీ సొంత వ్యవసాయ భూమిలో చెట్లు పెరిగినప్పటికీ, వాటిని మీ వ్యవసాయ ఉత్పత్తులుగా చట్టం పరిగణించదు! చట్టబద్ధంగా, అవి 'అటవీ ఉత్పత్తుల' కిందకు వస్తాయి. పెరిగిన చెట్లను నరకాలంటే సంక్లిష్టమైన అనుమతులు అవసరం అవుతాయి. అటవీ, రెవెన్యూ, వ్యవసాయ శాఖల నుంచి ఆమోదాలు తీసుకోవాలి. అనుమతుల కోసం తరచుగా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇప్పటికే రోజువారీ బాధ్యతలతో తీరిక లేకుండా ఉండే రైతులకు ఈ పనులు సులభం కాదు.

**2014 తర్వాత ఆశాజనకమైన కదలిక**

ఈ పరిస్థితుల్లో మార్పు తేవటానికి ఆశాజనకమైన విధాన మార్పులు జరుగుతున్నాయి. రైతులు చెట్లను వ్యవసాయ పంటలతో అనుసంధానించడాన్ని ప్రోత్సహించడానికి జాతీయ అటవీ వ్యవసాయ విధానాన్ని 2014లో అమల్లోకి తెచ్చారు. 2018లో ఒక నిపుణుల కమిటీ చెట్ల ఆధారిత వ్యవసాయ క్షేత్రాలను ప్రధాన స్రవంతి వ్యవసాయంలోకి తీసుకురావడం ద్వారా 'అడవుల వెలుపల చెట్టు'న్న ప్రాంతాన్ని విస్తరించాలని సిఫారసు చేసింది. ఈ విధానాలు మంచి ఉద్దేశ్యంతో కూడినవే అయినప్పటికీ, అవి నిజంగా కీలక సమస్యను పరిష్కరించలేదు. అదేమిటంటే.. ప్రైవేట్ వ్యవసాయ భూముల్లో పెంచే చెట్లకు సంబంధించిన చట్టపరమైన స్థితి మారలేదు.

ఈ సమస్య 1927 నాటి ఇండియన్ ఫారెస్ట్ యాక్ట్ నాటిది. ఇది వలసరాజ్యాల కాలం నాటి చట్టం. ప్రైవేట్ భూమిలో పండించిన కలపతో సహా అన్ని రకాల కలపలను 'అటవీ ఉత్పత్తులు'గానే నిర్వచించింది. దీని అర్థం రైతులు తాము పెంచిన చెట్లను నరకడానికి లేదా రవాణా చేయడానికి అటవీ శాఖ అనుమతులు తీసుకోవటం అవసరం. ఈ పాత నిబంధన దాదాపు ఒక శతాబ్దం పాటు 2023 వరకు అమలులో ఉంది. అటవీ సంరక్షణ చట్టానికి 2023లో ఒక మైలు రాయి వంటి సవరణ జరిగింది. అధికారికంగా అడవిగా నోటిఫై అయిన భూమికి లేదా 1980 అక్టోబర్ 25 నాటికి ప్రభుత్వ రికార్డులలో అడవిగా నమోదైన భూమికి మాత్రమే వర్తిస్తుందని, రైతుల పొలాలకు వర్తించదని ఈ సవరణ స్పష్టం చేసింది. సరళంగా చెప్పాలంటే, రైతులు ఇప్పుడు తమ వ్యవసాయ భూమిలో చెట్లను పెంచుకోవచ్చు. వాటిని నరికితే జరిమానా పడుతుందనే ఆందోళన లేకుండా ఆగ్రోఫారెస్ట్రీ సాగు చేసుకోవచ్చు.

సొంత భూమిలో పెంచిన చెట్లను నరకడానికి, రవాణా చేయటానికి మాత్రం అనుమతులు తప్పనిసరి అనే మరో ప్రధాన అడ్డంకి మిగిలే ఉంది. ప్రతి రాష్ట్రం కొన్ని జాతుల చెట్ల జాబితాను రూపొందించింది. వీటిని నరకాలన్నా లేదా కలప రవాణా చేయాలన్నా ప్రత్యేక అనుమతి అవసరం. తరచూ మారే ఈ నియమనిబంధనలు రైతులను గందరగోళపరుస్తూ ఉంటాయి.

**ఎన్‌టిపిఎస్‌కు స్పందన కరవు**

రైతులకు ఈ అనుమతులు ఇవ్వటం కోసమని 2020లో 'నేషనల్ ట్రాన్సిట్ పాస్ సిస్టమ్'(ఎన్‌టిపిఎస్) కేంద్రం ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. కానీ ఇప్పటివరకు, ఇది పెద్దగా ఆదరణ పొందలేదు. దాదాపు 950 మంది రైతులు మాత్రమే ఈ ప్లాట్‌ఫామ్‌లో నమోదు చేసుకున్నారు. కాబట్టి, ఆగ్రోఫారెస్ట్రీ నిబంధనలను మరింత సరళీకరించాల్సిన అవసరాన్ని గుర్తించిన కేంద్ర పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ 2025 జూన్‌లో 'వ్యవసాయ భూమిపై చెట్ల నరికివేతకు నమూనా నియమాల'ను ప్రకటించింది. అన్ని రాష్ట్రాలను దృష్టిలో పెట్టుకొని ఏకీకృత, రైతు స్నేహ పూర్వక వ్యవస్థ ఏర్పాటుకు ఇవి వీలు కల్పిస్తున్నాయి.

**కొత్త నియమాలు చెబుతున్నదేమిటి?**

నేషనల్ టింబర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎన్‌టీఎంఎస్) రైతులు తమ పొలాల్లో పెంచుతున్న చెట్లను నమోదు చేసుకోవడానికి, పర్మిట్లను ట్రాక్ చేయడానికి సహాయపడుతుంది. ఇది జాప్యాన్ని తగ్గిస్తుంది. రైతులు తమ తోటల భూములను ఎన్‌టీఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. భూమి యాజమాన్యం, ఊరు, నాటిన జాతులు, నాటిన తేదీలు వంటి వివరాలను అందించాలి. చెట్లను జియోట్యాగ్ చేసిన ఫోటోలను కూడా అప్‌లోడ్ చేయాలి. కాలానుగుణంగా కొత్త సమాచారాన్ని జోడించాలి.

**9 చెట్లకు ఆటోమేటిక్ అనుమతి**

పది చెట్ల కంటే తక్కువ పెంచుతున్న రైతులు చెట్ల ఫోటోలను అప్‌లోడ్ చేసిన తర్వాత ఈ పోర్టల్ ద్వారా 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ)'ను, చెట్లు నరకడానికి, రవాణా చేయటానికి ఆటోమేటిక్‌గా అనుమతులు పొందవచ్చు.

10 కంటే ఎక్కువ చెట్లు ఉన్న రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. గుర్తింపు పొందిన ఏజెన్సీ క్షేత్రస్థాయిలో పరిశీలించి ధ్రువీకరించిన తర్వాత అనుమతి మంజూరవుతుంది.

2016 నాటి కలప ఆధారిత పరిశ్రమల (స్థాపన – నియంత్రణ) మార్గదర్శకాల ప్రకారం ఏర్పడిన రాష్ట్ర స్థాయి కమిటీలు ఈ నియమాలను అమలు చేస్తాయి. విధానాల సరళీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు సలహా ఇస్తాయి. చెట్ల నరికివేత కోసం దరఖాస్తులను ధ్రువీకరించడానికి అటవీ నిర్వహణ లేదా వ్యవసాయ అటవీశాస్త్రంలో నైపుణ్యం కలిగిన ఏజెన్సీలను కూడా ఈ కమిటీలు ఎంప్యానెల్ చేస్తాయి. డివిజనల్ ఫారెస్ట్ అధికారులు కాలానుగుణంగా ధ్రువీకరణ సంస్థల పనితీరును పర్యవేక్షిస్తారు.

ఈ నియమాలు రైతులు అధికారిక చిక్కుల్లో చిక్కుకోకుండా కలప చెట్లను పెంచడం, నరకడం, విక్రయించే ప్రక్రియను సులభతరం చేయడానికి దోహదపడతాయి. అదే సమయంలో ప్రతి రాష్ట్రం స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చుకోవడానికి వీలు ఉండటం విశేషం. రాష్ట్రాలు వీటిని ఆమోదిస్తేనే ఆగ్రోఫారెస్ట్రీ రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.



## అటవీ వ్యవసాయంలో అనేక రకాలు...

**సాధారణ ఆగ్రోఫారెస్ట్రీ**
చెట్ల మధ్య పంటల సాగు. పండ్ల చెట్లు లేదా కలప చెట్లు లేదా పశువుల మేతకు పనికొచ్చే ఆకులనందించే జాతుల చెట్ల వరుసల మధ్య సీజనల్ పంటలు పండిస్తారు.

**సిల్వోపాస్టర్**
చెట్ల మధ్య పచ్చిక బయళ్ళుంటాయి. అందులో పశువులు మేస్తూ పెరుగుతాయి. జంతువులకు చెట్లు నీడనిస్తాయి. కలుపు నియంత్రించడంలో జంతువులు సహాయపడతాయి.

**ఆగ్రోసిల్వోపాస్టోరల్**
చెట్లు, పంటలు, జంతువులు కలిసి పెరిగే క్షేత్రం. ఒక చక్కని ఉదాహరణ: ఇంటి తోట. ఇక్కడ వివిధ రకాల కూరగాయ మొక్కలు, పండ్ల చెట్లు, జంతువులు.. అన్నీ కలిసి పెరిగే వ్యవస్థ.

అటవీ వ్యవసాయం మనకు కొత్తది కాదు, పురాతనమైనదే. కానీ, ఆధునిక అటవీ వ్యవసాయ పద్ధతులు సమకాలీన వ్యవసాయ, పర్యావరణ సవాళ్లకు ప్రకృతి ఆధారిత పరిష్కారంగా సరికొత్త ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

**విండ్‌బ్రేక్‌లు**
తీవ్ర గాలి, ధూళి నుంచి పంటలు, పశువులు, భవనాలను రక్షించడానికి చెట్లు, పొదలను వరుసలుగా నాటుతారు.

– నిర్వహణ:
**పంతంగి రాంబాబు**
సాక్షి సాగుబడి డెస్క్

## లిస్టింగ్ స్ట్రీట్

### 3 హిట్.. 1 ఫట్

నిరాశపరిచిన జెమ్ ఆరోమాటిక్స్

ముంబై: ఇటీవల ఐపీఓలు పూర్తి చేసుకున్న నాలుగు కంపెనీల షేర్లు ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. టారిఫ్ అనిశ్చితులతో స్టాక్ మార్కెట్ నష్టాల్లో ట్రేడైనప్పటికీ.., నాలుగింటిలో మూడు లిస్టింగులు అదరగొట్టాయి. ఒకటి మాత్రం నిరాశపరిచింది. అత్యధికంగా పటేల్ రిటైల్ షేరు తొలిరోజే 13% లాభాలు పంచింది. జెమ్ ఆరోమాటిక్స్ షేరు ఇష్యూ ధర (రూ.325)తో పోలిస్తే 2% నష్టాన్ని మిగిల్చింది.

| కంపెనీ | ఇష్యూ | లిస్టింగ్ | ముగింపు |
|---|---|---|---|
| పటేల్ రిటైల్ | 255 | 305 | 290(+13%) |
| విక్రం సోలార్ | 332 | 340 | 356(+7%) |
| శ్రీజీ షిప్పింగ్ | 252 | 272 | 255(+1%) |
| జెమ్ ఆరోమాటిక్స్ | 325 | 325 | 391(-2%) |

● లిస్టింగ్, ముగింపులు ఇష్యూ ధర పోలిస్తే

## బిజినెస్ రీల్

### ఎస్బీఐ-ఫ్లిప్కార్ట్ కో- బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్

కొనుగోళ్లపై 5–7.5 శాతం క్యాష్బ్యాక్



న్యూఢిల్లీ: ఎస్బీఐ కార్డ్ సంస్థ ఫ్లిప్కార్ట్తో కలసి ఒక కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డును విడుదల చేసింది. ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి, ఎస్బీఐ ఎండీ అశ్విని కుమార్ తివారీ సమక్షంలో 'ఫ్లిప్కార్ట్ ఎస్బీఐ క్రెడిట్ కార్డ్'ను ఆవిష్కరించినట్టు ఎస్బీఐ కార్డ్ ప్రకటించింది. షాపింగ్పై క్యాష్ బ్యాక్ ప్రయోజనాలతో దీన్ని రూపొందించినట్టు తెలిపింది. ఈ కార్డుతో మింత్రాపై కొనుగోళ్లు చేస్తే 7.5 శాతం, ఫ్లిప్కార్ట్, షాప్సి, క్లియర్ట్రిప్పై చేసే కొనుగోళ్లపై 5 శాతం క్యాష్ బ్యాక్ పొందొచ్చని ఎస్బీఐ కార్డ్ తెలిపింది. రివార్డులను తిరిగి ఫ్లిప్కార్ట్పై కొనుగోళ్లకు, ట్రావెల్ బుకింగ్లకు వినియోగించుకోవచ్చని పేర్కొంది. ఫ్లిప్కార్ట్ యాప్, ఎస్బీఐ కార్డ్ డాట్ కామ్ నుంచి ఈ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

### ఓపెన్ఏఐ నుంచి లెర్నింగ్ యాక్సెలరేటర్

న్యూఢిల్లీ: ఏఐ సాధనాలు, శిక్షణాలతో విద్యావేత్తలకు సాధికారత అందించే దిశగా ఓపెన్ఏఐ కొత్తగా లెర్నింగ్ యాక్సెలరేటర్ను ప్రారంభించింది. ఐఐటీ మద్రాస్తో కలిసి ప్రారంభించిన ఈ ప్రాజెక్టుకు 5,00,000 డాలర్లు అందించనుంది. అలాగే, వచ్చే ఆరు నెలల్లో కేంద్ర విద్యా శాఖ, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ మొదలైన వాటితో భాగస్వామ్యం ద్వారా విద్యావేత్తలు, విద్యార్థులకు అయిదు లక్షల పైచిలుకు చాట్జీపీటీ లైసెన్సులు అందించనుంది. మరోవైపు, ఎడ్యుకేషన్ ఫర్ ఇండియా– ఆసియా పసిఫిక్ విభాగానికి హెడ్గా రాఘవ్ గుప్తాను నియమించినట్లు ఓపెన్ఏఐ తెలిపింది.

### కోడిగుడ్లు (హోల్సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-8-2025

| | |
|---|---|
| విశాఖ | 540–00 |
| చిత్తూరు | 558–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 540–00 |
| విజయవాడ | 550–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 500–00 |
| వరంగల్ | 502–00 |
| రిటైల్ ధర | 5.60 |

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| EICHERMOT | 6,151.00 | 2.68 |
| HINDUNILVR | 2,692.70 | 2.32 |
| MARUTI | 14,720.00 | 1.85 |
| ITC | 403.35 | 1 |
| NESTLEIND | 1,159.20 | 0.54 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| SHRIRAMFIN | 595.85 | -4.03 |
| SUNPHARMA | 1,601.20 | -3.35 |
| TATASTEEL | 155.05 | -2.87 |
| BAJFINANCE | 876 | -2.75 |
| TRENT | 5,290.00 | -2.45 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 8,242 |
| ఎన్ఎస్ఈ | 1,46,511 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 4,03,450 |
| ఎఫ్ఐఐ | - 6,516 |
| డీఐఐ | + 7,060 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 63.40 | $ 64.08 |
| బ్రెంట్ | 66.79 | $ 68.22 |

# పవన విద్యుత్కు మహర్దశ

- 2030 నాటికి 107 గిగావాట్లు
- ప్రస్తుత సామర్థ్యం కంటే రెట్టింపు
- అంతర్జాతీయ పవన విద్యుత్ మండలి

న్యూఢిల్లీ: భారత్లో పవన విద్యుదుత్పత్తి సామర్థ్యాలు వచ్చే ఐదేళ్లలో రెట్టింపు కానున్నాయి. ప్రస్తుతం 51 గిగావాట్ల వార్షిక ఉత్పాదక సామర్థ్యం ఉండగా.. 2030 నాటికి 107 గిగావాట్లకు చేరుకుంటుందని అంతర్జాతీయ పవన విద్యుత్ మండలి (జీడబ్ల్యూఈసీ) తెలిపింది. 2030 నాటికి 100 గిగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. భారత పర్యావరణ అనుకూల ఇంధన ఆకాంక్షలకు పవన విద్యుత్ కీలకంగా ఉండడమే కాకుండా, అంతర్జాతీయంగానూ ప్రభావం చూపిస్తున్నట్టు నివేదికలో పేర్కొంది. కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ సెక్రటరీ సంతోష్ కుమార్ సారంగి సమక్షంలో ఈ నివేదికను జీడబ్ల్యూఈసీ విడుదల చేసింది. భారత్ ఇంధన పరివర్తనను తక్కువ ఖర్చుతో విజయవంతంగా సాధించేందుకు పవన విద్యుత్ సాయంగా నిలుస్తుందని తెలిపింది. పవన విద్యుత్ టర్బయిన్ల ఉత్పత్తి పరంగా భారత్ ప్రపంచంలో మూడో స్థానానికి చేరుకున్నట్టు ఈ నివేదిక తెలిపింది. ప్రపంచ అవసరాల్లో 10 శాతాన్ని భారత్ పరిశ్రమ తీర్చనుందని, 1,54,000 మందికి ఉపాధి కల్పించనుందని వెల్లడించింది. పరిశ్రమ గణాంకాల ప్రకారం గతేడాది భారత్ 3 గిగావాట్ల పవన విద్యుత్ ఎక్విప్మెంట్ను ఎగుమతి చేయగా, అంతర్జాతీయంగా ఎగుమతి మార్కెట్ పరిమాణం 117 గిగావాట్లుగా ఉంది. ఈ ఏడాది 135 గిగావాట్లకు చేరుకుంటుందని అంచనా. ప్రపంచ ఎగుమతుల్లో 60 శాతం చైనా సమకూరుస్తోంది.




### 500 గిగావాట్ల సామర్థ్యం సాధిస్తాం..

2030 నాటికి శిలాజేతర ఇంధన వనరుల ద్వారా 500 గిగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని సాధిస్తామని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఈ సందర్భంగా ప్రకటించారు. ఇందులో 100 గిగావాట్లు పవన విద్యుత్ రూపంలో ఉంటుందన్నారు. భారత్ కేవలం శుద్ధ ఇంధన సదుపాయాలనే సమకూర్చుకోవడం లేదంటూ భవిష్యత్ను నిర్మిస్తున్నట్టు చెప్పారు. 30 గిగావాట్ల సామర్థ్యం కలిగిన పవన విద్యుత్ ప్రాజెక్టుల అమలు వివిధ దశల్లో ఉన్నట్టు సంతోష్ కుమార్ సారంగి ఈ కార్యక్రమంలో భాగంగా ప్రకటించారు. వచ్చే కొన్నేళ్లలో ఇవి కార్యకలాపాలు మొదలు పెడతాయని చెప్పారు. ముఖ్యంగా ఈ ఏడాది ఆరు నుంచి ఏడు గిగావాట్ల సామర్థ్యం అదనంగా కార్యకలాపాల్లోకి వస్తుందన్నారు. అమెరికా టారిఫ్లు పునరుత్పాదక ఇంధన ఎక్విప్మెంట్ తయారీ కంపెనీలపై పెద్దగా ప్రభావం చూపించకపోవచ్చంటూ, భారత్ నుంచి అమెరికాకు సోలార్, విండ్ ఎగుమతులు పెద్దగా లేవన్నట్టు చెప్పారు. 2030 నాటికి ప్రపంచ విద్యుదుత్పత్తిలో పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే సగం ఉంటుందని, ఇందులో పవన విద్యుత్ వాటా 20–25 శాతం మేర ఉంటుందని ప్రపంచ పవన విద్యుత్ మండలి ఇండియా చైర్మన్ గిరీష్ తంతి తెలిపారు.

## రూ.600 పెరిగిన పసిడి

ఢిల్లీలో ధర రూ.1,00,770 ● రూ.3,000 లాభపడిన వెండి

న్యూఢిల్లీ: బంగారం ధరలు మంగళవారం స్వల్పంగా లాభపడ్డాయి. బలహీన రూపాయి, అంతర్జాతీయ ధోరణులు ఇందుకు మద్దతునిచ్చినట్టు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత బంగారం రూ.600 పెరిగి రూ.1,00,770 స్థాయికి చేరింది. 99.5 శాతం స్వచ్ఛత పసిడి రూ.500 లాభపడి రూ.1,00,400 స్థాయిని తాకింది. వెండి సైతం రూ.3,000 ర్యాలీ చేసి కిలో ధర రూ.1,18,000కు చేరింది. ''ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ లీసా కుక్ను తొలగించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకోవడంతో యూఎస్ సెంట్రల్ బ్యాంక్ స్వతంత్ర ప్రతిపత్తిపై ఆందోళనలకు దారితీసింది. దీంతో ఇన్వెస్టర్లు సురక్షిత సాధనమైన బంగారంలో పెట్టుబడులకు మొగ్గు చూపించారు'' అని హెచ్డీఎఫ్సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ఫెడ్ త్వరలోనే వడ్డీ రేట్లను తగ్గించే దిశగా అమెరికా అధ్యక్షుడు ఒత్తిళ్లను పెంచడం కూడా బంగారం ధరలకు మద్దతునిచ్చే పరిణామంగా పేర్కొన్నారు. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్స్కు 0.37 శాతం పెరిగి 3,378 డాలర్ల వద్ద ట్రేడయ్యింది. ''టారిఫ్ల పరమైన అనిశ్చితులు సైతం బంగారం ధరలకు మద్దతునిచ్చేవే. భారత్పై అదనంగా 25 శాతం టారిఫ్ల అమలు, రష్యా–ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో శాంతి చర్చల్లో అర్థవంతమైన పురోగతిపై ట్రేడర్లలో సందేహానికి దారితీసింది''అని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా వివరించారు.



## అదానీ-జేపీ డీల్కు సీసీఐ సై

దివాలా పరిష్కార బిడ్తో కొనుగోలుకి వీలు




న్యూఢిల్లీ: రుణ సంక్షోభంలో చిక్కుకున్న జైప్రకాష్ అసోసియేట్స్(జేపీ) కొనుగోలుకి కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) తాజాగా అదానీ గ్రూప్ను అనుమతించింది. దీంతో ప్రస్తుతం దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్న జేపీని సొంతం చేసుకునేందుకు అదానీ గ్రూప్ వేసిన బిడ్ గెలుపొందే వీలుంది. తద్వారా అదానీ ఎంటర్ప్రైజెస్, అదానీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలపర్స్ లేదా అదానీ గ్రూప్లోని ఏ ఇతర సంస్థ అయినా జేపీలో 100 శాతం వాటా కొనుగోలుకి అనుమతించింది. వెరసి అదానీ గ్రూప్ సంస్థలు జేపీని సొంతం చేసుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐబీసీ చట్ట నిబంధనలమేరకు ఇటీవల సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు ప్రకారం దివాలా పరిష్కార ప్రణాళిక దాఖలుకు సీసీఐ అనుమతి తప్పనిసరి. కాగా.. జేపీ దివాలా పరిష్కార ప్రణాళికను ప్రస్తుతం రుణదాతల కమిటీ(సీవోసీ) సమీక్షిస్తోంది. సీసీఐ అనుమతి తదుపరి మాత్రమే దివాలా పరిష్కార ప్రణాళికను సీవోసీ సమీక్షించి అంగీకరిస్తుంది. కాగా.. జేపీ కొనుగోలుకి అదానీ గ్రూప్తోపాటు.. దాల్మియా భారత్ ప్రతిపాదనను సైతం తాజాగా సీసీఐ అనుమతించింది. వేదాంతా గ్రూప్, జిందాల్ పవర్, పీఎన్సీ ఇన్ఫ్రాటెక్ తదితర సంస్థలు సైతం జేపీ కొనుగోలుకి వీలుగా సీసీఐను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. 2024 జూన్3న జేపీపై కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియకు ఎన్సీఎల్టీ అలహాబాద్ బెంచ్ ఆదేశించింది. రుణ చెల్లింపుల్లో వైఫల్యం ఇందుకు కారణంకాగా.. రుణదాతలకు రూ. 57,185 కోట్లు బకాయిపడటం గమనార్హం!

## వీఐపీ ఇండస్ట్రీస్లో 'మల్టిపుల్స్' పెట్టుడులకు ఓకే

సీసీఐ ఆమోదం




న్యూఢిల్లీ: లగేజీ, ట్రావెల్ యాక్సెసరీల సంస్థ వీఐపీ ఇండస్ట్రీస్లో వాటాల కొనుగోళ్లకు వీలుగా మల్టిపుల్స్ ఈక్విటీ, ఇతర ఇన్వెస్టర్లతో కూడిన కన్సార్షియానికి కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం తెలిపింది. వీఐపీ ఇండస్ట్రీస్ ప్రమోటర్లు కంపెనీలో 32 శాతం మేర తమ వాటాను ఆల్టర్నేటివ్ అస్సెట్ మేనేజ్మెంట్ కంపెనీ మల్టిపుల్స్ ఈక్విటీ, తదితర ఇన్వెస్టర్లతో కూడిన కన్సార్షియంకు విక్రయించనున్నట్టు జూలైలో ప్రకటించడం గమనార్హం. ఈ కన్సార్షియంలో మల్టిపుల్స్ ప్రైవేటు ఈక్విటీ ఫండ్ 4 (ఎంపీఈఎఫ్), మల్టిపుల్స్ ప్రైవేటు ఈక్విటీ గిఫ్ట్ ఫండ్ 4 (ఎంపీజీఎఫ్), సంవిభాగ్ సెక్యూరిటీస్, క్యారెట్లేన్ వ్యవస్థాపకుడు మిథున్ పదమ్ సాచేటి, ఆయన సోదరుడు సిద్ధార్థ సాచేటి ఉన్నారు. ఇందులో సంవిభాగ్ సెక్యూరిటీస్ అన్నది ఆకాశ్ భన్సాలీకి చెందిన సంస్థ. సీసీఐ ఆమోదం నేపథ్యంలో వీఐపీ ఇండస్ట్రీస్లో 26 శాతం మేర అదనపు వాటా కొనుగోలుకు వీలుగా పబ్లిక్ షేర్ హోల్డర్లకు ఈ కన్సార్షియం ఓపెన్ ఆఫర్ ఇవ్వాల్సి ఉంటుంది. జూన్ చివరికి వీఐపీ ఇండస్ట్రీస్లో ప్రమోటర్, ప్రమోటర్ సంస్థలకు మొత్తంగా 51.73 శాతం వాటా ఉంది.

## సెంచురీ పల్ప్పై సీసీఐకి ఐటీసీ

- అనుమతి కోసం దరఖాస్తు
- డీల్ విలువ రూ. 3,498 కోట్లు




న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ తాజాగా ఆదిత్య బిర్లా రియల్టీ(ఏబీఆర్ఈఎల్) నుంచి పల్ప్, పేపర్ బిజినెస్ కొనుగోలుకి కాంపిటీషన్ కమిషన్ను ఆశ్రయించింది. తద్వారా రూ. 3,498 కోట్ల విలువైన ఈ డీల్పై అనుమతిని కోరింది. 1984లో ఉత్తరాఖండ్లోని నైనిటాల్లో ఏబీఆర్ఈఎల్ నెలకొల్పిన సెంచురీ పల్ప్ అండ్ పేపర్ బిజినెస్ను ఐటీసీ సొంతం చేసుకోనుంది. ప్రస్తుతం వార్షికంగా 4.8 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో దేశీ పేపర్ పరిశ్రమలో సుప్రసిద్ధ కంపెనీగా సెంచురీ పల్ప్ అవతరించింది. అయితే ప్రతిపాదిత కొనుగోలు కారణంగా పోటీకి సంబంధించి ఎలాంటి ఆందోళనలు తలెత్తబోవని ఐటీసీ పేర్కొంది. దేశీ పేపర్ మార్కెట్లలో తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో తాజా డీల్ ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపబోదని సీసీఐకు వివరించింది. కాగా.. పల్ప్, పేపర్ బిజినెస్ను స్లంప్ సేల్ ప్రాతిపదికన ఐటీసీకి విక్రయించేందుకు బోర్డు అనుమతించినట్లు ఈ ఏడాది మార్చిలో ఏబీఆర్ఈఎల్ తెలియజేసింది. ఇందుకు నగదు రూపేణా ఐటీసీ రూ. 3,498 కోట్లు చెల్లించేందుకు అంగీకరించినట్లు వెల్లడించింది. తద్వారా తమకు కీలకమైన రియల్టీ విభాగంపై దృష్టిసారించనున్నట్లు పేర్కొంది. 2020–24 మధ్యకాలంలో రూ, 4,000 కోట్ల ఫ్రీ క్యాష్ ఫ్లో సాధించిన పేపర్ బోర్డ్స్, ప్యాకేజింగ్ విభాగం ఇకపైనా ఇదే రీతిలో కొనసాగనున్నట్లు ఐటీసీ ఇటీవల అంచనా వేసిన సంగతి తెలిసిందే..

## సినిమా టికెట్లపై 5% జీఎస్టీ!

- రూ.300లోపు వాటికి అమలు చేయాలి
- మల్టీప్లెక్స్ అసోసియేషన్ డిమాండ్




న్యూఢిల్లీ: సినిమా టికెట్ల ధర రూ.300లోపు వాటిని 5 శాతం జీఎస్టీ కిందకు తీసుకురావాలని సినిమా, మల్టీప్లెక్స్ ఆపరేటర్లు కేంద్రాన్ని కోరారు. దీనివల్ల సినిమా ప్రదర్శనలు సామాన్యులకు అందుబాటులో ఉండడమే కాకుండా.. కరోనా తర్వాత నుంచి ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్న, సినిమా ప్రదర్శకులకు సాయంగా నిలుస్తుందని మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఏఐ) పేర్కొంది. ''ప్రస్తుత జీఎస్టీ చట్టంలో రూ.100కు మించిన సినిమా టికెట్లను 18 శాతం శ్లాబు పరిధిలో ఉంచగా, రూ.100లోపు టికెట్లపై 12 శాతం జీఎస్టీ అమలవుతోంది. రూ.100 పరిమితిని రూ.300కు పెంచాలని కోరుతున్నాం. దీంతో రూ.300 వరకూ ఉన్న టికెట్లపై 5 శాతం జీఎస్టీ, అంతకుమించిన ధరలపై 18 శాతం జీఎస్టీ అమలు చేయాలి''అని ఎంఏఐ ప్రెసిడెంట్ కమల్ జ్ఞాన్చందాని పేర్కొన్నారు. రూ.100 పరిమితి ఏడేళ్లుగా అమల్లో ఉందంటూ.. దీన్ని రూ.300కు పెంచాలని కేంద్ర ఆర్థిక శాఖ, ఐఅండ్బీ శాఖను కోరినట్టు చెప్పారు. పరిశ్రమ మనుగడకు, వృద్ధికి మద్దతుగా రూ.300 వరకు ధరలున్న మూవీ టికెట్లపై తక్కువ రేటు విధించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. తమ ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించినట్టయితే అప్పుడు రూ.300 వరకు టికెట్లపై రూ.20–25 వరకు ధర తగ్గుతుందన్నారు. సినిమా థియేటర్లలో విక్రయించే ఆహారం, పానీయాలను రెస్టారెంట్ సేవలుగా పరిగణిస్తూ.. ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) సదుపాయం కల్పించడం లేదన్నారు. దీంతో ఈ సేవలకు గాను తాము చేసిన కొనుగోళ్లపై చెల్లించిన పన్నును సర్దుబాటు చేసుకునే అవకాశం ఉండడం లేదన్నారు. కనుక ఐటీసీ ప్రయోజనం కల్పించాలని కోరారు. 9,000 స్క్రీన్లకు ఎంఏఐ ప్రాతినిధ్యం వహిస్తోంది.

### జేఎస్డబ్ల్యూ ఎంజీ మోటార్ 'ఈవీ సహీ హై' ప్రచారం

EV sahi hai

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాలపై అపోహలను తొలగించి, వాటి ప్రయోజనాలను వివరించేందుకు జేఎస్డబ్ల్యూ ఎంజీ మోటార్ అవగాహన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'ఈవీ సహీ హై' పేరుతో చేపట్టిన ఈ ప్రచారం ద్వారా ఈవీల వినియోగం, ఖర్చు తగ్గింపు, పర్యావరణహితం, సౌకర్యవంతమైన డ్రైవింగ్ వంటి అంశాలను వివరించే ప్రయత్నం చేస్తోంది. తొలి దశలో ఈవీ యజమానుల స్వీయ అనుభవాలను వీడియోల రూపంలో ప్రదర్శించగా, రెండో దశలో ప్రముఖ నటులు వరుణ్ శర్మ, పుల్కిత్ సమ్రాట్ వినోదాత్మక శైలిలో ఈవీల ప్రయోజనాలను తెలియజేస్తున్నారు. evsahihai.com అనే ప్రత్యేక వెబ్సైట్ను కూడా ప్రారంభించారు. ఇందులో ఈవీ టెక్నాలజీ, చార్జింగ్ స్టేషన్ మ్యాప్స్, కాస్ట్ కాలిక్యులేటర్, సందేహాల నివృత్తి వంటి సమగ్ర సమాచారం అందుబాటులో ఉంది.

### తెలంగాణలో యూబీఎల్ రూ. 90 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కింగ్ఫిషర్, హైనెకెన్ బ్రాండ్ల తయారీ సంస్థ యునైటెడ్ బ్రూవరీస్ (యూబీఎల్) తెలంగాణలో రూ. 90 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం తమకున్న నిజాం బ్రూవరీలో క్యానింగ్ లైన్ యూనిట్ను ఏర్పాటు చేసేందుకు ఈ మొత్తాన్ని వెచ్చించనున్నట్లు తెలిపింది. తద్వారా తెలంగాణలో క్యాన్డ్ బీర్ విభాగంలోకి ప్రవేశించనున్నట్లు వివరించింది. ఈ యూనిట్ ఏడాది వ్యవధిలో అందుబాటులోకి వస్తుందని యూబీఎల్ తెలిపింది. తొలుత ప్రీమియం బ్రాండ్లకు ఈ ఉత్పత్తులను వినియోగించనున్నట్లు పేర్కొంది. దేశీయంగా అతిపెద్ద బీర్ల మార్కెట్లలో ఒకటైన తెలంగాణలో క్యాన్స్కి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ ఎండీ వివేక్ గుప్తా తెలిపారు.

## ఐపీవోకు ఆర్డీ ఇంజినీరింగ్ రెడీ

- సెబీ నుంచి గ్రీన్ సిగ్నల్
- రూ. 580 కోట్లపై కన్ను




న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు 2008లో ఏర్పాటైన ఆర్డీ ఇంజినీరింగ్కు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రూ. 580 కోట్లు సమీకరించేందుకు హైదరాబాద్ కంపెనీకి వీలు చిక్కనుంది. ఐపీవోలో భాగంగా కంపెనీ రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా ప్రమోటర్ చంద్ర శేఖర్ మోటూరు మరో రూ. 80 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. లిస్టింగ్కు వీలుగా కంపెనీ మార్చిలో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. కాగా.. తెలంగాణలోని సీతారామ్పూర్లో కొత్తగా రెండు తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనుంది. ఇందుకు ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 280 కోట్లు వెచ్చించనుంది. ఆంధ్రప్రదేశ్లోని పరవాడలో కొత్త ఏకీకృత తయారీ ప్లాంటును నెలకొల్పేందుకు మరో రూ. 45 కోట్లు కేటాయించనుంది. ఈ బాటలో రూ. 65 కోట్లు రుణ చెల్లింపులకు, మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. సమీకృత డిజైన్, తయారీ సామర్థ్యాలుగల కంపెనీ ప్రధానంగా ప్రీఇంజినీర్డ్ బిల్డింగ్స్, మెటీరియల్ హ్యాండ్లింగ్ సిస్టమ్స్, ఇంజినీరింగ్ సర్వీసులు అందిస్తోంది. కంపెనీ క్లయింట్లలో ఆర్సెలర్మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా, జేకే సిమెంట్, నవయుగ ఇంజినీరింగ్, ఉదయ్పూర్ సిమెంట్ వర్క్స్ తదితరాలున్నాయి. 2025 మార్చికల్లా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోగల 5 తయారీ యూనిట్ల ద్వారా 44,144 మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2023–24లో రూ. 620 కోట్ల ఆదాయం, రూ. 29 కోట్ల నికర లాభం ఆర్జించింది.

## ఏపీవైలో 50 లక్షల మంది స్వనిధి లబ్ధిదారులు

పీఎఫ్ఆర్డీఏ లక్ష్యం




న్యూఢిల్లీ: అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) పథకం కిందకు 50 లక్షల మంది ప్రధాన మంత్రి స్వనిధి పథకం లబ్ధిదారులను చేర్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి సంస్థ (పీఎఫ్ఆర్డీఏ) చైర్మన్ ఎస్ రామన్ ప్రకటించారు. వీధి వర్తకుల కోసం ఉద్దేశించిన పీఎం స్వనిధి పథకం 2020 జూన్ 1న ప్రారంభమైంది. దీని కింద ఒక్కో లబ్ధిదారుడికి తనఖా అవసరం లేకుండా రూ.50వేల రుణ సాయం అందించనున్నారు. ఈ పథకం విజయవంతమైందంటూ.. స్వనిధి పథకం 82 శాతం మంది ఇప్పటికే మొదటి విడత రుణాన్ని పొందడమే కాకుండా, తిరిగి చెల్లించినట్టు రామన్ చెప్పారు. గత మూడేళ్లలో అటల్ పెన్షన్ యోజన పథకం కింద కోటి మంది కొత్త సభ్యులు చేరినట్టు తెలిపారు. ఇందులో 2024–25లోనే 1.17 కోట్ల మంది సభ్యులైనట్టు వెల్లడించారు. ఇందులో 55% మంది మహిళలు ఉన్నట్టు తెలిపారు. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆగస్ట్ నాటికి ఏపీవై కింద 50 లక్షల మంది కొత్త సభ్యులు చేరినట్టు ప్రకటించారు.

## కొత్త జీఎస్టీతో ఫార్మా సవాళ్లకు పరిష్కారం..

డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ ఆశాభావం

న్యూఢిల్లీ: ఫార్మా పరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సవాళ్లకు కొత్త జీఎస్టీ విధానంతో పరిష్కారం లభించగలదని డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ చైర్మన్ సతీష్ రెడ్డి తెలిపారు. చాలాకాలంగా అధిక జీఎస్టీ రేట్లు, పూర్తయిన ఉత్పత్తికన్నా ముడి వస్తువులపై పన్ను అధికంగా ఉండటంలాంటి సమస్యలతో పరిశ్రమ సతమతమవుతోందన్నారు. దీని వల్ల దేశీయంగా తయారీ విషయంలో వ్యయా లు పెరిగిపోయి, అందుబాటు ధరల్లో లభించాల్సి న ఔషధాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు.

# ఏఐతో బ్యాంకింగ్లో సమూల మార్పులు..!

- సగం ఉద్యోగాల స్వరూపం మారిపోతుంది
- బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ అంచనా




ముంబై: కృత్రిమ మేధ (ఏఐ) అమలుతో భారత బ్యాంకింగ్ రంగంలో సగం ఉద్యోగాల స్వరూపం మారిపోతుందని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) అంచనా వేసింది. ఎన్నో రంగాల్లో ఉద్యోగాలపై ఏఐ ప్రభావం చూపిస్తుందన్న ఆందోళనల నేపథ్యంలో బీసీజీ నివేదికకు ప్రాధాన్యం ఏర్పడింది. గత దశాబ్ద కాలంలో బ్యాంకులు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై (ఐటీ) ఐదు రెట్లు అధికంగా వ్యయాలు చేసినప్పటికీ పెరిగిన ఉత్పాదక పరిమితమేనని ఈ నివేదిక తెలిపింది. నికరంగా పెరిగిన ఉత్పాదకత ఒక శాతమేనంటూ, అంతర్జాతీయ బ్యాంకులతో పోల్చితే భారత బ్యాంకులు వెనుకబడినట్టు పేర్కొంది. కనుక బ్యాంక్లు ఏఐ వినియోగం ద్వారా ఉత్పాదతక పెంపు పరంగా ఉన్న సవాళ్లను అధిగమించొచ్చని తెలిపింది. ఇప్పటికే చాలా బ్యాంక్లు ఈ తరహా టూల్స్ను వినియోగిస్తున్నట్టు పేర్కొంది. బ్యాంకులు ఈ తరహా కొత్త సాంకేతికతలను స్వీకరించడం మొదలు పెడితే, గత కొన్నేళ్ల నుంచి ఎదుర్కొంటున్న సంక్లిష్ట వ్యయ సవాళ్లను అధిగమించగలవని బీసీజీ సీనియర్ పార్ట్నర్ రుచిన్ గోయల్ పేర్కొన్నారు. ''ఏఐ వినియోగం పెరిగే కొద్దీ సంఘటిత రంగంలో ఉద్యోగాలకు సవాళ్లు ఎదురవుతాయి. ఐటీ తదితర రంగాల్లో ఇప్పటికే ఉద్యోగుల తొలగింపులు వింటున్నాం. బ్యాంకుల్లోనూ నికర ఉద్యోగుల సంఖ్య పెరుగుదల తగ్గుతోంది. టెక్నాలజీ కారణంగా కొన్ని ఉద్యోగ ఖాళీలను బ్యాంకులు భర్తీ చేయకపోవచ్చు''అని గోయల్ చెప్పారు. రానున్న రోజుల్లో టెక్నాలజీపై బ్యాంకులు చేసే వ్యయాలు పెరుగుతాయన్నారు.

### రుణ వృద్ధి మెరుగుపడాలి..

బ్యాంకుల్లో రుణ వృద్ధి నిదానించడాన్ని బీసీజీ నివేదిక ఎత్తి చూపించింది. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు వీలుగా బ్యాంకుల రుణ వృద్ధి వేగవంతం కావాలని పేర్కొంది. సాధారణ జీడీపీ వృద్ధి కంటే 3–3.5 శాతం మేర బ్యాంకుల రుణ ఆస్తులు పెరగాల్సి ఉంటుందని తెలిపింది. 2024–25లో సాధారణ జీడీపీ 9.8 శాతం కాగా, బ్యాంకుల రుణ వృద్ధి 12 శాతానికే పరిమితమైనట్టు గుర్తు చేసింది.

# ఆంధ్రకు విహారి గుడ్‌బై

## త్రిపుర జట్టుతో చేరిన బ్యాటర్ ● మూడు ఫార్మాట్‌లపై దృష్టి



**న్యూఢిల్లీ:** సీనియర్ బ్యాటర్ గాదె హనుమ విహారి దేశవాళీ క్రికెట్‌లో తన సొంత టీమ్ ఆంధ్రను వీడాడు. 2025–26 సీజన్ కోసం అతను ఈశాన్య జట్టు త్రిపురతో జత కట్టాడు. ఒక ఏడాది కోసం ప్రస్తుతానికి ఒప్పందం కుదుర్చుకున్నా, మున్ముందు దీనిని పొడిగించే అవకాశం ఉంది. దేశవాళీలో మరో టీమ్ తరఫున ఆడేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) విహారికి నిరభ్యంతరకర పత్రం (ఎన్‌ఓసీ) జారీ చేసింది. తన కెరీర్‌ను పునర్నిర్మించుకోవడంలో భాగంగా మూడు ఫార్మాట్‌లలో ఆడేందుకే రంజీ ట్రోఫీలో ఎలైట్ డివిజన్‌లో ఉన్న త్రిపుర టీమ్‌ను విహారి ఎంచుకున్నాడు. ఈ విషయంలో ఏసీఏ అతనికి ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో జట్టును వదలాల్సి వచ్చిందని వెల్లడించాడు. 2024–25 సీజన్‌లో ఆంధ్ర తరఫున రంజీ మ్యాచ్‌లు మాత్రమే ఆడిన విహారి... వన్డేల్లో విజయ్ హజారే ట్రోఫీ, టి20ల్లో ముస్తాక్ అలీ ట్రోఫీలో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. 'మూడు ఫార్మాట్‌లలో బాగా ఆడగల సత్తా నాకు ఉందని నమ్ముతాను. అందుకే ఇతర అవకాశాల కోసం ఎదురు చూస్తూ వచ్చాను. టి20 ఫార్మాట్‌లో యువ ఆటగాళ్లను ఎంచుకుంటున్నామని ఏసీఏ నాకు చెప్పింది. దాంతో 50 ఓవర్ల ఫార్మాట్‌లో కూడా ఆడటం అనవసరమని భావించా. అందుకే విజయ్ హజారేలో బరిలోకి దిగలేదు. పైగా కొత్త తరహా వాతావరణంలో ఆడాలని నాకూ ఉంది' అని విహారి చెప్పాడు. 2023–24 సీజన్‌లో ఏసీఏతో విభేదాలు రావడంతో జట్టును వీడాలని అప్పుడే నిర్ణయించుకున్న విహారి గత సీజన్‌కు ముందే మధ్యప్రదేశ్ జట్టుతో చేరడం దాదాపుగా ఖాయమైంది. అయితే చివరి నిమిషంలో అతను మళ్లీ ఆంధ్రతో కొనసాగడానికి సిద్ధపడటంతో మధ్యప్రదేశ్ క్రికెట్ సంఘం అసంతృప్తి వ్యక్తం చేసింది. త్రిపుర కూడా ఇంకా కెప్టెన్సీ విషయంలో విహారికి ఎలాంటి హామీ ఇవ్వలేదు. 'ప్రస్తుతం నేనున్న పరిస్థితిలో ఏదైనా చిన్న జట్టు తరఫున ఆడటానికి ఇదే సరైన సమయం అనిపించింది. ముందుగా త్రిపుర సంఘం నన్ను అడిగింది. దాంతో ఈ సవాల్‌ను స్వీకరించేందుకు సిద్ధమయ్యా. నేను కెప్టెన్‌ను అయినా కాకపోయినా సీనియర్‌గా జట్టుకు అన్ని విధాలా ఉపయోగపడతా. టీమ్‌లో చక్కటి ఆటగాళ్లు ఉన్నారు. పెద్ద టీమ్‌లపై రాణించే విధంగా దీనిని తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తా' అని విహారి విశ్వాసం వ్యక్తం చేశాడు.

### ఒడిదుడుకుల కెరీర్...

32 ఏళ్ల విహారి 2018లో భారత్ తరఫున తొలి టెస్టు మ్యాచ్ ఆడాడు. వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో 289 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలవడంతో అతనికి గుర్తింపు లభించింది. అయితే 2021లో జరిగిన సిడ్నీ టెస్టులో గాయంతో బాధపడుతూనే అశ్విన్‌తో కలిసి మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించిన అతని వీరోచిత ప్రదర్శనతో విహారి ఒక్కసారిగా హీరోగా మారిపోయాడు. దురదృష్టవశాత్తూ గాయం నుంచి కోలుకున్న తర్వాత నాలుగు టెస్టులు మాత్రమే ఆడగలిగిన అతను చివరిసారిగా భారత్‌కు 2022లో ప్రాతినిధ్యం వహించాడు. 16 టెస్టుల్లో విహారి 33.56 సగటుతో 839 పరుగులు చేశాడు. అయితే ఆ తర్వాత దేశవాళీ క్రికెట్‌లో చెప్పుకోదగ్గ ప్రదర్శన లేకపోగా, పలువురు బ్యాటర్లు దూసుకురావడంతో రేసులో విహారి వెనుకబడిపోయాడు. కెరీర్ ఆరంభంలో ఆరేళ్లు హైదరాబాద్ తరఫున ఆడి ఆ తర్వాత ఆంధ్రకు మారిన విహారి... ఆ తర్వాత ఒక సీజన్‌లో మళ్లీ హైదరాబాద్‌కు వచ్చాడు. ఆపై మరోసారి ఆంధ్రకు వెళ్లిపోయిన అతను ఇప్పుడు త్రిపుర తరఫున అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. 2019లో చివరిసారిగా ఐపీఎల్ ఆడి ఆ తర్వాత చాన్స్ దక్కించుకోలేకపోయిన అతను కామెంటేటర్‌గా పని చేయడంతో పాటు గత ఏడాది తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో మధురై పాంథర్స్ జట్టుకు మెంటార్‌గా కూడా వ్యవహరించాడు.

## 29 నుంచి శ్రీపాదరావు స్మారక చెస్ టోర్నీ

**సాక్షి, హైదరాబాద్:** అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పీకర్, దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారకార్థం... ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్‌లో ఆలిండియా ఓపెన్ బిలో 1600 'ఫిడే' రేటింగ్ చెస్ టోర్నీ జరగనుంది. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగే ఈ టోర్నీని తొమ్మిది రౌండ్లపాటు నిర్వహిస్తారు. ఈ టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 8 లక్షల 3 వేలు. విజేతకు రూ. 70 వేలు, రన్నరప్ ప్లేయర్‌కు రూ. 50 వేలు, మూడో స్థానంలో నిలిచిన ప్లేయర్‌కు రూ. 30 వేలు లభిస్తాయి. అండర్–15, 13, 11, 9, 7 వయో విభాగాల్లో టాప్–5లో నిలిచిన వారికి రూ. 5 వేలు చొప్పున అందజేస్తారు. ఈ టోర్నీలో ఆడాలనుకునే వారు 7337578899, 7337399299 ఫోన్ నంబర్లలో నిర్వాహకులను సంప్రదించి బుధవారంలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ తెలిపారు.

# ‘పూర్తి ఫిట్‌నెస్‌తో సిద్ధమయ్యా’

## గాయం నుంచి కోలుకున్న సూర్యకుమార్



**న్యూఢిల్లీ:** భారత టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కొత్త ఉత్సాహంతో మైదానంలోకి పునరాగమనం చేయబోతున్నాడు. స్పోర్ట్స్ హెర్నియాతో బాధపడుతుండటంతో ఐపీఎల్ ముగిసిన తర్వాత అతనికి మ్యూనిక్‌లో శస్త్ర చికిత్స జరిగింది. ఇప్పుడు కోలుకున్న సూర్య పూర్తి ఫిట్‌నెస్‌తో ఆసియా కప్‌కు సన్నద్ధమయ్యాడు. ఈ క్రమంలో బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో అతనికి రీహాబిలిటేషన్ సాగింది. 'ప్రస్తుతం నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను. గత ఆరు వారాలుగా రీహాబిలిటేషన్ సాగింది. నాతో పాటు సీఓఈలో ఉన్నవారు నాకు తగిన విధంగా మార్గనిర్దేశనం చేశారు. ఒక్కో వారం నా పురోగతిని చూసుకుంటూ ముందుకు వెళ్లాను. మానసికంగా కూడా నేను మెరుగయ్యాను. ఈ ప్రక్రియ అంతా సరైన రీతిలో సాగింది. నేను మైదానంలో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు దీనిని ఒక అవకాశంగా చూస్తున్నా' అని సూర్యకుమార్ చెప్పాడు. గతంలోనూ సూర్య హెర్నియా సర్జరీతో బాధపడగా, అంతకు ముందే అతని కాలి మడమ గాయాలకి కూడా శస్త్ర చికిత్స జరిగింది. 'గతానుభవం కారణంగా నేను కోలుకోవడానికి ఎంత సమయం పడుతుందనేది నాకు బాగా తెలుసు. కాబట్టి అన్నింటికీ సిద్ధమై ఒక్కో అడుగు వేసుకుంటూ ముందుకు వెళ్లాను. నా శరీరం ఎలా స్పందిస్తుందనేది సీఓఈ సిబ్బందికి బాగా తెలియడం సానుకూలంగా మారింది. ఫిజియో, స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్ దానికి అనుగుణంగానే ప్రణాళికలు రూపొందించారు. సీఓఈలో సౌకర్యాలు చాలా అద్భుతంగా కనిపిస్తున్నాయి. ఇలాంటివి నేను ఎప్పుడూ చూడలేదు. ఆటగాళ్ల కోణంలో చూస్తే వారి కోసమే ప్రత్యేకంగా రూపొందించిన కొత్త తరహా ఎక్విప్‌మెంట్‌లు చాలా ఉన్నాయి. ఎవరైనా ఇక్కడికి వస్తే వీటిని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవచ్చు' అని సూర్యకుమార్ వ్యాఖ్యానించాడు.

# యువతరానికి పరీక్ష

## రేపటి నుంచి దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీ

- శ్రేయస్ అయ్యర్, సర్ఫరాజ్, తిలక్ వర్మలపై అందరి దృష్టి
- క్వార్టర్స్‌లో నార్త్ జోన్‌తో ఈస్ట్ జోన్ ఢీ
- సెంట్రల్ జోన్, నార్త్‌ఈస్ట్ జోన్ అమీతుమీ
- ఉదయం గం. 9:30 నుంచి జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



తిలక్ వర్మ

**బెంగళూరు:** దేశవాళీ క్రికెట్ సీజన్ ఆరంభానికి రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా గురువారం నుంచి దులీప్ ట్రోఫీ ప్రారంభం కానుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రవిచంద్రన్ అశ్విన్, చతేశ్వర్ పుజారా వంటి సీనియర్ ప్లేయర్లు టెస్టు ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో... జాతీయ జట్టులో చోటు దక్కించుకునేందుకు యువ ఆటగాళ్లకు ఇది చక్కటి వేదిక కానుంది. ఈ ఏడాది దులీప్ ట్రోఫీని పాత పద్ధతిలోనే జోన్‌ల వారిగా నిర్వహించనున్నారు. సౌత్ జోన్, వెస్ట్ జోన్ జట్లు ఇప్పటికే సెమీఫైనల్‌కు అర్హత సాధించగా... రేపటి నుంచి ప్రారంభం కానున్న క్వార్టర్ ఫైనల్లో నార్త్ జోన్‌తో ఈస్ట్ జోన్... సెంట్రల్ జోన్‌తో నార్త్ ఈస్ట్ జోన్ తలపడనున్నాయి. వచ్చే నెల 15 వరకు జరగనున్న ఈ టోర్నమెంట్‌ను బెంగళూరు వేదికగా నిర్వహించనున్నారు. ఇటీవల భారత జట్టు ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌ను 2–2తో 'డ్రా' చేసుకోగా... తదుపరి సొంతగడ్డపై వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ నేపథ్యంలో పలువురు ఆటగాళ్లు జాతీయ సెలెక్టర్ల దృష్టిలో పడేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిలో శ్రేయస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్, దేవదత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ, రజత్ పాటీదార్, తనుశ్ కొటియాన్, మొహమ్మద్ షమీ, ఖలీల్ అహ్మద్, ముకేశ్ కుమార్, నిశాంత్ తదితరులు ఉన్నారు. వచ్చే నెలలో జరగనున్న ఆసియాకప్ టి20 టోర్నమెంట్ కోసం ప్రకటించిన భారత జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన శ్రేయస్ అయ్యర్ దులీప్ ట్రోఫీలో సత్తా చాటి సుదీర్ఘ ఫార్మాట్‌లో అయినా టీమిండియా బెర్త్ సాధించాలని చూస్తున్నాడు.

### సౌత్ జోన్ సారథిగా తిలక్...

మొత్తం ఆరు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నమెంట్‌లో సెప్టెంబర్ 4 నుంచి 7 వరకు సెమీఫైనల్స్ జరగనున్నాయి. ఇక 11న ఫైనల్ ప్రారంభం కానుంది. ఆయా జోన్‌ల సెలెక్టర్లు ఇప్పటికే జట్లను ప్రకటించారు. హైదరాబాద్ బ్యాటర్ ఠాకూర్ తిలక్ వర్మ... సౌత్ జోన్ జట్టుకు సారథిగా వ్యవహరించనున్నాడు. ఇప్పటికే భారత టి20 జట్టులో సుస్థిర స్థానం ఏర్పరుచుకున్న తిలక్... ఇప్పుడు సుదీర్ఘ ఫార్మాట్‌పై దృష్టి పెడుతున్నాడు. మెరుగైన టెక్నిక్ ఉన్న ఆటగాడిగా దిగ్గజాల ప్రశంసలు అందుకున్న ఈ హైదరాబాదీ... దులీప్ ట్రోఫీలో ఎలాంటి ప్రదర్శన కనబరుస్తాడో చూడాలి. ఇక అపార నైపుణ్యం ఉన్న ఆటగాడిగా గుర్తింపు సాధించిన శ్రేయస్ అయ్యర్... జాతీయ జట్టులో చోటు కోసం మాత్రం తీవ్రంగా కష్టపడుతున్నాడు. స్పిన్ సమర్థవంతంగా ఎదుర్కోగల సత్తాతో పాటు... అవసరమైతే వేగంగా ఆడి మ్యాచ్ స్వరూపాన్ని మార్చే ప్రతిభగల అయ్యర్ దులీప్ ట్రోఫీలో రాణించాలని భావిస్తున్నాడు. అతడు చివరిసారిగా 2024లో ఇంగ్లండ్‌తో టెస్టు మ్యాచ్ ఆడాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో సిరీస్‌లో పలువురు ప్లేయర్లను ఆరో స్థానంలో పరిశీలించినా... వారు పెద్దగా ఆకట్టుకోలేకపోయిన నేపథ్యంలో దులీప్ ట్రోఫీలో రాణిస్తే... శ్రేయస్‌కు టెస్టు జట్టులో చోటు దక్కే అవకాశాలున్నాయి.



శ్రేయస్ అయ్యర్



### షమీ సత్తా చాటేనా!

టీమిండియా సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీ... తిరిగి టెస్టు జట్టులో పునరాగమనం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. గాయం నుంచి కోలుకున్న అనంతరం పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించలేదనే కారణంగా అతడిని ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక చేయలేదు. దీంతో ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపై అదనపు భారం పడగా... మొహమ్మద్ సిరాజ్‌కు మరో ఎండ్ నుంచి నిలకడైన తోడు లభించలేదు. ఈ నేపథ్యంలో దులీప్ ట్రోఫీలో షమీ సత్తాచాటితే అతడు తిరిగి టెస్టు జట్టులోకి రావచ్చు. దీంతో అతడికి ఈ టోర్నీ కీలకం కానుంది. ఈస్ట్ జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న షమీ మునుపటి వాడి ప్రదర్శిస్తే ప్రత్యర్థులకు ఇబ్బందులు తప్పకపోచ్చు. ఇక ఈస్ట్ జోన్ తరఫున ముకేశ్ కుమార్, సెంట్రల్ జోన్ తరఫున ఖలీల్ అహ్మద్ కూడా తమ అస్త్రశస్త్రాలకు పదును పెట్టుకుంటున్నారు. వీరితో పాటు మరికొంతమంది యువ ఆటగాళ్లు సైతం దులీప్ ట్రోఫీలో తమదైన ముద్రవేసేందుకు సిద్ధమవుతున్నారు.



సర్ఫరాజ్

### సర్ఫరాజ్‌పై నజర్

ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో చక్కటి సగటు ఉన్న ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ వెస్ట్ జోన్ తరఫున దులీప్ ట్రోఫీ బరిలోకి దిగనున్నాడు. ఇప్పటికే జాతీయ జట్టు తరఫున టెస్టులు ఆడిన సర్ఫరాజ్... ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో సైతం రాణించాడు. కానీ జట్టు కూర్పు నేపథ్యంలో అతడికి అవకాశం దక్కలేదు. ఈ నేపథ్యంలో స్వదేశంలో వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో సిరీస్‌లకు ముందు దులీప్ ట్రోఫీలో రాణించి టెస్టు జట్టులోకి తిరిగి రావాలని సర్ఫరాజ్ కృతనిశ్చయంతో ఉన్నాడు. అందుకోసం ఈ ముంబైకర్ తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి భారీగా బరువు సైతం తగ్గాడు. ఇక సౌత్‌జోన్ తరఫున దేవదత్ పడిక్కల్, వెస్ట్ జోన్ నుంచి రుతురాజ్ గైక్వాడ్, సెంట్రల్ జోన్ తరఫున రజత్ పాటిదార్ కూడా టెస్టు జట్టులో చోటు దక్కించుకోవాలని తహతహలాడుతున్నారు. ముంబై ఆల్‌రౌండర్ తనుశ్ కొటియాన్ వెస్ట్ జోన్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుండగా... హరియాణాకు చెందిన నిశాంత్ నార్త్ జోన్ తరఫున బరిలోకి దిగుతున్నారు.

# కోయల్ ప్రపంచ రికార్డు



**అహ్మదాబాద్:** కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ మహిళల యూత్, జూనియర్ విభాగంలో భారత లిఫ్టర్ కోయల్ బార్ రెండు ప్రపంచ రికార్డులు నెలకొల్పింది. 53 కేజీల విభాగంలో పోటీపడ్డ కోయల్ మొత్తం 192 కేజీలు బరువెత్తి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. కోయల్ స్నాచ్‌లో 85 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 107 కేజీలు బరువెత్తింది. క్లీన్ అండ్ జెర్క్, టోటల్ అంశాల్లో కోయల్ కొత్త ప్రపంచ రికార్డులు లిఖించింది. మరోవైపు సీనియర్ విభాగంలో భారత్‌కు మూడు రజత పతకాలు లభించాయి. పురుషుల 65 కేజీల విభాగంలో రాజా ముత్తుపాండి (296 కేజీలు), మహిళల 53 కేజీల విభాగంలో స్నేహా సోరెన్ (185 కేజీలు), 58 కేజీల విభాగంలో బింద్యారాణి దేవి (206 కేజీలు) రెండో స్థానంలో నిలిచి రజత పతకాలను దక్కించుకున్నారు. పురుషుల యూత్ 65 కేజీల విభాగంలో అనిక్ మోదీ, జూనియర్ 65 కేజీల విభాగంలో యశ్ ఖండాగలె.... మహిళల యూత్ 58 కేజీల విభాగంలో భావన గొగోయ్, జూనియర్ 58 కేజీల విభాగంలో మీనా సాంటా స్వర్ణ పతకాలను సాధించారు.

# రోహిత్‌కు 5 వికెట్లు

- మధ్యప్రదేశ్ 181 ఆలౌట్
- హైదరాబాద్ 155/1
- బుచ్చిబాబు ఇన్విటేషనల్ టోర్నీ



**చెన్నై:** రోహిత్ రాయుడు 5 వికెట్లతో సత్తా చాటడంతో... బుచ్చిబాబు ఇన్విటేషనల్ టోర్నమెంట్‌లో మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ మెరుగైన స్థితిలో నిలిచింది. మొదట మధ్యప్రదేశ్ 56.5 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. ఆర్యన్ తివారీ (68 బంతుల్లో 53; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో ఆకట్టుకోగా... కెప్టెన్ శుభమ్ (25), అథర్వ మహాజన్ (20), మంగేశ్ యాదవ్ (20) తలా కొన్ని పరుగులు చేశారు. హైదరాబాద్ బౌలర్లలో రోహిత్ రాయుడు 44 పరుగులిచ్చి 5 వికెట్లు ఖాతాలో వేసుకోగా... తనయ్ త్యాగరాజన్, అనికేత్ రెడ్డి చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 33 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 155 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (121 బంతుల్లో 85 బ్యాటింగ్; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీకి చేరువయ్యాడు. నితీశ్ రెడ్డి (48 బంతుల్లో 41; 6 ఫోర్లు) అవుట్ కాగా... రాహుల్ రాధేశ్ (32 బంతుల్లో 22 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు. మధ్యప్రదేశ్ బౌలర్లలో రోహిత్ రజావత్ ఒక వికెట్ పడగొట్టాడు. చేతిలో 9 వికెట్లు ఉన్న హైదరాబాద్ జట్టు ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 26 పరుగులు వెనుకబడి ఉంది.

### సర్ఫరాజ్ సెంచరీ...

భారత ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్ (112 బంతుల్లో 111;9 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీతో కదంతొక్కాడు. హరియాణాతో పోరులో ముంబై తరఫున బరిలోకి దిగిన సర్ఫరాజ్ చెలరేగడంతో ముంబై జట్టు 90 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 346 పరుగులు చేసింది. షమ్స్ ములానీ (82 బంతుల్లో 50 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీ చేయగా... కెప్టెన్ తనుశ్ కొటియాన్ (60 బంతుల్లో 48; 3 ఫోర్లు, 1 సిక్స్) దివ్యాన్ష్ సక్సేనా (106 బంతుల్లో 46; 3 ఫోర్లు, 1 సిక్స్), హార్దిక్ తమోర్ (73 బంతుల్లో 39; 2 ఫోర్లు, 1 సిక్స్), ముషీర్ ఖాన్ (66 బంతుల్లో 30; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. ఒక దశలో ముంబై జట్టు 84 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన సమయంలో సర్ఫరాజ్ కౌంటర్ అటాక్‌తో సత్తాచాటాడు. గత మ్యాచ్‌లో తమిళనాడుపై సెంచరీ సాధించిన సర్ఫరాజ్... అదే జోరు ఇక్కడా కొనసాగించాడు. మరోవైపు రుతురాజ్ గైక్వాడ్ (144 బంతుల్లో 133; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు), అర్షిన్ కులకర్ణి (190 బంతుల్లో 146; 16 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలు బాదడంతో... హిమాచల్ ప్రదేశ్‌తో మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు 90 ఓవర్లలో 440 పరుగులకు ఆలౌటైంది. హిమాచల్ ప్రదేశ్ బౌలర్లలో ప్రిన్స్ ఠాకూర్ 7 వికెట్లు పడగొట్టాడు.



పశ్చిమబెంగాల్‌లోని నదియాలో మంగళవారం గణేశుడి విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న ఓ కళాకారుడు



బెంగళూరులోని దుకాణంలో గణపతి విగ్రహాన్ని పరిశీలన చూస్తున్న చిన్నారి



బెంగళూరులో వినాయకుడి విగ్రహాన్ని మోసుకెళ్తున్న ఓ వ్యక్తి



బెంగళూరులో గణేశుని విగ్రహాన్ని కారు సీట్లో పెట్టుకుని వెళ్తూ..

# పుతిన్, మోదీలకు జిన్‌పింగ్ రెడ్ కార్పెట్

## వచ్చే వారం చైనాలో జరగనున్న ఎస్‌సీవో శిఖరాగ్రం

- ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యతను చాటే యత్నం
- హాజరుకానున్న బ్రిక్స్, ఆసియా దేశాల నేతలు

**బీజింగ్:** ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ ఒకటో తేదీ వరకు చైనాలోని టియాంజిన్‌లో జరగనున్న షాంఘై సహకార సదస్సు(ఎస్‌సీవో) సందర్భంగా కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ శిఖరాగ్రానికి రావాలంటూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీలను రెడ్ కార్పెట్ పరిచి జిన్‌పింగ్ స్వయంగా ఆహ్వానం పలకనున్నారు. బ్రిక్స్ దేశాలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధం తీవ్రరూపం దాల్చిన వేళ అమెరికా ఆధిపత్యానికి గండికొట్టడంతోపాటు, ప్రత్యామ్నాయం తామేనని చూపేందుకు జిన్‌పింగ్ ప్రయత్నం చేయనున్నారు. ఈ సదస్సుకు మధ్య, పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయ ఆసియా దేశాల నేతలు పాల్గొననున్నారు. మరో వారంలో మొదలయ్యే కీలక సదస్సులో ఎస్‌సీవోలో మరికొన్ని దేశాలను చేర్చుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయని పరిశీలకులు అంటున్నారు. 'అమెరికా నేతృత్వంలోని అంతర్జాతీయ క్రమం ఎలా దారుణంగా ఉంటుందో చెప్పడంతోపాటు, జనవరి నుంచి చైనా, ఇరాన్, రష్యా, తాజాగా భారత్‌ను కట్టడి చేసేందుకు వైట్ హౌస్ చేసిన ప్రయత్నాలు అంతగా ప్రభావం చూపలేదని చూపడానికి ఈ శిఖరాగ్ర సమావేశాన్ని ఒక అవకాశంగా ఉపయోగించుకోవాలని జిన్‌పింగ్ భావిస్తున్నారు' అని ది చైనా–గ్లోబల్ సౌత్ ప్రాజెక్ట్ ఎడిటర్ ఇన్ చీఫ్ ఎరిక్ ఒలాండర్ విశ్లేషించారని రాయిటర్స్ పేర్కొంది.

అమెరికా విధానాలకు వ్యతిరేకంగా ఐక్య వేదికను చూపుకునేందుకు, బహుళ ధ్రువ క్రమం దిశగా ప్రపంచం సాగుతోందని తెలియజేయడమే చైనా లక్ష్యంగా కనిపిస్తోందని అంటున్నారు. అంతర్జాతీయంగా ఇటీవల చోటుచేసుకున్న దౌత్యపరమైన పరిణామాలు, బ్రిక్స్ దేశాల మధ్య బలోపేతమవుతున్న ఆర్థిక సంబంధాలను ప్రస్తావించిన ఒలాండర్..ఇవన్నీ డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న అనూహ్య చర్యల ఫలితమేనన్నారు. ఎస్‌సీవోలో ప్రస్తుతం 10 శాశ్వత సభ్య దేశాలు, మరో 16 దేశాలు పరిశీలక హోదాలో ఉన్నాయి. ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిలో సహకార దృక్పథానికి ఉన్న ప్రాముఖ్యాన్ని ఇవి తెలియజేస్తున్నాయని ఒలాండర్ పేర్కొన్నారు. సభ్య దేశాల సంఖ్య పెరిగినప్పటికీ దేశాల మధ్య సహకారం పరంగా చూస్తే బ్రిక్స్ మంచి ఫలితాలను రాబట్టలేకపోతోందని తక్షశిల ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన మనోజ్ కేవల్‌రమణి రాయిటర్స్‌తో వ్యాఖ్యానించారు. వాస్తవానికి ఎస్‌సీవో లక్ష్యం, ఆచరణాత్మక వైఖరి ఇప్పటికీ అస్పష్టంగానే ఉన్నాయని ఆయన తెలిపారు. మొత్తమ్మీద అమెరికా విధానాలకు వ్యతిరేకంగా ఉమ్మడి ప్రయోజనాలను సాధించుకోవడమనేదే ఎస్‌సీవో ప్రధాన లక్ష్యంగా ఉందని చెప్పారు.

సభ్యదేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడమే ఈ వేదిక లక్ష్యం అయినప్పటికీ, చైనా–భారత్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న సరిహద్దు ఉద్రిక్తతలను సడలించేందుకు ఇది ఉపయోగపడనుందని తెలిపారు. భారత్ మంకుపట్టును వీడి చైనాతో సామరస్యంగా వ్యవహరిస్తుందని ఒలాండర్ అంచనా వేశారు. తద్వారా ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ శిఖరాగ్రం సందర్భంగా భారత్–చైనాలు సరిహద్దుల్లోని ఉద్రిక్త ప్రాంతాల నుంచి బలగాల ఉపసంహరణతోపాటు వీసా నియంత్రణలు, వాణిజ్య సంబంధాల బలోపేతానికి సంబంధించిన కీలకమైన ప్రకటనలు చేయవచ్చని తెలిపారు. వాతావరణ మార్పుల వంటి అంశాల్లో రెండు దేశాల మధ్య సహకారం విస్తృతం కానుందన్నారు. భద్రతాపరమైన అంశాల్లో ఎస్‌సీవో సాధించే పురోగతి మాత్రం పరిమితంగానే ఉంటుందని కేవల్‌రమణి విశ్లేషించారు. 2001లో ఎస్‌సీవోను ప్రకటించాక జరుగుతున్న అతిపెద్ద శిఖరాగ్రం ఇదే. అంతర్జాతీయ వ్యవహారాల్లో పెరుగుతున్న ఈ కూటమి ప్రాధాన్యతను చెప్పకనే చెబుతుందని పరిశీలకులు అంటున్నారు. కొత్త ప్రపంచ క్రమతను చాటే ముఖ్యమైన వేదిక ఎస్‌సీవో శిఖరాగ్రమని చైనా విదేశాంగ శాఖ తాజాగా అభివర్ణించడం గమనార్హం.

## దేశంలో 'పెరుగుతున్న ఇథనాల్ బ్లెండింగ్'

- రైతుల ఆదాయానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం
- జులైలో రికార్డు స్థాయిలో 19.93% మిశ్రమం
- బయోఫ్యూయెల్ ప్రాజెక్టుల స్థాపనకు రూ.1,969 కోట్లు

**సాక్షి, న్యూఢిల్లీ:** ఇథనాల్‌తో కలిసిన పెట్రోల్‌ను ఇంధనంగా వాడటం వల్ల రైతుల ఆదాయం పెరగడమే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడిందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రి హర్దీప్ సింగ్ పూరి వెల్లడించారు. 2014–15 నుంచి 2025 జూలై వరకు రైతులకు రూ.1.25 లక్షల కోట్లు నేరుగా చెల్లించగా, దేశానికి రూ.1.44 లక్షల కోట్ల విదేశీ మారకాన్ని ఆదా చేసినట్లు ఆయన వివరించారు. అలాగే 736 లక్షల మెట్రిక్ టన్నుల కార్బన్‌డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గి, 244 లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురు అవసరం తక్కువైందని ఇటీవల పార్లమెంట్ వేదికగా వెల్లడించారు.

**ఇథనాల్ మిశ్రమం పెరుగుదల**

పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం 2022 జూన్‌లోనే 10% లక్ష్యాన్ని చేరింది. తర్వాత ఇది 2022–23లో 12.06%, 2023–24లో 14.60%, 2024–25లో జూలై 31 నాటికి 19.05%గా నమోదైంది. కేవలం జూలై నెలలోనే 19.93% సాధించడం విశేషమని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఇథనాల్ ఉత్పత్తి కోసం ముడి సరుకుల విస్తరణ, పన్ను రాయితీలు, వడ్డీ సబ్సిడీ పథకాలు, సహకార చక్కెర కర్మాగారాలకు మల్టీఫీడ్ స్టాక్ ప్లాంట్లకు ఆర్థిక సాయం వంటి చర్యలు తీసుకున్నామని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి వివరించారు.

**బయోడీజిల్‌కు ప్రోత్సాహం**

దేశంలో 2019లో ప్రారంభమైన 'ప్రధానమంత్రి జై–వాన్ యోజన'(2024లో సవరణ) కింద పంట అవశేషాలు, బయోమాస్‌తో ఆధునిక బయోఫ్యూయెల్ ప్రాజెక్టులు స్థాపించేందుకు రూ.1,969.50 కోట్లు కేటాయించామని కేంద్ర మంత్రి తెలిపారు. ఇందులో రూ.1,800 కోట్లు కమర్షియల్ ప్రాజెక్టులకు, రూ.150 కోట్లు డెమో ప్రాజెక్టులకు వినియోగించనున్నారు. మరోవైపు బయోడీజిల్ వినియోగాన్ని పెంచేందుకు లక్ష్యాలు నిర్ధారించడమే కాకుండా, జీఎస్టీను 12% నుంచి 5%కు తగ్గించామని మంత్రి వివరించారు. 'ఇథనాల్, బయోడీజిల్ వంటి గ్రీన్ ఫ్యూయెల్స్ వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుంది. రైతులకు లాభం కలుగుతుంది. చమురు దిగుమతులు తగ్గుతాయి. దేశానికి ఇంధన భద్రత లభిస్తుంది' అని కేంద్రమంత్రి పూరి స్పష్టం చేశారు.

# దేశ ఐక్యతకు వైవిధ్యమే మూలం

- ప్రజలు కలిసి ఉండడానికి ఏకరూపకత అవసరం లేదు
- భిన్నమైన భావజాలం, సిద్ధాంతం కలిగి ఉండడం నేరం కాదు
- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** భారతదేశ ఐక్యతకు దాని వైవిధ్యమే మూలమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) అధినేత మోహన్ భగవత్ చెప్పారు. భిన్నమైన భావజాలం, సిద్ధాంతం కలిగి ఉండడం నేరమేమీ కాదని అన్నారు. దేశంలో ప్రజలంతా ఐక్యంగా ఉండడానికి వారి మధ్య ఏకరూపత ఉండాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. సామరస్యపూర్వకంగా, కలిసిమెలసి జీవితం మన సంస్కృతిలో ఒక భాగమని గుర్తుచేశారు. వైవిధ్యం వల్ల ఐక్యత దెబ్బతినదని పేర్కొన్నారు. వైవిధ్యంలోనే ఐక్యత ఉంటుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ త్వరలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహించుకోనుంది. ఇందులో భాగంగా వివిధ రంగాల ప్రముఖులు, అమెరికా, చైనా, డెన్మార్క్, రష్యా, ఇజ్రాయెల్ తదితర దేశాల దౌత్యవేత్తలు, ప్రతినిధులతో మోహన్ భగవత్ మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో సమావేశమయ్యారు. హిందూ దేశ భావనపై తన అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇది అధికారానికి, బలానికి సంబంధించిన విషయం కాదన్నారు. దేశంలో ఉన్న ప్రజలందరికీ న్యాయం ఒక్కటేనని, హిందూ దేశం అంటే దీనినుంచి ఏ ఒక్క వర్గాన్ని మినహాయించడం కాదని స్పష్టంచేశారు. హిందూ దేశ భావన ఎవరికీ వ్యతిరేకం కాదని పేర్కొన్నారు.

**సంఘ్–బీజేపీ మధ్య విభేదాల్లేవు**

ఆర్‌ఎస్‌ఎస్‌కు, స్వయం సేవకులకు(వాలంటీర్లు) మధ్య బలమైన బంధం ఉందని మోహన్ భగవత్ తెలిపారు. వారు స్వతంత్రంగా పని చేస్తున్నారని, వారికి ఆ స్వేచ్ఛ ఉందని తేల్చిచెప్పారు. బీజేపీపై సంఘ్ పెత్తనం చేస్తోందంటూ వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పారు. సంఘ్ అనుబంధ విభాగాలు, సంఘాలను ప్రత్యక్షంగా లేదా రిమోట్‌తో నియంత్రించడం లేదన్నారు. సంఘ్–బీజేపీ మధ్య ఎలాంటి విభేదాలు లేవని పరోక్షంగా స్పష్టంచేశారు. మొత్తం సమాజాన్ని ఏకం చేయాలన్నదే సంఘ్ ఆశయమని చెప్పారు. గత 75 ఏళ్లలో మన దేశం చేరాల్సిన స్థాయికి చేరలేదని అభిప్రాయపడ్డారు.

**40 వేల ఏళ్లుగా మన డీఎన్‌ఏ ఒక్కటే**

ప్రాచీన భారత దేశంలో మన పూర్వీకుల ఉమ్మడి సంప్రదాయాలు అందరినీ కలిసికట్టుగా ఉంచాయని మోహన్ భగవత్ పేర్కొన్నారు. విభజన ముందు మన దేశం ఒక్కటిగానే ఉందని, ఉమ్మడి దేశంలో 40 వేల ఏళ్లుగా మనందరి డీఎన్‌ఏ ఒక్కటేనని వివరించారు. హిందువులు అంటే సంప్రదాయాల పరంగా, భౌగోళికంగా విస్తృతమైన అర్థం ఉందన్నారు. అది కొందరికి తెలుసని, మరికొందరికి తెలియదని చెప్పారు. మన పూర్వీకుల్లో ఉమ్మడి సంప్రదాయం ఉండేదన్నారు. భరతమాతను ఆరాధించే విధానం ఉందన్నారు. ఉమ్మడి దేశంగా చూస్తే ప్రజలందరి డీఎన్‌ఏ ఒక్కటేనని స్పష్టంచేశారు. దేశం అభివృద్ధి చెందాలంటే సామాజిక మార్పు అవసరమని సూచించారు. ఇందుకోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మోహన్ భగవత్‌తో జరిగిన సమావేశంలో యోగా గురువు బాబా రాందేవ్, జేడీ(యూ) నేత కె.సి.త్యాగి, బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, అనుప్రియా పటేల్ తదితరులు పాల్గొన్నారు. బుధవారం, గురువారం సైతం ఈ సమావేశం జరుగుతుంది.

## చైనా విద్యార్థులకు ట్రంప్ ఆహ్వానం

**6 లక్షల మందికి ఎంట్రీ**

**వాషింగ్టన్:** అమెరికా, చైనా మధ్య కీలకమైన సంబంధాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఆరు లక్షల మంది చైనా విద్యార్థులకు ఆహ్వానం పలుకుతున్నామని చెప్పారు. వారికోసం అమెరికా యూనివర్సిటీల తలుపులు తెరిచి ఉంచామని వెల్లడించారు. చైనా విద్యార్థులు తమ దేశంలో నిక్షేపంగా ఉన్నత చదువులు చదువుకోవచ్చని సూచించారు. వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులో ట్రంప్ తాజాగా మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. చైనాలోని అరుదైన ఖనిజాలు అమెరికాకు సులువుగా లభించేలా చూడాల్సిన బాధ్యత డ్రాగన్ ప్రభుత్వంపై ఉందన్నారు. లేకపోతే చైనా ఉత్పత్తులపై 200 శాతం టారిఫ్‌లు విధించడానికైనా వెనుకాడబోమని తేల్చిచెప్పారు. అమెరికా–చైనా మధ్య వాణిజ్యపరమైన ఉద్రిక్తతల కారణంగా చైనా విద్యార్థులు నష్టపోవడం తమకు సమ్మతం కాదన్నారు. వారిపై ఎలాంటి ప్రభావం పడకుండా జాగ్రత్త వహిస్తామన్నారు. మరోవైపు చైనా విద్యార్థులకు ట్రంప్ ఆహ్వానం పలకడం పట్ల మాగా(మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) మద్దతుదారులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

## సీఎం కుర్చీని చులకన చేస్తారనుకోలేదు

**ప్రధాని మోదీపై మమతా బెనర్జీ ఆగ్రహం**

**బర్ధమాన్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై టీఎంసీ అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పదవిని ప్రధాని మోదీ చులకన చేసి మాట్లాడటాన్ని ఆమె తప్పుపట్టారు. ప్రధాని మోదీ అలా దూషిస్తారని తాను ఎన్నడూ అనుకోలేదన్నారు. సీఎం కుర్చీని చులకనగా దొంగగా పేర్కొనడం అంటే యావత్తూ బెంగాల్ ప్రజలను దొంగలని అన్నట్లేనని పేర్కొన్నారు. మంగళవారం పూర్వ బర్ధమాన్ జిల్లా బర్ధమాన్ పట్టణంలో జరిగిన కార్యక్రమంలో మమత మాట్లాడారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను నిలిపివేస్తూ కేంద్రం రాష్ట్ర ఖజానాపై ఎంతో భారం మోపుతోందని ఆరోపించారు. ఈ నెల 22న కోల్‌కతాలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. అవినీతి, నేరాలు టీఎంసీకి మారుపేర్లని వ్యాఖ్యానించారు.

# అమెరికాలో కొత్తరకం వ్యాధి!

**దేశంలో తొలి కేసు నమోదు**

- ఎల్‌సాల్వెడార్ నుంచి వచ్చిన వ్యక్తిలో గుర్తింపు
- శరీరంలో మాంసాన్ని తినేసే ఈగ లార్వాలు
- మనుషులకు ముప్పు తక్కువేనంటున్న వైద్యులు

మానవ శరీరంలో మాంసాన్ని తినేసే ప్రమాదకరమైన పరాన్నజీవికి సంబంధించిన తొలి కేసు అమెరికాలో నమోదైంది. మేరీలాండ్‌లో ఓ వ్యక్తి ఈ నెల 4వ తేదీన దీనిబారిన పడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ వ్యాధిని న్యూవరల్డ్ స్క్రూవార్మ్(ఎన్‌డబ్ల్యూఎస్) మియాసిస్ అని పిలుస్తున్నారు. ఒక జాతికి చెందిన ఈగ(మగ్గోట్స్) లార్వా మనిషి శరీరంలోని కణజాలంలో తిష్టవేసి, క్రమంగా మాంసాన్ని భక్షిస్తుందని అంటున్నారు. ఎల్‌సాల్వెడార్ దేశం నుంచి వ్యక్తికి వ్యాధి సోకినట్లు డాక్టర్లు పేర్కొన్నారు. సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ప్రివెన్షన్(సీడీసీ) సహకారంతో తొలి కేసును నిర్ధారించినట్లు యూఎస్ డిపార్టుమెంట్ ఆఫ్ హెల్త్, హ్యూమన్ సర్వీసెస్(హెచ్‌హెచ్‌ఎస్) తెలియజేసింది.

- ఎన్‌డబ్ల్యూఎస్ మియాసిస్ అనేది సాధారణంగా పాడి పశువులు, ఇతర జంతువుల్లో కనిపిస్తుంది. దక్షిణ అమెరికాతోపాటు కరీబియన్ దీవుల్లో దీని ఉనికి ఉంటుంది. కానీ, ఇటీవల సెంట్రల్ అమెరికా, మెక్సికోతోపాటు అమెరికాకు సైతం విస్తరించినట్లు నిపుణులు గుర్తించారు.
- ప్రధానంగా శరీరంపై పుండ్లు, గాయాలు ఉన్నవారికి ఎన్‌డబ్ల్యూఎస్ మియాసిస్ సోకే అవకాశాలు అధికంగా ఉంటాయి.



దీని ప్రభావానికి గురైన పశువులకు, ప్రాంతాలకు దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

- కొక్లియోమియా హోమినివోరక్స్ ఈగ లార్వాలే ఈ స్క్రూవార్మ్స్. జంతువుల పుండ్లు, గాయాలపై వాలుతుంటాయి. పుండు భాగంలో లేదా సున్నితమైన కణజాలంపై ఒక ఆడ ఈగ ఒకేసారి 300 వరకు గుడ్లు పెట్టగలదు.
- గుడ్ల నుంచి బయటకు వచ్చే లార్వాలు పుండ్ల లోపలికి చొచ్చుకెళ్తాయి. క్రమంగా మాంసాన్ని తినేస్తాయి. తీవ్రమైన నొప్పి కలుగుతుంది. సరైన చికిత్స తీసుకోకపోతే ప్రాణాపాయం సంభవిస్తుంది.
- లార్వాలు మూడు నుంచి ఐదు రోజుల్లో పుండు నుంచి బయటకు వచ్చి కిందపడిపోతాయి. భూమి కిందిభాగంలోకి చేరుకుంటాయి. ఈగలుగా మారి బయటకు వస్తాయి. గుడ్లు పెట్టడానికి పుండ్లు, గాయాలు ఉన్న జంతువులను వెతుక్కుంటాయి.
- కొక్లియోమియా హోమినివోరక్స్ ఈగ జీవితకాలం దాదాపు 30 రోజులు. మొత్తం జీవితకాలంలో 3,000కుపైగా గుడ్లు పెడతాయి.
- న్యూవరల్డ్ స్క్రూవార్మ్ మియాసిస్ వల్ల మనుషులకు ముప్పు తక్కువేనని అమెరికా వైద్యులు చెబుతున్నారు. దేశంలో ఈ ఏడాది జంతువులకు ఈ పరాన్నజీవి సోకలేదు.
- ఒకసారి సోకితే ఆ ఉధృతి తీవ్రంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అందుకే ముందుజాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థతో కలిసి పని చేస్తున్నారు.
- ఈగలకు సంతాన నిరోధక ఆపరేషన్లు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. టెక్సాస్‌లో ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముల్లును ముల్లుతోనే తీయాలి అన్నట్లుగా ఈగల్లో సంతానాన్ని అరికట్టడానికి ఈగలనే ప్రయోగిస్తారు. స్టెరిలైజ్ చేసిన మగ ఈగలు ఆడ ఈగలతో కలిస్తే.. ఆ ఆడ ఈగల్లో సంతాన సామర్థ్యం క్షీణిస్తుంది.
- మనుషులు గాయాలు, పుండ్లు బయటకు కనిపించకుండా జాగ్రత్తపడితే ఈగల బారినపడే అవకాశాలు ఉండవు. గాయాలకు సాధ్యమైనంత త్వరగా చికిత్స తీసుకోవాలి.

**– సాక్షి, నేషనల్ డెస్క్**

## ఎల్గార్ పరిషత్ కేసులో నిందితుడికి బెయిల్

**ముంబై:** ఎల్గార్ పరిషత్ కేసులో నిందితుడు రమేశ్ గయిచోర్‌కు బాంబే హైకోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రి(75) వద్ద గడిపేందుకు మూడు రోజుల వెసులుబాటు కల్పించింది. తలోజా జైలులో ఉన్న రమేశ్‌ను రూ.25 వేల పూచీకత్తుతో విడుదల చేయాలని జస్టిస్ ఏఎస్ గడ్కరీ, జస్టిస్ రాజేశ్ ఎస్ పాటిల్‌ల ధర్మాసనం మంగళవారం ఆదేశించింది. ఎస్కార్టు ఫీజును కూడా ఆయన చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. రమేశ్‌ది పేద కుటుంబమని, ఆయన తండ్రి సెక్యూరిటీ గార్డుగా పనిచేసేవారని లాయర్లు తెలపడంతో ఈ మేరకు ధర్మాసనం ఎస్కార్టు ఫీజును రద్దు చేసినట్లు ప్రకటించింది. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి రమేశ్ తండ్రి వద్ద గడిపే మూడు రోజులూ ఎస్కార్టు కల్పించాలని నవీ ముంబై పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది.

## గాజాలో మరో 16 మంది మృతి

**జెరూసలేం:** గాజా ప్రాంతంలో ఇజ్రాయెల్ ఆర్మీ విధ్వంసం కొనసాగుతోంది. తాజాగా మంగళవారం జరిగిన దాడుల్లో కనీసం 16 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయినట్లు నాస్సెర్, షేక్ రద్వాన్, షిఫా ఆస్పత్రుల సిబ్బంది తెలిపారు. మృతుల్లో పలువురు మహిళలు, చిన్నారులు ఉన్నారన్నారు. అదేవిధంగా, పోషకాహార లోపం, కరువు కారణాలతో మరో ముగ్గురు చనిపోయారన్నారు. దీంతో, జూన్ నుంచి పోషకాహార లోప సంబంధ కారణాలతో ప్రాణాలు విడిచిన వారి సంఖ్య 186కు పెరిగిందని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది.

## ఆస్ట్రేలియాలో కాల్పులు.. ఇద్దరు పోలీసులు మృతి

**వెల్లింగ్టన్(న్యూజిలాండ్):** గ్రామీణ ఆస్ట్రేలియాలో గన్ మోత మోగింది. మెల్‌బోర్న్ నగరానికి 320 కిలోమీటర్ల దూరంలోని పొరెపుంకాహ్ పట్టణంలో పోలీసులు సెర్చ్‌వారెంట్‌తో ఒక ప్రాంతాన్ని జల్లెడపడుతుండగా వారిపై ఒక ఆగంతకుడు కాల్పులు జరిపాడు. దీంతో ఒక పోలీస్ డిటెక్టివ్, సీనియర్ కానిస్టేబుల్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. భారీస్థాయిలో మందుగుండుతో దుండగుడు వెంటనే సమీప అడవిలోకి పారిపోయాడు. దీంతో పోలీసులు అతని కోసం వేట మొదలెట్టారు.

## ఎవరైనా బాధపడితే సారీ: డీకే శివకుమార్

**బెంగళూరు:** కర్ణాటక అసెంబ్లీలో ఆర్‌ఎస్‌ఎస్ గీతం ఆలపించడం పట్ల కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ మంగళవారం క్షమాపణ చెప్పారు. ఎవరి మనసులైనా గాయపడితే తనను క్షమించాలని అన్నారు. తాను కాంగ్రెస్‌లో పుట్టానని, జన్మాంతరం కాంగ్రెస్‌లోనే ఉంటానని తేల్చిచెప్పారు. పార్టీ మారే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. కాంగ్రెస్‌కు తాను పూర్తి విధేయుడినని పేర్కొన్నారు. డీకే శివకుమార్ ఈనెల 21వ తేదీన అసెంబ్లీలో ఆర్‌ఎస్‌ఎస్ గీతం ఆలపించిన సంగతి తెలిసిందే. ఆయనపై కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. శివకుమార్ బీజేపీలో చేరుతారన్న ఊహాగానాలు సైతం వినిపించాయి.

## రక్షణ కవచం సుదర్శన్ చక్ర: అనిల్ చౌహాన్

**న్యూఢిల్లీ:** ప్రతిపాదిత గగనతల రక్షణ వ్యవస్థ 'సుదర్శన్ చక్ర' మన దేశానికి బలమైన కవచంగా, ఖడ్గంగా పనిచేస్తుందని చీఫ్ ఆఫ్ ఎయిర్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ మంగళవారం చెప్పారు. అత్యాధునిక సెన్సార్లు, క్షిపణులు, నిఘా పరికరాలు, కృత్రిమ మేధ పరికరాల సమ్మేళనమే సుదర్శన్ చక్ర అని వివరించారు. ఇజ్రాయెల్‌కు చెందిన ఐరన్ డోమ్ తరహాలో సేవలు అందిస్తుందని తెలిపారు. అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో సమర్థంగా పనిచేయడం సుదర్శన్ చక్ర ప్రత్యేకత అని స్పష్టంచేశారు. 'రణ్ సంవాద్' పేరిట త్రివిధ దళాల అధికారులతో జనరల్ చౌహాన్ సమావేశమయ్యారు. ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు.

## చిన్ననాటి స్కూలుకెళ్లిన శుభాంశు శుక్లా

**లక్నో:** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తన చిన్న నాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. సోమవారం ఆయన యూపీలోని తన సొంతూరు లక్నోకు చేరుకోవడం, ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించడం తెల్సిందే. మంగళవారం ఆయన అలిగంజ్ క్యాంపస్‌లో ఉన్న సిటీ మాంటిస్సోరి స్కూలుకు వెళ్లారు. భార్య, కామ్న, కుమారుడు కియాష్ వెంటబెట్టుకుని చిన్న తనంలో చదువుకున్న స్కూలు కారిడార్‌తోపాటు క్లాసు రూముల్లో కలియదిరిగారు. మళ్లీ స్కూలుకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

## విక్రమ సింఘేకి బెయిలిచ్చిన కోర్టు

**కొలంబో:** శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమ సింఘే(76)కి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అధికారంలో ఉండగా ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై ఇటీవల పోలీసులు ఆయన్ను అరెస్టు చేయడం తెల్సిందే. తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన్ను ఆస్పత్రిలో చేర్చారు. మంగళవారం కోర్టు విచారణకు ఆయన వర్చువల్‌గా ఆస్పత్రి ఐసీయూ నుంచే హాజరయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు వెంటనే బెయిలివ్వాలని న్యాయవాదులు కోరారు. సానుకూలంగా స్పందించిన కొలంబో ఫోర్ట్ మేజిస్ట్రేట్ నిలుపులి విక్రమ సింఘే రూ.50 లక్షల పూచీకత్తు కలిగిన మూడు వేర్వేరు ష్యూరిటీలతో బెయిలిచ్చారు.

## ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా జార్ఖండ్ తీర్మానం

**రాంచీ:** జార్ఖండ్ అసెంబ్లీ మంగళవారం ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా తీర్మానం చేసింది. కేంద్రంలోని అధికార పార్టీకి ప్రత్యక్షంగా లాభం చేకూర్చేందుకే ఎస్ఐఆర్‌ను ఈసీ తెస్తోందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి రాధాకృష్ణ కిశోర్ అసెంబ్లీలో ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని ప్రవేశపెడుతూ ఆరోపించారు. ఎస్ఐఆర్‌ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష బీజేపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అసెంబ్లీలో అధికార పక్షానికి మెజారిటీ ఉన్నందున ఓటింగ్ అవసరం లేదని స్పీకర్ పేర్కొన్నారు.

## లిథువేనియా ప్రధానిగా ఇన్గా రుగినీన్



**విల్నియస్:** లిథువేనియాలో యువ కార్మిక నాయకురాలిగా పేరొందిన సామాజిక భద్రత, కార్మిక శాఖ మంత్రి ఇన్గా రుగినీన్(44) ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. మంగళవారం ఆ దేశ పార్లమెంట్(సీమస్)లో జరిగిన ఓటింగ్‌లో ఇన్గా మెజారిటీ ఓట్లు సాధించి ప్రధాని పీఠాన్ని కైవసం చేసుకున్నారు. అక్రమంగా బంధువుతో కలిసి వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలపై ప్రస్తుత ప్రధానమంత్రి గింటాటస్ పలుకాస్ రాజీనామా చేయడంతో ఈ ఎంపిక అనివార్యమైంది. మంగళవారం పార్లమెంట్‌లో జరిపిన ఓటింగ్‌లో మెజారిటీ ఓట్లు పడ్డాయి.

# భాషాపరంగా మాండమస్ అంటే ఏమిటి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

## వ్యక్తిగత స్వేచ్ఛలు, హక్కులు

### ప్రకరణ–28

**విద్యాలయాల్లో మత బోధన నిషేధం**

**ప్రకరణ 28(1):** ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచే ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రత్యేక మత బోధన నిషేధం. **ప్రకరణ 28(2):** పై నిబంధనకు కొన్ని మినహాయింపులిచ్చారు. ప్రభుత్వం నిర్వహించే దేవాదాయ, ధర్మాదాయ సంస్థల్లో ప్రత్యేక మత బోధన చేయవచ్చు. **ప్రకరణ 28(3):** ప్రభుత్వ గుర్తింపు ఉన్న, ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందే విద్యాసంస్థల్లో ఒక వ్యక్తి ఐచ్ఛికంగా మత ప్రార్థనలు /బోధనల్లో పాల్గొనవచ్చు. అయితే పాల్గొనమని ఒత్తిడి చేయరాదు. ఆ వ్యక్తి మైనర్ అయితే తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి అనుమతి తీసుకోవాలి.

### ప్రకరణలు–29, 30

**విద్యా, సాంస్కృతిక పరమైన హక్కులు**

**ప్రకరణ 29(1):** భారతదేశంలో నివసిస్తున్న ప్రజలకు ప్రత్యేక భాష, లిపి, సంస్కృతి ఉంటే.. వాటిని పరిరక్షించుకుని, పెంపొందించుకునే స్వేచ్ఛ వారికి ఉంటుంది.

**ప్రకరణ 29(2):** ప్రభుత్వం నిర్వహిస్తోన్న లేదా ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందుతున్న సంస్థల్లో ప్రవేశానికి మతం, జాతి, కులం, భాషా ప్రాతిపదికన వివక్ష చూపరాదు.

**ప్రకరణ 30(1):** మైనారిటీ వర్గాలవారు, ప్రత్యేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకొని, నిర్వహించుకోవచ్చు.

**ప్రకరణ 30(1)(ఎ):** మైనారిటీలు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు, వాటి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే, వారికి ప్రత్యేక నష్టపరిహారం చెల్లించాలి. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ క్లాజును చేర్చారు.

**ప్రకరణ 30(2):** ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించే సమయంలో విద్యాసంస్థల పట్ల వివక్ష చూపరాదు. అల్ప సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలు, అధిక సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలను సమ దృష్టితో చూడాలి.

**వివరణ:**

- ఆర్టికల్ 29, 30లలో 'మైనారిటీ' పదాన్ని ప్రస్తావించారు. కానీ ఈ పదాన్ని రాజ్యాంగంలో ఎక్కడా నిర్వచించలేదు.
- మైనారిటీల వర్గీకరణకు రాష్ట్రాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దేశంలో రెండు రకాల మైనారిటీ వర్గాలున్నాయి. అవి మతపరమైన, భాషాపరమైన మైనారిటీ వర్గాలు.
- హిందువులు మినహా మిగతా వారంతా మతపరమైన మైనారిటీలే. భాషాపరమైన మైనారిటీలు రాష్ట్రాల వారీగా మారుతుంటారు. ఉదాహరణకు.. తెలంగాణలో కన్నడిగులు, గుజరాతీలు, మరాఠీలు భాషాపరంగా మైనారిటీలు.

**సుప్రీంకోర్టు తీర్పులు**

**కేరళ విద్య పాఠ్యాంశాల సవరణ బిల్లు (1958) కేసు:** కేరళ ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవ, కమ్యూనిస్టు భావాలున్న పాఠ్యాంశాలను చేర్చారు. దీంతో ఈ బిల్లును సుప్రీంకోర్టు సలహా పరిధికి నివేదించారు. పాఠ్యాంశాల్లో తీవ్రవాద భావజాలాన్ని చేర్చడం చెల్లదని సుప్రీంకోర్టు తెలిపింది.

**డి.ఎ.వి. కాలేజ్ v/s స్టేట్ ఆఫ్ పంజాబ్ (1971) కేసు:** విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో పంజాబీ మాత్రమే బోధన భాషగా ఉండాలని నిర్ణయించారు. అయితే ఇది చెల్లుబాటు కాదని సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది.

**అల్‌సెయింట్స్ v/s గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (1980) కేసు:** మైనారిటీ విద్యాసంస్థల నిర్వహణలో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదని ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

**టి.ఎం.ఎ.పాయ్ v/s స్టేట్ ఆఫ్ కర్ణాటక (2003) కేసు:** మైనారిటీ విద్యా సంస్థల విషయంలో ప్రభుత్వం ఏ సందర్భంలో జోక్యం చేసుకోవచ్చో, జోక్యం చేసుకోరాదో వివరణ ఇస్తూ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. అవి..

- మైనారిటీ స్థాయిని నిర్ణయించడానికి రాష్ట్రాన్ని మాత్రమే యూనిట్‌గా తీసుకోవాలి.
- మైనారిటీ అనే పదంలో భాషాపరమైన, మతపరమైన మైనారిటీలు ఉండవచ్చు.
- బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు, వారిపై పాలనా నియంత్రణ సంబంధిత హక్కులు మేనేజ్‌మెంట్‌కే ఉంటాయి. ప్రభుత్వ ధనసహాయం పొందని మైనారిటీ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే అధికారం ప్రభుత్వానికి లేదు. అయితే క్యాపిటేషన్ ఫీజులను ప్రభుత్వం నియంత్రించవచ్చు.

### ప్రకరణ – 31

**ఆస్తిహక్కు**

పార్లమెంటు ఆస్తి హక్కుకు సంబంధించి అనేక సవరణలు, చట్టాలు చేసింది. 1951లో మొదటి రాజ్యాంగ సవరణ,1964లో 17వ రాజ్యాంగ సవరణ, 1971లో 24వ రాజ్యాంగ సవరణ చేశారు. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. దాన్ని 12వ భాగంలో ప్రకరణ 300–ఎలో రాజ్యాంగ పరమైన హక్కుగా (Constitutional Rights) చేర్చారు. 1979 జూన్ 20 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. అలాగే ఆస్తి హక్కుకు సంబంధించి నూతన నిబంధనలను కూడా చేర్చారు.

**ప్రకరణ 31(ఎ):** ప్రభుత్వం ఆస్తిని స్వాధీనం చేసుకున్నప్పుడు వర్తించే కొన్ని మినహాయింపులను ఈ ప్రకరణలో పేర్కొన్నారు. భూ సంస్కరణల అమలు కోసం చట్టాలు చేసినప్పుడు.. అవి 14, 19 ప్రకరణలకు వ్యతిరేకమనే కారణంతో న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు.

**ప్రకరణ 31(బి):** కొన్ని చట్టాల వర్తింపునకు మినహాయింపులు. వీటిని 9వ షెడ్యూల్డ్‌లో ప్రస్తావించారు. ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉన్నాయన్న కారణంతో ఇలాంటి చట్టాలను న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు. 9వ షెడ్యూల్డ్‌లో పేర్కొన్న అంశాలు సాధారణంగా న్యాయ సమీక్షకు గురికావు. కానీ 'రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో న్యాయ సమీక్ష అంతర్భాగం. దాన్ని పరిమితం చేసే అధికారం పార్లమెంటుకు లేదు' అని కేశవానంద భారతి కేసు(1973)లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

2007లో ఐ.ఆర్. కొహెల్హో v/s తమిళనాడు కేసులో 'న్యాయ సమీక్ష రాజ్యాంగ మౌలిక నిర్మాణంలోకి వస్తుంది. కాబట్టి 1973 తర్వాత 9వ షెడ్యూల్డ్‌లో చేర్చిన అంశాలు న్యాయ సమీక్షకు గురవుతాయి' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

**ప్రకరణ 31(సి):** ఆదేశిక సూత్రాల అమలు కోసం ప్రాథమిక హక్కులపై, ముఖ్యంగా ఆస్తి హక్కుపై కొన్ని పరిమితులు విధించవచ్చు. ఈ పరిమితులు రాజ్యాంగ విరుద్ధమంటూ న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీల్లేదు. ఆదేశిక సూత్రాల్లోని ప్రకరణ 39లో ఉన్న క్లాజు బి, సిలో సామ్యవాద తరహా సమాజ స్థాపన గురించి పేర్కొన్నారు. ఈ విషయమై రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు కొన్ని పరిమితులు విధిస్తే, అవి ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమని న్యాయస్థానంలో ప్రశ్నించలేం.

**వివరణ:**

ప్రకరణ 31(ఎ), 31(బి), 31(సి)లు ఆస్తిహక్కుపై పరిమితికి సంబంధించినవి. ఇవి ఎలాంటి ప్రాథమిక హక్కులను ప్రసాదించవు. 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కు ప్రకరణ 31ను తొలగించారు. కానీ వీటిని మాత్రం కొనసాగించారు.

**మత స్వేచ్ఛ - సుప్రీంకోర్టు తీర్పులు**

**బిజో ఇమాన్యువల్ v/s స్టేట్ ఆఫ్ కేరళ (1986) కేసు:** జాతీయ గీతాన్ని ఆలపించడం తమ మత విశ్వాసాలకు విరుద్ధమని నిరూపించగలిగితే.. జాతీయ గీతం పాడాలని ఏ వ్యక్తిని ఒత్తిడి చేయరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. కేరళ పాఠశాలల్లో జాతీయ గీతం ఆలపించడం తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీన్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో ఈ కేసు దాఖలైంది.

**సెయింట్ జేవియర్స్ కాలేజీ v/s స్టేట్ ఆఫ్ గుజరాత్ (1974) కేసు:** 'లౌకికతత్వం' పదానికి ఈ కేసులో సుప్రీంకోర్టు వివరణ ఇచ్చింది. మతానికి, దేవుడికి అతీతంగా వ్యవహరించడమే లౌకికతత్వం. దేవుడి పట్ల ప్రత్యేక ద్వేషం, వ్యతిరేకత చూపకూడదు. దేవుణ్ని నమ్మేవారిని, నమ్మని వారిని ప్రభుత్వం ఒకే విధంగా చూడాలి.

### ప్రకరణ – 32

**రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies)**

ప్రాథమిక హక్కుల్లో ఇది అత్యంత ముఖ్యమైంది. మూడో భాగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగినా/ఆ హక్కులను పరిమితం చేసినా/అమలు చేయకపోయినా, బాధితులు నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన రాజ్యాంగ పరిహారాలను పొందవచ్చు. మొదటి ఆరు ప్రాథమిక హక్కుల అమలు ఈ నిబంధన పైనే ఆధారపడి ఉంటుంది. హక్కులను గుర్తించడంతో పాటు, వాటి అమలుకు హామీ ఉన్నప్పుడే వాటికి విలువ ఉంటుంది. అమలు కాని హక్కులు వ్యర్థం.

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు నిబంధన 32 (4) హామీ ఇస్తోంది. అందుకే అంబేద్కర్ రాజ్యాంగ పరిహార హక్కును రాజ్యాంగ ఆత్మగా, హృదయంగా వర్ణించారు.

**ప్రకరణ 32(1):** ఒక వ్యక్తి ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు లేదా అవి అమలు కానప్పుడు ఆ వ్యక్తి నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన పరిహారం పొందవచ్చు.

**ప్రకరణ 32(2):** హక్కులను కాపాడటానికి ప్రత్యేక ఆదేశాలైన హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, కో-వారెంటో, సెర్షియరీ లాంటి రిట్లను సుప్రీంకోర్టు జారీ చేసేందుకు ఈ భాగం వీలు కల్పిస్తుంది.

**ప్రకరణ32(3):**సుప్రీంకోర్టు అధికారాలకు విఘాతం కలగకుండా, ఇతర న్యాయస్థానాల(స్థానిక కోర్టులు, జిల్లా కోర్టులు)కు కూడా రిట్లు జారీచేసే అధికారాన్ని పార్లమెంటు చట్టం ద్వారా కల్పించవచ్చు.

**ప్రకరణ 32(4):** రాజ్యాంగంలో ఇతరత్రా అనుమతించిన విధంగా తప్ప ఈ ప్రకరణ ద్వారా గుర్తించిన హక్కులు రద్దు కావు.

**వివరణ:**

రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో రాజ్యాంగ పరిహార హక్కు అంతర్భాగమని 1981లో ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

**రిట్లు-పరిధి-పరిమితులు**

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు జారీచేసే ప్రత్యేక ఆదేశాలను న్యాయశాస్త్ర పరిభాషలో రిట్లు (Writs) అంటారు. రిట్లు జారీ చేసే పద్ధతిని బ్రిటన్ రాజ్యాంగం నుంచి గ్రహించారు. నిబంధన 32 ప్రకారం సుప్రీంకోర్టుకు, నిబంధన 226 ప్రకారం రాష్ట్ర హైకోర్టులకు రిట్లు జారీ చేసే అధికారాన్ని కల్పించారు. పార్లమెంటు ప్రత్యేక చట్టం ద్వారా ఈ అధికారాన్ని జిల్లా న్యాయస్థానాలకు కల్పించవచ్చు. ఇప్పటి దాకా పార్లమెంటు అలాంటి చట్టాలను రూపొందించలేదు. కాబట్టి సుప్రీంకోర్టు, హైకోర్టులకు మాత్రమే రిట్లు జారీ చేసే అధికారం ఉంది. రిట్ల జారీ విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి. హైకోర్టులు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దవుతుంది. ప్రకరణ 226 విషయ పరిధి తక్కువ. కానీ సుప్రీంకోర్టు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దు కాదు. ప్రకరణ 32 విషయ పరిధి విస్తృతమైంది.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీం కోర్టుకు ప్రత్యేకమైన, ప్రాథమిక విచారణ పరిధి ఉంటుంది (Primary and Original). అందుకే సుప్రీం కోర్టును ప్రాథమిక హక్కుల పరిరక్షణ కర్త అంటారు.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీంకోర్టు, హైకోర్టులకు ఉమ్మడి పరిధి ఉంటుంది. అంటే పౌరులు ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ప్రకరణ 32 ప్రకారం నేరుగా సుప్రీంకోర్టును లేదా ప్రకరణ 226 ప్రకారం హైకోర్టును ఆశ్రయించవచ్చు.

సాధారణంగా హైకోర్టు ద్వారా తగిన రక్షణ, ఉపశమనం లభిస్తుందని పౌరులు భావిస్తే, మొదట హైకోర్టును ఆశ్రయించాలని కనుభాయ్ బ్రహ్మ భట్ v/s గుజరాత్ (1972) కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

**వివిధ రిట్లు-అర్థం-పరిధి-ప్రాముఖ్యత**

**హెబియస్ కార్పస్ (Hebeas Corpus)**

ఈ పదం లాటిన్ భాష నుంచి వచ్చింది. హెబియస్ అంటే 'Have', కార్పస్ అంటే 'Body' అని అర్థం. ఒక వ్యక్తిని భౌతికంగా కోర్టు ముందు హాజరుపర్చడమని దీనికి అర్థం. ఇది పురాతన రిట్. నిబంధన 19–22 వరకు పొందుపరచిన వ్యక్తిగత స్వేచ్ఛలకు భంగం కలిగినప్పుడు ఈ రిట్ జారీ చేస్తారు. అరెస్టయిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప న్యాయస్థానంలో హాజరుపరచాలి. లేని పక్షంలో ఈ రిట్ దాఖలు చేస్తే వెంటనే ఆ వ్యక్తిని న్యాయస్థానం ముందు హాజరుపరచాలని కోర్టు ఆదేశిస్తుంది.



వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణతోపాటు చట్టబద్ధత లేకుండా ఏ వ్యక్తిని నిర్బంధించకుండా, శిక్షించకుండా కాపాడటం ఈ రిట్ ప్రధాన ఉద్దేశం. ఈ రిట్‌ను ప్రభుత్వ సంస్థలకు, ప్రైవేట్ వ్యక్తులకు కూడా జారీ చేయవచ్చు.

మూడో వ్యక్తికి కూడా ఇందులో జోక్యం చేసుకునే హక్కు(లోకస్ స్టాండై) ఉంటుంది. బాధితుల తరఫున సామాజిక స్పృహ ఉన్న సంస్థ/వ్యక్తి ఈ రిట్ దాఖలు చేయవచ్చు. అందుకే దీన్ని ఉదారమైన రిట్ అని, వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణ సాధనమని అంటారు.

**మినహాయింపులు:**

పార్లమెంటు స్వాధికారాలకు భంగం కలిగించిన కారణంతో వ్యక్తిని నిర్బంధించినప్పుడు, కోర్టు ద్వారా నేరారోపణ నిరూపితమై జైలు శిక్ష అనుభవిస్తున్నప్పుడు ఇది వర్తించదు.

**మాండమస్ (Mandamus)**

భాషాపరంగా మాండమస్ అంటే ఆదేశం అని అర్థం.సుప్రీం కోర్టు లేదా హైకోర్టు జారీచేసే అత్యున్నత ఆదేశంగా దీన్ని చెప్పవచ్చు. ప్రభుత్వాధికారి/సంస్థ తమ చట్టబద్ధమైన విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని న్యాయస్థానం ఇచ్చే ఆదేశం.

ప్రభుత్వాధికారులు, సంస్థలు తమ విధులను చట్టబద్ధంగా నిర్వర్తించనప్పుడు ప్రజల హక్కులకు భంగం వాటిల్లుతుంది.అలాంటి సందర్భాల్లో వారు సక్రమంగా విధులు నిర్వర్తించడానికి ఈ రిట్ జారీ చేస్తారు. పబ్లిక్ సంస్థలు, క్వాజి పబ్లిక్ (Quasi-Public),జ్యుడీషియల్ సంస్థలు,క్వాజి జ్యుడీషియల్ సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీ చేయవచ్చు.

**మినహాయింపులు:**

రాష్ట్రపతి, గవర్నర్లకు ఈ రిట్ వర్తించదు. వీరు తమ అధికారాలు, విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని ఏ కోర్టు ఆదేశించలేదు.

ప్రైవేట్ వ్యక్తులు, ప్రైవేటు సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీచేయడానికి వీల్లేదు. మాండమస్ రిట్‌ను అంతిమ ప్రత్యామ్నాయంగా మాత్రమే జారీ చేస్తారు.అంటే పరిపాలనాపరమైన ప్రత్యామ్నాయాల ద్వారా పౌరులు న్యాయాన్ని పొందలేనప్పుడు ఈ రిట్ ద్వారా ఉపశమనం పొందవచ్చు. ఈ రిట్ జారీ అనేది కోర్టు విచక్షణపై ఆధారపడి ఉంటుంది. అధికారులు తప్పనిసరిగా నిర్వర్తించాల్సిన విధులకే ఇది వర్తిస్తుంది. విచక్షణ(Discretion) పూర్వకమైన విధులకు వర్తించదు.

# తరగతి గదిలో క్రమశిక్షణ దేనిపై ఆధారపడి ఉంటుంది?




**మాదిరి ప్రశ్నలు**

1. కిందివాటిలో విద్యా లక్ష్యం కానిది ఏది?
   1) విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించడం
   2) సమాజంతో విద్యార్థుల సంబంధాలు తెలపడం
   3) విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడం
   4) విద్యార్థులకు ఉపాధి కల్పింపజేయడం
2. ప్రాథమిక విద్యను ఎవరికి బోధించాలని రాజ్యాంగం నిర్దేశించింది?
   1) తెలివి ఉన్న వారికి
   2) వెనుకబడినవారికి
   3) 6 నుంచి 14 ఏళ్ల లోపు బాలబాలికలకు
   4) 5 - 14 ఏళ్ల లోపు వెనుకబడిన వారికి
3. నూతన విద్యా ప్రణాళికలో ప్రధానాంశం?
   1) జాతీయ సమైక్యత పెంపొందించడం
   2) ప్రజల్లో స్నేహభావాన్ని పెంపొందించడం
   3) మతం విషయంలో అవగాహన పెంపొందించడం
   4) విద్యార్థుల మానసిక శక్తులను పెంపొందించడం
4. ఉత్తమ ఉపాధ్యాయుడికి ఉండాల్సిన ముఖ్య లక్షణం?
   1) వృత్తికి న్యాయం చేయడం
   2) నైతిక జీవనం పెంపొందించడం
   3) ధనం సంపాదించడం
   4) సమాజాన్ని గౌరవించడం
5. ఉపాధ్యాయునిగా మీరు సాధించాల్సింది?
   1) మూఢనమ్మకాలను తొలగించడం
   2) అక్షరాస్యతను విస్తరించడం
   3) సమాజంలో చైతన్యం కలిగించడం
   4) ఏదీకాదు
6. సమాజంలో ఉపాధ్యాయుని స్థానం?
   1) విలువైనది 2) ఉన్నతమైనది
   3) సాధారణమైనది
   4) వ్యాపారాత్మకమైనది
7. ఉపాధ్యాయులు రాజకీయాల్లో పాల్గొనడంపై మీ అభిప్రాయం?
   1) పాల్గొనవచ్చు 2) పాల్గొనరాదు
   3) స్థానిక ఎన్నికల్లో పాల్గొనవచ్చు
   4) ప్రభుత్వ అనుమతితో పాల్గొనవచ్చు
8. ప్రస్తుతం పాఠశాలల్లో అమలవుతున్న మూల్యాంకన విధానం ఏది?
   1) నిర్మాణాత్మక మూల్యాంకనం
   2) రూపాత్మక మూల్యాంకనం
   3) గుణాత్మక మూల్యాంకనం
   4) నిరంతర సమగ్ర మూల్యాంకనం
9. క్రమశిక్షణ పాటించని విద్యార్థులపై ఉపాధ్యాయుడు చర్య తీసుకోవడాన్ని మీరు సమర్థిస్తారా?
   1) సమర్థిస్తాను
   2) కొన్ని సందర్భాల్లో సమర్థిస్తాను
   3) ఎటూ చెప్పలేను
   4) సమర్థించను
10. పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం నిర్దేశించడానికి కారణం?
    1) ప్రశాంతత కోసం
    2) అందంగా కనిపించడానికి
    3) ప్రత్యేక గుర్తింపు కోసం
    4) సమానత్వ భావన కోసం
11. గృహ సంబంధ, వృత్తి సంబంధ విషయాల్లో మీరు దేనికి ప్రాధాన్యమిస్తారు?
    1) వృత్తి సంబంధ విషయాలకు
    2) రెండింట్లో ఏది అవసరమో అది చేస్తాను
    3) గృహ విషయాలకు
    4) దేనికీ ప్రాధాన్యం ఇవ్వను
12. తరగతిలో విద్యార్థులు గోల చేస్తున్నప్పుడు ఉపాధ్యాయుడు ఏం చేస్తే బాగుంటుంది?
    1) కొంతసేపు బోధనను ఆపాలి
    2) గోలను పట్టించుకోకూడదు
    3) గట్టిగా మాట్లాడాలి
    4) కొంతమంది విద్యార్థులను బయటకు పంపించాలి
13. తరగతి గదిలోని ఏ విద్యార్థీ సరైన ప్రగతి సాధించలేకపోతే దానికి కారణం?
    1) సరైన వసతులు లేకపోవడం
    2) సరైన ప్రోత్సాహం లేకపోవడం
    3) విద్యా ప్రణాళిక లోపం
    4) ఉపాధ్యాయుడు దండించకపోవడం
14. తరగతి గదిలో ఉపాధ్యాయుడు పరిశీలించాల్సిన విషయం?
    1) అల్లరి పిల్లల ప్రవర్తన
    2) తరగతి గది పరిసరాలు
    3) విద్యార్థుల సంభాషణలు
    4) పాఠ్యాంశాలు
15. ఉపాధ్యాయుడు, విద్యార్థి మధ్య సంబంధం ఎలా ఉండాలి?
    1) భౌతికంగా దూరంగా, మానసికంగా దగ్గరగా
    2) భౌతికంగా దగ్గరగా, మానసికంగా దూరంగా
    3) అంటీ ముట్టనట్లు
    4) గాఢమైన స్నేహమైత్రి ఉండాలి
16. చక్కగా విధులు నిర్వహించే ఉపాధ్యాయుడిని విద్యార్థులు ఏవిధంగా పరిగణిస్తారు?
    1) నాయకునిగా 2) స్నేహితుడిగా
    3) మార్గదర్శకుడిగా
    4) దైవంతో సమానంగా
17. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుడు ఎలా ఉండాలని ఆశిస్తారు?
    1) మంచి ప్రజ్ఞా - జ్ఞానం ఉన్నవారు
    2) సామర్థ్యం ఉన్నవారు
    3) నిష్పక్షపాతంగా మూల్యాంకనం చేసేవారు
    4) తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపేవారు
18. కిందివాటిలో విద్యార్థులను ఎక్కువగా ప్రభావితం చేసేది?
    1) స్నేహితులు 2) పాఠశాల
    3) సినిమాలు 4) సమాజం, ధనం
19. కిందివాటిలో ఉపాధ్యాయుడు బోధన ఆపాల్సిన సందర్భం ఏది?
    1) విద్యార్థి మానసికంగా అలసట చెందినప్పుడు
    2) ఉపాధ్యాయునికి ముఖ్యమైన పనులుఉన్నప్పుడు
    3) ఉపాధ్యాయుడు అలసిపోయినప్పుడు
    4) విద్యార్థులు నిరాసక్తతతో ఉన్నప్పుడు
20. తరగతి గదిలో హాస్యపూరిత వాతావరణం ఏవిధంగా దోహదపడుతుంది?
    1) మంచిదికాదు
    2) ఉపాధ్యాయుడు, విద్యార్థులు మిత్రుల్లా మెలగుతారు
    3) తరగతిలో అభ్యసన ప్రక్రియ సరైన స్థితిలో ఉంటుంది
    4) అభ్యసన ప్రక్రియ కుంటుపడుతుంది
21. తరగతి గదిలో క్రమశిక్షణ దేనిపై ఆధారపడి ఉంటుంది?
    1) ఉపాధ్యాయుడి రౌద్ర స్వభావం
    2) అల్లరి చేసేవారిని వెంటనే దండించడం
    3) రాత పని ఎక్కువగా ఇవ్వడం
    4) ఉపాధ్యాయుని బోధనా పటిమ
22. విద్యార్థుల్లో క్రమశిక్షణారాహిత్యానికి కారణం ఏమిటి?
    1) పరిసరాలు, సామాజిక కారకాలు
    2) బాధ్యతారాహిత్యమైన తల్లిదండ్రులు, కుటుంబ పరిస్థితులు
    3) పాఠశాల పరిపాలన నిర్వహణ పద్ధతులు
    4) పైవన్నీ
23. విద్యార్థుల వెనుకబాటుతనానికి కారణం?
    1) సామాజికపరమైన పేదరికం
    2) శారీరక లోపం
    3) అతి గారాబం, చెడు సావాసాలు
    4) పైవన్నీ
24. పేదరికం వల్ల ఒక విద్యార్థి పాఠశాలకు రావడం పూర్తిగా మానేస్తే ఉపాధ్యాయుడిగా మీరు ఏం చేస్తారు?
    1) హాజరు పట్టీ నుంచి పేరు తొలగిస్తాను
    2) తోటి విద్యార్థులతో తల్లిదండ్రులకు కబురు పంపుతాను
    3) ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకువెళతాను
    4) అవసరమైతే విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లి దండ్రులతో మాట్లాడతాను
25. సాధారణంగా విద్యార్థులు నైతిక విలువలను ఎవరి నుంచి అలవర్చుకుంటారు?
    1) తల్లిదండ్రులు 2) ఉపాధ్యాయులు
    3) సమవయస్కులు 4) పైవారందరూ
26. తరగతి గదిలో పొరపాటు చేసిన ఉపాధ్యాయుడు?
    1) తప్పును నిజమని అందరూ నమ్మేలా చేయాలి
    2) తప్పు చేయడం సహజం అని విద్యార్థులు గుర్తించేట్లు చేయాలి
    3) విద్యార్థులు గమనించకుండా తెలివిగా వ్యవహరించాలి
    4) అంగీకరించి, సరైన దాన్ని సూచించాలి
27. విద్యార్థులు పాఠాన్ని మరింతగా అవగాహన చేసుకోవడానికి ఉపాధ్యాయుడిగా మీరు ఏం చేస్తారు?
    1) ట్యూషన్ వెళ్లమని సలహా ఇస్తాను
    2) కొత్త గ్రంథాలను చదవాలని చెబుతాను
    3) క్రమశిక్షణతో బోధిస్తాను
    4) విద్యార్థులకు మరిన్ని ఉదాహరణలతో వివరిస్తాను
28. మీరే విద్యార్థి అయితే ఉపాధ్యాయుడు బోధించే పాఠం అర్థం కాకపోతే ఏం చేస్తారు?
    1) ఉపాధ్యాయునిపై గౌరవ భావంతో నిశ్శబ్దంగా కూర్చుంటాను
    2) ఇంటివద్ద ట్యూషన్‌లో చదువుకుంటాను
    3) నిస్సంకోచంగా సమస్యను ఉపాధ్యాయుని ముందు ఉంచుతాను
    4) ప్రధానోపాధ్యాయునికి చెబుతాను
29. పరీక్షా పత్రాల మూల్యాంకనం తర్వాత అందరి కంటే తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థికి సంబంధించి ఉపాధ్యాయుడు ఏం చేయాలి?
    1) విద్యార్థికి తక్కువ మార్కులు రావడానికి కారణాలు తెలుసుకోవాలి
    2) తల్లిదండ్రులను పిలిచి అతడిని ఎక్కువ సమయం చదివించాలని చెప్పాలి
    3) విద్యార్థిని టీవీ చూడటానికి, ఆటలకు దూరంగా ఉండాలని చెప్పాలి
    4) పరీక్షా పత్రాన్ని ఎక్కువ సార్లు చూసి రాసుకు రావాలని చెప్పాలి
30. మీరు ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాలనుకోవడానికి కారణం ఏమిటి?
    1) అన్ని రకాల సౌకర్యాలు ఉంటాయి
    2) విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించవచ్చు
    3) రోజూ విద్యార్థులతో ఉల్లాసంగా గడపవచ్చు
    4) వృత్తిలో గౌరవం లభిస్తుంది
31. ఉపాధ్యాయుడు ఎక్కువ సమయం ఎవరి కోసం కేటాయించాలి?
    1) తెలివైన విద్యార్థులు
    2) వెనుకబడిన విద్యార్థులు
    3) క్రమశిక్షణారాహిత్యం ఉన్న విద్యార్థులు
    4) సహ ఉపాధ్యాయులు
32. ఉపాధ్యాయుడి ఉత్తమ అభిరుచి ఏది?
    1) నూతన జ్ఞాన సముపార్జన
    2) ఆటలాడటం
    3) ఇతరులతో మంచి సంబంధాలు కొనసాగించడం
    4) తీయని స్వరంతో మాట్లాడటం, పాటలు పాడటం
33. ఉపాధ్యాయుడు ఏ విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని బోధించాలి?
    1) బాగా చదివేవారిని
    2) బాగా వెనుకబడిన వారిని
    3) సగటు విద్యార్థిని
    4) పై వారందరినీ
34. విద్యార్థిని ప్రగతి పథంలో నడిపించడానికి ఉపాధ్యాయుడిగా మీరు సూచించే మార్గం?
    1) ఇతర విషయాల్లో దృష్టి మరల్చకుండా పాఠ్యాంశాల్లో చక్కని అవగాహన ఏర్పరుచుకునేట్లు చేస్తాను
    2) ఆటలాడటం, మ్యాగజీన్స్ చదవడం మానిపిస్తాను
    3) తరచుగా బట్టీ వేయిస్తాను
    4) పాఠ్యాంశాలు, పాఠ్యేతరాలను ఆసక్తిగా ఉండేట్లు చేస్తాను

**సమాధానాలు**

1) 4; 2) 3; 3) 1; 4) 1; 5) 2; 6) 2; 7) 1; 8) 4; 9) 1; 10) 4; 11) 1; 12) 1; 13) 2; 14) 4; 15) 1; 16) 3; 17) 4; 18) 2; 19) 1; 20) 3; 21) 4; 22) 4; 23) 4; 24) 4; 25) 2; 26) 4; 27) 4; 28) 3; 29) 1; 30) 4; 31) 2; 32) 1; 33) 4; 34) 4.

## విద్య, ఉద్యోగ సమాచారం



### ఎన్‌సీడీసీ, న్యూఢిల్లీలో డైరెక్టర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌సీడీసీ).. ఒప్పంద ప్రాతిపదికన చీఫ్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** చీఫ్ డైరెక్టర్(మార్కెటింగ్)-01, డిప్యూటీ డైరెక్టర్(మార్కెటింగ్)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి మార్కెటింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీతో పాటు ఎంబీఏ/పీజీడీఎం ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు చీఫ్ డైరెక్టర్‌కు రూ1,23,100 నుంచి రూ.2,15,900, డిప్యూటీ డైరెక్టర్‌కు రూ.67,700 నుంచి రూ.2,08,700.
» **వయసు:** చీఫ్ డైరెక్టర్‌కు 45 ఏళ్లు, డిప్యూటీ డైరెక్టర్‌కు 35 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:**
ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్, నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌సీడీసీ) 4-సిరి, ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, హౌజ్ కాస్, న్యూఢిల్లీ–110016 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 31.08.2025.
» **వెబ్‌సైట్:** http://www.ncdc.in

### ఎస్ఆర్ఎఫ్‌టీఐ, కోల్‌కతాలో మెడికల్ ఆఫీసర్ పోస్టులు

కోల్‌కతాలోని సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్(ఎస్ఆర్ఎఫ్‌టీఐ) ఒప్పంద ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 63 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.40,000.
» **ఎంపిక విధానం:**
ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:**
ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది డైరెక్టర్, సత్యజిత్ రే ఫిల్మ్-టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్, ఈ.ఎం.బైపాస్ రోడ్, పీ.వో.పంచసయార్, కోల్‌కతా–700094 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 01.09.2025.
» **వెబ్‌సైట్:** https://srfti.ac.in

# వెయ్యేళ్ల కిందటే బతుకమ్మ ప్రారంభం

**భారతదేశ చరిత్రలోనే బహుశా మొదటిసారిగా ఒక అకృత్యానికి, అన్యాయానికి అహింసా పూర్వక సత్యాగ్రహాలతో నిరసన తెలిపిన ఏకైక ప్రక్రియ బతుకమ్మ. నాటి నుంచి నేటి వరకు శాంతియుతంగా, సత్యాగ్రహ రూపంలో నిరసన తెలిపిన ఉద్యమం ఇది. ప్రపంచంలో తెలంగాణ ప్రజలకు మాత్రమే ఈ ఘనత దక్కుతుంది. భారతదేశంలో వెయ్యేళ్ల క్రితం అహింసాయుతమైన సత్యాగ్రహానికి పునాది వేసిన ఘనత బతుకమ్మ పండుగదే.**

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

**జనరల్ స్టడీస్**

తెలంగాణ హిస్టరీ

## బతుకమ్మ పండుగ

తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ. రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా 2014 అక్టోబర్ 2న ఈ పండుగను అధికారికంగా నిర్వహించింది. తెలంగాణ ఉద్యమం సందర్భంగా వివిధ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు 'బతుకమ్మ' పండుగను జరుపుకొని ఈ పండుగ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. ఇప్పుడిదొక బృహత్ పండుగ.

ఇప్పటిదాకా బతుకమ్మ పండుగ మూలాలు వెలుగులోకి రాలేదు. ఈ విషయాన్ని చరిత్రకారులు, సాహితీవేత్తలు ధ్రువీకరించారు. శతాబ్దాలుగా బతుకమ్మ పండుగపై ఎన్నో జానపద గాథలు, పాటలు తెలంగాణలో ప్రచారంలో ఉన్నాయి. ఎందరో తెలుగు రీసెర్చ్ స్కాలర్లు బతుకమ్మ పండుగ ప్రాధాన్యతపై ఎన్నో పరిశోధనలు చేశారు. కానీ ఈ పండుగను ఎప్పుడు, ఎవరు ప్రారంభించారు? ఎలా మొదలైంది? లాంటి ప్రశ్నలకు సమాధానం దొరకలేదు. ప్రపంచంలోనే ఏకైక పూల పండుగ, స్త్రీల కోసం ఉన్న పండుగ బతుకమ్మే.

కొందరు సాహితీవేత్తలు ఈ పండుగలో జైన మత అడుగుజాడలను, కాకతీయులతో ఉన్న సంబంధాన్ని వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. కానీ అవి ప్రజామోదం పొందలేదు. కాకతీయులు కొంతకాలం ఆంధ్ర దేశం అంతటినీ పాలించినా ఈ పండుగ తెలంగాణకే పరిమితం కావడం అర్థం కాని విషయం. 'బతుకమ్మ' చరిత్ర మూలాలు కనుక్కోవాలంటే వెయ్యేళ్ల క్రితం 'రాజ్యపాలన చేసిన కల్యాణి చాళుక్యుల, చోళుల చరిత్రను తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

## బతుకమ్మ చరిత్ర

973లో రాష్ట్రకూటుల సామంతుడైన రెండో తైలపుడు చివరి రాష్ట్రకూటరాజైన 'కర్కుడు-2'ను ఓడించి స్వతంత్ర కల్యాణీ చాళుక్య రాజ్యం స్థాపించాడు. ప్రస్తుత తెలంగాణ ప్రాంతం ఇతడి ఆధీనంలో ఉండేది. ఈ కాలంలోనే వేములవాడ చాళుక్య రాజ్యంలోని వేములవాడ 'రాజేశ్వరాలయం' అప్పటికే ప్రసిద్ధి చెందింది. తెలంగాణ ప్రజల ఇష్ట దైవంగా రాజేశ్వరుడు పూజలు అందుకునేవాడు. రెండో అరికేసరి(930-55) వేయించిన 'దానశాసనం'లో ఈ దేవాలయ ప్రసక్తి ఉంది. వేములవాడ చాళుక్య రాజులు రాష్ట్రకూటుల సామంతులు. అందువల్ల చోళులు, రాష్ట్రకూటుల మధ్య యుద్ధం జరిగితే వీరు రాష్ట్రకూటుల పక్షం వహించేవారు. ఈ విధంగా రెండో పరాంతకుడు వేములవాడలోని రాజేశ్వరాలయాన్ని కూడా సందర్శించాడని శాసనాల్లో పేర్కొన్నారు.

## చోళుల కాలం నాటి చరిత్ర

రాజేంద్ర చోళుడు వేములవాడ దేవాలయాన్ని ధ్వంసం చేసిన అనంతరం వేములవాడ రాజేశ్వరుడి(బృహదీశ్వరుడి) మాహాత్మ్యం తెలుసుకుని లింగరూపంలో ఉన్న రాజేశ్వరుణ్ని కంచి నగరానికి తీసుకెళ్లాడు. తన విజయానికి గుర్తుగా తండ్రి అయిన రాజరాజచోళునికి ఈ లింగాన్ని బహూకరించాడని తెలుస్తోంది. 1006లో ఈ లింగానికి(బృహదీశ్వరుడికి) తంజావూరులో దేవాలయ నిర్మాణం ప్రారంభించాడు. 1010లో లింగ ప్రతిష్ఠాపన చేసి, గోపుర కలశాభిషేకాలు నిర్వహించినట్లు శాసనాల ద్వారా స్పష్టమవుతోంది.



రాజరాజచోళుడు బృహదీశ్వరుడికి కృతజ్ఞతాపూర్వకంగా బంగారు కమలాలను సమర్పించాడు. ఈ బృహదీశ్వరాలయాన్ని వేములవాడ చాళుక్య దేశంపై జరిగిన దండయాత్రలో దోచుకున్న ధనంతో నిర్మించామని తమిళ శాసనాల్లో చోళరాజులు ప్రకటించుకున్నారు. వేములవాడ భీమన్న గుడిలోని శివలింగం, బృహదీశ్వరాలయంలోని శివలింగం ఒకేలా ఉంటాయి. తంజావురులోని బృహదీశ్వరాలయం దక్షిణ భారతదేశంలోనే ఎత్తయిన 'విమానం'(విమానం అంటే గోపురం లేదా దేవాలయ ద్వారం) ఉన్న దేవాలయం దీన్ని 'ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించింది.

బతుకమ్మ పండుగకు బృహదీశ్వరాలయం, వేములవాడ రాజన్న ఆలయాలతో సంబంధం ఏమిటి? చోళ, చాళుక్యుల చరిత్రను ఎందుకు ప్రస్తావించామనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. వేములవాడ నుంచి శివలింగాన్ని దౌర్జన్యంగా తంజావూరుకు తరలించి, అక్కడ గొప్ప దేవాలయం నిర్మించడం చోళులకు గర్వకారణమైన విషయమే కావొచ్చు. కానీ అది తెలంగాణ ప్రజలకు బాధను కలిగించింది. చోళులు బృహదేశ్వరుడిని తీసుకెళ్లినందుకు నిరసనగా సృష్టికి కారణభూతమైన శక్తిస్వరూపాన్ని బృహతమ్మ (బతుకమ్మ)గా పూజించారు. అదే 'బృహత్' బృహతమ్మ లేదా బతుకమ్మగా ప్రాచుర్యం పొందింది.

## బృహత్ అమ్మ, బ్రతుకమ్మ

బతుకమ్మను బృహతమ్మ రూపాంతరంగా భావిస్తూ తంజావూరు దేవాలయానికి బృహత్ అనే పదం వినియోగించారు. బృహత్ అనే పదాన్ని బృహతమ్మ (గొప్ప అమ్మ) అనే పేరుతో ఉపయోగించారు.

'బృహత్ కథ' అనే సంస్కృత గ్రంథం భారతీయ ప్రాచీన గాథలకు, అనేక కథలు, కావ్యాలు, నాటకాలకు మూలమైంది. దీన్ని రచించిన గుణాఢ్యుడు (మెదక్ జిల్లా) తెలంగాణ తొలికవి. బృహత్ కథను పైశాచీ నామంతో రచించాడు. రెండో శతాబ్దంలో 'పెరంగదై' పేరుతో తమిళంలోకి కూడా ఈ గ్రంథాన్ని అనువదించారు. రామాయణం, మహాభారతంతో సమాన ప్రతిపత్తి ఉన్న గొప్ప గ్రంథం ఇది. అనేక మంది కవులకు 'బృహత్కథ' కావ్య వస్తువుగా ఉండేది. ప్రాచీనమైన బృహత్ధారణ ఉపనిషత్ లేదా బృహదారణ్య ఉపనిషత్ పేరులో కూడా బృహత్ అనే పద వినియోగం కనిపిస్తుంది. బృహత్ పదాన్నే బృహతమ్మ లేదా బతుకమ్మగా ప్రజలు ఉపయోగించారని భావించాలి.

## బృహతమ్మ (బతుకమ్మ) ఉద్యమం

రాజేంద్రచోళుడు వేములవాడ బృహత్ శివలింగాన్ని తంజావూరుకు తరలించాక తెలంగాణ ప్రజలు తమ ఆక్రోశాన్ని ఒక ఉద్యమంగా మార్చి చోళ రాజులకు తమ నిరసనను తెలిపే ప్రయత్నమే 'బతుకమ్మ' సృష్టికి దారితీసింది. తెలంగాణ నుంచి లింగాకారమైన శివుడు వెళ్లిపోయిన తర్వాత ఇక్కడున్న పార్వతిని ఊరడించే ప్రయత్నంలో భాగంగా పూలతో(సృష్టి) మేరు పర్వతంలా బతుకమ్మను పేర్చారు. దానిపై పసుపు గౌరమ్మను రూపొందించి, దసరా సందర్భంలో తొమ్మిది రోజులు ఆటపాటలతో పదేపదే తలుస్తూ.. చివరగా తిరిగి రమ్మంటూ నీళ్లలో వదలడం ఒక పండుగగా మారింది.

బహుశా దేశ చరిత్రలోనే మొదటిసారిగా ఒక అకృత్యానికి, అన్యాయానికి అహింసా పూర్వక సత్యాగ్రహాలతో నిరసన తెలిపిన ఏకైక ప్రక్రియ బతుకమ్మ.

## బతుకమ్మ పాట

బతుకమ్మ పండుగ సందర్భంగా వివిధ రకాల పాటలు పాడతారు. అందులో ఒక ప్రాచీన చోళరాజును ప్రస్తుతించడం కనిపిస్తుంది. చోళదేశ రాజైన ధర్మాంగుడు నూరునోములు నోమి నూరు మందిని పొందాడట. ఆ పాటలోని ప్రథమార్థం ఇలా ఉంటుంది..

**'శ్రీ లక్ష్మిదేవియు ఉయ్యాలో సృష్టి బతుకమ్మయే ఉయ్యాలో**
**పుట్టినా రీతి జెప్పే ఉయ్యాలో భట్టు నరసింహా కవి ఉయ్యాలో**
**ధరచోళదేశము ఉయ్యాలో ధర్మాంగుడనరాజు ఉయ్యాలో**
**ఆ రాజు భార్యయు ఉయ్యాలో అది సత్యవతి యంద్రు ఉయ్యాలో**
**నూరు నోములు నోమి ఉయ్యాలో నూరు మందిని గాంచే ఉయ్యాలో**
**వారు శూరులయ్యి ఉయ్యాలో వైరులచే మృతులైరి ఉయ్యాలో...**

ఈ పాటలో కనిపించిన 'చోళదేశం, నూరునోముల సృష్టి, బతుకమ్మయే' అనే పదాలు బతుకమ్మ ఉద్యమానికి దగ్గరగా ఉన్నాయి. వేములవాడ బృహదీశ్వరుణ్ని తరలించింది చోళరాజు. బహుశా రాజరాజచోళుడి తండ్రి రెండో పరాంతక చోళుడు రాజేశ్వర నోము నోచి దేవుడి అనుగ్రహంతో పొందిన కుమారుడికి దేవుడి పేరుమీద 'రాజరాజ' అని నామకరణం చేసి ఉండాలి. మరోచోట పూబోణి పదం బతుకమ్మకు ప్రతిరూపంగా కనిపిస్తుంది. బహుశా బతుకమ్మ ఉద్యమ తీవ్రతను గ్రహించిన చోళరాజులు నరసింహ కవి లాంటి కవులతో వారికి అనుగుణంగా తెలంగాణ ప్రజల ఉక్రోషాన్ని మరిపించేలా ఉయ్యాల పాటలను రాయించి ప్రజల మధ్య వ్యాప్తి చెందించారని భావించవచ్చు. ఇన్నేళ్ల బతుకమ్మ పాటల్లో చోళుల కథ జీవించి ఉండటం మరో విశేషం. దీన్ని సాహిత్య పరమైన రుజువుగా భావించవచ్చు.

ప్రతాపరుద్రుడి కాలంలో కాకతీయులు మేడారం రాజుతో యుద్ధం చేశారు. సమ్మక్క, సారక్క, పగిడిద్దరాజుకు మద్దతుగా.. తెలంగాణ ప్రజలు వారిని దేవతలుగా భావించి మరో పద్ధతిలో సత్యాగ్రహాన్ని వెలిబుచ్చారు. రెండేళ్లకు ఒకసారి లక్షల సంఖ్యలో ఒక చోట చేరి దాదాపు 700 ఏళ్ల తర్వాత కూడా తమ ఆగ్రహాన్ని ఒక తీర్థం రూపంలో వెలిబుచ్చడం తెలంగాణ చరిత్రలో మరో మరుపురాని సంఘటన. బతుకమ్మ ఉత్సవమే సమ్మక్క-సారక్క జాతరకు మూలాధారంగా భావించవచ్చు. మేడారం జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందింది.

చరిత్రలో ఏ అంశమైనా సంపూర్ణ నిర్ధారితం కానీ, సత్యం కానీ కాకపోవచ్చు. తగిన ఆధారాలు దొరకనప్పుడు కొంత ఊహ ఉంటుంది. ఊహకు ఓ ఆధారం ఉంటుంది. ఆధారం మీద ఓ ఊహ ఉంటుంది. కాబట్టి వెయ్యేళ్ల నాటి బృహతమ్మనే నేటి బతుకమ్మ. ఈ బతుకమ్మనే తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసింది. తెలంగాణ ప్రజలకు ఆరాధ్య దైవంగా కలకాలం నిలిచిపోయింది..


## మాదిరి ప్రశ్నలు

1. తెలంగాణ ప్రభుత్వం బోనాలను రాష్ట్ర పండుగగా ఏ రోజున ప్రకటించింది? (2014లో)
   ఎ) జూన్ 2  బి) జూన్ 6
   సి) జూన్ 16  డి) జూన్ 18
2. బతుకమ్మ పండుగకు సంబంధించిన వాస్తవ అంశం?
   1. తంగేడి పూలు ఉపయోగించడం
   2. అశ్వయజ మాసం మొదటిరోజు ప్రారంభమవుతుంది
   3. మొదటిరోజు ఎంగిలి పూల బతుకమ్మ
   4. రెండో రోజు అటుకుల బతుకమ్మ
   ఎ) 1, 3 మాత్రమే  బి) 2, 4 మాత్రమే
   సి) 1, 2 మాత్రమే  డి) 1, 3, 4 మాత్రమే
3. బోనాల పండుగకు సంబంధించి వాస్తవ అంశం?
   1. బోనం (భోజనం)
   2. ఘటోత్సవం (కలశం)
   3. రంగం (భవిష్యవాణి)
   ఎ) 1, 2 మాత్రమే వాస్తవం
   బి) 1, 3 మాత్రమే వాస్తవం
   సి) 2, 3 మాత్రమే వాస్తవాలు
   డి) పైవన్నీ వాస్తవాలే
4. ఏడుపాయల జాతర ఏ ప్రాంతంలో ప్రసిద్ధి?
   ఎ) నాగసానిపల్లి  బి) రంగధాం పల్లి
   సి) కేస్లాపూర్  డి) వేలాల
5. 'సమ్మక్క-సారక్క' అతిపెద్ద గిరిజన జాతర. ఇది మేడారం (ములుగు జిల్లా) లో రెండేళ్లకు ఒకసారి జరుగుతుంది. దీనికి సంబంధించి సరికానిది?
   ఎ) 1996లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది
   బి) ఇది ప్రధానంగా నాలుగు రోజుల పండుగ
   సి) కన్నెపల్లి నుంచి సారక్కను తీసుకొస్తారు
   డి) సమ్మక్క - సారలమ్మ అక్కా చెల్లెళ్లు
6. హర్తాళిక పండుగను ఏ పండుగకు ముందు జరుపుకుంటారు?
   ఎ) దసరా  బి) వినాయక చవితి
   సి) దీపావళి  డి) పీర్ల పండగ
7. మేడారం తర్వాత అతిపెద్ద జాతరగా 'గొల్లగట్టు' జాతర ప్రసిద్ధి చెందింది. దీనికి సంబంధించిన అంశం?
   1. దీన్నే పెద్దగట్టు జాతర అంటారు
   2. నల్గొండ జిల్లాలోని సూర్యాపేట సమీపంలోని దురాజ్‌పల్లిలో ఉంది
   3. ఆరాధ్యదైవం లింగమంతుల స్వామి
   ఎ) 1 మాత్రమే  బి) 1, 2 మాత్రమే
   సి) 2, 3 మాత్రమే
   డి) 1, 2, 3 మాత్రమే
8. సాధారణంగా వర్షాకాలం ప్రారంభమై నాట్లు పూర్తయిన తర్వాత తొమ్మిది రోజులపాటు జరుపుకొనే ఆదివాసీల పండుగ?
   ఎ) నాగశేష  బి) పెర్సాపెన్
   సి) శీతల భవానీ  డి) తీజ్ పండుగ

**సమాధానాలు**

1) సి; 2) డి; 3) డి; 4) ఎ; 5) డి; 6) బి; 7) డి; 8) డి.

# The last stage in the selling process?




1. Which of the following information forms available to the marketing manager can usually be accessed more quickly and cheaply than other information sources?
   a) Marketing intelligence
   b) Marketing research
   c) Customer profiles
   d) External databases
   e) Internal databases
2. Banks selling Insurance and Mutual funds is:
   a) A relatively high level of diversification
   b) An example of product diversification
   c) Unlikely to reduce variability in the firm's profitability since the banks are all in same business
   d) An example of related linked diversification
   e) None of the above
3. An ideal marketing framework is designed to address three key management questions. Which of the following is one of those questions?
   a) Value Proposition - i.e. How can value propositions be made profitable?
   b) Value chain - i.e. Are there weak links in the company's value chain?
   c) Value network - i.e. How can a company effectively network?
   d) Value exploration – i.e. How can a company identify new value opportunities?
   e) All of the above
4. The biggest or greatest amount of involvement in a foreign market comes through which of the following?
   a) Exporting b) Joint venturing
   c) Licensing
   d) Indirect investment
   e) Direct investment
5. A strategy wherein A "three-day cooling off period" in which buyers can cancel a contract after re-thinking it is to protect the consumer is called:
   a) creative selling
   b) high pressure selling
   c) detail selling
   d) hard core selling
   e) detail hard core selling
6. The last stage in the selling process is:
   a) Approach
   b) Handling objections
   c) Closing d) Follow –up
   e) None of the above
7. The more direct connections among businesses, the more ____ is the relatedness of the diversification.
   a) linked b) constrained
   c) integrated d) intense
   e) None of the above
8. _____ are products bought by individuals and organizations for further processing or for use in conducting a business.
   a) Consumer products
   b) Services
   c) Industrial products
   d) Specialty products
   e) None of the above
9. All of the following would be forces that might be contained in a company's microenvironment EXCEPT:
   a) Economic forces
   b) The company itself
   c) Marketing channel firms
   d) Suppliers e) Dealers
10. Which of the following elements of marketing mix customer analyzes at the last, taking a decision of buying a particular product?
    a) Promotion b) Place
    c) Price d) Product
    e) People
11. Which of the following is a value-reducing reason for diversification?
    a) Enhancing the strategic competitiveness of the entire company
    b) Expanding the business portfolio in order to reduce managerial employment risk
    c) Gaining market power relative to competitors
    d) Conforming to antitrust regulation
    e) None of the above
12. _____ is the set of benefits a company promises to deliver its consumers to Satisfy their needs.
    a) A money-back guarantee
    b) An attribute
    c) A value proposition
    d) Good customer service
    e) None of the above
13. When backed by buying power, wants become _____.
    a) Demands b) Social Needs
    c) Exchanges
    d) Self-Esteem needs
    e) Social exchanges
14. The type of sales presentation approach that requires good listening and problem-solving skills is:
    a) Canned approach
    b) Formula approach
    c) Need-satisfaction approach
    d) Critical-thinking approach
    e) All of the above
15. Marketing research firms, advertising agencies, and media firms would all be examples of which of the following marketing intermediaries?
    a) Financial intermediaries
    b) Physical distribution firms
    c) Marketing service agencies
    d) Resellers e) None of the above
16. If a company's objective were to reach masses of buyers that were geographically dispersed at a low cost per exposure, the company would likely choose which of the following promotion forms?
    a) Advertising b) Personal selling
    c) Public relations
    d) Sales promotion
    e) Marketing
17. The purchasing of firms in the same industry is called:
    a) Unrelated diversification
    b) Vertical integration
    c) Networking the organization
    d) Horizontal acquisition
    e) None of the above
18. Which of the following is a disadvantage of primary market research?
    a) Up to date
    b) Expensive to collect
    c) Focused d) Exclusive
    e) Inclusive
19. Companies selling mass consumer goods and services such as soft drinks, cosmetics, air travel and athletic shoes and equipment spend a great deal of time trying to establish a superior brand image in markets is called _____.
    a) Business markets
    b) Global markets
    c) Consumer markets
    d) Nonprofit and governmental markets
    e) Dealer markets
20. If a consumer describes a car as being the "most economical car on the market," then this descriptor is a:
    a) Rule b) Attitude c) Belief
    d) Clue e) Praise
21. Through _____, many companies today are strengthening their connections to all partners, form providers of raw materials to components to final products that are carried to final buyers.
    a) Partnership relationship marketing
    b) Customized marketing
    c) Direct marketing
    d) Deviated marketing
    e) Indirect marketing
22. Wal-Mart owned Sam's club is an example of a retail form called a(n):
    a) factory outlet
    b) super specialty store
    c) seconds store
    d) warehouse club
    e) All of the above
23. The typical method of retail operation used by supermarkets and catalog showrooms is called:
    a) Self-service retailing
    b) Limited-service retailing
    c) Full-service retailing
    d) Service-merchandiser
    e) None of the above
24. Using a successful brand name to introduce additional items in a given product category under the same brand name (such as new flavors, forms, colors, added ingredients, or package sizes) is called a(n):
    a) Line extension
    b) Brand extension
    c) Multi-branding d) New brands
    e) None of the above
25. In terms of special product life cycles, a ____ is a basic and distinctive mode of expression.
    a) genre b) style
    c) fashion d) fad
    e) shape
26. Customers buy from stores and firms that offer the highest ____
    a) Customer perceived value
    b) Concern form society's interests
    c) Company image
    d) Level of customer satisfaction
    e) Product quality
27. ____ consists of dividing a market into distinct groups of buyers on the basis of needs, characteristics, or behavior that might require separate products or marketing mixes.
    a) Product differentiation
    b) Market segmentation
    c) Market targeting
    d) Market positioning
    e) Market differentiation
28. A(n) _____ is a retail store that carries a narrow product line with a deep assortment within that line.
    a) shopping goods store
    b) convenience store
    c) specialty store
    d) department store
    e) None of the above
29. _____ is a strategy of using a successful brand name to launch a new or modified product in a new category.
    a) Duo branding
    b) Line extension
    c) Brand extension
    d) Multi-branding
    e) Single branding
30. Minimizing pollution from production and all environmental impacts throughout the full Product life cycle is called _____
    a) Design For Environment (DFE)
    b) Green Marketing
    c) Environmental Sustainability
    d) Product Stewardship
    e) Red Marketing

**Answers**

| | | | | |
|---|---|---|---|---|
| 1) e | 2) b; | 3) d | 4) e | 5) b |
| 6) d | 7) b | 8) c | 9) a | 10) a |
| 11) b | 12) c | 13) a | 14) c | 15) c |
| 16) a | 17) d | 18) b | 19) c | 20) c |
| 21) b | 22) d | 23) a | 24) a | 25) b |
| 26) a | 27) b | 28) c | 29) c | 30) b |